www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 30-6-2024 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 75

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, కృష్ణపక్షం; తిథి: నవమి మ. 12.19 తదుపరి దశమి; నక్షత్రం: రేవతి ఉ. 7.34 తదుపరి అశ్వని; వర్జ్యం: రా.2.37-4.08; దుర్ముహూర్తం: సా.5.05-5.57; అమృతఘడియలు: శేషం.6.48 వరకు, రా.11.37-1.05; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 5.48; సూర్యాస్తమయం: 6.49

హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nalgonda | Nizamabad and Bengaluru

జగజ్జేత భారత్!

17 ఏళ్ల తర్వాత టీ20 వరల్డ్‌కప్ టీమిండియా కైవసం





- దక్షిణాఫ్రికాపై అద్భుత విజయం
- దాదాపు మ్యాచ్ చేజారిన దశలో రోహిత్ సేన మ్యాజిక్!
- కోహ్లీ, అక్షర్, దూబే హీరోలే..
- సూపర్ హీరో సూర్యనే!
- బౌండరీ వద్ద కళ్లుచెదిరే క్యాచ్
- చివరి నాలుగు ఓవర్లలో ప్రత్యర్థిని కట్టడి చేసిన పేసర్లు
- ఒత్తిడిలో చేతులెత్తేసిన సఫారీలు
- ప్రధాని మోదీ, రేవంత్ అభినందనలు

దక్షిణాఫ్రికా విజయానికి చివరి 24 బంతుల్లో 26 పరుగులు అవసరం! హార్డ్ హిట్టర్లు క్లాసెన్, మిల్లర్ మాంచి ఊపు మీదున్నారు! భారత్ విజయంపై అభిమానులు దాదాపుగా ఆశలు వదిలేసుకున్నారు. కానీ.. అద్భుతం జరిగింది! బుమ్రా, అర్షదీప్, హార్దిక్ సూపర్ బౌలింగ్‌తో చివరి 6 బంతుల్లో 16 పరుగులు అవసరమై.. దక్షిణాఫ్రికా తడబడుతున్న స్థితిలో బౌండరీ లైన్‌పై సూర్యకుమార్ యాదవ్ పట్టిన సూపర్ క్యాచ్ మ్యాచ్‌ను మలుపు తిప్పేసింది. అచ్చంగా 1983 వన్డే వరల్డ్‌కప్ ఫైనల్లో వివ్ రిచర్డ్స్ క్యాచ్‌ను కపిల్ వెనక్కి పరుగెడుతూ ఒడిసి పట్టి మ్యాచ్‌ను భారత్‌వైపు లాగేసినట్టే లాగేశాడు! అంతే టీ-20 వరల్డ్‌కప్ భారత జట్టుకు ఖాయమైంది! మన జట్టుకు ఇది రెండో టీ-20 వరల్డ్‌కప్పు! 2007లో ధోనీసేన కప్పు సాధించిన 17 ఏళ్లకు రోహిత్ సేన టైటిల్ కొట్టింది. ఆ వెంటనే భారత క్రికెటర్లు మైదానంలోనే తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. హార్దిక్ పాండ్య ఆటగాళ్లను హత్తుకొని ఆనందబాష్పాలు రాల్చాడు. రోహిత్ శర్మ జాతీయ జెండాను మైదానంలో పాతాడు. మెస్సీ తరహాలో వెళ్లి ప్రపంచ కప్పును అందుకున్నాడు.

9

అంతర్జాతీయ టీ20లకు విరాట్ గుడ్‌బై

- ఫైనల్లో విజయం అనంతరం ప్రకటన
- తుది సమరంలో అద్భుత ఇన్నింగ్స్
- మ్యాన్ ఆఫ్ ది ఫైనల్‌గా కోహ్లీ
- బుమ్రా.. మ్యాన్ ఆఫ్ ది టోర్నమెంట్

తెలంగాణ ఇక
మెడికల్ హబ్

హైదరాబాద్ విశ్వనగరంగా అభివృద్ధి చెందింది



వరంగల్‌లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులను పరిశీలిస్తున్న సీఎం

- శంషాబాద్‌లో వెయ్యి ఎకరాల్లో మెడికల్ టూరిజం
- ప్రతి పౌరుడికీ ఉచిత వైద్యం అందేలా డిజీ కార్డులు
- హైదరాబాద్‌కు దీటుగా వరంగల్ నగరం అభివృద్ధి
- త్వరలోనే ఎయిర్‌పోర్టు, టెక్స్‌టైల్ పార్కు: రేవంత్‌రెడ్డి
- నగరంలో మెడికవర్ ఆస్పత్రిని ప్రారంభించిన సీఎం
- వరంగల్, హనుమకొండల్లో విస్తృతంగా పర్యటన

వరంగల్/బాలసముద్రం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణ రాష్ట్రాన్ని మెడికల్ హబ్‌గా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ విశ్వనగరంగా అభివృద్ధి చెందిందని, విద్య, వైద్యం, విద్యుత్తు నిరంతరం ఉండటంతోపాటు ఫార్మా, ఐటీ, టూరిజం, విద్యాసంస్థలు నగరాన్ని ఆ స్థాయిలో నిలిపాయని తెలిపారు. కొవిడ్ సమయంలో మన దేశంలో వ్యాక్సిన్ తయారు చేసిన నాలుగు కంపెనీల్లో మూడు హైదరాబాద్‌కు చెందినవేనని గుర్తు చేశారు. శనివారం వరంగల్, హనుమకొండ జిల్లాల్లో సీఎం రేవంత్ పర్యటించారు. తొలుత వరంగల్ కాకతీయ టెక్స్‌టైల్ పార్కును, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులను పరిశీలించి.. హనుమకొండ కలెక్టరేట్‌లో వరంగల్ నగర అభివృద్ధిపై సమీక్షించారు. అనంతరం హనుమకొండ హంటర్ రోడ్డులో నిర్మించిన మెడికవర్ మల్టీ నేషనల్ ఆస్పత్రిని

మిగతా 13వ పేజీలో...

ఆ నామినేటెడ్ పదవులకు గ్రీన్‌సిగ్నల్!

- 37 మంది నియామకానికి అధిష్ఠానం ఓకే
- జూలై మొదటి వారంలో ఉత్తర్వులు జారీ

13

కాంగ్రెస్‌లోకి ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య?

నెరవేరిన కంటోన్మెంట్ కల!

14

గ్రేటర్ హైదరాబాద్‌లో విలీనానికి కేంద్రం అంగీకారం

దేశవ్యాప్తంగా కంటోన్మెంట్ పౌర ప్రాంతాలు రాష్ట్రాలకే..



డీఎస్ కన్నుమూత

- కాంగ్రెస్ సీనియర్ నేత డి.శ్రీనివాస్ మృతి
- హైదరాబాద్‌లోని నివాసంలో గుండెపోటు
- ఉమ్మడి ఏపీలో రెండుసార్లు పీసీసీ చీఫ్
- పార్టీని అధికారంలోకి తేవడంలో విశేష కృషి
- మూడుసార్లు ఎమ్మెల్యే.. మంత్రిగా బాధ్యతలు
- 2015లో బీఆర్ఎస్‌లోకి.. రాజ్యసభకు..
- చివరి రోజుల్లో మళ్లీ కాంగ్రెస్‌లో చేరిక
- నేడు నిజామాబాద్‌లో అంత్యక్రియలు
- హాజరుకానున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు

నిజామాబాద్, హైదరాబాద్ సిటీ, హైదరాబాద్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి, మాజీ ఎంపీ, ఉమ్మడి రాష్ట్రానికి పీసీసీ అధ్యక్షుడిగా పనిచేసిన ధర్మపురి శ్రీనివాస్ (డీఎస్) ఇకలేరు. కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని తన నివాసంలో శనివారం తెల్లవారుజామున 3 గంటలకు గుండెపోటుతో మృతిచెందారు. ఆయన వయసు 75 ఏళ్లు. ఆయనకు భార్య విజయలక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు సంజయ్

మిగతా 12వ పేజీలో...

మాజీ ఎంపీ రమేశ్ రాథోడ్ హఠాన్మరణం 12

కూల్చుడు కతలు!

"ఒకటి రెండు నెలలు ఓపిక పట్టండి.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉండదు. ఖమ్మం, నల్లగొండ, వరంగల్ జిల్లాలకు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మనతో టచ్‌లో ఉన్నారు. ఢిల్లీలో భారతీయ జనతా పార్టీకి చెందిన కీలక నేతలతో టచ్‌లో ఉన్నాం. రెండు నెలల తర్వాత అధికారంలోకి వస్తాం. ముఖ్యమంత్రి పదవిపై నాకు ఆశ లేదు."

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ఇలాంటి పిట్ట కథలు చెప్పడం అలవాటే కనుక ఆయన మాటలను సొంత పార్టీ వాళ్లు కూడా నమ్మడం లేదు. కేసీఆర్‌కు జాతకాలపై నమ్మకం కూడా ఎక్కువే. ప్రస్తుతం ఆయనకు గ్రహాలు అనుకూలంగా లేవట. వచ్చే సెప్టెంబరు తర్వాత ఆయనకు మంచి రోజులు వస్తాయట. బహుశా ఈ జాతకాలనే నమ్ముకొని ఒకటి రెండు నెలల తర్వాత రేవంత్ ప్రభుత్వం పడిపోతుందని చెబుతుండవచ్చు. అయితే కేసీఆర్ చెబుతున్న మాటల గురించి తెలుసుకున్న సీఎం రేవంత్.. ఆపరేషన్ ఆకర్ష్‌ను వేగవంతం చేశారు. ప్రస్తుత పరిస్థితులలో బీజేపీ అగ్రనేతలు కూడా తెలంగాణలో అతుకుల బొంత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి సిద్ధపడక పోవచ్చు. మహారాష్ట్రలో ఆ పార్టీ చేసిన ప్రయోగం వికటిస్తోంది.

కేసీఆర్ ప్రస్తుత దుస్థితికి ఆయనే కారణం. తెలంగాణ ఏర్పడిన తర్వాత పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిన ఘనత ఆయనదే. అందుకే ఇప్పుడు కాంగ్రెస్‌ను తప్పుబట్టే నైతిక అర్హత ఆయనకు లేకుండా పోయింది. అధికారంలో ఉన్నప్పుడు విర్రవీగిన కేసీఆర్ కుటుంబంపై ఇప్పుడు సానుభూతి చూపే వారే కరువయ్యారు. కవితను జైల్లో పెట్టి వంద రోజులు దాటినా తలచుకొనేవారే లేకుండా పోయారు.



కొత్త పలుకు

బ్రహ్మాండమైన ప్రజా మద్దతుతో 2018లో తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కేసీఆర్, 2019లో ఏపీలో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రజాస్వామ్యాన్ని పాతర వేశారు. సీఎంలు ఎలా ఉండకూడదో తమ చర్యల ద్వారా భావితరాలకు చెప్పారు. ఈ వాస్తవాన్ని గుర్తించకుండా 'మేం ఏం తక్కువ చేశామని మమ్మల్ని ఓడించారు?' అని ప్రజలను నిందిస్తున్నారు. మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామన్న స్పృహ లేకుండా రాచరిక పోకడలు పోతే ప్రజలు సహించరని ఎందుకు తెలుసుకోరో తెలియదు.

ప్రస్తుత రాజకీయాలలో అధికారం కోల్పోయిన పార్టీలు మనుగడ సాగించడం కష్టంగా ఉంటోంది. గతంలో చంద్రబాబు కూడా ఇటువంటి గడ్డు పరిస్థితులను ఎదుర్కొన్నారు. పార్టీని కాపాడుకోవడం కోసం ఆయన పడని పాట్లు లేవు. కేసీఆర్ ఆ దిశగా చర్యలు తీసుకోకపోగా తనను తాను మభ్యపెట్టుకొనే ప్రయత్నం చేస్తున్నారు.

తెలంగాణలో కట్టుకథలు, పిట్టకథలతో కేసీఆర్ కాలక్షేపం చేస్తుండగా ఏపీలో మాజీ సీఎం జగన్ బెంగళూరు ప్యాలెస్‌లో సేద తీరుతున్నారు. సీఎం ఎలా ఉండకూడదో జగన్ చాలా బలంగా రుజువు చేశారు. చంద్రబాబు ప్రభుత్వం అనుక్షణం ఈ విషయం గుర్తుపెట్టుకోవాలి. జగన్ పాలనలో మంత్రులు, ఎమ్మెల్యేల పోకడలను, ప్రభుత్వ దుశ్చర్యలను గుర్తుకు తెచ్చుకొని బ్లూ బుక్ రూపొందించుకొని అందుకు అనుగుణంగా ప్రస్తుత మంత్రులు నడుచుకోవాలి.

రామోజీరావు సంస్మరణ సభ ఏర్పాటు విషయంలో చంద్రబాబు తొలి విమర్శ ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ పరంగా ఆయన సంస్మరణ సభ ఏర్పాటు చేయడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒక బిడ్డ జన్మించినప్పుడు ఆ ఇంట్లో వాళ్లు సంబరాలు చేసుకుంటారు. ఆ బిడ్డ ఎదిగి పెద్దవాడై తాను ఎంచుకున్న మార్గంలో ఉన్నత శిఖరాలు అధిరోహించి కన్ను మూసినప్పుడు ఆయన వల్ల ప్రయోజనం పొందినవాళ్లు, ఆయనతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నవాళ్లు బాధపడతారు. గతించిన వారితో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకోవడం కోసం సంస్మరణ సభలు పెట్టుకుంటారు. నాయకుడైతే ఆయనను అభిమానించే ప్రజలు స్మరించుకుంటారు. ఈ నేపథ్యంలో రామోజీరావు సంస్మరణ సభను ప్రభుత్వపరంగా కాకుండా ఆయనతో అనుబంధం ఉన్న వారితో కమిటీ ఏర్పాటు చేసి నిర్వహింపజేసి ఉంటే విమర్శలకు అవకాశం ఉండేది కాదు.

4



అయోధ్యలో కుంగిన రామ్‌పథ్!

రోడ్డుపై గుహలను తలపించేలా గోతులు

వర్షాలకు ఛిద్రమైన రామమందిర మార్గం 2

అంజన్న చెంతన పవన్

కొండగట్టులో ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం ప్రత్యేక పూజలు 3

పెద్దఎత్తున తరలివచ్చిన అభిమానులు

బిహార్‌కు హోదా ఇవ్వాలి

లేదా ప్రత్యేక ప్యాకేజీ మంజూరు చేయాలి

కేంద్ర ప్రభుత్వానికి జేడీయూ డిమాండ్

సీఎం నితీశ్‌కుమార్ అధ్యక్షతన జాతీయ కార్యవర్గ సమావేశంలో తీర్మానం 2

పిండానికి గండం

- రాష్ట్రంలోని 10 జిల్లాల్లో అధికంగా గర్భస్రావాలు
- సిరిసిల్ల, భూపాలపల్లిలో అత్యధికం
- మహిళల అనారోగ్యమే ప్రధాన కారణం
- జనవరి-మే మధ్య 2.80 లక్షల రిజిస్ట్రేషన్లు
- వీరిలో 10 శాతం మందికి అబార్షన్
- 6 శాతం.. 3 నెలలు పైబడిన గర్భిణుల్లోనే..



హైదరాబాద్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని పది జిల్లాల్లో గర్భస్రావాల (అబార్షన్లు) శాతం అధికంగా ఉంది. ఈ ఏడాది జనవరి నుంచి మే వరకు అన్ని జిల్లాల్లో నమోదైన గర్భిణుల్లో 10 శాతం మందికి అబార్షన్లు అయినట్లు తేలింది. ఈ విషయాన్ని తాజాగా వైద్య ఆరోగ్య శాఖ ప్రభుత్వానికి నివేదించింది. ఈ ఐదు నెలల కాలంలో రాష్ట్రవ్యాప్తంగా 2,84,208 మంది గర్భిణులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇందులో 29,563 మందికి గర్భస్రావమైనట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఎక్కువగా మూడు మాసాల పైబడిన గర్భిణీల్లో అబార్షన్లు జరుగుతున్నట్లు, ఇందుకు ఆరోగ్య సమస్యలే ప్రధాన కారణంగా వైద్య శాఖ గుర్తించింది. మొత్తం గర్భిణుల్లో 15,777 మంది (6%) 3 మాసాలు నిండిన తర్వాత తమ గర్భాన్ని

మిగతా 11వ పేజీలో...



రూ.130 కోట్ల చేనేత వస్త్రం..
చీలికలు పీలికలై!

అత్యంత విలువైన సరుకు నిల్వల పట్ల తీవ్ర నిర్లక్ష్యం

- నెలల తరబడి గోదాముల్లోనే మూలుగుతున్న వైనం
- బడి, హాస్టల్ పిల్లలకు యూనిఫాం.. ఇతరత్రా అవసరాలకు పెద్దఎత్తున ఉత్పత్తి చేయించిన గత బీఆర్ఎస్ సర్కారు
- సంరక్షణ చర్యల్లేక కొంత ఎలుకలు, పందికొక్కుల పాలు
- బకాయిలే రూ.220 కోట్లు.. పవర్‌లూం ఉత్పత్తులవి 112 కోట్లు

హైదరాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): చేనేత సహకార సంఘాల్లో బీఆర్ఎస్ సర్కారు పెద్ద ఎత్తున ఉత్పత్తి చేయించిన వస్త్రమది! విలువ 130 కోట్లు!! ఈ వస్త్రంతో బడులు, సంక్షేమ హాస్టళ్లలోని పిల్లల కోసం యూనిఫాం, ఇతర దుస్తులు తయారు చేయించేందుకు, ప్రత్యేక దుస్తులకు ఎంబ్రాయిడరీతో సొబగులు అద్దించి, టెస్కో (తెలంగాణ చేనేత సహకార సంఘం) షోరూముల్లో పెట్టి విక్రయించేందుకు, హాస్టల్ విద్యార్థుల కోసం జంపఖానాలు, దుప్పట్లు తయారుచేయించేందుకు, ప్రభుత్వ

మిగతా 11వ పేజీలో...

ఎస్‌బీఐ సారథిగా శ్రీనివాసులుశెట్టి



12

- అతిపెద్ద బ్యాంకుకు చైర్మన్‌గా పాలమూరు వాసి!
- ఎఫ్ఎస్ఐబీ సిఫారసు.. కేంద్రం ఆమోదమే తరువాయి
- 1988లో పీఓగా ఎస్‌బీఐలోకి శ్రీనివాసులు
- ప్రస్తుతం మేనేజింగ్ డైరెక్టర్ హోదాలో బాధ్యతలు

ఒంటరి మహిళలే టార్గెట్

- డబ్బు ఆశజూపి కోరిక తీర్చుకుని హత్య
- రెండేళ్లలో ఐదుగురిని చంపిన కిరాతకుడు
- 3 వేలు అప్పు ఇచ్చిన వ్యక్తి ప్రాణమూ తీశాడు
- సీరియల్ కిల్లర్‌ను పట్టుకున్న పోలీసులు 3



అయోధ్యలో కుంగిన రామ్‌పథ్!

- రహదారిపై భారీ గుహలను తలపించేలా గోతులు
- వర్షాలకు ఛిద్రమైన రామమందిరానికి వెళ్లే మార్గం
- ఆరుగురు మునిసిపల్ అధికారులపై సస్పెన్షన్ వేటు

లఖ్‌నవూ జూన్ 29: అయోధ్యలో రూ.311 కోట్ల వ్యయంతో నిర్మించిన రామ్‌పథ్ తాజాగా కురుస్తున్న వర్షాలకు ఎక్కడికక్కడ కుంగిపోతోంది. రామ మందిరానికి దారితీసే 14 కిలోమీటర్ల ఈ వలయాకార రహదారిపై ఆలయ గేటుకు అర కిలోమీటరు దూరంలోనే ఒక మీటరు వ్యాసార్థం కలిగిన గొయ్యితో పాటు ఆలయానికి 1.5 కిలోమీటర్ల దూరంలో 6 మీటర్ల వ్యాసార్థంతో మరో రెండు భారీ గోతులు ఏర్పడ్డాయి. ఇక అయోధ్యధామ్ రైల్వేస్టేషన్‌లో నిర్మించిన 40మీటర్ల పొడవైన ప్రహరీ సైతం కుప్పకూలింది. పలు ఇళ్లతో పాటు ప్రభుత్వ కార్యాలయాలను వాన నీరు ముంచెత్తింది. పట్టణంలో కొత్తగా ఏర్పాటు చేసిన డ్రైనేజీ వ్యవస్థ ధ్వంసమైందని, ఆలయ నిర్మాణానికి ముందు ఇలాంటి సమస్యలు ఎన్నడూ లేవని స్థానికులు చెబుతున్నారు. రాజకీయ లబ్ధి కోసం ప్రభుత్వం హడావుడిగా నిర్మాణాలు పూర్తిచేయడమే దీనికి కారణమని ఆరోపిస్తున్నారు. కాగా, పలు ప్రాంతాల్లో రోడ్డు కుంగిపోయిన నేపథ్యంలో నగరపాలక సంస్థ అధికారులు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు. ఈ పనుల కోసం రోడ్లను దిగ్బంధించడంతో యాత్రికులు అవస్థలు పడుతున్నారు. దీనిపై సీరియస్ అయిన యోగి ప్రభుత్వం.. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆరుగురు మునిసిపల్ అధికారులను సస్పెండ్ చేసింది. మరోవైపు భారీ వర్షాలతో రామమందిరం గర్భగుడి పైకప్పు లీకయిందని ఆలయ ప్రధాన అర్చకుడు ఆచార్య సత్యేంద్ర దాస్ ఇటీవల ఆరోపించారు. కాగా, అయోధ్య రామమందిరం నిర్మాణంలో భారీ అవినీతి జరిగిందని ఆరోపిస్తూ ప్రతిపక్ష నేతలు బీజేపీపై విరుచుకుపడ్డారు. ప్రార్థనా స్థలాలు కూడా బీజేపీకి దోపిడీ వనరులుగా మారాయని యూపీ కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్ రాయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

లోకం తీరు



సైనిక విన్యాసాల్లో అపశ్రుతి.. వరదతో నదిలో మునిగిన టీ-72 ట్యాంక్

- ఒక అధికారి సహా ఐదుగురు జవాన్ల దుర్మరణం

జమ్మూ, జూన్ 29: కేంద్ర పాలిత ప్రాంతం లద్దాఖ్‌లో భారత సైన్యం నిర్వహించిన యుద్ధట్యాంకుల విన్యాసంలో అపశ్రుతి చోటుచేసుకుంది. టీ-72 యుద్ధ ట్యాంకుతో బోధి నదిని దాటుతుండగా.. ఆకస్మిక వరద ఉధృతి పెరిగింది. దీంతో ఆ ట్యాంకులో ఉన్న ఓ జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్(జేసీవో), నలుగురు జవాన్లు దుర్మరణంపాలయ్యారు. ఈ ఘటన వాస్తవాధీన రేఖ(ఎల్‌ఏసీ)కి సమీపంలో.. దౌలత్‌బేగ్ ఓల్డీలోని న్యోమా-చుషల్ ప్రాంతంలో చోటుచేసుకుంది. శనివారం తెల్లవారుజామున టీ-72 యుద్ధ ట్యాంకుతో నదిని దాటుతుండగా.. ఈ ఘటన చోటుచేసుకుందని రక్షణ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. మృతుల్లో డ్రైవర్, గన్‌మన్ సహా.. నలుగురు సైనికులు, ఓ జేసీవో ఉన్నట్లు వివరించింది.

భారీ వర్షాలతో ఢిల్లీలో 11 మంది మృతి

న్యూఢిల్లీ, జూన్ 29: రెండ్రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఢిల్లీలో 11 మంది మరణించినట్టు అధికారులు ప్రకటించారు. వసంత విహార్‌లో గోడ కూలిన సంఘటనలో ముగ్గురు కూలీలు ప్రాణాలు కోల్పోయారు. మరో మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో వాతావరణ శాఖ ఆరెంజ్ అలెర్ట్‌ను జారీ చేసింది. మరోవైపు, వర్షాల కారణంగా గుజరాత్‌లోని రాజ్‌కోట్ విమానాశ్రయం బయట ప్రయాణికుల పికప్-డ్రాప్ ప్రాంతంలోని కప్పు కూలిపోయింది. అదృష్టవశాత్తూ ప్రాణనష్టం సంభవించలేదు. కాగా, ఢిల్లీలో విమానాశ్రయం పైకప్పు కూలిపడటంతో జరుగుతున్న మరమ్మతు పనుల కారణంగా చెన్నైలో 16 విమాన సర్వీసులు రద్దయ్యాయి.

హరిద్వార్‌లో ఆకస్మిక వరద.. ఉప్పొంగిన నది

హరిద్వార్, జూన్ 29: ఉత్తరాఖండ్‌లోని ప్రముఖ పుణ్యక్షేత్రం హరిద్వార్‌లో శనివారం సంభవించిన అనూహ్య వరదలు తీవ్ర నష్టాన్ని కలిగించాయి. కుండపోతగా భారీ వర్షం కురియడంతో రహదారులు జలమయమయ్యాయి. ఇళ్లలోకి వరద నీరు చేరింది. నీరు లేక ఎప్పుడూ ఎండిపోయి కనిపించే సుఖీ నది ఆకస్మికంగా ఉప్పొంగింది. ఎప్పటిలాగానే స్థానికులు తమ వాహనాలను ఆ నది వద్ద నిలిపి ఉంచగా వరదకు అవి కొట్టుకుపోయాయి. అక్కడ పార్కు చేసిన ఉంచిన కార్లు, బస్సులు ఇతర వాహనాలు కొట్టుకుపోయిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

యువత ఆగ్రహంతోనే బీజేపీ సీట్లలో కోత

- దళితులు, బీసీలు దూరం.. ఆరెస్సెస్ సమీక్షలో వెల్లడి

లఖ్‌నవూ, జూన్ 29: యువత ఆగ్రహంతో ఉండడం, దళితులు, బీసీలు దూరం కావడం వల్లనే ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి సీట్లు తగ్గినట్టు మాతృ సంస్థ ఆరెస్సెస్ గుర్తించింది. బుధవారం నుంచి నాలుగు రోజుల పాటు ఇక్కడ జరిగిన తూర్పు ప్రాంత పదాధికారుల సమావేశంలో ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో సీట్లు తగ్గడంపై సమీక్ష జరిపారు. ఈ సమావేశంలో ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబలే పాల్గొన్నారు. పేపర్ లీకులు, నిరుద్యోగం కారణంగా యువత ఆగ్రహంతో ఉన్నారని, అది ఎన్నికలపై ప్రభావం చూపిందని సమీక్షలో తేలింది. ఓటు బ్యాంకుగా ఉన్న దళితులు, ఓబీసీలు సమాజ్‌వాదీ పార్టీ- కాంగ్రెస్ కూటవి వైపు మళ్లడం మరో కారణమని గుర్తించారు.

కేజ్రీవాల్‌కు 12 వరకు జ్యుడీషియల్ కస్టడీ

న్యూఢిల్లీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మద్యం విధానం కుంభకోణంపై సీబీఐ నమోదు చేసిన కేసులో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను వచ్చే నెల 12 వరకు జ్యుడీషియల్ కస్టడీకి పంపిస్తూ శనివారం ప్రత్యేక కోర్టు ఆదేశాలు ఇచ్చింది. తొలుత ఆయనను మూడు రోజుల పాటు కస్టడీలోకి తీసుకోగా ఆ గడువు ముగిసింది. దాంతో ఆయనను ప్రత్యేక జడ్జి సునేనా శర్మ ముందు హాజరు పరిచారు. విచారణ, న్యాయ ప్రయోజనాల దృష్ట్యా ఆయనను మరో 14 రోజుల పాటు జ్యుడీషియల్ కస్టడీకి ఇవ్వాలని సీబీఐ కోరింది. ఈ సందర్భంగా సీబీఐ తరఫున న్యాయవాది.. కేజ్రీవాల్ సమాధానాలు చెప్పలేదని, ఏం అడిగినా దాటవేస్తున్నారని కోర్టుకు తెలిపారు.

రెండ్రోజుల్లో నీట్-పీజీ తేదీలు: ధర్మేంద్ర ప్రధాన్

న్యూఢిల్లీ, జూన్ 29: నీట్-పీజీ కొత్త షెడ్యూల్‌ను మరో రెండ్రోజుల్లో జాతీయ పరీక్షల బోర్డు (ఎన్‌బీఈ) ప్రకటిస్తుందని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు. హరియాణాలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ భేటీలో ప్రధాన్ ఈ విషయాన్ని వెల్లడించారు. మరోవైపు, నీట్-యూజీ పేపర్ లీక్ కేసులో సీబీఐ తాజాగా ఝార్ఖండ్‌లో ఓ హిందీ పత్రిక జర్నలిస్టును అరెస్టు చేసింది. ఇటు గుజరాత్‌లోని ఏడు చోట్ల సీబీఐ సోదాలు జరిపింది. కేసులోని అనుమానితుల నివాసాల్లో ఉదయం నుంచి సెర్చ్ ఆపరేషన్ నిర్వహించినట్లు సీబీఐ అధికారులు వెల్లడించారు.

అమర్‌నాథ్ యాత్ర ప్రారంభం

శ్రీనగర్/జమ్మూ, జూన్ 29: హిందువులకు పరమ పవిత్రమైన అమర్‌నాథ్ యాత్ర శనివారం ప్రారంభమైంది. దక్షిణ కశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలో సముద్ర మట్టానికి 3900 మీటర్ల ఎత్తులో ఉండే గుహలో దర్శనమిచ్చే స్వయంభు మంచు లింగాన్ని తొలిరోజు సుమారు 13 వేల మంది యాత్రికులు దర్శనం చేసుకున్నారు. కశ్మీర్‌లో ఇటీవల ఉగ్రదాడులు జరిగిన నేపథ్యంలో యాత్ర సాగే దారిలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. యాత్రలో పాల్గొంటున్న భక్తులకు ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా శుభాకాంక్షలు తెలిపారు. జూన్ 29 నుంచి ఆగస్టు 19 వరకు 52 రోజుల పాటు యాత్ర కొనసాగనుంది.

చర్మం ద్వారా రక్తంలోకి రసాయనాలు!

న్యూఢిల్లీ, జూన్ 29: సన్‌స్క్రీన్, మాయిశ్చరైజర్, క్లెన్సర్, నెయిల్ పాలిష్, లిప్ స్టిక్ వంటి సౌందర్య ఉత్పత్తులను వాడుతున్నారా.. ఈ సౌందర్య ఉత్పత్తుల్లో ఉండే పీఎఫ్ఏఎస్(పాలీఫ్లోరో ఆల్కైల్ పదార్థాలు) రసాయనాలతో ప్రమాదం పొంచి ఉంది. ఈ రసాయనాలు మానవ చర్మం ద్వారా రక్తంలోకి కలిసిపోయి అనారోగ్యానికి దారి తీస్తున్నాయని బర్మింగ్‌హామ్ వర్సిటీకి చెందిన శాస్త్రవేత్తలు చేసిన అధ్యయనంలో తేలింది. ఈ రసాయనాలు మానవ శరీరానికి హాని కలిగించవని అనేక అధ్యయనాలు పేర్కొన్నాయి. అయితే, బర్మింగ్‌హామ్ వర్సిటీ అధ్యయనం వాటిని తప్పని తేల్చింది. 17 రకాల పీఎఫ్ఏఎస్ రసాయనాలపై అధ్యయనం చేసిన పరిశోధకులు వాటిల్లో 15 రకాల రసాయనాలు 36 గంటల్లోపు మానవ చర్మం ద్వారా రక్తంలో కలుస్తున్నట్టు గుర్తించారు.

ఆర్మీ, నేవీ అధిపతులుగా ప్రాణ స్నేహితులు


ఉపేంద్ర దినేశ్

న్యూఢిల్లీ, జూన్ 29: వారిద్దరూ క్లాస్ మేట్స్.. అంతకుమించి ప్రాణ స్నేహితులు..ప్రస్తుతం సైన్యంలోని రెండు విభాగాలకు అధిపతులుగా వ్యవహరించనున్నారు. ఆర్మీ చీఫ్‌గా ఆదివారం బాధ్యతలు చేపట్టనున్న లెఫ్టినెంట్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, నేవీ చీఫ్‌గా మే ఒకటో తేదీన నియమితులైన అడ్మిరల్ దినేశ్ త్రిపాఠి ఈ అరుదైన రికార్డును నెలకొల్పారు. వారిద్దరు మధ్యప్రదేశ్‌లోని రేవాలో ఉన్న సైనిక్ స్కూల్‌లో 1970 ప్రాంతంలో చేరారు. ఇద్దరు అయిదో తరగతి నుంచి కలిసి చదువుకున్నారు. అప్పటి నుంచి వారి స్నేహబంధం బలపడుతూ వస్తోంది. రెండు విభాగాల మధ్య సమన్వయానికి వారి స్నేహం ఎంతగానో ఉపకరిస్తుందని భావిస్తున్నారు.

ప్రత్యేక హోదా.. లేదా ప్యాకేజీ

బిహార్‌కు ఇవ్వాలని కేంద్రానికి జేడీయూ డిమాండ్

- సీఎం నితీశ్ అధ్యక్షతన పార్టీ జాతీయ కార్యవర్గ భేటీలో తీర్మానం

న్యూఢిల్లీ, జూన్ 29: కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో మూడోసారి ప్రభుత్వ ఏర్పాటులో కీలకంగా మారిన జనతాదళ్ (యునైటెడ్) పార్టీ తన డిమాండ్లను సాధించుకునే దిశగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా తమ రాష్ట్రం బిహార్‌కు ప్రత్యేక హోదా లేదా ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని పునరుద్ఘాటిస్తూ కేంద్రాన్ని తాజాగా డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం పార్టీ అధ్యక్షుడు, బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ అధ్యక్షతన జరిగిన పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశంలో తీర్మానం చేసింది. పేపర్ లీక్ కేసుల్లో దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. అలాగే పరీక్షా పేపర్ల లీకేజీలకు వ్యతిరేకంగా పార్లమెంట్‌లో పటిష్ఠ చట్టాన్ని తీసుకురావాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పింది. ఎన్డీఏ ప్రభుత్వంలో జేడీయూ కీలక భాగస్వామిగా మారిన విషయం తెలిసిందే. లోక్‌సభ ఎన్నికల్లో బిహార్‌లో ఈ పార్టీ 12 సీట్లను గెలుచుకుంది. దీంతో ఎన్డీఏ సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటులో పార్టీ కీలకమైంది. నరేంద్ర మోదీ ప్రభుత్వంలో ఈ పార్టీకి చెందిన ఇద్దరు మంత్రులు కూడా ఉన్నారు. కేంద్ర ప్రభుత్వంలో పార్టీ భాగస్వామ్యం నేపథ్యంలో తమ పార్టీ బాధ్యతతోపాటు ప్రజల అంచనాలు కూడా పెరిగిపోయాయని పార్టీ వర్గాలు అంటున్నాయి. రాష్ట్రానికి ప్రత్యేక హోదాను డిమాండ్ చేస్తూ గత ఏడాది బిహార్ కేబినెట్ తీర్మానాన్ని ఆమోదించింది. అయితే ఇప్పుడు కేంద్రంలో మోదీ ప్రభుత్వానికి జేడీయూ కీలకంగా మారిన నేపథ్యంలో ఈ డిమాండ్‌ను మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఇదిలా ఉండగా.. జేడీయూ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా పార్టీ రాజ్యసభ ఎంపీ సంజయ్ కుమార్ ఝాను శనివారం నియమించారు. బీజేపీతో ఈయనకు మంచి సంబంధాలున్న నేపథ్యంలో ఆయనకు ఈ పదవి కట్టబెట్టినట్టు తెలుస్తోంది. పార్టీ డిమాండ్లను నెరవేర్చుకోవడంలో ఈయన సేవలు ఎంతగానో ఉపయోగపడతాయని భావిస్తున్నారు. కాగా ప్రధాని నరేంద్ర మోదీ.. బిహార్‌పై ఎల్లప్పుడూ దృష్టిసారిస్తారని, ఈ నేపథ్యంలో ప్రత్యేక హోదా లేదా ప్రత్యేక ప్యాకేజీ కోసం పార్టీ చేస్తున్న డిమాండ్ నెరవేరుతుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. మరోవైపు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్‌ను 50 శాతం నుంచి 65 శాతానికి పెంచుతూ బిహార్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఇటీవల పట్నా హైకోర్టు కొట్టివేయడం పట్ల ఆందోళన వ్యక్తం చేసిన జేడీయూ.. రాష్ట్ర చట్టాన్ని రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని కేంద్రాన్ని కోరింది. దీని వల్ల న్యాయ సమీక్షకు అవకాశం ఉండదని భావిస్తోంది.


జేడీయూ జాతీయ కార్యవర్గ భేటీలో నితీశ్‌కుమార్

బిహార్‌లో కూలిన మరో బ్రిడ్జి

బిహార్‌లో మరో బ్రిడ్జి కూలిపోయింది. కేవలం తొమ్మిది రోజుల్లో ఈ రాష్ట్రంలో ఐదు బ్రిడ్జిలు కూలిపోయి రాష్ట్రంలో పనుల నాణ్యతను ప్రశ్నిస్తున్నాయి. బిహార్‌లోని మధువని జిల్లాలో నాలుగు పిల్లర్ల ఓ బ్రిడ్జి భారీ వర్షాలకు శుక్రవారం కూలిపోయింది. నేపాల్ సరిహద్దుకు దగ్గరగా ఉన్న మాదేపూర్ బ్లాక్‌లో భుతహి నదిపై 75 మీటర్ల పొడవైన ఈ బ్రిడ్జిని రూ.3 కోట్ల ఖర్చుతో 2021 నుంచి నిర్మిస్తున్నారు. భారీ వర్షాలకు నదిలో ప్రవాహం పెరిగి ఓ వైపు పిల్లర్ కొట్టుకుపోవడంతో బ్రిడ్జి కూలిపోయినట్లు బిహార్ ప్రజా పనుల శాఖ అధికారులు చెబుతున్నారు. కూలిన బ్రిడ్జి కనిపించకుండా కాంట్రాక్టర్ టార్పాలిన్ కప్పారు.

'కాబోయే ప్రధాని అఖిలేశ్'!

- లఖ్‌నవూలో హోర్డింగులు

లఖ్‌నవూ, జూన్ 29: సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ 'కాబోయే ప్రధాని' అంటూ పోస్టర్లు ఏర్పాటు చేయడం చర్చకు దారి తీసింది. జులై 1న అఖిలేశ్ యాదవ్ పుట్టిన రోజు సందర్భంగా కొందరు కార్యకర్తలు 'భావి భారత ప్రధానికి జన్మదిన శుభాకాంక్షలు' అంటూ లఖ్‌నవూ ఎస్పీ కార్యాలయం ముందు శనివారం హోర్డింగ్స్ ఏర్పాటు చేశారు. అలాగే ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 37 సీట్లల్లో విజయం సాధించి లోక్‌సభలో మూడో అతిపెద్ద పార్టీగా అవతరించిన సందర్భాన్ని కూడా గుర్తుచేస్తూ హోర్డింగ్స్‌లో పేర్కొన్నారు. గతేడాది కూడా ఎస్పీ కార్యాలయం ముందు 'కాబోయే ప్రధాని అఖిలేశ్' అంటూ పోస్టర్లను ఏర్పాటు చేయడం ఎస్పీ, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధానికి దారి తీసింది.

ఢిల్లీలో అసాధారణ వర్షాల అంచనాలో ఐఎండీ విఫలం

- వాతావరణ నిపుణుల విశ్లేషణ

విశాఖపట్నం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీని శుక్రవారం తెల్లవారుజామున కురిసిన అసాధారణ వర్షపాతం అతలాకుతలం చేసింది. ఒకేరోజు ఏకంగా 22.81 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఢిల్లీలో అంత అసాధారణ వర్షం కురుస్తుందని అంచనా వేయడంలో వాతావరణ నమూనాలు(మోడల్స్) విఫలమయ్యాయని నిపుణులు అంటున్నారు. ఢిల్లీలో జూన్ నెల సగటు వర్షపాతం 7.41 సెంటీమీటర్లు కాగా, అంతకు మూడు రెట్లు వర్షం ఒక్క శుక్రవారమే నమోదవడం అసాధారణమే. భారత వాతావరణ శాఖ(ఐఎండీ) రికార్డుల ప్రకారం జూన్ నెలలో 1936 తరువాత ఇదే అత్యధిక వర్షపాతం. అయితే, ఢిల్లీలో శుక్రవారం కుండపోతగా వర్షం కురుస్తుందని ముందస్తుగా ఐఎండీ అంచనా వేయలేకపోయింది. ఢిల్లీలో శుక్రవారం గాలులతో వర్షం కురుస్తుందని ముందుగా ఐఎండీ ప్రకటించింది. పశ్చిమ, తూర్పుభారతంలో పలు వాతావరణ అంశాలను పరిగణనలోకి తీసుకుని ఢిల్లీలో గురువారం నుంచి ఐదు రోజులు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు, 29, 30 తేదీల్లో పలుచోట్ల భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. అయితే 28వ తేదీ(శుక్రవారం) తెల్లవారుజామున ఢిల్లీలో ఈదురుగాలులతో కుండపోతగా వర్షం కురుస్తుందని ఐఎండీ అంచనా వేయలేకపోయిందని నిపుణులు పేర్కొంటున్నారు. ఈదురుగాలులతో వర్షం, పలు చోట్ల భారీవర్షం కురుస్తుందని శుక్రవారం ఉదయం 4.58 గంటలకు ఐఎండీ హెచ్చరిక జారీ చేసింది. అయితే, ఆ హెచ్చరిక జారీ చేసే సమయానికే కుండపోతగా వర్షం కురుస్తోందని, అప్పటికే అనేక ప్రాంతాలు నీట మునిగాయని నిపుణులు గుర్తుచేస్తున్నారు. శని, ఆదివారాల్లో కూడా భారీవర్షాలు ఢిల్లీని ముంచెత్తుతాయన్నారు.


బైడెన్‌పై 'టైమ్' కవర్ పేజీ కలకలం

న్యూయార్క్, జూన్ 29: టైమ్ మేగజైన్ కవర్ పేజీపై ముద్రించిన అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఫొటో కలకలం రేపుతోంది. బైడెన్ నడుచుకుంటూ పేజీ అంచుకు వెళ్లిపోయినట్టు ఉన్న ఆ ఫొటోకు 'భయాందోళన'(పానిక్) అని పైన క్యాప్షన్ పెట్టారు. దీంతో బైడెన్ మానసిక స్థితిని ప్రస్తావిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు వెల్లువెత్తుతున్నాయి.



ఆయన మానసిక స్థితి దిగజారుతోందని, మాటలు తడబడుతున్నాయని, నడక కూడా తడబడుతోందని వస్తున్న అభిప్రాయాలకు ఆ ఫొటో అద్దం పడుతోందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. నవంబరులో అధ్యక్ష ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో మాజీ అధ్యక్షుడు ట్రంప్‌తో జరిపిన ప్రథమ చర్చలో ఆయన తడబాటుకు గురైన తీరు ఆయన పార్టీ సభ్యులైన డెమోక్రాట్లనూ ఆందోళనకు గురిచేసిన విషయం తెలిసిందే. దీనిపై తాజాగా బైడెన్ స్పందించారు. 'నేను యువకుడిని కాదనే విషయం నాకు తెలుసు. గతంలో నడిచినంత సులువుగా ఇప్పుడు నడవలేనని, చర్చల్లో గతంలో చూపినంత మెలకువ ఇప్పుడు ప్రదర్శించలేనని కూడా నాకు తెలుసు. అయితే, నేను చేయగలనని దృఢంగా, మనస్ఫూర్తిగా నమ్మకం లేకుంటే అసలు దిగేవాడినే కాదు' అని బైడెన్ స్పష్టం చేశారు. తద్వారా పోటీ నుంచి తాను తప్పుకోవడం లేదని స్పష్టం చేశారు. కాగా, అమెరికా మాజీ అధ్యక్షులు బిల్ క్లింటన్, బరాక్ ఒబామా సహా పార్టీలోని అనేక మంది సీనియర్లు బైడెన్‌కే తమ మద్దతని స్పష్టం చేశారు.

ఐఎస్ఎస్‌కు ముప్పు!



సమీపంలోని రష్యా పాత ఉపగ్రహం విచ్ఛిన్నం

- కక్ష్యలో తిరుగుతున్న శకలాలు

సునీతా విలియమ్స్ తిరుగు ప్రయాణం కొన్ని నెలలు ఆలస్యమయ్యే అవకాశం

వాషింగ్టన్, జూన్ 29: అంతర్జాతీయ అంతరిక్ష పరిశోధన కేంద్రం (ఐఎస్ఎస్) సమీపంలోని ఓ కక్ష్యలో రష్యాకు చెందిన కాలం చెల్లిన ఓ పాత ఉపగ్రహం విచ్ఛిన్నమై వందకుపైగా శకలాలుగా విడిపోయింది. వీటితో ప్రమాదం పొంచి ఉన్న నేపథ్యంలో, ఐఎస్ఎస్‌లో ఉన్న సునీతా విలియమ్స్‌తోపాటు ఇతర వ్యోమగాములను గంటపాటు అక్కడే ఉన్న స్టార్‌లైనర్ తదితర వ్యోమనౌకల్లో తలదాచుకోవాలని నాసా ఎమర్జెన్సీ ఆదేశాలు జారీ చేసింది. రష్యా ఉపగ్రహ శకలాల కదలికలను క్షుణ్ణంగా పరిశీలించి, వాటితో ప్రమాదం లేదని నిర్ధారించుకున్న తర్వాత వ్యోమగాములు తిరిగి ఐఎస్ఎస్‌లోకి వెళ్లటానికి అనుమతించింది. ఈ వివరాలు శనివారం వెల్లడయ్యాయి. రష్యాకు చెందిన కాలపరిమితి ముగిసిన ఓ పాత ఉపగ్రహం బుధవారం విచ్ఛిన్నమైంది. దాని శకలాలు కక్ష్యలో పరిభ్రమిస్తూ ఉండటంతో ఐఎస్ఎస్‌కు అవి తగిలే ప్రమాదం ఉందని నాసా భావించింది. ఈ నేపథ్యంలోనే ముందుజాగ్రత్త చర్యగా వ్యోమగాములను ఐఎస్ఎస్‌కు అనుసంధానమై ఉన్న వారి వారి వ్యోమనౌకల్లో తలదాచుకోవాలని హెచ్చరికలు జారీ చేసింది. బోయింగ్ కంపెనీ రూపొందించిన స్టార్‌లైనర్ వ్యోమనౌక ద్వారానే సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్ ఈ నెల 5వ తేదీన ఐఎస్ఎస్‌కు చేరుకున్నారు. తొలుత 8 రోజులపాటే అనుకున్న వారి అంతరిక్ష యాత్ర.. ఇప్పటికే వ్యోమనౌకలో తలెత్తిన సాంకేతిక సమస్యలతో వాయిదా పడింది. ప్రస్తుతం రష్యా ఉపగ్రహ శకలాలతో కొత్త ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో, భూమ్మీదికి వారు తిరిగి రావటానికి కొన్ని నెలలు పట్టవచ్చని తెలుస్తోంది. దీనిపై నాసా ప్రతినిధి స్టీవ్ స్టిచ్ మాట్లాడుతూ, స్టార్‌లైనర్ మిషన్‌ను 45 రోజుల నుంచి 90 రోజులకు పొడిగించాలని నాసా యోచిస్తున్నట్లు వెల్లడించారు. రష్యా ఉపగ్రహ శకలాల ముప్పు పూర్తిగా తొలగిపోవటానికి కొన్ని వారాల నుంచి నెలలు పట్టవచ్చని నాసా భావిస్తోంది. అంతరిక్షంలో వ్యర్థాలు పేరుకుపోవటం తీవ్రమైన సమస్యగా పరిణమిస్తోంది. తాజా ఘటనతో ఈ సమస్య మరోసారి చర్చనీయాంశమైంది.

2040కల్లా చంద్రుడి మీదకు మనిషి!

- ఇందుకోసం ప్రత్యేకంగా మెగా అంతరిక్ష నౌక: ఇస్రో చైర్మన్


సోమనాథ్

న్యూఢిల్లీ, జూన్ 29: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) 2040కల్లా చంద్రుడి మీదకు మనుషులను తీసుకువెళ్తుందని ఆ సంస్థ చైర్మన్ సోమనాథ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇందుకోసం ప్రత్యేకంగా మెగా అంతరిక్ష వాహక నౌక.. నెక్స్ట్ జనరేషన్ లాంచ్ వెహికిల్(ఎన్‌జీఎల్‌వీ)ను తయారు చేస్తున్నామని చెప్పారు. దీనికే 'సూర్య' అని నామకరణం చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం అది డిజైన్ దశలో ఉందన్నారు. శనివారం ఆయన ఓ జాతీయ వార్తా సంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా ఇస్రో భవిష్యత్తు ప్రయోగాల గురించి వివరించారు. అంతరిక్ష వాహక నౌక అయిన సూర్య ఇండియాలో ఇప్పుడున్న రాకెట్లన్నింటికన్నా పెద్దగా ఉంటుందని, 40టన్నుల బరువును మోసుకువెళ్తుందని చెప్పారు. క్రయోజెనిక్ ఇంజన్‌తో పాటు దిగువ భూకక్ష్యలో ద్రవ ఆక్సిజన్, మీథేన్‌తో నడిచేలా దీన్ని రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. చంద్రయాన్-4 ప్రయోగాన్ని కూడా త్వరలోనే నిర్వహిస్తామని సోమనాథ్ తెలిపారు. ఈ ప్రయోగంలో భాగంగా చంద్రుడి మీద శివశక్తి పాయింట్ నుంచి మట్టి, రాళ్ల నమూనాలను తీసుకువస్తామన్నారు. చంద్రయాన్-3 ల్యాండ్ అయిన ప్రాంతానికి శివశక్తి పాయింట్ అని పేరు పెట్టిన సంగతి తెలిసిందే. అంతరిక్షంలో భారతదేశం నిర్వహించతలపెట్టిన పరిశోధనా కేంద్రానికి సంబంధించి డిజైనింగ్ ప్రక్రియ నడుస్తోందని సోమనాథ్ ఈ సందర్భంగా చెప్పారు. ప్రాజెక్టు నివేదికను, దానికయ్యే ఖర్చు అంచనాలను ఇప్పటికే రూపొందించామన్నారు. 2028కల్లా ఈ అంతరిక్ష కేంద్రానికి సంబంధించిన మొదటి మాడ్యూల్‌ను నిర్మిస్తామని చెప్పారు.

మోదీది నైతిక ఓటమి!

- ప్రజా తీర్పు ప్రధానికి వ్యతిరేక సంకేతం : సోనియా
- నేర చట్టాలు నిలిపివేయాలని డిమాండ్



న్యూఢిల్లీ, జూన్ 29: ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గమనిస్తే ప్రధాని మోదీ నైతికంగా పరాజయం పాలైన సంకేతాలు సుస్పష్టంగా కనిపిస్తున్నాయని కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియాగాంధీ పేర్కొన్నారు. కానీ, దేశంలో ఎలాంటి మార్పూ రానట్టే, మార్పులేదన్నట్టే మోదీ ప్రధానిగా కొనసాగుతున్నారని దుయ్యబట్టారు. "ప్రజాతీర్పు సుస్పష్టమైన సంకేతాలు ఇచ్చింది. వ్యక్తిగతంగా, రాజకీయంగా, నైతికంగా కూడా.. తీర్పు మోదీకి వ్యతిరేకం" అని సోనియాగాంధీ నిప్పులు చెరిగారు. ఓ పత్రికలో రాసిన వ్యాసంలో తాజా ఎన్నికల తీర్పుపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ఫలితాలనుకానీ, ప్రజా తీర్పును కానీ ఆయన అర్థం చేసుకున్నారనడానికి ఎలాంటి సాక్ష్యాలూ కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. లోక్‌సభ ఉప సభాపతి విషయంలో ఇది ప్రస్ఫుటంగా గోచరించిందని తెలిపారు. "లోక్‌సభ స్పీకర్ విషయంలో మోదీ దూతలు ఏకాభిప్రాయాన్ని కోరినప్పుడు ఇండియా కూటమి ప్రభుత్వానికి మద్దతుగా నిలిచింది. పార్లమెంటులో సమతుల్యతకు పెద్దపీట వేయాలని భావించింది. ఇదే సమయంలో సంప్రదాయాలు పాటిస్తారని, సంప్రదాయం ప్రకారం ఉపసభాపతి పదవిని ప్రతిపక్షాలకు ఇస్తారని ఆశించాం. దీనినే బాధ్యతాయుతంగా అభ్యర్థించాం. కానీ, ప్రభుత్వం మాత్రం మా అభ్యర్థనను ససేమిరా అంగీకరించలేదు. సంప్రదాయాలకు గొడుగు పట్టలేదు" అని సోనియాగాంధీ విమర్శించారు. రాజ్యాంగంపై దాడిని దృష్టి మరల్చేక్రమంలోనే ప్రధాని, లోక్‌సభ స్పీకర్ నుంచి బీజేపీ నేతల వరకు ఎమర్జెన్సీని ప్రస్తావిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. అయితే.. 1975నాటి ఎమర్జెన్సీపై 1977లో ప్రజలు తీర్పు ఇచ్చారని, దీనిని నిర్ద్వంద్వంగా, నిస్సందేహంగా అప్పటి నేతలు ఆమోదించారని తెలిపారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన మూడు నూతన నేర న్యాయ చట్టాలపైనా సోనియాగాంధీ స్పందించారు. ఆ మూడు చట్టాలు పార్లమెంటు సంపూర్ణంగా పరిశీలించే వరకు వాటి అమలును నిలిపివేయాలని(సోమవారం నుంచి అమల్లోకి వస్తున్నాయి) ఆమె డిమాండ్ చేశారు.

కర్ణాటకలో స్వామీజీల రాజకీయం

సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి పదవులపై కొనసాగుతున్న వ్యాఖ్యలు


వీర సోమేశ్వర శివాచార్య

బెంగళూరు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రి పదవులపై స్వామీజీల వ్యాఖ్యలు కొనసాగుతున్నాయి. ఒక్కలిగ వర్గానికి సీఎం పదవి ఇవ్వాలని చంద్రశేఖరనాథ స్వామీజీ సీఎం సిద్దరామయ్య సమక్షంలో చేసిన వ్యాఖ్యలు మరిచిపోక ముందే మరికొందరు స్వామీజీలు ఆయన బాటలోనే పయనిస్తున్నారు. వీరశైవ-లింగాయత్‌లకు అనుకూలంగా శ్రీశైల జగద్గురు చెన్న సిద్ధరామ పండితారాధ్య స్వామీజీ శుక్రవారం సీఎం మార్పు, అదనంగా మరో ఉప ముఖ్యమంత్రి పదవి తదితర వ్యాఖ్యలు చేశారు. తాజాగా, బెలెహొన్నూర్ రంభాపురి పీఠాధిపతి వీర సోమేశ్వర శివాచార్య స్వామీజీ కూడా శనివారం ఇదే తరహా డిమాండ్ చేశారు. కాగా.. సీఎం, డిప్యూటీ సీఎం మార్పునకు సంబంధించిన అంశాలను బహిరంగంగా లేదా మీడియా ముందు మాట్లాడితే నోటీసులు జారీ చేసి క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ పార్టీ వర్గాలను హెచ్చరించారు. బెంగళూరులో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. పార్టీ ప్రాధాన్యం ప్రకారం తాను, సిద్దరామయ్య ఎలా పనిచేయాలనేది ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే నిర్ణయిస్తారని తెలిపారు. ఈ విషయంపై మంత్రులు, ఎమ్మెల్యేలు, స్వామిజీలు మాట్లాడాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. తాను సీఎం అయ్యేందుకు ఎవరి సిఫారసు అవసరం లేదని.. తాను చేసిన పనులు చూసి అధిష్ఠానం తగిన నిర్ణయం తీసుకుంటుందని, ఈ విషయంలో ఎవరూ మాట్లాడవద్దని కోరారు. స్వామిజీలు రాజకీయాలు మాట్లాడకుంటే మంచిదని అభిప్రాయపడ్డారు. ఇదిలా ఉండగా, రాష్ట్రంలో లింగాయత, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విభాగాల్లో ఒక్కొక్కరికి ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని మంత్రులు సతీశ్‌జార్కిహొళి, రాజణ్ణ ఇటీవల డిమాండ్ చేశారు. అంతలోనే చెన్నగిరి ఎమ్మెల్యే బసవరాజ్ మాట్లాడుతూ సీఎం పదవిని శివకుమార్‌కు అప్పగించి దజను డిప్యూటీ సీఎం పదవులు ఇచ్చుకున్నా అభ్యంతరం లేదన్నారు. వారం రోజులుగా ఈ వివాదం కొనసాగుతోంది.

111 మండలాల్లో లోటు వర్షపాతమే

- జూన్‌లో సగటున 149 మి.మీ. నమోదు
- కొన్ని ప్రాంతాలకే వర్షాలు పరిమితం
- కొన్ని జిల్లాల్లో నేడు, రేపు మోస్తరు వర్షాలు

హైదరాబాద్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాలు ముందస్తుగా వచ్చి మురిపించినా.. రాష్ట్రంలోని 111 మండలాల్లో లోటు వర్షపాతమే నమోదైంది. జూన్ మొదటి వారంలోనే రాష్ట్ర వ్యాప్తంగా సగటున 134 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. రెండో వారంలో వర్షాలు తగ్గుముఖం పట్టగా... మూడో వారంలో తీవ్ర లోటు వర్షపాతం నమోదైంది. జూన్ 1 నుంచి 29 వరకు రాష్ట్ర వ్యాప్తంగా సగటున 149 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాష్ట్రంలో జూన్ నెల సగటు సాధారణ వర్షపాతం 119 మిల్లీమీటర్లు. అంటే సాధారణం కంటే జూన్‌లో సుమారు 20 శాతం అధికంగా వర్షపాతం నమోదైనట్లు గణాంకాలు చెబుతున్నాయి. కానీ, వర్షాలు కొన్ని ప్రాంతాలకే పరిమితమయ్యాయి. రాష్ట్రంలోని 7 మండలాల్లో కనీసం పంటలు వేసుకునేంత స్థాయిలోనూ వర్షాలు పడలేదు. అక్కడ తీవ్రలోటు వర్షపాతం (60-99శాతం) నమోదైనట్లు వాతావరణ కేంద్రం పేర్కొంది. మరో 104 మండలాల్లో 20-59శాతం లోటు వర్షపాతం నమోదైంది. 210 మండలాల్లో సాధారణ వర్షపాతం కురవగా...166 మండలాల్లో అధికంగా, మరో 125 మండలాల్లో అత్యధిక వర్షపాతం రికార్డు అయింది. కాగా, రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో ఆది, సోమవారాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.



కొండగట్టులో అయోధ్య బాల రాముడి ధనుస్సు

మల్యాల, జూన్ 29: అయోధ్య రామ మందిరానికి సమర్పించడానికి చల్లా శ్రీనివాస శాస్త్రి సహకారంతో నిర్మించిన శ్రీరామ ధనుస్సుకు శనివారం జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో పూజలు నిర్వహించారు. 13 కిలోల వెండి, కిలో బంగారంతో ఈ ధనుస్సు తయారు చేశారు. శ్రీరాముడు సంచరించిన ప్రాంతాల్లో దీనికి పూజలు నిర్వహిస్తున్నట్లు శ్రీనివాసశాస్త్రి తెలిపారు. కొండగట్టు నుంచి రావణుడి సంహారం జరిగిన శ్రీలంకకు తీసుకెళ్తామని ఆ తర్వాత అయోధ్య రామ మందిరంలో సమర్పిస్తామని చెప్పారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన శ్రీనివాస శాస్త్రి అయోధ్యలో అన్నదాన సత్రం నిర్వహిస్తున్నారు.

నీట్ రద్దుపై అసెంబ్లీలో తీర్మానం చేయాలి : సీపీఎం

హైదరాబాద్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): నీట్ పరీక్షను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ అసెంబ్లీలో తీర్మానం ఆమోదింపజేయాలని సీపీఎం కోరింది. ఈ మేరకు వైద్య విద్య ప్రవేశ పరీక్షలు గతంలో మాదిరిగా రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించేందుకు కేంద్రం అనుమతినివ్వాలని డిమాండ్ చేస్తూ ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం కోరారు. కాగా, తెలంగాణలో అర్బన్ కమిషన్ ఏర్పాటు చేయాలని ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ అభిప్రాయపడ్డారు.

సైబర్ నేరగాళ్లకు మహిళా టీచర్ ఝలక్

కొరియర్‌లో డ్రగ్స్ అంటూ బ్యాంకు ఖాతా వివరాలు కోరిన ముఠా

తన అన్న క్రైం బ్రాంచ్ అని చెప్పి తప్పించుకున్న ఉపాధ్యాయురాలు

మక్తల్, జూన్ 29: సాధారణంగా సైబర్ నేరగాళ్లు.. మాటల గారడీతో అమాయకులను బురిడీ కొట్టిస్తుంటారు. కాని సైబర్ నేరగాళ్లకే తన చాకచక్యంతో ఝలక్ ఇచ్చిందో మహిళా టీచర్. నారాయణపేట జిల్లా మక్తల్‌కు చెందిన ఉపాధ్యాయురాలు జయశ్రీకి ఫోన్ చేసిన సైబర్ నేరగాళ్లు.. తాము ముంబాయి క్రైమ్ బ్రాంచ్ నుంచి ఫోన్ చేస్తున్నట్లు వెల్లడించారు. "మీ పేరిట ముంబాయి నుంచి థాయ్‌లాండ్‌కు ఇంటర్నేషనల్ కొరియర్ సర్వీస్ నుంచి డ్రగ్స్ పార్సిల్ వెళ్లింది. మీపై కేసు నమోదైంది. మీరు ఇక్కడికి వచ్చి ఫిర్యాదు రాసి ఇస్తే సరిపోతుంది. లేదంటే మిమ్మల్ని అరెస్టు చేస్తాం" అని బెదిరించారు. పంతులమ్మ కాల్‌రికార్డు చేసుకొని స్పందిస్తూ.. తాము తెలంగాణ వాసులమని అక్కడికి రాలేమని చెప్పారు. పర్వాలేదు ఆధార్, పాన్‌కార్డు, బ్యాంకు వివరాలు పంపించాలని సైబర్ నేరగాళ్లు చెప్పారు. అలా చేస్తే మీపై కేసు నమోదు కాకుండా చూస్తామని నమ్మబలికారు. దీనికి ఉపాధ్యాయురాలు భయపడకుండా తన అన్న క్రైమ్ బ్రాంచ్‌లో పనిచేస్తాడు. మీ ఫోన్ నెంబర్, వివరాలు వెల్లడిస్తే అక్కడికి వస్తాడని ఝలక్ ఇచ్చింది. దీంతో సైబర్ నేరగాళ్లు తమ ఫోన్ స్విచ్‌ఆఫ్ చేసుకున్నారు.

కొండగట్టు అంజన్న సేవలో పవన్

ప్రత్యేక పూజలు చేసిన ఏపీ డిప్యూటీ సీఎం.. తరలి వచ్చిన అభిమానులు



పవన్‌కు స్వామివారి చిత్రపటాన్ని అందిస్తున్న అర్చకులు

జగిత్యాల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత, సినీ నటుడు పవన్ కల్యాణ్ శనివారం జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానాన్ని దర్శించుకున్నారు. తాను ఇలవేల్పుగా కొలిచే ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో దీక్షా వస్త్రాలు, తలపాగాతో ఆలయానికి వచ్చిన పవన్ కల్యాణ్‌కు మేళతాళాలతో అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్ పవన్ కల్యాణ్‌కు పూలమొక్క అందించి స్వాగతం పలికారు. అనంతరం పవన్ కల్యాణ్ కొండగట్టు అంజన్నను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పవన్ కల్యాణ్ గోత్రనామాలతో అర్చకులు పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను అందించారు. ఆశీర్వచనం అందించి శేష వస్త్రాన్ని, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. కాగా, గతేడాది పవన్ కల్యాణ్ తన ప్రచార వాహనం వారాహికి కొండగట్టులోనే పూజలు చేసి.. ఏపీలో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో తాను ఆశించిన ఫలితాలు రావడంతో అంజన్నకు మొక్కులు చెల్లించుకున్నారు.

భారీగా తరలివచ్చిన అభిమానులు...

కొండగట్టుకు పవన్ కల్యాణ్ వస్తున్నారన్న సమాచారంతో ఆయన అభిమానులు, జనసేన కార్యకర్తలు పెద్దసంఖ్యలో ఆ ప్రాంతానికి చేరుకున్నారు. తెలంగాణ, ఏపీలోని పలు ప్రాంతాల నుంచి తరలివచ్చారు. జై శ్రీరామ్, జై హనుమాన్, జై జనసేన, పవన్ కల్యాణ్ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ అభిమానులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అభిమానుల కేకలు, కేరింతలు, ఈలలతో కొండగట్టు ప్రాంతం మారుమోగింది. పవన్ కల్యాణ్ రాక సందర్భంగా జగిత్యాల- కరీంనగర్ హైవే రోడ్డు నుంచి కొండగట్టుకు వచ్చే గుట్ట రోడ్డుకు ఇరువైపులా అభిమానులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. దారి పొడవునా ఫ్లెక్సీలు ప్రదర్శిస్తూ పవన్ కల్యాణ్‌కు స్వాగతం పలికారు. అభిమానులకు ఆయన అభివాదం చేస్తూ ముందుకు సాగారు.

అంతకుముందు కొండగట్టుకు వస్తున్న క్రమంలో సిద్దిపేట జిల్లా సరిహద్దులో పవన్‌కు ఘనస్వాగతం లభించింది. సిద్దిపేట అర్బన్ మండలంలోని పొన్నాల, ములుగు మండలంలోని ఒంటిమామిడి, వర్గల్ వద్ద అభిమానులు ఆయనకు స్వాగతం పలికారు. పొన్నాల వద్ద తెలంగాణ పవన్ కల్యాణ్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన గజమాలను ఆయన స్వీకరించారు.

పోలీసుల భారీ బందోబస్తు...

పవన్ కల్యాణ్ కొండగట్టు పర్యటన సందర్భంగా పోలీసులు అడుగడునా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అభిమానులు భారీ సంఖ్యలో రావడంతో వారిని నిలువరించడం పోలీసులకు కష్టంగా మారింది. కాగా, పవన్ కల్యాణ్ వెంట ప్రముఖ ఆర్కిటెక్చర్ ఆనంద్ సాయి కూడా కొండగట్టుకు వచ్చారు. గతంలో అప్పటి సీఎం కేసీఆర్ కొండగట్టు దేవస్థాన అభివృద్ధి కోసం జరిపిన పర్యటనలోనూ ఆనంద్ సాయి కీలక పాత్ర పోషించారు. యాదాద్రి మాదిరిగానే అంజనాద్రిని అభివృద్ధి పరచడానికి అవసరమైన ప్రణాళికను ఆనంద్ సాయి రూపొందించి కేసీఆర్‌కు అందజేశారు. ప్రస్తుతం ఆయన పవన్ కల్యాణ్‌తో కలిసి రావడం చర్చనీయాంశమైంది.

ఒంటరి మహిళలే టార్గెట్

- డబ్బు ఆశచూపి శారీరక వాంఛ తీర్చుకుని హత్య
- రెండేళ్లలో ఐదుగురు మహిళలను చంపిన కిరాతకుడు



మహబూబ్‌నగర్, జూన్ 29 : ఒంటరిగా ఉన్న మహిళలకు డబ్బు ఆశచూపి శారీరక వాంఛ తీర్చుకున్న తర్వాత వారి ప్రాణాలు తీస్తున్న ఓ కరడుగట్టిన హంతకుడిని మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ పోలీసులు పట్టుకున్నారు. సదరు యువకుడు రెండేళ్లలో ఏకంగా ఆరు హత్యలు చేశాడు. చేసిన అప్పు తీర్చమన్నందుకు ఓ పురుషుడిని కూడా ఆ కిరాతకుడు కడతేర్చాడు. మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ జానకి ధరావత్ వివరాలను శనివారం విలేకరులకు వెల్లడించారు. గద్వాల జిల్లా కేటి దొడ్డి మండలం చిన్నచింత కుంట గ్రామానికి చెందిన బోయ కాశమయ్య అలియాస్ బోయ కాశి(25) అవివాహితుడు. రెండేళ్ల క్రితం మహబూబ్‌నగర్‌కు వచ్చి కూలి పనులు చేస్తూ ఫుట్‌పాత్, బస్టాండ్‌ల్లో నిద్రిస్తూ కాలం గడిపేవాడు. పని చేయగా వచ్చిన డబ్బుతో మద్యం తాగి జల్సా చేసేవాడు. కూలీలు పని కోసం వేచి ఉండే అడ్డాల దగ్గర మాటువేసి ఒంటరి మహిళలతో మాటలు కలిపి డబ్బు ఆశ చూపి లోబర్చుకునేవాడు. నమ్మి వచ్చిన వారితో వాంఛ తీర్చుకున్న తర్వాత ప్రాణం తీసి పరారయ్యేవాడు. మే 25న టీడీగుట్ట లేబర్ అడ్డా దగ్గర మహబూబ్‌నగర్ మండలం గాజులపేటకు చెందిన ఓ మహిళకు డబ్బు ఇస్తానని నమ్మించి భూత్పూర్‌లోని అమిస్తాపూర్ వంతెన వద్ద నిర్మాణంలో ఉన్న ఓ భవనంలోకి తీసుకెళ్లాడు. అక్కడ శారీరక వాంఛ తీర్చుకున్న తర్వాత ఆమె గొంతుకు టవల్ బిగించి, బ్లేడుతో గొంతుకోశాడు. అనంతరం బండరాయితో తలపై మోది ఆమె కాళ్లకున్న వెండి కడియాలు తీసుకుని పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మృతురాలి దుస్తులకు అతుక్కుని ఉన్న ఓ బస్ టికెట్‌పై రాసి ఉన్న ఫోన్ నెంబర్ ఆధారంగా దర్యాప్తు చేసి హత్యకు గురైంది ఎవరనేది గుర్తించారు. ఆ క్రమంలో నిందితుడు కాశీని గుర్తించిన పోలీసులు టీడీగుట్ట వద్ద శనివారం అదుపులోకి తీసుకుని విచారించారు. నేరాన్ని అంగీకరించిన కాశీ.. గతంలో తాను చేసిన హత్యల వివరాలను వెల్లడించాడు. 2022 జూన్ 22న బిజినేపల్లి మండలం అల్లీపూర్ గేట్ దగ్గర ఓ గుర్తుతెలియని మహిళను హత్య చేసిన కాశీ 2022 నవంబరు 21న హన్వాడ పరిధిలో జైనల్లీపూర్ గ్రామానికి చెందిన ఓ మహిళ ప్రాణం తీశాడు. 2023 జూన్ 17న వనపర్తి రూరల్‌లోని పెద్దగూడెం గ్రామంలో ఓ మహిళను, 2024 ఫిబ్రవరి 7న మహబూబ్‌నగర్ రూరల్ మండలం పరిధిలోని మన్యంకొండ దగ్గర మరో మహిళను హత్య చేశాడు. సంగారెడ్డి జిల్లాకు చెందిన మున్నూర్ మల్లేష్ అనే సహచర కూలీ కాశీకి రూ.3వేలు అప్పు ఇచ్చి తీర్చమన్నందుకు 2023 జూలై 13న అమిస్తాపూర్ శివారులో తలపై బండరాయితో మోది హత్య చేశాడు.

గర్భిణి మృతికి కారణమైన ఆస్పత్రి సీజ్

హుజూర్‌నగర్, జూన్ 29: గిరిజన వివాహిత రత్నావత్ సుహాసినికి గర్భవిచ్ఛిత్తి చేసే క్రమంలో ఆమె మృతికి కారణమైన సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లోని న్యూకమల ఆస్పత్రిని జిల్లా వైద్యాధికారి కోటాచలం శనివారం సీజ్ చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. చివ్వెంల మండలం ఎంజీనగర్ తండాకు చెందిన సుహాసినికి గర్భవిచ్ఛిత్తి చేసిన న్యూకమల ఆస్పత్రి నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారని తేలిందన్నారు. సుహాసిని ఉదంతంలో డాక్టర్లు, ఆస్పత్రి నిర్వాహకులు, సూర్యాపేట, కోదాడలోని ఆస్పత్రులపై చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

సౌత్ గ్లాస్ పరిశ్రమలో క్లూస్ టీం ఆధారాల సేకరణ

- మృతుల కుటుంబాలకు 25 లక్షల పరిహారం ఇవ్వాలి
- షాద్‌నగర్ ఎమ్మెల్యే డిమాండ్
- పరిశ్రమ మేనేజర్‌పై కేసు



బాధిత కుటుంబాలతో మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

షాద్‌నగర్, షాద్‌నగర్ అర్బన్ (ఆంధ్రజ్యోతి), షాద్‌నగర్ రూరల్, జూన్ 29: రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం బూర్గుల శివారులోని సౌత్ గ్లాస్ పరిశ్రమలో శుక్రవారం జరిగిన పేలుడుకు సంబంధించి క్లూస్ టీం పోలీసులు శనివారం ఆధారాలు సేకరించారు. ప్రమాదానికి కారణమైన ఆటోక్లేవ్ యంత్రం వద్ద గాజు శకలాలు, పౌడర్, గ్యాస్ తదితర నమూనాలను సేకరించారు. వాటిని ల్యాబ్‌కు పంపి వచ్చే నివేదికను షాద్‌నగర్ పోలీసులకు అందజేయనున్నారు. ప్రమాదంలో ఐదుగురు కార్మికులు మరణించగా పదిమందికి గాయాలయ్యాయి. మృతిచెందిన కార్మికుల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు ఉస్మానియా ఆస్పత్రికి శనివారం తరలించారు. గ్లాస్ పరిశ్రమను షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి సందర్శించి ప్రమాదానికి కారణాలు తెలుసుకున్నారు. యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని, మృతుల కుటుంబాలకు రూ.25లక్షల పరిహారం ఇవ్వాలని ఎమ్మెల్యేడిమాండ్ చేశారు. పరిశ్రమ మేనేజర్‌పై కేసు నమోదు చేసినట్టు క్రైమ్ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి తెలిపారు. మేనేజర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని షాద్‌నగర్ డిప్యూటీ తహసీల్దార్ ఆనంద్‌సింగ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశామన్నారు. మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటానని ఎంపీ డీకే అరుణ బాధిత కుటుంబాలకు హామీ ఇచ్చారు. బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కోరినట్టు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి తెలిపారు. మరోవైపు హైకోర్టు న్యాయవాదులు కె.రాజేష్‌కుమార్, కె.స్వాతి, మీనాక్షి, నవీన్‌కుమార్ పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి, మేనేజింగ్ డైరెక్టర్, కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్, సౌత్‌గ్లాస్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ, ఆటోమోటివ్ గ్లాసెస్ ఆర్కిటెక్చర్‌లకు లీగల్ నోటీసులు పంపారు. ప్రమాదంలో మరణించిన వారికి పరిహారం, క్షతగాత్రులకు వసతుల కల్పన వివరాలు తెలపాలని కోరారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆర్కే RK




కొత్తపలుకు

కూల్చుడు కతలు!

"ఒకటి రెండు నెలలు ఓపిక పట్టండి.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉండదు. ఖమ్మం, నల్లగొండ, వరంగల్ జిల్లాలకు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మనతో టచ్‌లో ఉన్నారు. ఢిల్లీలో భారతీయ జనతా పార్టీకి చెందిన కీలక నేతలతో టచ్‌లో ఉన్నాం. రెండు నెలల తర్వాత అధికారంలోకి వస్తాం. ముఖ్యమంత్రి పదవిపై నాకు ఆశ లేదు. ఎవరో ఒకరు ముఖ్యమంత్రి అవుతారు. నేను మీకు మార్గదర్శిగా ఉంటాను. కాంగ్రెస్‌లో చేరుతున్న మన ఎమ్మెల్యేలను న్యాయస్థానం ద్వారా అనర్హులుగా ప్రకటింపజేస్తాం. ఢిల్లీకి చెందిన పెద్ద లాయర్‌తో మాట్లాడాం. ఇంతకంటే ఎక్కువ చెప్పను. చెబితే రహస్యాలు లీక్ అవుతాయి".. తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మూడు రోజుల క్రితం ఫాంహౌస్‌కు పిలిపించుకున్న తన పార్టీ ఎమ్మెల్యేలతో చెప్పిన మాటలు ఇవి. ఎమ్మెల్యేలకు తన మాటలపై నమ్మకం కుదరడం కోసం ఆయన కొన్ని ఆడియో సంభాషణలను కూడా వినిపించారు. సదరు ఆడియోలో మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డితో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

> అధికారంలో ఉన్నప్పుడు విర్రవీగిన వాళ్లను ప్రజలు క్షమించరు. 2019లో 151 సీట్లతో జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పుడు ఆహా ఓహో అనుకున్నాం. అయితే ఆ ప్రభుత్వ పోకడలను గమనించిన ప్రజలకు అనతికాలంలోనే విరక్తి కలిగింది. జగన్మోహన్‌రెడ్డి వికృత ఆలోచనలు చేసి ఉండకపోతే ఇప్పుడు 11 సీట్లకే పరిమితమై ఉండేవారు కాదు. ప్రతిపక్ష నాయకుడి హోదా కోసం దేబిరించాల్సిన దుస్థితి వచ్చి ఉండేది కాదు. ప్రజలే ఆయనకు ఆ హోదా ఇచ్చి ఉండేవారు. పగ, ప్రతీకారాలతో రగిలిపోకుండా ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించి ఉంటే పెద్దగా అద్భుతాలు చేయకపోయినా జగన్‌రెడ్డి అధికారంలో కొనసాగి ఉండేవారు. అలా చేయలేదు కనుకే ప్రజలు ఆయనకు గర్వభంగం కలిగించారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు గత ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించడం ఆనవాయితీగా వస్తోంది. అయితే దీనివల్ల ఐదేళ్ల తర్వాత జరిగే ఎన్నికల్లో ఫలితం ఉండడం లేదు. ఇది పదే పదే రుజువైంది.

ప్రభృతులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కించపరిచే విధంగా చేసినట్టున్న వ్యాఖ్యలు ఉన్నాయి. ఈ ఆడియో టేపులు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడకముందు రికార్డ్ చేసినవా? లేక కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతా అన్నది మాత్రం కేసీఆర్ చెప్పలేదు. మొత్తంమీద కాంగ్రెస్ పార్టీ నుంచి బయటకు వచ్చే వారితో పాటు భారతీయ జనతా పార్టీ ఎమ్మెల్యేలు, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కలసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారన్నది కేసీఆర్ మాటల సారాంశం. కేసీఆర్ ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న వారిలో ఒకరైన చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య శుక్రవారం ఢిల్లీ వెళ్లి మరీ కాంగ్రెస్ పార్టీలో చేరగా, మరో ఇద్దరు వారం రోజుల్లో ఆ పార్టీలో చేరబోతున్నారు. కేసీఆర్ చెబుతున్న దాంట్లో నిజం ఉందా? లేదా? భారతీయ జనతా పార్టీకి చెందిన కీలక నేత నిజంగానే ఆయనతో టచ్‌లో ఉన్నారా? కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రస్తుతం మంత్రులుగా ఉన్నవారు ఆ పార్టీని వదిలి వస్తారా? వస్తే వారిలో ఎవరు ముఖ్యమంత్రి అవుతారు? ఎలా అవుతారు? ఎనిమిది మంది సభ్యులున్న బీజేపీ, 30 మంది (ప్రస్తుతానికి) సభ్యులున్న బీఆర్‌ఎస్‌తో కలిపినా 38 మంది సభ్యుల బలం మాత్రమే ఉంటుంది. ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే మరో 22 మంది కావాల్సి ఉంటుంది. కాంగ్రెస్ నుంచి అంతమందితో బయటకు వచ్చే నాయకుడు ఉన్నారా? ఈ లోపు బీఆర్‌ఎస్ నుంచి మరికొంత మంది కాంగ్రెస్‌లో చేరితే ఆ పార్టీ బలం 30 కంటే తక్కువ అవుతుంది కదా? ఈ పరిస్థితులలో రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని పడగొట్టడం ఎలా సాధ్యం? వంటి ప్రశ్నలకు మాత్రం సమాధానం లేదు. పార్టీ వదిలిపోతున్న శాసనసభ్యులను కాపాడుకోవడం కోసం కేసీఆర్ ఈ కథ అల్లారో.. లేక నిజంగానే ఆయన ఢిల్లీలోని బీజేపీకి చెందిన కీలక నేతతో టచ్‌లో ఉంటూ వ్యూహ రచన చేస్తున్నారో తెలియదు. పార్టీ ఎమ్మెల్యేలు చేజారిపోతున్నప్పుడు ఉన్న వారినైనా కాపాడుకోవడం కోసం పార్టీ అధినేత ఇలాంటి కథలు చెప్పడం సహజం. కేసీఆర్‌కు ఇలాంటి పిట్ట కథలు చెప్పడం అలవాటే కనుక ఆయన మాటలను సొంత పార్టీ వాళ్లు కూడా నమ్మడం లేదు. గతంలో టీఆర్‌ఎస్‌ను జాతీయ పార్టీగా ప్రకటించినప్పుడు కూడా మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లో అన్ని సీట్లు గెలుస్తాం, ఇన్ని సీట్లు గెలుస్తాం, లోక్‌సభ ఎన్నికల తర్వాత నేనే ప్రధానమంత్రిని అవుతా, లేదా చక్రం తిప్పుతా.. అని తన పార్టీ వారి వద్ద కేసీఆర్ గొప్పలు చెప్పుకొన్నారు. చివరకు బీఆర్‌ఎస్‌కు లోక్‌సభలో కనీసం ప్రాతినిధ్యం కూడా లేకుండా పోయింది. కేసీఆర్‌కు జాతకాలపై నమ్మకం కూడా ఎక్కువే. ప్రస్తుతం ఆయనకు గ్రహాలు అనుకూలంగా లేవట. వచ్చే సెప్టెంబరు తర్వాత ఆయనకు మంచి రోజులు వస్తాయట. బహుశా ఈ జాతకాలనే నమ్ముకొని ఒకటీ రెండు నెలల తర్వాత రేవంత్ రెడ్డి ప్రభుత్వం పడిపోతుందని చెబుతుండవచ్చు. అయితే కేసీఆర్ చెబుతున్న మాటల గురించి తెలుసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ఆపరేషన్ ఆకర్ష్‌ను వేగవంతం చేశారు. మరికొద్ది రోజుల్లో బీఆర్‌ఎస్ బలం 20 లోపునకు పడిపోతుందని చెబుతున్నారు. కాగా ప్రస్తుత పరిస్థితులలో బీజేపీ అగ్రనేతలు కూడా తెలంగాణలో అతుకుల బొంత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి సిద్ధపడకపోవచ్చు. మహారాష్ట్రలో ఆ పార్టీ చేసిన ప్రయోగం వికటిస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో ఆ రాష్ట్రంలో బీజేపీకి ప్రతికూల ఫలితాలు వచ్చాయి. ప్రస్తుతం బీజేపీతో చేతులు కలిపిన ఎన్సీపీ నేత అజిత్ పవార్ వర్గానికి చెందిన పలువురు ఎమ్మెల్యేలు తిరిగి శరద్ పవార్ వర్గంలో చేరబోతున్నారన్న వార్తలు వస్తున్నాయి. ఏక్‌నాథ్ షిండే నాయకత్వంలో శివసేనను వదిలి వచ్చిన వాళ్లలో కూడా కొందరు అదే ఆలోచన చేయవచ్చు. వీటన్నింటికీ తోడు అధికారంలో కొనసాగడం కోసం ఒకప్పుడు బీజేపీని తిట్టి పోసిన వారితో చేతులు కలపడాన్ని ఆరెస్సెస్ కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ నేపథ్యంలో తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని అస్థిరపరచడానికి బీజేపీ ముందుకు రాకపోవచ్చు. మహారాష్ట్ర అసెంబ్లీకి అక్టోబర్‌లో ఎన్నికలు జరగనున్నాయి. ఆ ఎన్నికల్లో బీజేపీకి ప్రతికూల ఫలితాలు వస్తే ఏక్‌నాథ్ షిండే వంటి వారిని ఇతర రాష్ట్రాలలో ప్రోత్సహించడానికి బీజేపీ అగ్రనేతలు సిద్ధపడకపోవచ్చు. దీన్నిబట్టి కేసీఆర్ జాతకంలో ఇప్పుడప్పుడే మార్పులు ఉండకపోవచ్చు. కేసీఆర్ ప్రస్తుత దుస్థితికి ఆయనే కారణం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పార్టీ ఫిరాయింపులను విస్తృతంగా ప్రోత్సహించిన ఘనత ఆయనదే. అందుకే ఇప్పుడు కాంగ్రెస్ పార్టీని తప్పుబట్టే నైతిక అర్హత ఆయనకు లేకుండా పోయింది. అధికారంలో ఉన్నప్పుడు విర్రవీగిన కేసీఆర్ కుటుంబంపై ఇప్పుడు తెలంగాణలో సానుభూతి చూపించేవారే కరువయ్యారు. కవితను జైల్లో పెట్టి వంద రోజులు దాటినా ఆమె గురించి తలచుకొనేవారే లేకుండా పోయారు. తనకూ తన కుటుంబసభ్యులకూ ఈ పరిస్థితి ఎందుకు ఎదురవుతున్నదో కేసీఆర్ ఆత్మపరిశీలన చేసుకోవడం లేదు. నిజానికి తెలంగాణ ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన కేసీఆర్‌ను ప్రజలు శాశ్వతంగా గుండెల్లో పెట్టుకోవాలి. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఒక్క సీటు కూడా లభించలేదంటే కేసీఆర్ అండ్ కో సేవలు ఇకపై తమకు అవసరం లేదని తెలంగాణ ప్రజలు నిర్ణయానికి వచ్చారని భావించాలి. కళ్ల ముందు కనిపిస్తున్న వాస్తవాలను గుర్తించకపోగా ఒకటి రెండు నెలల్లో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పడిపోతుందని కల్లబొల్లి కబుర్లు చెప్పడం కేసీఆర్‌కే చెల్లుతుంది.



వాస్తవంలోకి వస్తే బెటర్!

బ్రహ్మాండమైన ప్రజా మద్దతుతో 2018లో తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కేసీఆర్, 2019లో ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి ప్రజాస్వామ్యాన్ని పాతర వేశారు. ముఖ్యమంత్రులు ఎలా ఉండకూడదో తమ చర్యల ద్వారా భావితరాలకు చెప్పారు. ఈ వాస్తవాన్ని గుర్తించకుండా 'మేం ఏం తక్కువ చేశామని మమ్మల్ని ఓడించారు?' అని ప్రజలను నిందిస్తున్నారు. మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామన్న స్పృహ లేకుండా రాచరిక పోకడలు పోతే ప్రజలు సహించరని ఎందుకు తెలుసుకోరో తెలియదు. తమను తాము గొప్ప పాలకులుగా ఆ ఇద్దరూ ఇప్పటికీ నమ్ముతున్నారు. తెలంగాణలో కేసీఆర్ ప్రగతిభవన్‌కు పరిమితం కాగా, ఆంధ్రప్రదేశ్‌లో జగన్మోహన్‌రెడ్డి పరదాల మాటున ఉండిపోయారు. ఈ నేపథ్యంలో కేసీఆర్.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టడం ఎలా అన్న పిచ్చి ఆలోచనలు చేయకుండా తాను కోల్పోయిన ప్రజాభిమానాన్ని తిరిగి పొందడం ఎలా? అన్న దానిపై దృష్టిపెట్టడం మంచిది. ప్రస్తుత రాజకీయాలలో అధికారం కోల్పోయిన పార్టీలు మనుగడ సాగించడం కష్టంగా ఉంటోంది. గతంలో చంద్రబాబు కూడా ఇటువంటి గడ్డు పరిస్థితులను ఎదుర్కొన్నారు. పార్టీని కాపాడుకోవడం కోసం ఆయన పడని పాట్లు లేవు. కేసీఆర్ ఆ దిశగా చర్యలు తీసుకోకపోగా తనను తాను మభ్యపెట్టుకొనే ప్రయత్నం చేస్తున్నారు. ఎమ్మెల్యేలను కాపాడుకోవడం కోసం పిట్ట కథలు చెప్పడం తప్పు కాదు గానీ అది నిజం కాబోతోందని నమ్మితే మాత్రం రాజకీయంగా మోక్షం లభించదు. తెలంగాణ ప్రజలు తనను ఎందుకు తిరస్కరించారో గుర్తించడానికి కేసీఆర్ ఇప్పటికీ సిద్ధంగా లేకపోవడమే ఆశ్చర్యం కలిగిస్తోంది. ఆయనలో ఇప్పటికీ అహం తగ్గలేదు. ఎక్కడ తగ్గాలో, ఎక్కడ నెగ్గాలో తెలుసుకున్నాడు కనుకనే చంద్రబాబు పడి లేచారు. ఈ లాజిక్‌ను పట్టించుకోని కేసీఆర్, ప్రజలు తన పాలన కోసం ఎదురుచూస్తున్నారని పగటి కలలు కంటున్నారు. రాజకీయాల్లో విధేయతకు ఇప్పుడు చోటు లేకుండా పోయింది. తన పక్కన పెద్ద సోఫా వేసి కూర్చోబెట్టుకున్న మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, ఎక్కడో ఉన్న వ్యక్తిని రాజకీయాల్లోకి తెచ్చి ఎమ్మెల్యేను చేసిన సంజయ్ వంటి వాళ్లు అధికారం కోల్పోయిన తర్వాత తనను వదిలిపోవడంపై కేసీఆర్ మనసు కష్టపెట్టుకున్నట్టుగా ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వంలో పదేళ్లు మంత్రిగా పనిచేసిన సబితా ఇంద్రారెడ్డి ఆ పార్టీని వదిలి తనతో చేతులు కలిపినప్పుడు కేసీఆర్‌కు ఇలాంటి సెంటిమెంట్లు గుర్తుకురాలేదు. గతంలో కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలకు చెందిన శాసనసభ్యులను తన పార్టీలో చేర్చుకున్నప్పుడు వారిని అనర్హులుగా ప్రకటించాల్సి ఉంటుందన్న విషయం కేసీఆర్‌కు తెలియదా? అప్పుడు కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు ఇచ్చిన ఫిర్యాదులను స్పీకర్ పట్టించుకున్నారా? తెలుగుదేశం పార్టీ తరఫున ఎన్నికైన తలసాని శ్రీనివాసయాదవ్‌తో ఉత్తుత్తి రాజీనామా చేయించి మంత్రి పదవి కట్టబెట్టిన కేసీఆర్‌కు నైతిక విలువలు గుర్తుకు రాలేదా? ఇప్పుడు తన పార్టీకి చెందిన ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించకపోవడం అన్యాయం, అక్రమం అని రోదిస్తే ఫలితం ఉంటుందా? అధికారంలో ఉన్నప్పుడు కట్టుబాట్లు తప్పకుండా ఉండి ఉంటే కేసీఆర్‌కు ఈ దుస్థితి వచ్చి ఉండేది కాదు. కర్మ ఫలం అనుభవించి తీరాల్సిందే. పార్టీ ఫిరాయింపులను తప్పుబట్టే అర్హత ఇప్పుడు ఈ దేశంలో ఏ ఒక్క రాజకీయ పార్టీకి కూడా లేదు. అందుకే కేసీఆర్ ఆక్రందనలను తెలంగాణ ప్రజలు ఆలకించడం లేదు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఇకపై పాలన మీద మరింత దృష్టి కేంద్రీకరించాలి. ప్రభుత్వం పరుగులు పెడుతోందన్న భావనను ప్రజల్లో కలిగించాలి. తన ప్రభుత్వంపై ప్రజల అభిప్రాయం ఎలా ఉందో తెలుసుకుంటూ ఉండాలి. కొన్ని విషయాలలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో కింది స్థాయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉదాహరణకు ట్రాన్స్‌ఫారం కావాలంటే వారాల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి. భూ వినియోగ మార్పిడి ఫైళ్లకు అతీగతీ ఉండటం లేదు. ఆయా

> నిజానికి తెలంగాణ ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన కేసీఆర్‌ను ప్రజలు శాశ్వతంగా గుండెల్లో పెట్టుకోవాలి. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు ఒక్క సీటు కూడా లభించలేదంటే కేసీఆర్ అండ్ కో సేవలు ఇకపై తమకు అవసరం లేదని తెలంగాణ ప్రజలు నిర్ణయానికి వచ్చారని భావించాలి.

సమస్యలపై ప్రజాభిప్రాయాన్ని మదింపు చేసుకొని ప్రభుత్వం వెంటనే తగు చర్యలు తీసుకోవాలి. రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థను కూడా పటిష్ఠం చేయాలి. పోలీసులలో కొంత అలసత్వం కనబడుతోంది. మంత్రివర్గ విస్తరణ తర్వాతనైనా రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని పరుగులు పెట్టిస్తారని ఆశిద్దాం.

> తన పక్కన పెద్ద సోఫా వేసి కూర్చోబెట్టుకున్న మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, ఎక్కడో ఉన్న వ్యక్తిని రాజకీయాల్లోకి తెచ్చి ఎమ్మెల్యేను చేసిన సంజయ్ వంటి వాళ్లు అధికారం కోల్పోయిన తర్వాత తనను వదిలిపోవడంపై కేసీఆర్ మనసు కష్టపెట్టుకున్నట్టుగా ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వంలో పదేళ్లు మంత్రిగా పనిచేసిన సబిత ఇంద్రారెడ్డి ఆ పార్టీని వదిలి తనతో చేతులు కలిపినప్పుడు కేసీఆర్‌కు ఇలాంటి సెంటిమెంట్లు గుర్తుకురాలేదు. గతంలో కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలకు చెందిన శాసనసభ్యులను తన పార్టీలో చేర్చుకున్నప్పుడు వారిని అనర్హులుగా ప్రకటించాల్సి ఉంటుందన్న విషయం కేసీఆర్‌కు తెలియదా? అప్పుడు కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు ఇచ్చిన ఫిర్యాదులను స్పీకర్ పట్టించుకున్నారా? తెలుగుదేశం పార్టీ తరపున ఎన్నికైన తలసాని శ్రీనివాసయాదవ్‌తో ఉత్తుత్తి రాజీనామా చేయించి మంత్రి పదవి కట్టబెట్టిన కేసీఆర్‌కు నైతిక విలువలు గుర్తుకురాలేదా? ఇప్పుడు తన పార్టీకి చెందిన ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించకపోవడం అన్యాయం, అక్రమం అని రోదిస్తే ఫలితం ఉంటుందా? అధికారంలో ఉన్నప్పుడు కట్టుబాట్లు తప్పకుండా ఉండి ఉంటే కేసీఆర్‌కు ఈ దుస్థితి వచ్చి ఉండేది కాదు.

ఇప్పటికీ అవే రోత మాటలు!

తెలంగాణలో కట్టుకథలు, పిట్టకథలతో కేసీఆర్ కాలక్షేపం చేస్తుండగా ఆంధ్రప్రదేశ్‌లో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రస్తుతం బెంగళూరులోని ప్యాలెస్‌లో సేద తీరుతున్నారు. ఎన్నికల ఫలితాలు చూసిన తర్వాత అన్నీ వదిలేసుకుని హిమాలయాలకు వెళ్లాలనిపించిందని నిర్వేదం వ్యక్తంచేశారు. శాసనసభలో తనకు ప్రతిపక్ష నాయకుడి హోదా ఇవ్వాలని సభాపతికి ఒక లేఖ రాసి పడేసి ఆయన బెంగళూరు వెళ్లిపోయారు. ప్రతిపక్ష నాయకుడి హోదాను ఆయనకు ప్రజలే ఇవ్వలేదు. ప్రజలు తనను అంతలా ఎందుకు తిరస్కరించారో తెలుసుకొనే ప్రయత్నం చేయకపోగా ప్రతిపక్ష నాయకుడి హోదా ఇవ్వకపోతే తాను శాసనసభకు హాజరు కానన్న బెదిరింపులకు తెగబడటం విడ్డూరంగా ఉంది. చాక్లెట్ కొనిస్తేనే నేను బడికి వెళతానని పిల్లలు మారాం చేసినట్టుగా జగన్‌రెడ్డి మారాం ఉంది. ఆయన శాసనసభకు హాజరు కాకపోతే ఎవరికి నష్టం? చెరువు మీద అలిగినట్టుగా ఉంది. అయినా ఇప్పుడు జగన్‌కు ప్రతిపక్ష హోదా ఇవ్వాల్సిందేనని వాదిస్తున్న వాళ్లు గతంలో జగన్ తలుచుకుంటే చంద్రబాబుకు ప్రతిపక్ష నాయకుడి హోదా పోతుందని కూశారు. తెలంగాణలో కాంగ్రెస్ నేత భట్టి విక్రమార్కకు ప్రతిపక్ష నాయకుడి హోదా తొలగించినప్పుడు అలా ఎలా అని ప్రశ్నించలేదు. చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడి పదిహేను రోజులు మాత్రమే అయింది. అయినా తన ఏలుబడిలో సజావుగా ఉన్న రాష్ట్రంలో ప్రజలు ఇప్పుడు సమస్యలతో అల్లాడిపోతున్నట్టుగా చిత్రించే పనిలో జగన్‌రెడ్డి అండ్ కో ఉండటం మరీ రోతగా ఉంది. తమ పాలన నిజంగా అంత గొప్పగా ఉండి ఉంటే వైసీపీకి 11 సీట్లు మాత్రమే ఎందుకు వచ్చినట్టు? ముఖ్యమంత్రి ఎలా ఉండకూడదో జగన్‌రెడ్డి చాలా బలంగా రుజువు చేశారు. చంద్రబాబు ప్రభుత్వం అనుక్షణం ఈ విషయం గుర్తుపెట్టుకోవాలి. జగన్ పాలనలో మంత్రులు, ఎమ్మెల్యేల పోకడలను, ప్రభుత్వ దుశ్చర్యలను గుర్తుకు తెచ్చుకొని బ్లూ బుక్ రూపొందించుకొని అందుకు అనుగుణంగా ప్రస్తుత మంత్రులు నడుచుకోవాలి. ప్రభుత్వం ఎలా ఉండకూడదో జగన్‌రెడ్డి మన కళ్ల ముందు ఆవిష్కరించారు. అది తెలుసుకొని వాటిని గుర్తుచేసుకుంటూ జాగ్రత్తలు తీసుకోవడం చంద్రబాబు ప్రభుత్వ బాధ్యత. అధికారంలో ఉన్నప్పుడు విర్రవీగిన వాళ్లను ప్రజలు క్షమించరు. భారీ మెజారిటీతో అధికారంలోకి వచ్చిన వారిని ప్రజలు మరింత నిశితంగా గమనిస్తారు. 2019లో 151 సీట్లతో జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పుడు ఆహా ఓహో అనుకున్నాం. అయితే ఆ ప్రభుత్వ పోకడలను గమనించిన ప్రజలకు అనతికాలంలోనే విరక్తి కలిగింది. జగన్మోహన్‌రెడ్డి వికృత ఆలోచనలు చేసి ఉండకపోతే ఇప్పుడు 11 సీట్లకే పరిమితమై ఉండేవారు కాదు. ప్రతిపక్ష నాయకుడి హోదా కోసం దేబిరించాల్సిన దుస్థితి వచ్చి ఉండేది కాదు. ప్రజలే ఆయనకు ఆ హోదా ఇచ్చి ఉండేవారు. పగ, ప్రతీకారాలతో రగిలిపోకుండా ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించి ఉంటే పెద్దగా అద్భుతాలు చేయకపోయినా జగన్‌రెడ్డి అధికారంలో కొనసాగి ఉండేవారు. అలా చేయలేదు కనుకే ప్రజలు ఆయనకు గర్వభంగం కలిగించారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు గత ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించడం ఆనవాయితీగా వస్తోంది. అయితే దీనివల్ల ఐదేళ్ల తర్వాత జరిగే ఎన్నికల్లో ఫలితం ఉండడం లేదు. ఇది పదే పదే రుజువైంది. ప్రస్తుత ప్రభుత్వ పనితీరు ఆధారంగానే ప్రజలు తీర్పు ఇస్తారు. ఇప్పుడు 164 సీట్లతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఆనవాయితీ ప్రకారం జగన్ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపడం మొదలుపెట్టింది. పోలవరం ప్రాజెక్టుపై శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు తొలి శ్వేతపత్రం విడుదల చేశారు. జగన్మోహన్‌రెడ్డి చేతగానితనం వల్ల పోలవరం ప్రాజెక్టు నాశనం అయిందని, వేల కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందని ఆయనను నిందించారు. త్వరలో మరో ఆరేడు అంశాలపై శ్వేతపత్రాలు విడుదల చేస్తామని చెప్పుకొచ్చారు. నిజమే, జగన్ పాలనతో పోలవరం ప్రాజెక్ట్ అతీగతీ లేకుండా పోయింది. ప్రజలకు ఆ విషయం తెలియదా? రాష్ట్రంలో రాజధాని లేకుండా పోయిందని, పోలవరం వంటి ప్రాజెక్టులు మూలనపడ్డాయని గుర్తించారు కనుకే ప్రజలు జగన్‌రెడ్డిని చిత్తు చిత్తుగా ఓడించారు. మూడు రాజధానులు అని చెప్పినా కర్నూలు, విశాఖలలో కూడా ఆయనకు ఆదరణ లభించలేదు. ఈ నేపథ్యంలో జగన్ వైఫల్యాల గురించి ప్రజలకు కొత్తగా చెప్పాల్సింది ఉందా? అన్న ప్రశ్న ఉత్పన్నమవుతుంది. గత ప్రభుత్వంలో తమ ఆశలు అడియాశలయ్యాయి కనుకే కనీవినీ ఎరుగని మెజారిటీతో కూటమిని ప్రజలు గెలిపించారు. కుంటుపడిన పోలవరం ప్రాజెక్టును తాము ఎలా ముందుకు తీసుకు వెళ్లబోతున్నారో ముఖ్యమంత్రిగా చంద్రబాబు వివరించాల్సిన అవసరం ఉంది. జగన్ చర్యల కారణంగా పోలవరంలో కొన్ని వేల కోట్ల రూపాయల నష్టం జరిగిన మాట వాస్తవమే అయితే ఆ నష్టానికి బాధ్యులు అయిన వారిపై చర్యలు తీసుకోవాలి కదా? నిబంధనలకు విరుద్ధంగా జగన్ ప్రభుత్వం చేపట్టిన రివర్స్ టెండరింగ్‌ను సరిదిద్దుతారా? కాంట్రాక్టర్‌ను మార్చడం తప్పిదం అని చెబుతున్నందున ఆ తప్పును సరిదిద్దుతారా? లేదా? వంటి ప్రశ్నలు తలెత్తుతాయి. ఈ కారణంగా జరిగింది చెప్పడంతో పాటు జరగబోయేది కూడా చెబితేనే శ్వేతపత్రాల విడుదల వల్ల ప్రయోజనం ఉంటుంది. అధికారం ఉన్నప్పుడు దుర్మార్గంగా వ్యవహరించిన వారిని ఎన్నికల్లో ఓడించడం ద్వారా తమ బాధ్యత తీరిపోయిందని ప్రజలు భావిస్తారు. జగన్ విషయంలో కూడా ఇదే జరిగింది. గంపెడు ఆశతో చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారు. ఈ వాస్తవాన్ని చంద్రబాబు అండ్ కో గుర్తించాలి. జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పుడు కూడా, అంతకుముందు ఉన్న చంద్రబాబు ప్రభుత్వాన్ని తిట్టిపోశారు. ప్రజలు అవేవీ గుర్తుంచుకోకుండా జగన్‌రెడ్డి దుష్ట పాలన ఆధారంగానే తీర్పు ఇచ్చారు. కాగా రామోజీరావు

> లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్రలో బీజేపీకి ప్రతికూల ఫలితాలు వచ్చాయి. ప్రస్తుతం బీజేపీతో చేతులు కలిపిన ఎన్సీపీ నేత అజిత్ పవార్ వర్గానికి చెందిన పలువురు ఎమ్మెల్యేలు తిరిగి శరద్ పవార్ వర్గంలో చేరబోతున్నారన్న వార్తలు వస్తున్నాయి. ఏక్‌నాథ్ షిండే నాయకత్వంలో శివసేనను వదిలి వచ్చిన వాళ్లలో కూడా కొందరు అదే ఆలోచన చేయవచ్చు. వీటన్నింటికీ తోడు అధికారంలో కొనసాగడం కోసం ఒకప్పుడు బీజేపీని తిట్టి పోసిన వారితో చేతులు కలపడాన్ని ఆరెస్సెస్ కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ నేపథ్యంలో తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని అస్థిరపరచడానికి బీజేపీ ముందుకు రాకపోవచ్చు. మహారాష్ట్ర అసెంబ్లీకి అక్టోబర్‌లో ఎన్నికలు జరగనున్నాయి. ఆ ఎన్నికల్లో బీజేపీకి ప్రతికూల ఫలితాలు వస్తే ఏక్‌నాథ్ షిండే వంటి వారిని ఇతర రాష్ట్రాలలో ప్రోత్సహించడానికి బీజేపీ అగ్రనేతలు సిద్ధపడకపోవచ్చు. దీన్నిబట్టి కేసీఆర్ జాతకంలో ఇప్పుడప్పుడే మార్పులు ఉండకపోవచ్చు.

సంస్మరణ సభ ఏర్పాటు విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు తొలి విమర్శ ఎదుర్కొంటున్నారు. రామోజీరావుకు అర్హత ఉందా? లేదా? అన్న విషయం పక్కన పెడితే ప్రభుత్వ పరంగా ఆయన సంస్మరణ సభ ఏర్పాటు చేయడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒక బిడ్డ జన్మించినప్పుడు ఆ ఇంట్లో వాళ్లు సంబరాలు చేసుకుంటారు. ఆ బిడ్డ ఎదిగి పెద్దవాడై తాను ఎంచుకున్న మార్గంలో ఉన్నత శిఖరాలు అధిరోహించి కన్ను మూసినప్పుడు ఆయన వల్ల ప్రయోజనం పొందినవాళ్లు, ఆయనతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నవాళ్లు బాధపడతారు. గతించిన వారితో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకోవడం కోసం సంస్మరణ సభలు పెట్టుకుంటారు. నాయకుడైతే ఆయనను అభిమానించే ప్రజలు స్మరించుకుంటారు. ఈ నేపథ్యంలో రామోజీరావు సంస్మరణ సభను ప్రభుత్వపరంగా కాకుండా ఆయనతో అనుబంధం ఉన్న వారితో కమిటీ ఏర్పాటు చేసి నిర్వహింపజేసి ఉంటే విమర్శలకు అవకాశం ఉండేది కాదు. ఇకపై ముఖ్యమంత్రి చంద్రబాబు మరింత జాగ్రత్త తీసుకుంటారని ఆశిద్దాం!

మూర్తీభవించిన ప్రజాస్వామ్య పరిణతి

వెంకయ్యనాయుడు పదవీకాలం పూర్తయ్యిందని, వారు రాజకీయాల నుంచి కూడా విశ్రాంతి తీసుకోబోతున్నారు అన్న విషయం ఎంతో భావోద్వేగాన్ని కలిగిస్తోంది. అయితే ఆయన 'ఐ హేవ్ రిటైర్డ్ ఫ్రం పోలిటిక్స్, బట్ నాట్ టైర్డ్ ఆఫ్ పబ్లిక్ లైఫ్' అని అనటం సంతోషదాయకం. రాజ్యసభకు నేతృత్వం వహించే బాధ్యత పూర్తి అయినప్పటికీ ఆయన గడించిన అనుభవాలు భవిష్యత్తులో ఎంతోకాలం పాటు దేశానికి లాభం చేకూరుస్తాయని, ప్రజాజీవితంలో పనిచేస్తున్న మావంటి కార్యకర్తలకు మార్గదర్శకంగా ఉంటాయని భావిస్తున్నాను.

వెంకయ్యనాయుడు ఎల్లప్పుడు దేశ యువతకు అత్యంత చేరువగా ఉంటూ, యువజనుల అభ్యున్నతికి పాటుపడుతూ వచ్చారు. పార్లమెంట్‌లో కూడా యువ సభ్యులను ప్రోత్సహిస్తూ, వారికి మార్గదర్శకంగా నిలిచేవారు. విద్యార్థినీ విద్యార్థులను కలుసుకుని, వారితో సంభాషించేందుకు విశ్వవిద్యాలయాలకు, ఎన్నో సంస్థలకు తరచూ వెళుతూ ఉంటారు. కొత్త తరంతో సదా అనుబంధం కొనసాగిస్తూ ఉన్నారు. యువత కూడా ఆయన్ని కలుసుకోవటానికి ఉత్సుకత చూపుతూ ఉంటుంది. పార్లమెంట్ వెలుపల ఉపరాష్ట్రపతిగా ఆయన చేసిన ఉపన్యాసాల్లో 25 శాతం యువత మధ్య చేసినవే కావటం గొప్ప విశేషం. యువతలోనూ, ప్రజల్లోనూ ఆయనకు గల ఆదరాభిమానాలకి ఇది ప్రధాన కారణం.

పార్టీ కార్యకర్తగా ఆయన అంకితభావం కానీ, శాసనసభ్యునిగా పనితీరు కానీ, పార్లమెంట్ సభ్యునిగా చూపిన క్రియాశీలత కానీ భారతీయ జనతా పార్టీ అధ్యక్షునిగా ప్రదర్శించిన దక్షత–నాయకత్వం గానీ, కేబినెట్ మంత్రిగా చేసిన నిరంతర శ్రమ గానీ, 'నవాచార్' కోసం చేసిన కృషి – పొందిన సఫలత్వం కానీ... ఇవన్నీ దేశానికి మహోపకారం చేశాయి. ఉపరాష్ట్రపతిగా, రాజ్యసభాపతిగా ఆయన తన బాధ్యతలన్నింటినీ పట్టుదలతో నిర్వహించటం చూశాను. ఎప్పుడూ ఏ బాధ్యతనీ ఆయన భారంగా భావించలేదు. అప్పగించబడిన ప్రతి పనికి న్యాయం చేశారు. పార్లమెంట్ సభ్యులందరితోపాటు దేశ యువత కూడా సమాజం గురించి, దేశం గురించి, ప్రజాస్వామ్యం గురించి వెంకయ్యనాయుడు నుంచి ఎంతో నేర్చుకోవాలని నేను కోరుతున్నాను. లిజనింగ్, లెర్నింగ్, కనెక్టింగ్, కమ్యూనికేటింగ్, చాటింగ్ ఔర్ రిఫ్లెక్టింగ్, రీకలెక్టింగ్, రీకనెక్టింగ్ వంటి ఆయన మాటలు వెంకయ్య గురించి ఎంతో తెలియపరుస్తాయి. ఆయనకున్న అపారమైన అనుభవాలు మన దేశ యువతకు మార్గనిర్దేశం చేస్తాయి, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చెయ్యగలుగుతాయి.

వెంకయ్యనాయుడి పుస్తకాల శీర్షికలే ఆయనకున్న పదప్రయోగ ప్రతిభను ప్రస్ఫుటింపజేస్తాయి. అయన 'వన్ లైనర్స్' – 'విట్ లైనర్స్', 'విన్ లైనర్స్'గా కూడా ఉంటాయి. అంతే, ఆ తరువాత ఇంకేమీ చెప్పవలసిన అవసరం ఉండదు. 'హిజ్ ఈచ్ వర్డ్ ఈజ్ హర్డ్, ప్రిఫర్డ్, రివర్డ్ అండ్ నెవర్ కౌంటర్డ్' తన సాటిలేని భాషా పటిమ, సహజ ప్రతిభ, సమయస్ఫూర్తి సాయంతో గడ్డు పరిస్థితుల దిశని మార్చగలిగే ఆయన సామర్థ్యాన్ని నేను అభినందిస్తున్నాను. వెంకయ్యనాయుడు దక్షిణ భారతావనిలో విద్యార్థి రాజకీయాల్లో చురుకుగా పాల్గొంటూ తన రాజకీయ ప్రయాణం ప్రారంభించారు. ఆయనకున్న భావజాలం, తదనుగుణమైన పార్టీకి దక్షిణాదిన అప్పటికి సమీప భవిష్యత్తులో ఏ సామర్థ్యమూ ఉండే అవకాశమే లేదు. అయినా సామాన్య విద్యార్థి కార్యకర్తగా యాత్ర ప్రారంభించి ఆ పార్టీ జాతీయ అధ్యక్షుని వంటి అత్యున్నత పదవిని చేరుకోగలిగారు. ఇది ఆయనకున్న భావనిబద్ధత, కర్తవ్యపరాయణతలకు ప్రతీక. దేశభక్తి, భావాల్ని వ్యక్తీకరించే కళ ఉంటే, భాషా వైవిధ్యంపై విశ్వాసం ఉంటే, 'భాష–ప్రాంతం' అనేవేవీ ఎప్పుడూ మనకి అడ్డుగోడలు కావు అని వెంకయ్యనాయుడు నిరూపించారు.

వెంకయ్యనాయుడికి మాతృభాష అంటే ఎనలేని ప్రేమ. అదే విషయాన్ని ఆయన "మాతృభాష కంటిచూపు వంటిది, పరభాష కళ్ళజోడు వంటిది" అని చెపుతూ ఉండటం మనమంతా పలుసార్లు విన్నాం. అది ఆయన హృదయపు లోతులనుంచి వెలువడిన భావన. వెంకయ్య హయాంలో పార్లమెంట్ వ్యవహారాల్లో భారతీయ భాషలకి విశేష ప్రాధాన్యం ఇవ్వబడింది. వారు అధ్యక్షులుగా ఉన్న కాలంలో సభలోని సభ్యులకు 22 షెడ్యూల్డ్ భాషల్లో, దేనిలోనైనా మాట్లాడటానికి అవకాశం కల్పించారు. ఆయన ప్రతిభ, కార్యనిష్ఠ ఇకపై కూడా పార్లమెంట్‌కు ఎల్లప్పుడూ ఒక దిక్సూచిలా నిలుస్తాయి. పార్లమెంటరీ మర్యాదను పాటిస్తూ సముచితమైన భాషలో ఏ సభ్యుడైనా తాను చెప్పదలచిన విషయాన్ని ప్రభావవంతంగా చెప్పవచ్చు అనేందుకు వెంకయ్య స్ఫూర్తిప్రదాతగా నిలుస్తారు. వెంకయ్యనాయుడి నాయకత్వ

> వెంకయ్య హయాంలో పార్లమెంట్ వ్యవహారాల్లో భారతీయ భాషలకి విశేష ప్రాధాన్యం ఇవ్వబడింది. వారు అధ్యక్షులుగా ఉన్న కాలంలో సభలోని సభ్యులకు 22 షెడ్యూల్డ్ భాషల్లో, దేనిలోనైనా మాట్లాడటానికి అవకాశం కల్పించారు. ఆయన ప్రతిభ, కార్యనిష్ఠ ఇకపై కూడా పార్లమెంట్‌కు ఎల్లప్పుడూ ఒక దిక్సూచిలా నిలుస్తాయి. పార్లమెంటరీ మర్యాదను పాటిస్తూ సముచితమైన భాషలో ఏ సభ్యుడైనా తాను చెప్పదలచిన విషయాన్ని ప్రభావవంతంగా చెప్పవచ్చు అనేందుకు వెంకయ్య స్ఫూర్తిప్రదాతగా నిలుస్తారు.



ప్రతిభ, క్రమశిక్షణ రాజ్యసభ నిబద్ధతను, పని సామర్థ్యాన్ని గణనీయంగా పెంచాయి. ఆయన పదవీకాలంలో రాజ్యసభ పని సామర్థ్యం 70 శాతం పెరగటమే కాక సభ్యుల హాజరు సహితం పెరిగింది. వెంకయ్య హయాంలో సుమారు 177 బిల్లులు పాసవ్వటం, లేదా వాటిపై చర్చ జరగటం ఒక రికార్డు. ఆయన మార్గదర్శకత్వంలో భారతీయ సంకల్పనలను సాకారం గావించే ఎన్నో చట్టాలు రూపొందాయి. ఆయన తీసుకున్న ఎన్నో నిర్ణయాల వల్ల ఎగువసభ ఎగువ దిశగా ప్రయాణం సాగించింది.

న సా సభా యత్ర న సంతి వృద్ధాః
వృద్ధా న తే యే న వదంతి ధర్మమ్

ఏ సభలో అయితే అనుభవజ్ఞులు ఉంటారో అదే నిజమైన సభ. కర్తవ్యబోధ చేసే వారే అనుభవజ్ఞులు అని శాస్త్రాలు చెపుతున్నాయి. వెంకయ్యనాయుడు మార్గదర్శకత్వంలో రాజ్యసభ ఆ స్థాయిని ఎంతో సమర్థంగా నిలిపింది. వారు సభలోని సభ్యులకు దిశానిర్దేశం చేయటమే కాదు, క్రమశిక్షణ దృష్ట్యా ప్రేమగా మందలించే వారు కూడా. ఆయన మాటని ఏ సభ్యుడూ ఎన్నడూ అన్యథా భావించలేదని నా



విశ్వాసం. ఒక వ్యక్తి తాను చెప్పే విషయాల్ని తన వ్యక్తిగత జీవితంలో ఆచరించి చూపినప్పుడు మాత్రమే ఆయనపైన అంతటి గౌరవం ఏర్పడుతుంది.

పార్లమెంట్ కార్యకలాపాల్లో ఒక పరిమితిని మించి జాప్యం సభా తిరస్కారంతో సమానం అని వెంకయ్యనాయుడు భావిస్తారు. ఆయన ఆదర్శాల్లో ప్రజాస్వామ్యపు పరిపక్వతను నేను గమనిస్తున్నాను. మునుపు సభలో చర్చ జరిగేటప్పుడు గోల జరిగితే కార్యకలాపాలు నిలుపు చేయబడేవి. కానీ వెంకయ్య సభ్యులతో మాట్లాడి, సంప్రదింపులు జరిపి, సమన్వయంతో సభని కొనసాగించటంలో సఫలీకృతులయ్యారు. సభ జరిగే సమయంలో సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుని గొడవపడే పరిస్థితి ఏర్పడితే వెంకయ్య గారి నోటినుండి "లెట్ ద గవర్నమెంట్ ప్రొపోస్, లెట్ ద అపోజిషన్ అపోస్, లెట్ ద హౌస్ డిస్పోస్" అనే మాటలు గంభీరంగా వినవచ్చేవి. రాజ్యసభకు ఇతర సభ నుంచి వచ్చే బిల్లుల్ని ఆమోదించే లేక తిరస్కరించే హక్కు తప్పకుండా ఉంది. ఈ సభ వాటిని పాస్ చెయ్యొచ్చు, కొట్టివేయ్యొచ్చు, మార్పు చెయ్యొచ్చు, కానీ వాటిని అడ్డుకుని, నిలుపుచెయ్యాలన్న ఆలోచనకు మన ప్రజాస్వామ్యంలో తావు లేదు.

మనందరి సిద్ధాంతాలు, అభిప్రాయాలు భిన్నమైనవి అయినప్పటికీ వెంకయ్యనాయుడుకి వీడ్కోలు చెప్పటానికి సభ్యులందరం హాజరయ్యాం. ఇదే ప్రజాస్వామ్యంలో ఉన్న సౌందర్యం, గొప్పతనం. వెంకయ్య పట్ల సభకి ఉన్న గౌరవ భావం. వారు ప్రత్యేకమైన పద్ధతిలో సభను నిర్వహించటంలో ఏర్పరిచిన ప్రమాణాలు ఇకపై ఈ పదవిని చేపట్టబోయేవారికి స్ఫూర్తినిస్తాయి. వారు ప్రవేశపెట్టి ఆచరించిన సంప్రదాయాల్ని రాజ్యసభ అనుసరిస్తూ దేశం పట్ల జవాబుదారీతనంతో పనిచేస్తుందని విశ్వసిస్తూ సభ్యులందరి పక్షాన, నా పక్షాన వెంకయ్యనాయుడుకి అనేకానేక శుభాకాంక్షలు, ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

■ నరేంద్రమోదీ
(అనువాదం: యార్లగడ్డ లక్ష్మీప్రసాద్)

(భారత ఉపరాష్ట్రపతిగా, రాజ్యసభ అధ్యక్షుడిగా ముప్పవరపు వెంకయ్యనాయుడు పదవీవిరమణ సందర్భంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాజ్యసభలో వెలువరించిన వీడ్కోలు ప్రసంగంలోని కొన్ని భాగాలు. నేడు హైదరాబాద్‌లో వెంకయ్యనాయుడు 75వ జన్మదినోత్సవ వేడుక)

ఫతేనగర్, ఖాజాకుంట ఎస్టీపీల ట్రయల్ రన్..


ట్రయల్‌రన్‌ను ప్రారంభిస్తున్న ఎండీ అశోక్‌రెడ్డి

6



జీహెచ్‌ఎంసీలోకి కంటోన్మెంట్

విలీనానికి అంగీకరించిన కేంద్ర ప్రభుత్వం

- సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ ఫలితం
- నెరవేరిన దశాబ్దాల కల
- శరవేగంగా అభివృద్ధికి అవకాశం
- స్థానిక నాయకులు, ప్రజల సంబరాలు

"సికింద్రాబాద్ కంటోన్మెంట్‌ను జీహెచ్‌ఎంసీలో విలీనం చేయడం వల్ల ఈ రహదారుల మీదుగా రాకపోకలు సాగించేందుకు ఉన్న అవరోధాలన్నీ తొలగిపోనున్నాయి. స్థానికంగా అభివృద్ధి జరగనుంది. ఇక్కడ ఉన్న వేలాది ఎకరాల ఖాళీ స్థలాల్లో విశాలమైన భవనాలు, బహుళ అంతస్తుల నిర్మాణాలకు పునాదులు పడనున్నాయి.

సికింద్రాబాద్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు సికింద్రాబాద్ కంటోన్మెంట్‌ను జీహెచ్‌ఎంసీలో విలీనం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. ఈ ప్రాంతం కేంద్ర రక్షణ శాఖ, ఆర్మీ కనుసన్నల్లో ఉన్నందున లక్షలాది మంది ప్రజలు ఇంతకాలం ఇబ్బందులు పడ్డారు. జీహెచ్‌ఎంసీలో కంటోన్మెంట్‌ను విలీనం చేయాలని డిమాండ్ చేశారు. నగరం నడిబొడ్డున ఉన్నప్పటికీ ఇప్పటి వరకు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నామని, ఇకపై కంటోన్మెంట్ కూడా శరవేగంగా అభివృద్ధి చెందడం ఖాయమని స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు సంబరాలు చేసుకుంటున్నారు.

బ్రిటిష్ కాలంలో ఆవిర్భావం


బ్రిటిష్‌కాలంలో ట్యాంక్‌బండ్‌కు అవతల ఉత్తర దిక్కున రిసాలబజార్ వరకు కంటోన్మెంట్ ఏర్పడింది. బ్రిటిష్ సైనికుల కోసం భవనాలు, కార్యాలయాలు, స్థావరాలు ఉండేవి. స్వాతంత్ర్యానంతరం వీటన్నింటినీ కేంద్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, రక్షణ శాఖకు అప్పగించింది. అప్పటి నుంచి కంటోన్మెంట్ కేంద్ర రక్షణ శాఖ ఆధీనంలోనే ఉంది. మౌలిక సదుపాయాల కల్పన మొదలు ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టాలన్నా రక్షణ శాఖ అనుమతి తీసుకోవాల్సి వస్తున్నది.

రక్షణ శాఖ ఆదేశాల మేరకు

కేంద్ర రక్షణ శాఖ ఆదేశాల మేరకు కంటోన్మెంట్ బోర్డు పరిపాలన బాధ్యతలు నిర్వర్తిస్తుంది. ఆర్మీ ఉన్నతాధికారి అధ్యక్షుడిగా ఉండే బోర్డులో మిలిటరీ అధికారులతో పాటు పౌరుల తరఫున సభ్యులు ఉంటారు. 40 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న కంటోన్మెంట్ 8 వార్డులుగా విభజితమై ఉంది. 350 కాలనీలు, బస్తీల్లో నాలుగు లక్షలకుపైగా జనాభా నివసిస్తోంది. ఇల్లు కట్టుకోవాలన్నా, ఇంటికి మరమ్మతులు చేసుకోవాలన్నా కఠినమైన నిబంధనలు ఉన్నాయి. చుట్టూ ఉన్న జీహెచ్‌ఎంసీలో బహుళ అంతస్తుల నిర్మాణాలు జరుగుతుండగా, కంటోన్మెంట్‌లో మాత్రం గ్రౌండ్‌ప్లస్ 2 అంతస్తుల వరకు మాత్రమే అనుమతి ఉంది.

రాకపోకలకు అవాంతరాలు

బొల్లారం, ఈసీఐఎల్, మల్కాజిగిరి తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగించాలంటే ప్రజలకు అనేక అవాంతరాలు. సైనిక స్థావరాలు, సైనిక కార్యాలయాలు, ఆర్మీ సంస్థలు ఉన్నాయని, భద్రతకు ముప్పు ఉందన్న సాకుతో రక్షణ శాఖ అధికారుల నుంచి సాధారణ పౌరులకు నిత్యం సమస్యలు ఎదురయ్యేవి. భద్రత పేరిట ఏ క్షణంలో ఏ రహదారిని మూసివేస్తారో తెలియని పరిస్థితి నెలకొనేది. మరోవైపు నందమూరినగర్, 108 బజార్, చిన్నకమేళా, పెద్ద కమేళా, సెంట్రల్ బ్యాటరీ తదితర బస్తీలు ఆర్మీ భూముల్లో ఉన్నాయన్న కారణం చూపుతూ మిలటరీ అధికారులు ఈ బస్తీల ప్రజలను తరచూ భయభ్రాంతులకు గురిచేసేవారు. ఈ బస్తీలను ఎప్పుడు ఖాళీ చేయిస్తారోనని ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. ఈ స్థలాలను తమకు బదలాయించాలని ఎన్నో ఏళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేస్తున్నా ప్రయోజనం లేకుండా పోయింది.



సానుకూలంగా రక్షణ శాఖ

కంటోన్మెంట్లలో పౌర జనాభా పెరుగుతుండడం, నిర్వహణ సైతం రక్షణ శాఖకు గుదిబండగా మారడం, సాధారణ పౌరుల తరఫున సమస్యలు ఏకరువు పెడుతుండడంతో రెండు, మూడు సంవత్సరాలుగా 'కంటోన్మెంట్ విలీనం'పై కేంద్ర రక్షణ శాఖ సానుకూలంగా స్పందించడం ప్రారంభమైంది. దేశంలో మొత్తం 62 కంటోన్మెంట్లు ఉండగా, తొలుత చిన్న, చిన్న కంటోన్మెంట్లను మున్సిపల్ కార్పొరేషన్లలో విలీనం చేయడం ప్రారంభించింది. ఆ తర్వాత పెద్ద కంటోన్మెంట్లపై దృష్టి సారించింది. ముఖ్యంగా దేశంలోని అన్ని కంటోన్మెంట్లలో అతి పెద్దదైన సికింద్రాబాద్ కంటోన్మెంట్‌ను జీహెచ్‌ఎంసీలో విలీనం చేయడం రక్షణ శాఖకు సవాల్‌గా మారింది. వందలు, వేల కోట్ల రూపాయల విలువైన రక్షణ శాఖ భూములు, లీజు స్థలాలు, లీజు భవనాలు ఉండడంతో వీటిని వదులుకోవడంపై రక్షణ శాఖ మొదటి నుంచీ అయిష్టత ప్రదర్శిస్తోందన్న వాదన ఉంది. విలీనానికి ఈ భూములే అడ్డంకిగా ఉన్నాయంటూ రక్షణ శాఖ ఉన్నతాధికారులు ఎన్నోసార్లు అనధికారికంగా చెబుతూ వచ్చారు. ఏడాది క్రితం కంటోన్మెంట్ల విలీనంపై కేంద్ర ప్రభుత్వం నియమించిన అధ్యయన కమిటీ సైతం ఈ అంశాన్ని కీలకంగా గుర్తించినట్టు చెబుతున్నారు.

మోదీని ఒప్పించిన రేవంత్‌రెడ్డి

రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన రేవంత్‌రెడ్డి విలీనంపై చొరవ చూపారు. ప్రధాని మోదీ సహా కేంద్ర పెద్దలతో సమావేశమైన సందర్భాల్లో సికింద్రాబాద్ కంటోన్మెంట్ విలీనం గురించి ప్రస్తావించారు. ఎట్టకేలకు జీహెచ్‌ఎంసీలో విలీనానికి మోదీని ఒప్పించారు. దీంతో కంటోన్మెంట్ బోర్డు ఆస్తులు, అప్పులు జీహెచ్‌ఎంసీకి బదిలీ కానున్నాయి. కాగా, కేంద్ర ప్రభుత్వం పేరిట హక్కుగా ఉన్న భూములు, భవనాలు కేంద్ర ప్రభుత్వానికే దక్కుతాయి. ఈ ప్రాంతాలను విభజించేటప్పుడు సాయుధ దళాల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనివ్వాలని కేంద్రం స్పష్టం చేయడం గమనార్హం.

మౌలిక సదుపాయాల కల్పనలో..

తాగునీరు, మురుగునీరు, విద్యుత్, పారిశుధ్య నిర్వహణ, రోడ్లు తదితర మౌలిక సదుపాయాల కల్పనలో సైతం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చుట్టూ ఉన్న జీహెచ్‌ఎంసీలో రోజు విడిచి రోజు తాగునీరు సరఫరా అవుతుండగా, కంటోన్మెంట్‌లో మాత్రం మూడు, నాలుగు రోజులకోసారి నీటిని అందిస్తున్నారు. మెట్రో వాటర్ బోర్డు నుంచి కంటోన్మెంట్ తాగునీటిని కొనుగోలు చేసి, ప్రజలకు సరఫరా చేస్తుండడమే దీనికి కారణం. ఏళ్ల క్రితం నిర్మించిన రిజర్వాయర్లు, పంప్ హౌజ్‌లను ఇంకా కొనసాగిస్తుండడంతో సరిపడా తాగునీటిని నిల్వ చేసుకునే శక్తి కంటోన్మెంట్ బోర్డుకు లేదు. దాంతో పాటు డ్రైనేజీ వ్యవస్థ పటిష్టంగా లేకపోవడం, అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉండడం, పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండడం తదితర కారణాలతో కంటోన్మెంట్‌ను జీహెచ్‌ఎంసీలో విలీనం చేయాలన్న డిమాండ్ రోజురోజుకూ పెరుగుతూ వచ్చింది. ప్రభుత్వాలు, ముఖ్యమంత్రులు మారినప్పుడల్లా కంటోన్మెంట్ విలీనం అంశంపై విస్తృత చర్చలు జరిగేవి.



- పాతకక్షల నేపథ్యంలో రౌడీషీటర్‌ను..
- వివాహేతర సంబంధంతో అంబులెన్స్ నిర్వాహకుడిని..
- గల్ఫ్‌కు వెళ్లాల్సిన ఇంజనీర్‌ను..

ముగ్గురిని చంపేశారు!

నగరంలో తాజాగా మరో మూడు హత్యలు జరిగాయి. మూడు కమిషనరేట్ల పరిధిలో జూన్ నెలలోనే 20కి పైగా హత్యలు జరగగా, పాతకక్షల నేపథ్యంలో చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నజఫ్ అనే రౌడీషీటర్ హత్యకు గురయ్యారు. జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో వివాహేతర సంబంధం నేపథ్యంలో మరో వ్యక్తి, నార్సింగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇంజనీర్ హత్యకు గురయ్యారు.



చాదర్‌ఘాట్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మలక్‌పేట్ మెట్రోస్టేషన్ వద్ద నజఫ్ అనే రౌడీషీటర్‌ను కొందరు హతమార్చారు. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్‌కు కేవలం 100 మీటర్ల దూరంలోనే ఈ హత్య జరగడం గమనార్హం. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రెయిన్‌బజార్‌లోని చందానగర్ నివాసి సయ్యద్ నజఫ్‌అలీ(47) మీర్‌చౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రౌడీషీటర్. ఆటో నడపడంతో పాటు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. ఇతడికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. శుక్రవారం అర్ధరాత్రి 12 గంటలకు ఫోన్ రావడంతో చాదర్‌ఘాట్‌లోని సవేర హోటల్‌కు స్నేహితుడితో కలిసి బైక్‌పై వెళ్లారు. ఇద్దరు కలిసి భోజనం చేశారు. అనంతరం మాట్లాడుకుంటూ బయటకు వచ్చారు. ఇంతలో మరో స్నేహితుడు రావడంతో అతడిని అక్కడే ఉండమని చెప్పి సమీపంలోని మలక్‌పేట మెట్రోస్టేషన్ మెట్లపై దాదాపు అరగంటపాటు కూర్చుని ఫోన్‌లో నిమగ్నమయ్యాడు. ఇంతలో వెనక నుంచి నలుగురు వ్యక్తులు కత్తులతో దాడి చేశారు. దాదాపు 30 కత్తిపోట్లకు గురైన నజఫ్ అలీ అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. మెడ భాగంలోనే 10కిపైగా కత్తిపోట్లు కావడంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న చాదర్‌ఘాట్ పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కాగా, శుక్రవారం మధ్యాహ్నం నజఫ్ వికారాబాద్ వెళ్లొచ్చాడు. ఆయన ఏ విషయమై అక్కడికి వెళ్లాడనే దానిపై పోలీసులు వివరాలు


నజఫ్‌అలీ (ఫైల్)

మిగతా 6వ పేజీలో..

జగద్గిరిగుట్టలో మరొకరు..


అనిల్‌కుమార్(ఫైల్)

జీడిమెట్ల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలోని వెంకటేశ్వరనగర్‌లో శుక్రవారం రాత్రి ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ఈ హత్యకు కారణం వివాహేతర సంబంధమేనని పోలీసులు భావిస్తున్నారు. మెదక్ జిల్లా అల్లాదుర్గం ప్రాంతంలోని ముప్పారం గ్రామానికి చెందిన అనిల్‌కుమార్(40) కొన్నాళ్లు జగద్గిరిగుట్ట శ్రీనివాస్‌నగర్‌లోని సొంత ఇంట్లో ఉన్నాడు. స్థానికంగా అంబులెన్స్ సర్వీసెస్ వ్యాపారం చేసేవాడు. కాగా, భర్త చనిపోయిన తన బంధువుతో ఇతడికి వివాహేతర సంబంధం ఉంది. ఆమెను తన సొంత ఇంట్లో ఉంచి భార్య భాగ్యలక్ష్మి, ఇద్దరు పిల్లలతో కలిసి వెంకటేశ్వరనగర్‌లో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. భాగ్యలక్ష్మి స్థానికంగా బ్యూటీపార్లర్, టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్నది. శుక్రవారం రాత్రి మద్యం తాగి పడుకున్న అనిల్‌ను కొందరు వ్యక్తులు కత్తులతో దారుణంగా పొడిచి హత్య చేశారు. ఎవరికీ అనుమానం రాకుండా ఇల్లు శుభ్రం చేసి పారిపోయారు. జగద్గిరిగుట్ట సీఐ క్రాంతికుమార్ సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. భార్య, పిల్లలు, బంధువు, ఇతర అనుమానితులను అదుపులోకి తీసుకుని బాలానగర్ ఏసీపీ హన్మంతరావు విచారిస్తున్నారు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు.

మంచిరేవులలో ఇంజనీర్..

నార్సింగ్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): సౌదీలో ఇంజనీర్‌గా పనిచేస్తున్న గోల్కొండ నివాసి మంచిరేవులలో హత్యకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నార్సింగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రీన్‌ల్యాండ్ వెంచర్‌లో ఒక వ్యక్తి హత్యకు గురయ్యాడని శనివారం మధ్యాహ్నం 12:30 గంటల ప్రాంతంలో పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు పరిశీలించగా మృతదేహం వద్ద దొరికిన కార్డు ఆధారంగా చనిపోయిన వ్యక్తి గోల్కొండ చోటాబజార్‌కు చెందిన ఇజాయిత్ అలీ(31) అని, సౌదీలో ఇంజనీర్‌గా పనిచేస్తున్నట్లు గుర్తించారు. హత్యకు ముందు ఇజాయిత్ అలీతో పాటు ఓ వ్యక్తి, మరో మహిళ క్వాలిస్ వాహనంలో గ్రీన్‌ల్యాండ్ వెంచర్‌లోకి వచ్చారని, మరో వ్యక్తి బైక్‌పై వచ్చారని ప్రచారం. వీరి మధ్య ఏం జరిగిందో కానీ, ఇంజనీర్‌ను హత్య చేసి క్వాలిస్ వాహనాన్ని అక్కడే వదిలి పారిపోయారని ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.


ఇజాయిత్ అలీ (ఫైల్)

వెళ్లిపోవాల్సిన వాడు ఆగిపోయాడు..

ఇజాయిత్ అలీ శుక్రవారం రాత్రి గల్ఫ్‌కు వెళ్లాల్సి ఉంది. కొన్ని కారణాల వల్ల ఆగిపోయాడు. త్వరలోనే ఇతడి పెళ్లి ఉందని, ఇంతలోనే దారుణం జరిగిందని స్థానికులు విలపిస్తూ చెప్పారు.



ఈ-స్పోర్ట్స్.. కుమ్మేస్తున్నాయి!

- హైదరాబాద్‌లోనే రూపుదిద్దుకుంటున్న గేమ్స్
- ఇక్కడి నుంచి ప్లేయర్లూ ఎక్కువే
- గణనీయంగా వృద్ధి చెందుతున్న అభిమానులు

ఈ-స్పోర్ట్స్‌ను కెరీర్‌గా తీసుకోవడానికి ఇటీవల ఎక్కువ మంది ఆసక్తి చూపిస్తున్నారు. వీటిని దేశంలో స్కిల్ గేమ్స్‌గా చూస్తుండడం, ప్రభుత్వం కూడా అనుమతించడం వల్ల ప్రొఫెషనల్ గేమర్‌గా మారాలని కొంత మంది కోరుకుంటున్నారు. ఈవెంట్ ఆర్గనైజర్, కోచ్, గేమ్ డెవలపర్‌గా ఈ-స్పోర్ట్స్ సంస్థల నుంచి జీతం తీసుకోవడంతో పాటుగా ప్రైజ్‌మనీ, స్పాన్సర్‌షిప్‌లు కూడా పొందవచ్చని వారు చెబుతున్నారు.

హైదరాబాద్ సిటీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఈ-స్పోర్ట్స్ రంగంలో రాణించేందుకు యువత దృష్టిసారిస్తున్నది. ఒక అంచనా ప్రకారం 2025 నాటికి ఈ-స్పోర్ట్స్ మార్కెట్ రూ.1,100 కోట్లకు చేరుతుందని, సాలీనా 46 శాతం వృద్ధి కనిపిస్తుందని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. రాబోయే కాలంలో ఆర్థిక వ్యవస్థపై సైతం ప్రభావం చూపే అవకాశం ఈ రంగానికి ఉందని ఎర్నెస్ట్ అండ్ యంగ్ లాంటి సంస్థలు అంచనా వేస్తుండడంతో ఈ రంగంపై పలువురు ఆసక్తి కనబరుస్తున్నారు.

హైదరాబాద్ కీలకపాత్ర

హైదరాబాద్‌లో గేమింగ్ కంపెనీలు పెద్ద సంఖ్యలో ఉన్నాయి. అంతర్జాతీయంగా ఖ్యాతి గడించిన గేమ్స్‌లో

మిగతా 6వ పేజీలో..

టీ20 సంబరం





వెస్టిండీస్‌లోని బ్రిడ్జ్‌టౌన్‌లో జరిగిన టీ20 వరల్డ్‌కప్‌లో టీమిండియా విజేతగా నిలవడంతో నగరంలోని పలు ప్రాంతాల్లో సంబరాలు అంబరాన్నంటాయి. యువత రోడ్లపైకి వచ్చి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. సెక్రటేరియట్ ఎదుట సంబరాలు జరుపుకుంటున్న వారిని చిత్రంలో చూడొచ్చు.



ఘన నివాళి బంజారాహిల్స్‌లో సీనియర్ నేత ధర్మపురి శ్రీనివాస్ పార్థివ దేహానికి నివాళులు అర్పిస్తున్న రాజ్యసభ సభ్యులు కే కేశవరావు, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే దానం నాగేందర్, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం

గణాంకశాస్త్రానికి మహోనాలోబిన్ సేవలు చిరస్మరణీయం

హైదరాబాద్ సిటీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ గణాంకశాస్త్ర నిపుణులు పీసీ మహోనాలోబిన్ గణాంక శాస్త్రానికి చేసిన సేవలు చిరస్మరణీయమని నేషనల్ శాంపిల్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డి.సతీష్ అన్నారు. పీసీ మహోనాలోబిన్ జయంతి సందర్భంగా ఏటా నిర్వహించే జాతీయ స్టాటిస్టిక్ డే వేడుకలను నేషనల్ శాంపిల్ సర్వే కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీడీ జి.సతీష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాలల విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో గెలిచిన విజేతలకు బహుమతులు అందజేశారు. భవన్స్ వివేకానంద కాలేజీకి చెందిన బి.శ్రీసాయి దీప్తి, పి.టీనాకు ప్రథమ బహుమతి, సెయింట్‌ఆన్స్ కాలేజ్ ఫర్ ఉమెన్‌కు చెందిన ఎం.శృతి, జి.విద్యకు ద్వితీయ బహుమతి, పి.పవిత్ర, అనుష్కాశాస్త్రీకి తృతీయ బహుమతి అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎన్ఎస్ఓ డిప్యూటీ డైరెక్టర్ శివపార్వతి రెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్లు బర్కత్ అలీ, జయరాం, మనోజ్ మీనాలతోపాటు గణాంకశాఖ అధికారులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులను అందజేస్తున్న సతీష్ తదితరులు



సాయిచంద్ వర్ధంతి సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కేటీఆర్

సాయిచంద్ కుటుంబానికి అండగా ఉంటాం

● వర్ధంతి సభలో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు

వనస్థలిపురం, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమ గాయకుడు, వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ దివంగత చైర్మన్ సాయిచంద్ కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు అన్నారు. వనస్థలిపురం డివిజన్ హస్తినాపురంలోని జీఎస్ఆర్ హాల్లో శనివారం ఏర్పాటు చేసిన సాయిచంద్ ప్రథమ వర్ధంతి కార్యక్రమానికి మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్వర్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గొంగడి సునీత, రసమయి బాలకిషన్ , బాల్క సుమన్, గాదరి కిషోర్, పట్నం నరేందర్‌రెడ్డి, రావుల చంద్రశేఖర్‌రెడ్డి, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు పల్లె రవికుమార్‌గౌడ్, ఎర్రోళ్ల శ్రీనివాస్, దేశపతి శ్రీనివాస్, దూదిమెట్ల బాలరాజ్, దేవిశ్రీప్రసాద్ తదితరులు హాజరై సాయిచంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్‌కు సాయిచంద్ కుడి భుజం మాదిరిగా ఉండి తెలంగాణ కోసం తన ఆట పాటలతో చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. హరీశ్ రావు మాట్లాడుతూ సాయిచంద్ లేకుండా కేసీఆర్ సభ లేదని, తెలంగాణ ఏర్పాటులో సాయిచంద్ కృషి ఎప్పటికీ మరిచిపోలేనిదన్నారు. అనంతరం కళాకారులు డప్పు రవి, రాజీవ్ రూపొందించిన సాయిచంద్ స్మృతి గీతాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రజినీసాయిచంద్, సాయిచంద్ తండ్రి వెంకటరాములు పాల్గొన్నారు.

నీళ్లు సన్నగొస్తున్నాయ్..

● 'డయల్ యువర్ ఎండీ'లో ఫిర్యాదు

హైదరాబాద్ సిటీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): 'హలో సార్.. మాకు నీళ్లొస్తున్నాయి. కానీ, సన్నగా వస్తుండడంతో ఏమాత్రం సరిపోవడం లేదు. మా ఏరియాకు ఎక్కువ నీళ్లు ఇవ్వండి' అని ఓ వినియోగదారుడు వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డికి మొరపెట్టుకున్నారు. లోప్రెషర్‌తో నీరు రావడం వల్ల పడుతున్న ఇబ్బందులను ఎండీకి వివరించారు. ఖైరతాబాద్‌లోని వాటర్‌బోర్డు ప్రధాన కార్యాలయంలో శనివారం 'డయల్ యువర్ ఎండీ' కార్యక్రమం నిర్వహించారు. 13 మంది వినియోగదారులు ఫోన్ చేశారు. తాగునీటి సరఫరా, మురుగునీటి నిర్వహణ, నల్లా కనెక్షన్, లోప్రెషర్ తదితర వాటిపై ఫిర్యాదు చేశారు. సంబంధిత జనరల్ మేనేజర్లతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామని ఎండీ హామీనిచ్చారు. కార్యక్రమంలో ఈడీ డాక్టర్ ఎం.సత్యనారాయణ, డైరెక్టర్లు అజ్మీరాకృష్ణ, ప్రవీణ్‌కుమార్, స్వామి, సీజీఎంలు, జీఎంలు పాల్గొన్నారు.

ముగ్గురికి కారుణ్య నియామకం

వాటర్‌బోర్డులో ముగ్గురికి కారుణ్య నియామకం కింద ఉద్యోగాలు లభించాయి. వారికి ఎండీ నియామకపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పీఅండ్‌ఏ సీజీఎం మహ్మద్ అబ్దుల్ ఖాదర్, జీఎం సరస్వతి పాల్గొన్నారు.

ఫతేనగర్, ఖాజాకుంట ఎస్టీపీల ట్రయల్ రన్

హైదరాబాద్ సిటీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఫతేనగర్, ఖాజాకుంట ఎస్టీపీల ట్రయల్‌రన్‌ను వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. ఎస్టీపీ ప్రాజెక్టుల్లో భాగంగా ప్యాకేజీ-3లో నిర్మిస్తున్న ఫతేనగర్, ఖాజాకుంట ఎస్టీపీలను ఆయన సందర్శించారు. ముందుగా ఫతేనగర్ ఎస్టీపీకి వెళ్లి వెట్‌వెల్, ఎస్బీఆర్, బ్లోయర్‌రూమ్‌ను పరిశీలించారు. అనంతరం.. వెట్‌వెల్ దగ్గర ఇన్‌లెట్ పంపులను స్విచ్ ఆన్ చేసి ట్రయల్‌రన్‌ను ప్రారంభించారు. తర్వాత ఖాజాకుంట ఎస్టీపీ ప్రాంగణంలో పర్యటించి సీసీ రోడ్లు, లైటింగ్ పనులను పరిశీలించారు. ముగింపు దశలో ఉన్న పనులను పూర్తి చేసి.. ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. అనంతరం వెట్‌వెల్ దగ్గర ఇన్‌లెట్ పంపులను స్విచ్ ఆన్ చేసి ట్రయల్‌రన్‌ను ప్రారంభించారు. ఖాజాకుంట ఎస్టీపీని ఆనుకుని ఉన్న మిగిలిన ఖాళీ స్థలంలో ల్యాండ్‌స్కేపింగ్, పూల మొక్కలతో సుందరీకరణ పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఈడీ సత్యనారాయణ, ప్రాజెక్ట్ డైరెక్టర్ రఘు, సీజీఎం, జీఎం, ఎస్టీపీ అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా మరో ఏడు..

మరో ఏడు ఎస్టీపీలు నిర్మాణం పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. వీటిలో మిరాలం, మియాపూర్-పటేల్‌చెరువు, నఫిల్‌గూడ, వెన్నెలగడ్డ, నాగోల్ ఎస్టీపీలున్నాయి. ఆగస్టులో నల్లగండ్ల ముల్లకత్వచెరువు, శివాలయనగర్ పాలపిట్ట దగ్గర నిర్మిస్తున్న ఎస్టీపీలను ప్రారంభించనున్నారు. ఇప్పటికే కోకాపేట, దుర్గంచెరువు, పెద్ద చెరువు, నల్లచెరువు ఎస్టీపీలు ప్రారంభమయ్యాయి.

ఈ-స్పోర్ట్స్.. కుమ్మేస్తున్నాయి!

(5వ పేజీ తరువాయి)

మన వారి పాత్ర ఉండడంతో ఈ-స్పోర్ట్స్ ఎరీనాలో హైదరాబాద్ అత్యంత కీలకపాత్ర పోషిస్తున్నది. గేమింగ్ ప్రేమికుల పరంగా కూడా ఇక్కడ అభిమానులు ఎక్కువగానే ఉన్నారు. గతంలో పబ్-జీ మొదలు ఇప్పుడు బీజీఐఎస్ వరకూ ఎన్నో సంస్థలు నగరంలో టోర్నమెంట్లను నిర్వహిస్తున్నాయి. గేమర్స్ కమ్యూనిటీ కారణంగానే తాము ఇక్కడ బీజీఐఎస్ నిర్వహిస్తున్నామని క్రాఫ్టాన్ ఇండియా ఈ-స్పోర్ట్స్ అసోసియేట్ డైరెక్టర్ కరన్ పాఠక్ చెప్పారు.

లాభాలతో పాటే నష్టాలు..

ఏ పనీ లేని వారే మొబైల్‌లో గేమ్స్ ఆడుతూ కూర్చుంటారు అని ఈ-స్పోర్ట్స్ పట్ల ఏహ్యభావం ఉన్నవారు అంటుండవచ్చు కానీ, ఈ-గేమ్స్‌తో పలు ప్రయోజనాలూ ఉన్నాయంటోంది కుర్రకారు. రిలాక్స్ కావడానికి ఎంతగా ఈ-స్పోర్ట్స్ ఉపయోగపడతాయో, టీమ్ స్పిరిట్ కూడా అంతే వృద్ధి చెందుతున్నదని చెబుతున్న వారూ ఎక్కువగానే ఉన్నారు. రోజుకు 3-5 గంటలపాటు మొబైల్స్‌లో గేమ్స్ ఆడుతూ ఉండడం వల్ల చదువు మీద ధ్యాస తగ్గడం, కళ్లకు కలిగే హాని, ఒత్తిడి, ఈ-గేమ్స్‌కు బానిసలుగా మారడం, సమాజానికి దూరంగా తమదైన లోకంలో గడపడం, వంటి అంశాల గురించి మాట్లాడితే, పరిమితి దాటితేనే సమస్యలని, హద్దుల్లో ఉంటే ఎలాంటి ఇబ్బంది ఉండదని చెప్పుకొస్తున్నారు.

ముగ్గురిని చంపేశారు!

(5వ పేజీ తరువాయి)

సేకరిస్తున్నారు. గతంలో మూడు హత్యలు, పలు హత్యాయత్నం కేసుల్లో నజఫ్ నిందితుడిగా ఉన్నట్లు, రెయిన్‌బజార్ పీఎస్‌లో అతడి పేరిట రౌడీషీట్ ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. అతడిపై జరిగిన దాడికి సంబంధించిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

రంగంలోకి మూడు బృందాలు..

నజఫ్ హత్య విషయం తెలియగానే హుటాహుటీన ఘటనా స్థలానికి చేరుకున్న సౌత్‌జోన్ డీసీపీ స్నేహమెహ్రా తక్షణమే మూడు బృందాలను రంగంలోకి దింపారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులతో ఒక బృందం, చాదర్‌ఘాట్ పోలీసులతో మరో స్పెషల్‌టీమ్, టెక్నికల్ ఎవిడెన్స్ ఆధారంగా గుర్తించి పట్టుకునేందుకు ఇంకో టీమ్‌ను రంగంలోకి దింపారు. రెయిన్‌బజార్‌లోని చందానగర్ నివాసి ఇబ్రహీంపైనే పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. హత్య చేసినట్లు అనుమానిస్తున్న నలుగురు చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయినట్లు సమాచారం.

వంద పడకల ఆస్పత్రి నిర్మాణాలపై కలెక్టర్ సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

హైదరాబాద్ సిటీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నగరంలో చేపట్టిన వంద పడకల ఆస్పత్రి భవన నిర్మాణ పనులపై కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కామాటిపురలో 100 పడకల ఆస్పత్రి, చార్మినార్‌లో ప్రభుత్వ నిజామియా టీబీ కాలేజీ, నిజామియా జనరల్ ఆస్పత్రిలో పునర్నిర్మాణ, పునరుద్ధరణ పనులు, కొత్త బ్లాక్‌ల నిర్మాణం, సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో శానిటేషన్, టాయిలెట్స్ బ్లాక్స్, యాకుత్‌పురాలోని ఎస్ఆర్‌టీ కాలనీలో 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్, బండ్లగూడ ఏరియా ఆస్పత్రిలో 50 పడకల ఆస్పత్రి, డబీర్‌పుర ఏరియా ఆస్పత్రిలో 100 పడకలు, బార్కాస్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అప్‌గ్రేడేషన్ పనులు, లాలాపేట్ 30పడకల అర్బన్ హెల్త్ కేర్ సెంటర్, అడ్డగుట్ట 30పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నిర్మాణ పనులు, నల్లకుంట ఓపీడీ బ్లాక్, సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ బిల్డింగ్, ఎర్రమంజిల్ ఎంసీహెచ్‌లో 200 పడకల ఆస్పత్రి, ప్రభుత్వ ఈఎన్టీ కోఠి హైదరాబాద్ ఇంటిగ్రేటెడ్ బిల్డింగ్, నల్లకుంట ఫీవర్ ఆస్పత్రిలో 100 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్, సీతాఫల్‌మండిలో 30 పడకల అర్బన్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్, తదితర పనుల పురోగతిపై తెలంగాణ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఇంజనీర్లు, డీసీహెచ్‌ఎస్, డీఎంహెచ్‌ఓలతో మాట్లాడి పనుల పురోగతిని తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ టెండర్ ప్రక్రియ మొదలుకాని వాటికి వెంటనే టెండర్లను పిలవాలని, నిర్మాణం మొదలైన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమీక్షలో టీఎంఎస్ఐడీసీ సూపరింటెండెంట్ ఇంజనీర్ సురేందర్‌రెడ్డి, ఈఈ చలపతి రావు, డీఎంహెచ్‌ఓ వెంకట్, డీసీహెచ్‌ఎస్ సునీత, టీజీ ఎంఎస్ఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎ.నాయుడు, డీఈ పి. జగదీష్ ప్రసాద్ పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో జాతీయ గణాంక దినోత్సవం

ప్రశాంత చంద్ర మహలనోబిస్ జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం కలెక్టరేట్‌లో జాతీయ గణాంక దినోత్సవాన్ని నిర్వహించారు.

వీసీల నియామకాల్లో బీసీలకు 50% కేటాయించాలి



సమావేశంలో అభివాదం చేస్తున్న ఎంపీ ఆర్. కృష్ణయ్య, గుజ్జ కృష్ణ తదితరులు

బర్కత్‌పుర, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 12 యూనివర్సిటీలకు త్వరలో చేపట్టనున్న వైస్‌చాన్స్‌లర్‌ల నియామకాల్లో బీసీలకు 50 శాతం కేటాయించాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. యూనివర్సిటీలలో 2400 ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటిని వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. త్వరలో భర్తీ చేయనున్న నామినేటెడ్ పోస్టులలో కూడా 50 శాతం పదవులు బీసీలకు కోటా ఇవ్వాలని కోరారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు జి.అనంతయ్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ జేఎన్‌టీయూ, పాలమూరు, ఉస్మానియా, శాతవాహన యూనివర్సిటీ వీసీ పోస్టులను బీసీలకు కేటాయించాలని, ఉన్నత విద్యామండలి చైర్మన్ పదవిలో కూడా బీసీనే నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు నీల వెంకటేష్, రాజేందర్, మల్లేష్‌యాదవ్, మోదీరాందేవ్ పాల్గొన్నారు.

బసవతారకం ఆస్పత్రిలో కేన్సర్‌పై సదస్సు



బసవతారకం ఆస్పత్రిలో జరిగిన సదస్సులో వైద్యులు

హైదరాబాద్ సిటీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): అత్యంత అరుదైన కేన్సర్ వ్యాధులకు మంచి చికిత్స అందించే వీలు ఏర్పడిందని బసవతారకం కేన్సర్ ఆస్పత్రి ట్రస్టు బోర్డు సభ్యులు, రేడియేషన్ ఆంకాలజిస్టు డాక్టర్ నోరి దత్తాత్రేయ పేర్కొన్నారు. శనివారం బసవతారకం కేన్సర్ ఆస్పత్రి ఆడిటోరియంలో కేన్సర్‌పై సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ నోరి దత్తాత్రేయ, బసవతారకం ఆస్పత్రి సీఈఓ డాక్టర్ కృష్ణయ్య మాట్లాడారు. సార్కోమా అనే ఎముకలు, మృదు కణజాలాలలో కొవ్వు, కండరాలు, రక్త నాళాలు, నరాలు, లోతైన చర్మ కణజాలాలు, పీచు కణజాలాలలో అభివృద్ధి చెందే అరుదైన కేన్సర్‌పై అవగాహన కలిగించడం, వ్యాధిని గుర్తించడం, ఎలాంటి చికిత్స అందించాలనే అంశాలపై ఈ సదస్సులో నిపుణులు చర్చించారు. మెడికల్ డైరెక్టర్, డాక్టర్ టీఎస్ రావు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.ఫణికోటేశ్వరరావు, అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ కల్పనా రఘునాథ్, చెన్నైకి చెందిన ప్రముఖ మస్కిలోస్కెలిటన్ ఆంకో సర్జన్ డాక్టర్ ఆనంద రాజాతో పాటూ వైద్యులు శ్రీనాథ్‌గుప్తా, డాక్టర్ సృజన్ శుక్లా వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

వీఎన్ఆర్ విజ్ఞానజ్యోతి కళాశాలకు ఐఎస్ఓ గుర్తింపు



దగ్గుపాటి సురేష్‌బాబుకు ఐఎస్ఓ సర్టిఫికెట్ అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

దుండిగల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): వీఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలకు అంతర్జాతీయ ప్రమాణీకరణ సంస్థ నుంచి ఐఎస్ఓ 2001, 2018 ప్రమాణపత్రం లభించింది. శనివారం కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఐఎస్ఓ సర్టిఫికెట్‌ను యాజమాన్యానికి అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యక్షుడు దగ్గుబాటి సురేష్‌బాబు మాట్లాడుతూ పాఠ్యాంశాల రూపకల్పన, విద్యార్థులకు అనుకూలమైన విద్యాబోధనా పద్ధతులు, మంచి వనరులు, వసతుల కల్పన, ఆహ్లాదకరమైన వాతావరణం వంటివి విద్యాసంస్థలో ఉన్నందున ఈ సర్టిఫికెట్ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రధాన అధ్యాపకులు ఆచార్య సీడీ నాయుడు, పరిపాలనా డీన్ ఆచార్య డాక్టర్ చెన్నకేశవరావు, సమన్వయ కర్త డాక్టర్ డీవీ చంద్రమోహన్‌రావు పాల్గొన్నారు.

'పీఎం సూర్యఘర్- ముఫ్త్ బిజిలీ యోజన పోర్టల్ సమస్యలు పరిష్కరించాలి'

హైదరాబాద్ సిటీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పీఎం సూర్యఘర్- ముఫ్త్ బిజిలీ యోజన పథకం పోర్టల్‌లో తలెత్తుతున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బి.అశోక్‌కుమార్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి టి.శ్రీహరిబాబు డిమాండ్ చేశారు. ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్యభవన్‌లో శనివారం తెలంగాణ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఈ పథకం కింద అపార్ట్‌మెంట్లు, సొసైటీలలో సోలార్ ఎనర్జీ స్థాపన కోసం ఉద్దేశించిన దరఖాస్తులను పోర్టల్ అంగీకరించడం లేదన్నారు. సాధారణంగా పోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలు డిస్కంలకు చెందిన ఏడీఈల లాగిన్‌లోకి రావాలి కానీ, అలా జరగడం లేదన్నారు. పోర్టల్ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం, డిస్కంలు ప్రత్యేక దృష్టిసారిస్తే మెరుగైన ఫలితాలు సాధించే అవకాశముంటుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ సోలార్ ఎనర్జీ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ పరకాల రాజేష్, బాబునాయుడు పాల్గొన్నారు.

కల్కిని వీక్షించిన దర్శక, నిర్మాతలు

చిక్కడపల్లి, జూన్ 29(ఆంధ్రజ్యోతి): అమితాబ్‌బచ్చన్, దీపికా పదుకోన్, ప్రభాస్ నటించిన కల్కి సినిమాను ఆ సినిమా దర్శక, నిర్మాతలు వీక్షించారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని సుదర్శన్ 35ఎంఎం థియేటర్‌లో శుక్రవారం రాత్రి 10గంటల నుంచి రాత్రి ఒంటిగంట వరకు మొత్తం సినిమాను సినిమా దర్శక నిర్మాతలు నాగ్‌అశ్విన్, స్వప్నదత్, ప్రేక్షకులతో కలిసి చూశారు. థియేటర్ మేనేజింగ్ పార్ట్‌నర్‌లు విశ్వంబర్, బాల్‌గోవింద్‌రాజు, మేనేజర్‌లు శ్రీనివాస్‌రెడ్డి, కుమార్ వారి వెంట ఉన్నారు.



ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామికి హైదరాబాద్ నార్సింగ్ సర్వీస్ రోడ్డులోని జయభేరి టెంపుల్ వీధికి చెందిన మాగంటి సత్యనారాయణమూర్తి, మధురావు కుటుంబసభ్యులు శనివారం రూ.40 లక్షలకు పైగా విలువగల బంగారు తాపడంతో చేసిన ఆభరణాలను సమర్పించారు. నాగాభరణం, జటాఝూటం, నాగపడగ, పానమట్టం, ధారపాత్ర, మకర తోరణం తదితర ఆభరణాలను ఈవో కేఎస్ రామారావు ద్వారా దేవస్థానానికి అందజేశారు.

- విజయవాడ(వన్‌టౌన్), జూన్ 29(ఆంధ్రజ్యోతి)

వీధి వ్యాపారులకు వెండింగ్ లైసెన్స్‌లు జారీ చేయాలి

హాకర్స్ జేఏసీ జాతీయ అధ్యక్షుడు ధర్మేంద్రకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న హాకర్స్ జేఏసీ జాతీయ అధ్యక్షుడు ధర్మేంద్రకుమార్

బర్కత్‌పుర, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): వీధి వ్యాపారులు దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముక అని, వారు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కావడం లేదని, ప్రభుత్వం తక్షణమే వెండింగ్ లైసెన్స్‌లు జారీ చేయాలని హాకర్స్ జేఏసీ జాతీయ అధ్యక్షుడు ధర్మేంద్రకుమార్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 6 లక్షల మంది వీధి వ్యాపారులు ఉన్నారని, వారికి వెండింగ్ లైసెన్స్, ఇఎస్ఐ, పీఎఫ్, మాన్‌ధన్ నగదును బదిలీ చేయాలన్నారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సౌతిండియా వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్ కదన్, తెలంగాణ హాకర్స్ జేఏసీ అధ్యక్షుడు ఎస్.వెంకటమోహన్ ఆధ్వర్యంలో వీధి వ్యాపారుల సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని పట్టణాల్లో వీధి వ్యాపారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. 2014లో తీసుకువచ్చిన వీధి వ్యాపారుల చట్టాన్ని పటిష్టంగా అమలు చేయకపోతే వచ్చే నవంబర్ 29న రాష్ట్రవ్యాప్తంగా నిరసన చేపడతామన్నారు. వీధి వ్యాపారులకు శ్రామిక్ మాన్‌ధన్ చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో హాకర్స్ జేఏసీ జాతీయ కో-ఆర్డినేటర్ మంజు గోయెల్, కార్యదర్శి మన్సూర్‌రజాక్, ఢిల్లీ కో-ఆర్డినేటర్ నితీష్‌దాస్, తెలంగాణ యూనియన్ ఉపాధ్యక్షుడు డి.శివరాజు, వి.శ్రీశైలం, కార్యదర్శి ఆర్. అనిల్‌కుమార్, సి. కేశవ్ పాల్గొన్నారు.

19 నుంచి ఉప్పుగూడలో బోనాలు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

చాంద్రాయణగుట్ట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఉప్పుగూడ మహంకాళి ఆలయ 75వ బోనాల ఉత్సవాలు జూలై 19 నుంచి 29 వరకు జరగనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు జె.మధుసూదన్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం బోనాల ఉత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌గౌడ్ మాట్లాడుతూ, జూలై 19న ధ్వజారోహణ, 21న ఘటస్థాపన, 28న బోనాల సమర్పణ, 29న ఢిల్లీ దర్వాజ వరకు అమ్మవారి ఘటం ఊరేగింపుతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు వేదాంత రాజనర్సింహాచార్యులు, ప్రధాన కార్యదర్శి కీర్తి నరేందర్ ముదిరాజ్, ప్రతినిధులు బత్తుల అనిల్, శ్రీనివాస్, సుభాష్, ప్రదీప్, సతీష్, వేణు, గురునాథ్, శ్రీకాంత్, హరి పాల్గొన్నారు.



గన్‌పార్కు వద్ద ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న విద్యార్థి నిరుద్యోగ సమాఖ్య గౌరవాధ్యక్షులు రాజారాం యాదవ్, తదితరులు

అమరవీరుల స్థూపం వద్ద నిరసన

మంగళ్‌హాట్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): యూత్ డిక్లరేషన్ ప్రకారం తక్షణమే 2 లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వాలని విద్యార్థి నిరుద్యోగ సమాఖ్య గౌరవాధ్యక్షులు రాజారాం యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల పక్షాన ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న ఓయూ విద్యార్థి నేత మోతీలాల్ నాయక్ ప్రాణానికి హాని జరిగితే ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత అని అన్నారు. శనివారం నాంపల్లిలోని అమరవీరుల స్థూపం వద్ద ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఆందోళన చేస్తున్న విద్యార్థి నిరుద్యోగ సమాఖ్య అధ్యక్షులు కొంపల్లి రాజు, మేకల కృష్ణ, పి.గోవర్దన్, కరుణాకర్ ముదిరాజ్, కృష్ణ యాదవ్, వీరేశం యాదవ్, శ్రీరాం, శరత్ యాదవ్, బి.అశోక్ యాదవ్, గొల్ల నర్సింహ యాదవ్, రాజశేఖర్, దత్తాత్రేయను పోలీసులు అరెస్ట్ చేసి గోషామహల్ స్టేషన్‌కు తరలించారు.



ఉత్తమ ఆటో డ్రైవర్‌కు యూనిఫామ్ అందజేస్తున్న సౌత్, వెస్ట్‌జోన్ డీసీపీ వెంకటేశ్వర్లు, ఏసీపీ శంకర్ రాజు

ఆటోడ్రైవర్లు నిబంధనలు పాటించాలి

గోషామహల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పరిమితికి మించి విద్యార్థులను ఆటోలో ఎక్కించుకోవద్దని, రోడ్డు నిబంధనలను ఆటో డ్రైవర్లు పాటించాలని సౌత్, వెస్ట్-3 డీసీపీ ఆర్.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శనివారం నాంపల్లిలోని ఎగ్జిబిషన్ మైదానంలో సేఫ్ ఇండియన్ రోడ్డు నిర్వాహకులు ఘన్‌శ్యామ్ ఓజా ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై, ఆటో డ్రైవర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డీసీపీ వెంకటేశ్వర్లు, ఏసీపీలు శంకర్ రాజు, ధనలక్ష్మి హాజరై ట్రాఫిక్ నిబంధనల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 300 మంది ఆటో డ్రైవర్లకు ఉచితంగా యూనిఫామ్ అందజేశారు. అవార్డులతో వారిని సత్కరించా రు. కార్యక్రమంలో బేగంపేట్ పీటీఐ ఏసీపీ జి.శంకర్ రాజు, 11 పోలీస్‌స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, గోషామహల్ ట్రాఫిక్ పీఎస్ ఎస్సై రామారావు పాల్గొన్నారు.



పత్తర్‌గట్టిలోని వస్త్ర దుకాణంలో బ్రిటిష్ హై కమిషనర్

పత్తర్ గట్టిలో బ్రిటిష్ హై కమిషనర్ సందడి

చార్మినార్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): బ్రిటిష్ హై కమిషనర్ గారెత్ శనివారం పత్తర్‌గట్టిలోని మఖ్తాం బ్రదర్స్ షాపును సందర్శించారు. షేర్వానీ, కుర్తా పైజమాలు కొనుగోలు చేశారు. బ్రిటిష్ హై కమిషనర్ రావడంతో ప్రజలు దుకాణం ముందు భారీగా గుమి గూడారు. ఆయనతో సెల్ఫీలు తీసుకున్నారు. ఈ సందర్భంగా బ్రిటిష్ హై కమిషనర్ మీడియాతో మాట్లాడుతూ మఖ్తాం బ్రదర్స్ షాప్‌లోని దుస్తులు ఎంతగానో ఆకట్టుకున్నాయని చెప్పారు. మొఘల్, నిజాంల కాలం నాటి దుస్తులను అన్ని వర్గాల వారు ధరించడం అభినందనీయమన్నారు.

మందుల దుకాణంపై దాడి



మందులను స్వాధీనం చేసుకున్న ఔషధ నియంత్రణ సంస్థ అధికారులు

హైదరాబాద్ సిటీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమిడీస్ చట్టానికి వ్యతిరేకంగా 'సుపోల్ బేబీ' మందును విక్రయిస్తున్న నాంపల్లిలోని మందుల దుకాణంపై శనివారం ఔషధ నియంత్రణ సంస్థ డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు పి.సంతోష్, సి.వివేకానందారెడ్డి దాడి చేసి కేసు నమోదు చేశారు. ఈ మందు జ్వరానికి పనిచేస్తుందని తప్పుడు ప్రకటనలతో అమ్మకాలు జరుపుతున్నట్లు అధికారులు గుర్తించారు. మందుల దుకాణం యజమానిపై, గుజరాత్ రాష్ట్రంలో మందును తయారు చేసిన కంపెనీపై కేసులు నమోదు చేసినట్లు ఔషధ నియంత్రణ సంస్థ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతానని..

డబ్బులు కొట్టేసిన సైబర్ నేరగాడు

హైదరాబాద్ సిటీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామని ఓ ప్రైవేట్ ఉద్యోగిని బురిడీ కొట్టించిన సైబర్ నేరగాళ్లు.. కార్డులో ఉన్న డబ్బులు కొల్లగొట్టారు. బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. నగరానికి చెందిన 31 ఏళ్ల వ్యక్తికి అపరిచిత వ్యక్తి నుంచి కాల్ వచ్చింది. మీ క్రెడిట్ కార్డు లిమిట్ డబుల్ చేస్తామని, ప్రాసెస్ ఆన్‌లైన్‌లోనే పూర్తి చేస్తామని నమ్మించాడు. అందుకు బాధితుడు సరేనన్నాడు. ఈ నేపథ్యంలో అపరిచిత వ్యక్తి ఇండస్ ఇండ్ యాప్‌ను ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించాడు. ఆ తర్వాత యాప్‌లో క్రెడిట్ కార్డు వివరాలు నమోదు చేయించాడు. సీవీవీ కూడా నమోదు చేయాలని చెప్పడంతో అందుకు బాధితుడు అంగీకరించలేదు. సీవీవీ ఎందుకు ఎంటర్ చేయాలని ప్రశ్నించగా.. సీవీవీ నమోదు చేస్తేనే కార్డు ఎక్కడైనా పోయినా పూర్తి వివరాలు యాప్‌లో ఉంటాయని నమ్మించాడు. అన్ని వివరాలు నమోదు చేయకుంటే క్రెడిట్ లిమిట్ పెరగదని బురిడీ కొట్టించాడు. బాధితుడ్ని నుంచి అన్ని వివరాలు నమోదు చేసి, వచ్చిన ఓటీపీలు ఎంటర్ చేశాడు. ఆ తర్వాత చూస్తే క్రెడిట్ లిమిట్ పెరగడం అటుంచి.. కార్డులోని బ్యాలెన్స్ రూ. 1,59,593లు కొల్లగొట్టాడు. బాధితుడు అపరిచిత వ్యక్తికి కాల్ చేయగా స్పందించలేదు. మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సిటీ సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించాడు.

నేడు నగరంలో సోషియా ఉడ్ సమ్మిట్

బర్కత్‌పుర, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఇండ్ నవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోషల్ మీడియాపై ఆదివారం నగరంలో సోషియా ఉడ్ సమ్మిట్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు అనిల్ రాచమల్ల తెలిపారు. ఈ కార్యక్రమంలో 300 మంది పాల్గొంటారని తెలిపారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలో టీ హబ్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్, ఉన్నత విద్యా ప్రిన్సిపాల్ కార్యదర్శి బుర్రా వెంకటేశం, ఆర్టీసీ ఎండీ వీ.సీ.సజ్జనార్, అడిషనల్ డీజీపీలు షికాగోయెల్ ఆయన తెలిపారు.

దాడులకు పాల్పడ్డ రెండు గ్రూపులపై కేసు నమోదు

మదీన, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): స్నేహితుల మధ్య జరిగిన గొడవ కారణంగా రెండు గ్రూపులుగా విడిపోయి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ సంఘటనలో బండ్లగూడ పోలీసులు రెండు గ్రూపులపై కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ కె.సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం... గౌస్‌నగర్‌కు చెందిన అబ్దుల్లా, మహ్మద్ షరీఫ్‌ఖాన్ స్నేహితులు. వీరు మరికొంతమందితో కలిసి శుక్రవారం రాత్రి సమయంలో సమీపంలోని ఉందా హిల్స్ చెరువులో చేపలు పట్టడానికి వెళ్లారు. ఆ సమయంలో యూసుఫ్, సమీర్, జహీర్, అర్బాన్ కూడా అక్కడికి వచ్చారు. ఆ సమయంలో అబ్దుల్లా.. సమీర్ అనే యువకుడిపై కామెంట్ చేశాడు. దీంతో కోపోద్రిక్తుడైన సమీర్.. అబ్దుల్లాను కొట్టాడు. గొడవ పెద్దది కావడంతో వారంతా రెండు గ్రూపులుగా విడిపోయి ఒకరిపై ఒకరు కర్రలు, రాళ్లతో దాడి చేసుకున్నారు. అబ్దుల్లా ఫిర్యాదుతో బండ్లగూడ పోలీసులు రెండు గ్రూపులపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు.

ఏటీఎం కేంద్రంలో రూ.20 వేల నగదు స్వాధీనం

మదీన, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఏటీఎం కేంద్రంలో పడి ఉన్న నగదును బండ్లగూడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హాషమాబాద్ టవర్ రోడ్డులో స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎం కేంద్రం ఉంది. శుక్రవారం సాయంత్రం ఇందులో నగదు పడి ఉందని స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు వెళ్లి స్వాధీనం చేసుకున్నారు. బాధితులు ఆధారాలతో సంప్రదిస్తే నగదు తిరిగి ఇచ్చేస్తామని ఇన్‌స్పెక్టర్ కె.సత్యనారాయణ తెలిపారు.

రూ.10 కోసం గొడవ.. ఆటో డ్రైవర్ మృతి

చాంద్రాయణగుట్ట, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): 10 రూపాయల విషయంలో జరిగిన గొడవ ఆటోడ్రైవర్ మృతికి దారి తీసింది. ఫలక్‌నుమా, వట్టేపల్లికి చెందిన మహ్మద్ అన్వర్ (37) ఆటోలో ఈనెల 12న ఫలక్‌నుమా వద్ద 16 ఏళ్ల బాలుడు ఎక్కాడు. శంషీర్‌గంజ్‌లో దిగి రూ.10 ఇచ్చాడు. రూ.20 ఇవ్వాలని ఆటోడ్రైవర్ కోరాడు. దీనిపై ఇద్దరి మధ్య వాగ్వివాదం జరిగింది. బాలుడు డ్రైవర్‌ను తోసివేయడంతో కింద పడ్డాడు. తల రాయికి తగలడంతో గాయమైంది. స్థానికులు డ్రైవర్‌ను ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆటోడ్రైవర్ మృతికి కారణమైన బాలుడ్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఊట్‌పల్లిలో హెరాయిన్ స్వాధీనం

శంషాబాద్ రూరల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా ఊట్‌పల్లిలో నిషేధిత హెరాయిన్‌ను శనివారం పోలీసులు పట్టుకున్నారు. ఊట్‌పల్లిలో ఉంటున్న అంబాలాల్ సుతార్ నిషేధిత మత్తుపదార్థాలు నిల్వ చేశాడనే సమాచారంతో ఎస్సై రాజ్‌కుమార్ సిబ్బందితో దాడి చేశారు. 618 గ్రాముల హెరాయిన్‌ను పట్టుకున్నారు. పట్టుబడిన డ్రగ్ విలువ రూ.74 లక్షలు ఉంటుందని, అంబాలాల్‌ను అదుపులోకి తీసుకొని, డ్రగ్స్‌ను సీజ్ చేశామని సీఐ తెలిపారు.

బాలిక అదృశ్యం



జోని యాస్మిన్

పహాడిషరీఫ్ జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లిన పదహారేళ్ల బాలిక తిరిగి రాలేదు. వివరాలిలా ఉన్నాయి....బర్మా దేశానికి చెందిన మురా ఆలం ఎనిమిదేళ్లుగా రాయల్ కాలనీలోని క్యాంపు నెంబర్ ఎనిమిదిలో నివాసముంటున్నాడు ఈ నెల 24న మురా ఆలం కూతురు జోని యాస్మిన్ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె కోసం వెతికినా ఆచూకీ లభించకపోవడంతో మురా ఆలం బాలాపూర్ పోలీసులకు ఫిర్యాదుచేశారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/gCajTGsలో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

జలాల్‌బాబానగర్‌లో కార్డన్ సెర్చ్

రాజేంద్రనగర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్, అత్తాపూర్, మైలార్‌దేవుపల్లి పోలీసులు శనివారం జలాల్‌బాబానగర్, భూపాల్‌నగర్ పరిసర ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ జి.వెంకట్రామిరెడ్డి, రాజేంద్రనగర్, మైలార్‌దేవుపల్లి పోలీస్ స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు బి.నాగేంద్రబాబు, పి.మధు, ఎస్ఐలు, స్పెషల్ పార్టీ పోలీసులు, టీఎస్ఎస్‌పీ పోలీసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గంజాయి తాగే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో నిఘా ఏర్పాటు చేస్తున్నామని, గొడవలు, దౌర్జన్యాలు చేసే వారిపై నిఘా పెట్టామన్నారు.

జూపార్కులో వన మహోత్సవం

మదీన, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): 75వ వన మహోత్సవాన్ని పురస్కరించుకుని సెంట్రల్ జూ అథారిటీ ఆదేశాల మేరకు శనివారం జూపార్కులో మొక్కలు నాటారు. అనంతరం సందర్శకులకు మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్యూరేటర్ డాక్టర్ సునీల్ ఎస్.హిరెమత్, డిప్యూటీ క్యూరేటర్ ఏ.నాగమణి, డిప్యూటీ డైరెక్టర్ (వెటర్నరీ) డాక్టర్ ఎం.ఎ.హకీమ్, అసిస్టెంట్ క్యూరేటర్లు ఎ.సతీష్‌బాబు, బి.లక్ష్మణ్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లు అనిత, మాధవీలత, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ మంజుల, ప్రజా సంబంధాల అధికారి హనీఫుల్లా, జూ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సీహెచ్.ఎం.దీపక్ పాల్గొన్నారు.



హైకోర్టు న్యాయవాది అమరేందర్ రెడ్డికి డాక్టరేట్ ప్రదానం చేస్తున్న మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ మోహన్ యాదవ్, విద్యాశాఖ మంత్రి ఇంద్రసింగ్ పర్మార్, వీసీ తివారీ

హైకోర్టు న్యాయవాది అమరేందర్‌రెడ్డికి డాక్టరేట్

అఫ్జల్‌గంజ్, జూన్29(ఆంధ్రజ్యోతి): భోపాల్‌లోని మానస సరోవర్ గ్లోబల్ యూనివర్సిటీలో శనివారం జరిగిన స్నాతకోత్సవంలో నగరానికి చెందిన హైకోర్టు న్యాయవాది అమరేందర్‌రెడ్డికి మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ మోహన్‌యాదవ్, విద్యాశాఖ మంత్రి ఇంద్రసింగ్ పర్మార్, యూనివర్సిటీ వీసీ తివారీ, ఆరోగ్య భారతి జాతీయ ఆర్గనైజర్ సెక్రటరీ రామేశ్వర శర్మ చేతుల మీదుగా డాక్టరేట్ ప్రదానం చేశారు.



శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న డీఎస్సీ అభ్యర్థులు

డీఎస్సీ అభ్యర్థులకు గడువివ్వాలి

గోషామహల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ అభ్యర్థులు పరీక్షకు సన్నద్ధమయ్యేందుకు కనీసం మూడు నెలల సమయం ఇవ్వాలని ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. శనివారం గౌలిగూడలోని కేంద్ర కార్యాలయంలో డీఎస్సీ అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు డీఎస్సీ అభ్యర్థులు తమ పార్టీ తరఫున ప్రభుత్వంతో పోరాటం చేయడానికి మద్దతు పలికారని బోనాల శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడాన్ని ప్రజాఏక్తా పార్టీ స్వాగతిస్తుందన్నారు. అభ్యర్థులు సన్నద్ధమయ్యేందుకు కనీసం మూడు నెలల సమయం ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై సీఎం రేవంత్ రెడ్డిని కలిసి కోరనున్నట్టు తెలిపారు.

ఉద్యోగ విరమణ పొందిన వారికి సన్మానం

రాజేంద్రనగర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు, విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న పలువురు ఉన్నతాధికారులు, ఉద్యోగులు శనివారం ఉద్యోగ విరమణ పొందారు. వారిని ఆయా సంస్థల అధిపతులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. పదవీ విరమణ పొందిన వారిలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ అగ్రికల్చర్ డాక్టర్ సీమ, వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ డాక్టర్ వి.సుధారాణి, ఆఫీస్ సబార్డినేట్ అశోక్ ఉన్నారు. రాజేంద్రనగర్ ఆర్టీసీ బస్సు డిపోలో టీఐ-3గా పనిచేస్తున్న ఏ.పీ.రెడ్డి, కంట్రోలర్‌గా పనిచేస్తున్న బి.గోవర్ధన్‌రెడ్డి, డ్రైవర్‌గా పనిచేస్తున్న బి.వెంకట్‌రెడ్డి, కండక్టర్లుగా పనిచేస్తున్న కే.ఎం.ఎస్.కుమారి, శివానంద్, యాదయ్య పదవీ విరమణ పొందారు. వారిని డిపో మేనేజర్ ఎం.శ్రీనాథ్ ఘనంగా సన్మానించారు. హిమాయత్‌సాగర్‌లోని వాటర్ అండ్ ల్యాండ్ మేనేజ్‌మెంట్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (వాలంతరీ)లో వర్క్ ఇన్‌స్పెక్టర్ గ్రేడ్-2గా పనిచేస్తున్న ఎం.ఎ.నయీమ్ పదవీ విరమణ పొందారు. వారిని ఉద్యోగులు, స్నేహితులు ఘనంగా సన్మానించారు.

చార్మినార్‌లో..

చార్మినార్ జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ చేసిన ఉద్యోగులు సంస్థకు చేసిన సేవలు మరువలేనివని సెట్విన్ మేనేజింగ్ డైరెక్టర్ కే.వేణుగోపాల్ రావు అన్నారు. శనివారం పురానిహవేలిలోని సెట్విన్ ప్రధాన కార్యాలయంలో ఆ సంస్థలో పనిచేసి పదవీ విరమణ చేస్తున్న సూపరింటెండెంట్ పీబీఎస్.ప్రసాద్ రావు, డ్రైవర్లు టౌఫిక్, మొహమ్మద్ ఇబ్రహీం, అటెండర్లు శంషుద్దీన్, నర్మద, లీలావతి, మొహమ్మద్ ఖాసీంను సత్కరించారు. కార్యక్రమంలో సెట్విన్ సంస్థ అకౌంట్ ఆఫీసర్ సురేష్ బాబు, మేనేజర్ ఎం.ఏ.మొయిజ్, సూపరింటెండెంట్ కృష్ణ, సంస్థలో పనిచేస్తున్న కో ఆర్డినేటర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మదీన, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): హుసేనిఆలం ప్రభుత్వ మహిళా కళాశాలలో వివిధ సబ్జెక్టులు బోధించడానికి అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సునీత పద్మావతి ఓ ప్రకటనలో తెలిపారు. అరబిక్-1, తెలుగు-1, ఇంగ్లీష్-3, ఎకనామిక్స్ (ఉర్దూ మీడియం)-1, మోడ్రన్ లాంగ్వేజ్ (ఉర్దూ మీడియం)-1, కామర్స్-3, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్-4, మ్యాథమెటిక్స్-1 పోస్టు ఖాళీగా ఉన్నాయన్నారు. సంబంధిత సబ్జెక్టుల్లో పీజీలో 55 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులైతే పీజీలో 50 శాతం మార్కులు ఉండాలన్నారు. నెట్, సెట్, స్లెట్, పీహెచ్‌డీ అదనపు అర్హతలతో పాటు బోధనానుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు.

చిత్రపురి కాలనీ అభివృద్ధికి కృషి

- వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అనిల్‌కుమార్

నార్సింగ్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): చిత్రపురి కాలనీ సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తానని కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అనిల్‌కుమార్ వల్లభనేని అన్నారు. శనివారం చిత్రపురి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కావాలనే కొందరు తనపై అవినీతి ఆరోపణలు చేశారని, నిజం నిరూపించడానికి బహిరంగ చర్చకు రావాలని ఆయన సవాల్ విసిరారు. చిత్రపురి కాలనీ అభివృద్ధి చెందడానికి కమిటీ సభ్యుల నిర్ణయం మేరకు తాను రాజీనామాకు సిద్ధంగా ఉన్నానని ఆయన పేర్కొన్నారు. చిత్రపురి కాలనీ అభివృద్ధికి కృషి చేసే వ్యక్తిపై ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు. చిత్రపురి కాలనీ మొత్తం బడ్జెట్ 750 కోట్లు కాగా అవినీతి 300 కోట్లు జరిగిందని తనపై ఆరోపిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఎక్కడ అవినీతి జరిగిందో బహిరంగ చర్చకు రావాలని ఆయన సవాల్ విసిరారు.



అలనాటి కథ

మారిషస్ అనగానే అనేక జ్ఞాపకాలు నన్ను చుట్టుముడతాయి. విశ్వవిఖ్యాతి చెందిన కవి టిఎస్ ఎలియట్‌కు స్వయంగా రాసిన లేఖను బహుమతిగా అందుకోవటం.. ప్రధానులు, రాణులు ఉన్న స్వీట్‌లలో స్టేట్ గెస్ట్‌గా ఉండటం..ఇలా అందమైన గత జ్ఞాపకాలన్నీ గుర్తుకొస్తాయి.

మారిషస్‌లో మరపురాని సంఘటనలు!

తెలుగు లైబ్రరీ శంకుస్థాపన కోసం మారిషస్‌కు వెళ్లిన ఏడాది తర్వాత ఆ దేశ ప్రధాని నన్ను అక్కడ ఉన్న ఒక యూనివర్సిటీలో ప్రసంగించమని ఆహ్వానించారు. ఒక సారి మన దేశం తరఫున వెళ్లే.. మరో సారి ఆ దేశం ఆహ్వానంపై అక్కడికి వెళ్లటం మరచిపోలేని అనుభవమనే చెప్పాలి. నా కోసం ఎయిర్‌పోర్టుకు ప్రధాని సర్ శివసాగర్ రాంగులాం సెక్రటరీ విజయ్ ప్రత్యేకంగా వచ్చి.. నన్ను అక్కడ ఉన్న ప్రముఖ హోటల్ లి రిజ్వీకి తీసుకువెళ్లారు. అక్కడ నేను బస చేసిన స్వీట్‌లోనే ప్రధాని ఇందిరాగాంధీ, బ్రిటన్ రాణి ఎలిజిబెత్ ఉన్నారని అక్కడ స్టాఫ్ చెప్పారు. ప్రపంచంలోనే పెద్ద పెద్ద డిగ్నిటరీలు ఉన్న స్వీట్‌ను నాకు కేటాయించటం చాలా ఆశ్చర్యమనిపించింది. ఆ రోజు రాత్రి మారిషస్ గవర్నర్ జనరల్ విలియం భార్య లేడీ విలియం నా రూమ్‌కు వచ్చి నన్ను రాత్రి డిన్నర్‌కు ఆహ్వానించారు. డిన్నర్ సమయానికి విలియం నేరుగా హోటల్‌కు వచ్చేశారు. ఆ డిన్నర్ చాలా బాగా సాగింది. ఆ మర్నాడు ఉదయం లేడి విలియం నన్ను బ్రేక్‌ఫాస్ట్‌కు ఆహ్వానించారు. నేను సున్నితంగా తిరస్కరించాను. మర్నాడు విశ్వవిద్యాలయంలో నా ప్రసంగానికి కూడా మంచి స్పందన లభించింది.



ఈ సందర్భంలో మరో విషయం గురించి చెప్పాలి. మారిషస్‌లో మాల్కం అనే ప్రఖ్యాత రచయిత ఉండేవాడు. అతనిని మారిషస్ ప్రజలు తమ జాతీయ కవిగా భావించేవారు. నేను మారిషస్ వస్తున్నానని తెలిసి ఆయన నా గురించి ఒక వ్యాసం రాశారు. ఎవరి గురించి ఎక్కువగా పొగడని మాల్కం నా గురించి మాట్లాడటం ఒక సంచలనాన్ని రేకెత్తించింది. ఈ నేపథ్యంలో- లేడి విలియం- మార్షల్‌ను కలవాలనుకుంది. నేను కూడా మార్షల్‌కు డిన్నర్ ఇవ్వాలనుకుంటున్నాను కాబట్టి- అందరినీ నా స్వీట్‌కు డిన్నర్‌కు పిలిచాను. ఆ విషయం చెబితే మార్షల్ డిన్నర్‌కు రాడు కాబట్టి- అతనికి లేడి విలియం వస్తున్నట్లు చెప్పలేదు. నేను పిలిచిన సమయానికి మార్షల్ వచ్చారు. మౌనంగా కూర్చున్నాడు. ఆ తర్వాత లేడి విలియంను కూడా వచ్చింది. వారిద్దరికీ పరిచయం చేశారు. లేడి విలియం అనేక విషయాల గురించి మాట్లాడటం మొదలుపెట్టింది. కానీ మార్షల్ ఒక్క మాట కూడా మాట్లాడలేదు. కవులు, కళాకారుల మూడ్స్‌ను ముందుగా గుర్తించటం చాలా కష్టమని మరో సారి నాకు అర్థమయింది.

ఈ పర్యటనలో మరో ఆసక్తికరమైన సంఘటన కూడా జరిగింది. మారిషస్ ప్రధాని కార్యదర్శి విజయ్ నేను ఎక్కడికి వెళ్లినా నాతో పాటే ఉండేవారు. ఒక రోజు హఠాత్తుగా విజయ్‌కు- ఫ్రాన్స్ ప్రధాని మిత్రో మారిషస్‌కు ముందుస్తు సమాచారం ఇవ్వకుండా హఠాత్తుగా వస్తున్నారని.. ఆయనకు వెళ్లి స్వాగతం చెప్పమని ఫోన్ వచ్చింది. ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో విజయ్ నన్ను కూడా ఎయిర్‌పోర్టుకు రమ్మని పిలిచాడు. నేను కూడా అతనితో పాటుగా ఎయిర్‌పోర్టుకు వెళ్లాను. మిత్రో విమానం ల్యాండ్ అయింది. మిత్రోకు మేము బోకేలు అందించాం. మిత్రోను ప్రసన్నం చేసుకుందుకు విజయ్ రకరకాల విన్యాసాలు చేయటం మొదలుపెట్టాడు. మిత్రో చిన్నప్పుడు రాసిన ఒక కవితను ఇంగ్లీషులో చదివి వినిపించాడు. మిత్రో మొహంలో ఎటువంటి భావాలు కనబడలేదు. "ఇది నా ప్రైవేట్ విజిట్.. ఎటువంటి ప్రొటోకాల్ అవసరం లేదు.. నేను ఒక హోటల్‌లో




ఉంటా" అని విజయ్‌ని కసురుకున్నాడు. ఫ్రాన్స్ ప్రధాని కావాలన్నా.. వద్దన్నా.. ఆయనకు ప్రొటోకాల్ ఇవ్వాల్సిన బాధ్యత మారిషస్ ఉంది. దీంతో విజయ్ - "మీరు ఎక్కడికి వెళ్దాం అక్కడికే వెళ్దాం" అన్నాడు. మేమందరం మిత్రో ముందుగా బుక్ చేసుకున్న ఒక హోటల్‌కు వెళ్లాం. అక్కడ విజయ్‌ను వదిలేసి నేను నా హోటల్‌కు వచ్చేసా! మిత్రో హోటల్‌లో చెకిన్ అయిన తర్వాత 48 గంటల దాకా బయటకే రాలేదట! ఆ తర్వాత బయటకు వచ్చి బీచ్‌లో వ్యాహ్యాళికి వెళ్దామని పిలిచాడట. అక్కడ ఆయన విజయ్‌కు పెట్టిన ఏకైక కండిషన్- "నాకు ఏ ఆహారం పెడతారో.. అదే ఆహారం నా కుక్కకు కూడా పెట్టాలి.. నాకు ఎలాంటి గౌరవం ఇస్తారో.. అలాంటి గౌరవమే నా కుక్కకు ఇవ్వాలి" అని!

ఇలాంటి చిత్రమైన సంఘటనల మధ్య నా మారిషస్ పర్యటన ముగిసింది. నేను భారత్‌కు వచ్చేసే ముందు- ప్రధాని రాంగులాంను కలిసి కృతజ్ఞతలు చెప్పారు. ఆ సమయంలో ఆయన నాకు ఒక అమూల్యమైన బహుమతి ఇచ్చారు. అదే విశ్వవిఖ్యాత కవి టిఎస్ ఎలియట్ స్వయంగా రాసిన ఒక లేఖ! దానిని ఆయన ఒక వేలంపాటలో కొన్నారట. "ఇది మీ దగ్గర ఉంటే బావుంటుంది" అని ఆయన బహూకరించారు. అది ఇప్పటికీ నా దగ్గర ఉంది. బహుశా ఇప్పుడు ఆ లేఖ విలువ అంతర్జాతీయ మార్కెట్లో కొన్ని కోట్లు ఉంటుందేమో?

• రాజకుమారి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్

తెలుగు సినీ చరిత్రలో వైజయంతి మూవీస్ బ్యానర్‌కు, దాని అధినేత అశ్వనీదత్‌కు ఒక ప్రత్యేక స్థానం ఉంది. 50 ఏళ్ల చలన చిత్ర ప్రస్థానం కలిగిన ఈ బ్యానర్‌పై నిర్మించిన తాజా చిత్రం 'కల్కి' ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ఆదరణ పొందుతోంది. రికార్డులు సృష్టిస్తోంది. "ఈ బ్యానర్‌లో నా తొలి సినిమాకు అయిన ఖర్చు 15 లక్షలు. కల్కికి అయిన ఖర్చు సుమారు 700 కోట్లు. 500 రెట్లు ఎక్కువ. నన్ను, నా కుటుంబాన్ని, మా బ్యానర్‌ను ఇంతగా ఆదరిస్తున్న ప్రేక్షకులకు ఏమి ఇచ్చి రుణం తీర్చుకోగలం?" అంటారు అశ్వనీదత్. 'కల్కి' విజయోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో- ఆయన 'నవ్య'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూ.





తెలుగు సినిమాగతిని 'కల్కి' మార్చేసింది..!

ప్రపంచవ్యాప్తంగా 'కల్కి' సాధించిన విజయం మీకు ఎలా అనిపిస్తోంది?

దీని కోసమే 50 ఏళ్ల వేచి చూశామేమో అనిపిస్తోంది. మూడేళ్ల క్రితం 'కల్కి' షూటింగ్ ప్రారంభించాం. ఏ విషయంలోను ఎప్పుడూ తొందరపడలేదు. రాజీపడలేదు. 'కల్కి-2'కు సంబంధించి కూడా సుమారు నాలుగు వేల అడుగుల ఫిల్మ్ షూట్ చేశాం. మిగిలింది పూర్తి కావాలి. త్వరలోనే షూటింగ్ ప్రారంభిస్తాం.

సినిమా ప్రపంచంలో జయపజయాలు ఎప్పుడూ ఉంటాయి.. అపజయాలు ఎదురయినప్పుడు సినిమాల నుంచి విరమిద్దామని ఎప్పుడూ అనుకోలేదా?

ఒక్కసారి కూడా అనుకోలేదు. నాకు 22 ఏళ్ల వయస్సు ఉన్నప్పుడు సినిమా తీస్తానని గ్రేట్ ఎన్టీఆర్ దగ్గరకు వెళ్లా. అప్పుడు ఆయన- "నువ్వు చదువుకున్నావు. వ్యాపారం చేసుకోవచ్చు కదా! ఇక్కడ ఎప్పుడు ఏమవుతుందో తెలియదు.. నేనే ప్రస్తుతం కొన్ని రోజులు ఖాళీగా ఉంటున్నాను" అన్నారు. కానీ నేను సినిమా తీస్తానని పట్టుపట్టాను. సినిమా తీశాను. ఆ రోజు నుంచి జయపజయాలు ఎన్నో చూశా. 'శక్తి' లాంటి ఘోర పరాజయాలు కూడా ఉన్నాయి. అలాంటి సమయాల్లో కూడా 'ఇదొక పీడకల. వెళ్లిపోతుంది' అనుకొనేవాణ్ణి.

మీకు ఇంత ఆత్మనిబ్బరం ఎక్కడి నుంచి వచ్చింది?

మా అమ్మ దగ్గర నుంచి వచ్చింది. నేను సినిమా రంగంలోకి వెళ్లటం మా నాన్నకు ఇష్టం లేదు. నేను అమ్మ దగ్గరకు వెళ్లి చెప్పాను చాలా గొడవ చేశాను ఆ సమయంలో నాకు మా అమ్మ పూర్తిగా మద్దతు ఇచ్చింది. వెన్నంటి నిలిచింది. నాన్నతో పోరాడింది. పట్టుదలగా నన్ను మద్రాసుకు పంపించింది. నా సక్సెస్‌ను తను కళ్లారా చూసింది. అందుకే మా అమ్మకు ఎప్పుడూ రుణపడి ఉంటాను.

ఇంత పెద్ద బడ్జెట్‌తో 'కల్కి' ఎలా తీయగలిగారు?

'కల్కి'లాంటి సినిమాను తీయగలగటం కారణం- మా అమ్మాయిలు- స్వప్న, ప్రియాంక. వాళ్లిద్దరు అమెరికాలో చదువుకొని వచ్చారు. ఆ సమయంలో వాళ్లతో ఏదైనా ఒక పరిశ్రమ పెట్టించాలనుకున్నా. కానీ వాళ్లు సినిమా రంగంలోకి రావాలనుకున్నారు. స్వప్న ముందు చిన్న వీడియో చిత్రాలు తీసేది. ప్రియాంక వచ్చిన తర్వాత- ఇద్దరూ ప్రొడక్షన్‌లోకి వచ్చారు. ఆ సమయంలో వాళ్లకు కొన్ని ఫెయిల్యూర్స్ వచ్చాయి. వాళ్లు వాటిని తట్టుకొని నిలబడగలిగారు. ఆ తర్వాత మానసికంగా, శారీరకంగా చాలా కష్టపడి 'ఎవడే సుబ్రమణ్యం' సినిమా తీశారు. అదొక టర్నింగ్ పాయింట్.

'ఎవడే సుబ్రమణ్యం' - ఒక భిన్నమైన సినిమా. దాని కథ చెప్పినప్పుడు మీరేమన్నారు?

నాకు వాళ్ల మీద నమ్మకం ఉండేది. కానీ అదొక భిన్నమైన సినిమా. ఆ కథ చెప్పినప్పుడు- "కథ డిఫరెంట్‌గా ఉంది. బావుంది.. తీయండి.. అనుభవం వస్తుంది కదా..." అన్నాను. కానీ ఆ సినిమా తీస్తే రిస్క్ ఉంటుందనే విషయం నాకు తెలుసు. వాళ్లకు అనుభవం వస్తే చాలనుకున్నాను. కానీ ఆ సినిమా చాలా పెద్ద సక్సెస్ అయింది. ఆ తర్వాత వాళ్లు చాలా నేర్చుకున్నారు. ఆ సినిమా తర్వాత 'మహానటి' తీశారు. ఆ సమయంలో నాకు చాలా ఆనందం కలిగింది. ఎందుకంటే సావిత్రి గారు నాకు బాగా తెలుసు. అలాంటి గొప్ప నటి మీద చిత్రం తీయటం అంత సులభం కాదు. 'నేను ఇలాంటి స్టోరీ చేయలేకపోయాను. పిల్లలు చేస్తున్నారు' అనుకొనేవాణ్ణి.. బడ్జెట్ ఎక్కువయింది. పట్టించుకోవద్దని వాళ్లకు ధైర్యం చెప్పా. ఆ సినిమా కాపీ చూసిన తర్వాత మతి పోయింది. అంత గొప్పగా ఉందా సినిమా! ఆ తర్వాత 'జాతి రత్నాలు' పెద్ద హిట్. ఇలా వాళ్లకు సక్సెస్ అనేది ఒక్క రోజులో రాలేదు. ఒకో మెట్టు ఎక్కుతూ వచ్చారు. ఇప్పుడు శిఖరాన నిలబడ్డారు.

ప్రథమ కోపం

నేను బయట ఎక్కువగా ఎమోషన్స్ ప్రదర్శించను. అందరూ నా వాళ్లే కదా! బాధపడే అవకాశం ఉంటుంది. అయితే నాకు ప్రథమ కోపం ఎక్కువ. స్వప్నకు కూడా నా పోలికే ఎక్కువ వచ్చింది. తనకి కూడా నాలాగే షార్ట్ టెంపర్. కానీ వెంటనే సర్దుకుంటుంది. ఇక్కడ ఇంకో విషయం చెబుతాను. స్వప్న, ప్రియాంక- ఇద్దరూ ఒకే మాట మీద ఉంటారు. వారి అభిప్రాయాలు వేరుగా ఉండచ్చు. ఆలోచనా విధానం మాత్రం ఒకటే!

మీ సమయానికి, ఇప్పటికీ సినిమా నిర్మాణంలో ఎలాంటి మార్పులు వచ్చాయి?

మా రోజుల్లో హీరో ఇమేజ్ ఆధారంగా కథలను రూపొందించుకొనేవాళ్లం. హీరోలకు చెబితే వెంటనే ఒప్పుకొనేవారు. ప్రస్తుతం ఉన్నన్ని డిస్కషన్స్ ఉండేవి కావు. ప్రస్తుతం సినిమా నిర్మాణ ప్రక్రియ చాలా స్లో అయింది. అన్నీ జాగ్రత్తగా చూసుకొన్న తర్వాత మొదలుపెడుతున్నారు. అవుట్‌పుట్ కూడా అంత గొప్పగానూ వస్తోంది.

మీరు అనేక మంది హీరోలతో సినిమాలు తీసారు కదా.. వారిలో ఉన్న గొప్ప గుణాలేమిటి?

నా సినీ జీవితంలో బెస్ట్ టైమ్ చిరంజీవిగారి ఎంట్రీ తర్వాతే వచ్చిందని చెప్పాలి. 'జగదేకవీరుడు-అతిలోక సుందరి'తో ఆయనతో ప్రారంభమయిన ప్రస్థానం మరో మూడు సినిమాల వరకూ సాగింది. ఎక్కడా చిన్న పొరపొచ్చాలు కూడా రాలేదు. మహానుభావుడని చెప్పాలి. ఆ తర్వాత నాగార్జునగారితో ఐదు సినిమాలు చేశాను. చాలా మంచి మనిషి. ఇక కృష్ణగారి గురించి చెప్పక్కర లేదు. గొప్ప వ్యక్తి. 'అగ్నిపర్వతం' సినిమా తీస్తున్నప్పుడు ఆయన అనేక సూచనలు ఇచ్చేవారు. ఇప్పుడు ప్రభాస్‌తో చేశా! తనకు కథ చెప్పినప్పుడు - "ఇది నా కోసం రాసిన కథ. నేను చేసి తీరతాను" అని మూడేళ్లు అన్నీ పక్కన పెట్టి సినిమాలో నటించాడు. విపరీతమైన సహకారం అందించాడు. మూడేళ్ల పాటు అతనికి ఈ సినిమా తప్ప వేరే ఆలోచనే లేదు. నేను చేసిన హీరోలందరూ నిర్మాత చల్లగా ఉండాలను కొనేవారే! మంచి సహకారం అందించిన వారే!

మీరు అనేక మంది దర్శకులతో పనిచేశారు. ఏ దర్శకుడితో నాగిని పోలుస్తారు?

నాగిపై ఏ దర్శకుడి ప్రభావం ఉన్నట్లు కానీ, పోల్చగలిగినట్లు కానీ నాకు అనిపించలేదు. తను ఏది అనుకున్నాడో అదే తీశాడు. ఎక్కడా ఎక్కువా లేదు, తక్కువా లేదు. ఒక సీను చూసి- 'దీన్ని ఇంకా బాగా తీయవచ్చు' అని నాకు ఎక్కడా అనిపించలేదు. గ్రాఫిక్స్ విషయంలో తను పడిన శ్రమ అసామాన్యం. తనకు ఇసుమంత గర్వం కూడా లేదు. 'మహానటి' సినిమాలో తన విశ్వరూపం చూపించాడు. అప్పుడు 'భగవంతుడు నాకు అలాంటి అల్లుణ్ణి ఇచ్చాడు చాలు..ఎంత కాలమైనా సినిమాలు తీస్తానే ఉంటా' అనుకున్నా. ఇప్పుడు 'కల్కి'తో తెలుగు సినిమాను వేరే స్థాయికి తీసుకువెళ్లాడు.


• సీవీఎల్ఎన్ ప్రసాద్



సమయం గడిచిపోయింది..

నా ఉద్దేశంలో తెలుగు సినిమా గతిని 'కల్కి' మార్చేసింది. మన దేశంలో వచ్చిన గ్రేటెస్ట్ ఫిల్మ్స్‌లో ఇది కూడా ఒకటి. ఇలాంటి సినిమా తీస్తానని నేను ఎప్పుడూ అనుకోలేదు. గత మూడేళ్లు ఆడుతూ పాడుతూనే సెట్స్‌కు వెళ్లేవాడిని. 'వాళ్లు ఒక మహాయజ్ఞం చేస్తున్నారు. దానికి సమిధలు సమకూర్చటమే నేను చేయాల్సింది' అనుకున్నా! ఆ యజ్ఞ ఫలితం చూస్తుంటే విపరీతమైన ఆనందం కలుగుతోంది. పిల్లలను చూస్తుంటే- సినిమా తీసే విధానం నాకు కూడా తెలియదేమోననిపిస్తోంది. అమితాబ్, దీపిక, కమల్‌హాసన్, ప్రభాస్.. ఇలా దేశంలోనే అతి పెద్ద స్టార్స్ అందరినీ తీసుకువచ్చి సినిమా తీయటం అంత సులభం కాదు.

ఎన్టీఆర్ పెట్టిన పేరు!



సినిమా తీయటానికి వెళ్లినప్పుడు- ఎన్టీఆర్- "బ్యానర్‌కు ఏం పేరు పెట్టావు?" అని అడిగారు. "మీరు ఏ పేరు చెబితే ఆ పేరు పెడతా.." అన్నా. ఆయన అక్కడ ఉన్న కృష్ణుడి పటం వైపు చూశారు. "కృష్ణుడు మనకు అచ్చొచ్చిన దైవం కదా... 'వైజయంతి మూవీస్' అని పెట్టు.." అని ఒక కాగితంపై రాసి ఇచ్చారు. అలా ఆ మహానుభావుడితో పేరు పెట్టించుకొనే అదృష్టం దక్కింది.

ఎలా గుర్తుండాలంటే...



తెలుగు సమాజాన్ని, ప్రజలను అర్థం చేసుకొని... వాళ్ల అభిరుచులను గమనిస్తూ.. వాళ్ల అంచనాలకు మించిన గొప్ప సినిమాలు తీసే నిర్మాతగా నన్ను చరిత్ర గుర్తుపెట్టు కోవాలనుకుంటున్నా!

కల్కి- పార్ట్ 2



'కల్కి'ని మొదట రెండు భాగాలుగా తీద్దామని అనుకోలేదు. షూటింగ్ కొంత అయిన తర్వాత అనుకున్నారు. "కమల్‌హాసన్ క్యారెక్టర్ రెండో పార్ట్‌లోనే ఎలివేట్ అవుతుంది. దాని మీద ఎక్కువ వర్క్ చేద్దామనుకుంటున్నా" అని నాగీ చెప్పాడు. 'కల్కి' మొదటి పార్ట్ సూపర్ హిట్ అయింది. రెండోది కూడా మొదటి పార్ట్ కన్నా ఎక్కువ హిట్ అవుతుందనే నమ్మకం ఉంది. అవి ఎతాబ్, ప్రభాస్, కమల్ ముగ్గురు కలిసే సీన్స్ చాలా గొప్పగా ఉంటాయనిపిస్తుంది.

ఈ ముంబై భామ టీవీ నటిగా పేరు తెచ్చుకుంది. ఆ తర్వాత వెండితెరకొచ్చింది. పేరు నుస్రత్ భరూచా. 'రామ్‌సేతు', 'ఛత్రపతి' లాంటి హిందీ చిత్రాలతో పాపులరైన నుస్రుత్ భరూచా గురించి కొన్ని విశేషాలు...

అందుకే... కెరీర్‌లో నిలబడాలనుకున్నా..!

నుస్రత్ భరూచాకు ఇన్‌స్టాలో ఏడు మిలియన్ల ఫాలోవర్లు ఉన్నారు. తన ఇంట్లో ఫొటోలు, పెంపుడు జంతువులు, తినే ఆహారం, యాత్రా విశేషాలు, సినిమా కబుర్లు చెబుతుంటుంది. ఫొటోషూట్స్ అప్‌లోడ్ చేస్తుంటుంది. బాలీవుడ్ కథానాయికగా మరీ అంత పెద్ద హిట్లు లేకపోయినా.. ఆమెకు ఇన్‌స్టాలో మంచి ఫ్యాన్‌బేస్ ఉంది.

ఇంట్లో తెలీకుండా..

తన్వీర్, తస్నీమ్ దంపతులకు పుట్టిన గారాల పట్టి నుస్రత్. ముంబైలోనే పుట్టి పెరిగింది. అక్కడే విద్యాభ్యాసం. డిగ్రీ వరకు చదివింది. ఆ మధ్యలోనే సినిమా పిచ్చి పట్టుకుంది. సినిమాల్లోకి వెళ్తానంటే.. కుదరదన్నారు ఇంట్లో. దీంతో చేసేదేమీ లేక కొన్నాళ్లు ఊరుకుంది. ఆ తర్వాత ఇంటి దగ్గరనుంచి ఏదో కోర్సు చదవాలని వెళ్లి.. ఆడిషన్స్‌కు అటెండ్ అయ్యేది. అలా 'కిట్టీ పార్టీ' సీరియల్‌లో ఎంపికయింది. ఇంట్లో వాళ్లకు తెలీకుండా షూటింగ్‌లో పాల్గొంది. చివరికి ఇంట్లో వాళ్లు వొప్పుకోలేదు. ఇదో కెరీర్ అని వొప్పించింది. 2016లో 'జై సంతోషిమా' అనే చిత్రంతో బాలీవుడ్‌కు పరిచయమైంది.

అంత సులువుగా సక్సెస్ కాలేదు..

నుస్రత్ అందం, అభినయం ఉన్నా ప్రతిభ మాత్రం తప్పదని గ్రహించింది. సీరియల్స్‌లో నటించిన అనుభవంతో సినిమాల్లో నటించింది. ఒక్క సినిమా కూడా వర్కవుట్ కాలేదు. హీరో శివాజీ సరసన 'తాజ్ మహల్'(2010)లో నటించింది. ఓ తమిళ చిత్రంలో నటించింది. అయినా ఆమెకు అపజయాలే పలకరించాయి. 'ఎల్.ఎస్.డీ' చిత్రంతో నోటెడ్ అయ్యింది. అలాంటి సమయంలో 2011లో 'ప్యార్ కా పంచనామా' చిత్రంతో ఆమెకు సక్సెస్ దక్కింది. 'ఆకాష్‌వాణి', 'ప్యార్ కా పంచనామా 2', 'డ్రీమ్ గాళ్', 'రామసేతు'.. లాంటి బాలీవుడ్ చిత్రాల్లోని ఆమె నటనకు చక్కటి గుర్తింపు వచ్చింది. గతేడాది 'ఛత్రపతి' హిందీ చిత్రంలో బెల్లంకొండ శ్రీనివాస్ జోడీగా నటించింది. వాస్తవానికి ఇది ప్రభాస్ 'ఛత్రపతి'కి రీమేక్. ఈ సినిమాతో ఆమెకు క్రేజ్ వరించింది.




నేను నటించిన సినిమాను పేరెంట్స్‌తో పాటు బంధువులతో చూశా. ఆ రోజు.. బాగా గుర్తుంది! నా వెనకాల దూరంలో ఉండే ఐదు మంది అబ్బాయిలు ప్రతి సన్నివేశాన్ని కామెంట్ చేశారు. ఆరోజు నాకు నటన రాదని ఏడ్చాను. అప్పుడే మంచి నటిగా పేరు తెచ్చుకోవాలనుకున్నా

మ్యూజిక్ వీడియోలతోనూ పాపులర్..

'చలాంగ్' చిత్రంలో రాజ్‌కుమార్. ఆర్ తో కలసి నటించింది. ఇందులో 'కేర్ కి నర్దా..' అనే ఓ పాట యూట్యూబ్‌లో రిలీజ్ అయినప్పుడు.. ముప్ఫయి కోట్లకు పైగా వీక్షించారు. యోయో హనీసింగ్‌తో చేసిన 'సయాన్ జీ..' పాటను యాభై కోట్లకు పైగా వీక్షించారు. దీంతో నుస్రుత్‌కు యూత్‌లో మంచి ఆదరణ దక్కింది. 'ఆజీబ్ దాస్తా', 'తు జూతీ మే మక్కర్' లతో ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో కూడా ఆమె ఫేమ్ అయ్యింది. 'ఒకప్పుడు ఆడిషన్‌కు వెళితే.. సరిపోవు ఈ పాత్రకు అనేవాళ్లు. అవేమీ పట్టించుకోలేదు. సినిమాల్లో నటించటం మొదలెట్టాక.. ఓ చిత్రం పేరెంట్స్‌తో పాటు బంధువులతో చూశా. ఆ రోజు నా వెనకాల దూరంలో ఉండే ఐదు మంది అబ్బాయిలు ప్రతి సన్నివేశాన్ని కామెంట్ చేశారు. ఆరోజు నాకు నటన రాదని ఏడ్చాను. అప్పుడే మంచి నటిగా పేరు తెచ్చుకోవటమే కాదు కెరీర్‌లో నిలబడాలి అనుకున్నా' అంటుంది నుస్రత్. రెండేళ్ల క్రితం వెర్టిగో సమస్యతో బాధపడింది. డ్యాన్స్ వేసేప్పుడు కిందపడి మోకాలి, వెన్ను సమస్య వచ్చింది. మానసికంగా బలాన్ని పుంజుకుంది. మళ్లీ మామూలు స్థితికి రావటానికి ఏడాది సమయం పట్టింది. ఆ సమయంలో జీవితం అంటే ఏంటో అర్థమైంది అంటుంది నుస్రుత్ భరూచా.

పాదాల పగుళ్లు పోవాలంటే...

ఈ వానా కాలంలో కొందరికి, పాదాలు, మడమలు పగిలి ఇబ్బంది పెడుతూ ఉంటాయి. ఎక్కువగా పగిలితే ఆ పగుళ్ల నుండి రక్త స్రావం అయే అవకాశం కూడా ఉంటుంది. వర్షరుతువులో పాదాలు కొంచెం ఎక్కువ సేపు నీటిలో నానినా పగుళ్లబాధ తీవ్రం అవుతుంది.ఈ పగుళ్ల నివారణకు ఇంట్లోనే పాటించగల చిట్కాలను తెలుసుకుందాం,



బేకింగ్‌సోడాతో: ఒక బకెట్ లేదా టబ్‌లో గోరువెచ్చని నీరు తీసుకుని, అందులో మూడు స్పూన్ల బేకింగ్ సోడాకలిపి, ఆ నీటిలో పదిహేను నిమిషాల పాటు పాదాలను ఉంచి, తరువాత పొడి బట్టతో పాదాలను తుడిచి ప్యూమిస్ స్టోన్‌తో మృతచర్మ కణాలు తొలగిపోయేలా రుద్ది.. తరువాత కొబ్బరినూనెలో అలోవెరా జెల్ కలిపి రాయాలి.

బియ్యపుపిండితో: చర్మం మీది మృతకణాలు తొలగించడంలో బియ్యపుపిండి అద్భుతంగా పని చేస్తుంది. ఒక టేబుల్ స్పూన్ తేనెలో మూడు టేబుల్‌స్పూన్ల బియ్యపు పిండిని కలిపి, దానికి నాలుగు చుక్కల వెనిగర్ ను చేర్చి, ఆ మిశ్రమంతో పాదాలను పది నిమిషాల పాటు సున్నితంగా మర్దన చేయాలి. దీనివల్ల మృతకణాలు తొలగిపోవడంతో పాటు, తేనె వల్ల చర్మం తేమగా మారుతుంది.

నిమ్మరసంతో: ఐదు స్పూన్ల సముద్రపు ఉప్పుకు ఒక స్పూను కొబ్బరినూనె ఒక చెంచా నిమ్మరసం కలిపిపాదాలకు రాసి, పదిహేను నిమిషాలు ఉంచి చల్లని నీటితో కడిగేయాలి.

యాపిల్ సిడర్ వెనిగర్‌తో: ఒక చెంచా తేనె, ఒక చెంచా బియ్యపు పిండికి, ఒక చెంచా యాపిల్ సిడర్ వెనిగర్ చేర్చి ఈ మిశ్రమంతో పాదాలకు మర్దన చేసి తరువాత గోరువెచ్చని నీటిలో కడిగేయాలి.

నువ్వుల నూనెతో: నువ్వుల నూనె, కొంత గ్లిజరిన్.. రెండు చెంచాల కాఫీ పొడిని చేర్చి, ఆ మిశ్రమంతో కూడా పాదాలకు మర్దన చేసి, గోరువెచ్చని నీటితో కడిగేయాలి.

ఓట్‌మీల్‌తో: ఓట్‌మీల్, ఆలివ్ నూనె తేనె బియ్యపుపిండి కలిపిన మిశ్రమంతో పాదాలకు మర్దన చేసి గోరువెచ్చని నీటితో కడిగేయాలి.



1292 టీ20 ప్రపంచకప్‌లో విరాట్ కోహ్లీ చేసిన మొత్తం పరుగులు. టోర్నీ చరిత్రలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు.

281 ఈ వరల్డ్‌కప్‌లో రహ్మనుల్లా గుర్బాజ్ (అఫ్ఘానిస్థాన్) చేసిన పరుగులు. ఈ టోర్నీలో అత్యధిక పరుగుల వీరుడు ఇతనే.

98 నికోలస్ పూరన్ (వెస్టిండీస్) వ్యక్తిగత స్కోరు ఇది. ఈ టోర్నీలో అత్యధిక వ్యక్తిగత స్కోరర్ ఇతనే.

17 ఫజల్ ఫరూఖి (అఫ్ఘానిస్థాన్), అర్ష్‌దీప్ పడగొట్టిన వికెట్లు. టోర్నీలో అత్యధిక వికెట్ల వీరులుగా నిలిచారు.

5/9 ఫరూఖి బౌలింగ్ గణాంకాలు. అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శన ఇతనిదే.

8 టోర్నీలో భారత్, దక్షిణాఫ్రికా గెలిచిన మ్యాచ్‌లు. అత్యధిక విజయాలు ఈ జట్లవే.

26 ట్రావిస్ హెడ్ (ఆస్ట్రేలియా) కొట్టిన ఫోర్లు. ఈ టోర్నీలో అత్యధిక ఫోర్లు ఇతనివే. ఇబ్రహీం జద్రాన్ (25), రోహిత్ శర్మ (22) తర్వాతి స్థానాల్లో ఉన్నారు.

17 నికోలస్ పూరన్ బాదిన సిక్సర్లు. ఈ టోర్నీలో అత్యధిక సిక్సర్ల వీరునిగా నిలిచాడు. గుర్బాజ్ (16), రోహిత్ శర్మ (15), హెడ్ (15)లది తర్వాతి స్థానం.

3 ఈ టోర్నీలో రోహిత్ శర్మ అత్యధికంగా మూడు అర్ధ సెంచరీ (7 మ్యాచుల్లో)లు సాధించాడు.

134 ఉగాండాపై వెస్టిండీస్ గెలిచిన పరుగుల తేడా. పరుగుల పరంగా ఓ జట్టుకు భారీ విజయం ఇదే.

10 అమెరికాపై ఇంగ్లండ్ గెలిచిన వికెట్ల తేడా. వికెట్ల పరంగా ఇదే భారీ గెలుపు.

218/5 అఫ్ఘానిస్థాన్‌పై వెస్టిండీస్ చేసిన ఈ స్కోరు ఈ టోర్నీలో ఓ జట్టుకు అత్యధికం.

39 వెస్టిండీస్‌తో మ్యాచ్‌లో ఉగాండా చేసిన ఈ స్కోరు టోర్నీ చరిత్రలోనే అత్యల్పం.

డబ్బే డబ్బు

మొత్తం ప్రైజ్‌మనీ:	రూ. 93.78 కోట్లు
చాంపియన్‌కు:	రూ. 20.42 కోట్లు
రన్నరప్‌కు:	రూ. 10.67 కోట్లు
సెమీస్‌లో ఓడిన జట్టుకు:	రూ. 6.56 కోట్లు
సూపర్-8 పరాజితులకు:	రూ. 3.18 కోట్లు
9 నుంచి 12వ స్థానం జట్లకు:	రూ. 2.06 కోట్లు
13 నుంచి 20వ స్థానం జట్లకు:	రూ. 1.87 కోట్లు
ఒక్కో మ్యాచ్‌కు:	రూ. 25.97 లక్షలు

కప్పు దించేశారు..
మది ఉప్పొంగె!

ఓహ్ గాడ్.. ఎన్నాళ్లకెన్నాళ్లకు.. మొత్తానికి 17 ఏళ్ల సుదీర్ఘ ఎదురుచూపులకు తెర పడింది. టన్నుల కొద్దీ టాలెంట్ ఉన్నా అందకుండా ఊరిస్తోన్న టీ20 టైటిల్ టీమిండియా దరి చేరింది. అజేయ ఆటతీరుతో దూసుకెళ్లిన రోహిత్ సేన అంతిమ సమరంలోనూ అదే సత్తా చూపింది. విరాట్ కోహ్లీ తన కెరీర్ చివరి టీ20లో ఫామ్‌ను చాటుకోగా.. బౌలర్లు ఒత్తిడికి లోనుకాకుండా తుదిపోరుకు చక్కటి ముగింపు నిచ్చారు. ఓ మాదిరి ఛేదనలో క్లాసెన్ గుబులు రేపినా.. చివరి 5 ఓవర్లలో 30 పరుగులే ప్రత్యర్థికి కావాల్సి వచ్చినా భారత్ బెదరలేదు. స్టార్ పేసర్ బుమ్రా పరుగులను కట్టడి చేయగా.. ఐపీఎల్‌లో తీవ్ర విమర్శలకు గురైన హార్దిక్ నేటి ఫైనల్లో హీరోగా నిలిచాడు. క్లాసెన్ వికెట్‌తో పాటు చివరి ఓవర్‌లోనూ రెండు వికెట్లతో ప్రభావం చూపాడు. దీంతో గెలవాల్సిన చోట సఫారీలు తడబడగా.. ఒత్తిడికి లోనుకాని భారత్ విశ్వవిజేతగా త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించింది.



● ఉత్కంఠ ఫైనల్లో దక్షిణాఫ్రికాపై విజయం ● విరాట్ అర్ధసెంచరీ
● అదరగొట్టిన హార్దిక్, బుమ్రా ● మలుపు తిప్పిన సూర్య క్యాచ్

అపజయమన్నదే ఎరుగని ప్రస్థానం..
రోహిత్ సేన అందించిన చరిత్రాత్మక విజయం..
హృదయం పులకించిన మధుర క్షణం..


హార్దిక్ భావోద్వేగం

బ్రిడ్జ్‌టౌన్: ఉత్కంఠభరితంగా ముగిసిన టీ20 వరల్డ్‌కప్ ఫైనల్లో భారత్ చాంపియన్‌గా నిలిచింది. శనివారం దక్షిణాఫ్రికాతో జరిగిన ఫైనల్లో రోహిత్ సేన 7 పరుగుల తేడాతో గెలిచింది. దీంతో 2007 తర్వాత మరోసారి ఈ మెగా టోర్నీని కైవసం చేసుకున్నట్టయ్యింది. అలాగే 2011 తర్వాత ఏ ఫార్మాట్‌లోనైనా జట్టుకిదే తొలి వరల్డ్‌కప్. అటు మొదటిసారి ఐసీసీ టోర్నీలో ఫైనల్‌కు చేరిన దక్షిణాఫ్రికా విజయం అంచులవరకు వచ్చినా చివర్లో మ్యాచ్‌ను చేజార్చుకుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 176 పరుగులు చేసింది. విరాట్ కోహ్లీ (59 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సర్లతో 76), అక్షర్ పటేల్ (31 బంతుల్లో 1 ఫోర్, 4 సిక్సర్లతో 47), శివమ్ దూబే (16 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్‌తో 27) రాణించారు. కేశవ్, నోకియాలకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 8 వికెట్లకు 169 పరుగులు చేసి ఓడింది. క్లాసెన్ (27 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్సర్లతో 52), స్టబ్స్ (31), డికాక్ (39), మిల్లర్ (21) రాణించారు. హార్దిక్‌కు మూడు.. బుమ్రా, అర్ష్‌దీప్‌లకు రెండేసి దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా విరాట్, ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌గా బుమ్రా నిలిచారు.

చివర్లో పేసర్ల కట్టడి: ఓ మాదిరి ఛేదనలో సఫారీలు క్లాసెన్, స్టబ్స్ ధాటికి విజయం వైపు సాగినా.. డెత్ ఓవర్లలో బుమ్రా, హార్దిక్ ధాటికి పూర్తిగా తేలిపోయారు. రెండో ఓవర్‌లో బుమ్రా కళ్లు చెదిరే బంతితో ఓపెనర్ హెన్‌డ్రిక్స్ (4)ను బౌల్డ్ చేయగా.. ఆ వెంటనే కెప్టెన్ మార్‌క్రమ్ (4)ను అర్ష్‌దీప్ వెనక్కి పంపాడు. 12 రన్స్‌కే రెండు వికెట్లు కోల్పోయిన దశలో ఓపెనర్ డికాక్‌కు స్టబ్స్ జత కలిశాడు. మరో ఆరు ఓవర్ల పాటు ఈ జోడీ భారత బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొంది. కనీసం ఓ బౌండరీ ఉండేలా చూసిన వీరు స్కోరును సైతం పది పరుగుల రన్‌రేట్‌తో పరిగెత్తించారు. అయితే తొమ్మిదో ఓవర్‌లో స్వీప్ షాట్ కోసం వెళ్లి స్టబ్స్ బౌల్డయ్యాడు. అక్షర్ ఈ వికెట్ తీయడంతో మూడో వికెట్‌కు 58 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కాసేపటికే డికాక్‌ను అర్ష్‌దీప్ అవుట్ చేయడంతో మ్యాచ్ ఇరువైపులా మొగ్గు చూపింది. కానీ క్రీజులో హిట్టర్లు క్లాసెన్, మిల్లర్ ఉండడంతో పరుగుల వేటలో ఇబ్బంది పడలేదు. స్పిన్నర్లు అక్షర్, కుల్దీప్‌ను లక్ష్యంగా చేసుకున్నారు. 14వ ఓవర్‌లో మిల్లర్ 4,6తో 14 రన్స్ రాబట్టగా.. 15వ ఓవర్‌లో క్లాసెన్ ఏకంగా 4,6,6,4తో 24 పరుగులు సమకూర్చడంతో సమీకరణం 30 బంతుల్లో 30 రన్స్‌కు మారింది. ఒక్కసారిగా మ్యాచ్ సఫారీల వైపు మొగ్గినట్టు కనిపించడంతో భారత్‌లో ఆందోళన నెలకొంది. అయితే చివరి నాలుగు ఓవర్లలో భారత బౌలర్లు చెలరేగారు. 16వ ఓవర్‌లో బుమ్రా 4 పరుగులే ఇవ్వగా.. 17వ ఓవర్‌లోనూ పాండ్యా నాలుగు పరుగులే ఇచ్చి ప్రమాదకర క్లాసెన్ వికెట్ తీయడంతో భారత్ శిబిరంలో సంబరాలు నెలకొన్నాయి. ఐదో వికెట్‌కు ఈ జోడీ 22 బంతుల్లోనే 45 పరుగులు జత చేసింది. ఓ సూపర్ ఇన్‌స్వింగర్‌కు జాన్సెన్ (2) వికెట్ తీసిన బుమ్రా 18వ ఓవర్‌లో 2 పరుగులే ఇచ్చాడు. ఈ దశలో 12 బంతుల్లో 20 రన్స్ కావాల్సి రావడంతో సఫారీలు ఒత్తిడిలో పడ్డారు. మిల్లర్ క్రీజులో ఉన్నా షాట్లు ఆడలేకపోయాడు. ఇక ఆఖరి ఓవర్‌లో 16 పరుగులు అవసరమయ్యాయి. హార్దిక్ వేసిన వైడ్ ఫుల్ టాస్‌ను మిల్లర్ భారీ సిక్సర్‌గా మలిచే ప్రయత్నంలో సూర్య సూపర్ క్యాచ్‌తో వెనుదిరిగాడు. రబాడ (4) ఓ ఫోర్ సాధించినా ఐదో బంతికీ తను అవుటయ్యాడు. దీంతో భారత్ సంబరాలు ఆకాశాన్నంటాయి.

విరాట్-అక్షర్ నిలబెట్టారు..: బంతి నేరుగా బ్యాట్‌పైకి వస్తుందన్న అంచనాతో టాస్ గెలిచిన భారత్ బ్యాటింగ్ ఎంచుకుంది. కానీ ఆరంభంలో బౌలర్లకు పట్టు లభించడంతో 34 పరుగులకే రోహిత్ (9), పంత్ (0), సూర్యకుమార్ (3)ల వికెట్లను కోల్పోయిన జట్టు షాక్‌కు గురైంది. కానీ పేలవ ఫామ్‌తో నిరాశపరుస్తున్న విరాట్ కోహ్లీ విలువైన ఇన్నింగ్స్‌తో అండగా నిలవగా.. హిట్టర్ పాత్రలో అక్షర్ సహకరించాడు. దీంతో సఫారీల ముందు జట్టు సవాల్ విసిరే స్కోరును ఉంచింది. రెండో ఓవర్‌లోనే స్పిన్నర్ కేశవ్ మహరాజ్.. రోహిత్, పంత్‌ల వికెట్లు తీశాడు. ఇక ఐదో ఓవర్‌లో సూర్యను రబాడ కట్టడి చేశాడు. వాస్తవానికి తొలి ఓవర్‌లోనే కోహ్లీ మూడు ఫోర్లతో 15 రన్స్ అందించి జోష్‌ను నింపినా.. ఆ తర్వాత వికెట్ల పతనంతో అతడితో పాటు అక్షర్ జాగ్రత్తగా ఆడాల్సి వచ్చింది. మధ్య ఓవర్లలో పేసర్లు జాన్సెన్, నోకియా రన్స్‌ను నియంత్రించారు. అయితే అడపాదడపా అక్షర్ సిక్సర్లతో స్కోరులో కాస్త కదలిక కనిపించింది. కానీ 14వ ఓవర్‌లో లేని పరుగు కోసం వెళ్లిన అక్షర్ దురదృష్టవశాత్తు రనౌటయ్యాడు. దీంతో నాలుగో వికెట్‌కు 72 పరుగుల కీలక భాగస్వామ్యం ముగిసింది. వచ్చీ రాగానే దూబే సిక్సర్‌తో ఆకట్టుకోగా.. అటు నెమ్మదిగా ఆడుతూ వచ్చిన విరాట్ 48 బంతుల్లో ఫిఫ్టీ పూర్తయ్యాక జోరు పెంచాడు. 18వ ఓవర్‌లో 6,4తో 16 రన్స్ రాగా.. తర్వాతి ఓవర్‌లో 4,2,6తో 12 రన్స్ అందించి జాన్సెన్‌కు చిక్కాడు. అప్పటికే దూబేతో కలిసి ఐదో వికెట్‌కు 33 బంతుల్లో 57 పరుగులు జత చేశాడు. అయితే చివరి ఓవర్‌లో దూబే, జడేజా (2) వికెట్లను తీసిన నోకియా 9 పరుగులే ఇవ్వడంతో భారత స్కోరు 180లోపే ముగిసింది.

టీ20 వరల్డ్‌కప్ ఫైనల్స్‌లో అత్యధిక స్కోరు (176) నమోదు చేసిన జట్టుగా భారత్.

1 ఒక్క మ్యాచ్ కోల్పోకుండా టీ20 వరల్డ్‌కప్‌ను అందుకున్న జట్టుగా భారత్

ఒకే వరల్డ్‌కప్‌లో ఎక్కువ రన్స్ (243) చేసిన సౌతాఫ్రికా బ్యాటర్‌గా డికాక్

2 వరల్డ్‌కప్ చరిత్రలో నెమ్మదైన హాఫ్ సెంచరీ (48 బంతుల్లో) సాధించిన రెండో భారత బ్యాటర్‌గా కోహ్లీ. సూర్య (49) ముందున్నాడు.



విజేతగా వీడ్కోలు

టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ అనూహ్య నిర్ణయం తీసుకున్నాడు. భారత జట్టు విశ్వవిజేతగా ఆవిర్భవించి దేశ క్రికెట్ ఫ్యాన్స్ అంతా ఆనందోత్సాహల్లో మునిగిన వేళ.. 35 ఏళ్ల విరాట్ ఊహించని నిర్ణయం తీసుకున్నాడు. అంతర్జాతీయ టీ20ల నుంచి తక్షణమే వైదొలుగుతున్నట్టు ప్రపంచకప్ ఫైనల్ ముగిసిన క్షణాన ప్రకటించాడు. 59 బంతుల్లో 76 పరుగులు చేసి టీమిండియా విజయంలో అత్యంత కీలక పాత్ర పోషించిన కోహ్లీ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్న సంగతి తెలిసిందే. 'నేను ఆశించింది ఈ వరల్డ్ కప్పే. అది అందుకున్నా. దాంతో ఇదే నా చివరి మ్యాచ్' అని అవార్డుల ప్రదాన కార్యక్రమానికి ముందు మాట్లాడుతూ విరాట్ వెల్లడించాడు. 'మనం పరుగులు సాధించలేమని భావించే రోజు ఒకటి వస్తుంది. భగవంతుడు గొప్పవాడు. రిటైర్మెంట్ ప్రకటించడానికి ఇంతకు మించిన తరుణం లేదు' అని కోహ్లీ అన్నాడు.

విరాట్ టీ20 కెరీర్ ఇలా..

మ్యాచ్‌లు	125
ఇన్నింగ్స్	117
పరుగులు	4188
అత్యధిక స్కోరు	122*
సెంచరీలు	1
అర్ధ సెంచరీలు	38
సగటు	48.69
స్ట్రయిక్ రేట్	137.04



ఆటగాడిగా, కెప్టెన్‌గా టీ20 ప్రపంచకప్ నెగ్గిన రోహిత్. 2007లో ధోనీ సారథ్యంలో చాంపియన్‌గా నిలిచిన భారత జట్టులో రోహిత్ సభ్యుడు.

స్కోరుబోర్డు

భారత్: రోహిత్ (సి) క్లాసెన్ (బి) మహరాజ్ 9, విరాట్ (సి) రబాడ (బి) జాన్సెన్ 76, పంత్ (సి) డికాక్ (బి) మహరాజ్ 0, సూర్యకుమార్ (సి) క్లాసెన్ (బి) రబాడ 3, అక్షర్ (రనౌట్) డికాక్ 47, దూబే (సి) మిల్లర్ (బి) నోకియా 27, హార్దిక్ (నాటౌట్) 5, జడేజా (సి) మహరాజ్ (బి) నోకియా 2, **ఎక్స్‌ట్రాలు: 7, మొత్తం: 20 ఓవర్లలో 176/7; వికెట్ల పతనం:** 1-23, 2-23, 3-34, 4-106, 5-163, 6-174, 7-176; **బౌలింగ్:** జాన్సెన్ 4-0-49-1, మహరాజ్ 3-0-23-2, రబాడ 4-0-36-1, మార్‌క్రమ్ 2-0-16-0, నోకియా 4-0-26-2, షంసి 3-0-26-0.

దక్షిణాఫ్రికా: హెన్‌డ్రిక్స్ (బి) బుమ్రా 4, డికాక్ (సి) కుల్దీప్ (బి) అర్ష్‌దీప్ 39, మార్‌క్రమ్ (సి) పంత్ (బి) అర్ష్‌దీప్ 4, స్టబ్స్ (బి) అక్షర్ 31, క్లాసెన్ (సి) పంత్ (బి) హార్దిక్ 52, మిల్లర్ (సి) సూర్య (బి) హార్దిక్ 21, జాన్సెన్ (బి) బుమ్రా 2, మహరాజ్ (నాటౌట్) 2, రబాడ (సి) సూర్య (బి) హార్దిక్ 4, నోకియా (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 9, మొత్తం: 20 ఓవర్లలో 169/8; వికెట్ల పతనం:** 1-7, 2-12, 3-70, 4-106, 5-151, 6-156, 7-161, 8-168; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-20-2, బుమ్రా 4-0-18-2, అక్షర్ 4-0-49-1, కుల్దీప్ 4-0-45-0, హార్దిక్ 3-0-20-3, జడేజా 1-0-12-0.


దక్షిణాఫ్రికా ఆటగాళ్ల నిర్వేదం



థాంక్యూ.. ద్రవిడ్

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

2007 వన్డే ప్రపంచకప్.. విండీస్‌లోనే జరిగిన ఈ మెగా టోర్నీని భారత్ క్రీడాభిమానులు పొరపాటున కూడా గుర్తుంచుకోవడానికి ఇష్టపడరు. గ్రూప్ 'బి' నుంచి శ్రీలంక, బంగ్లా జట్లు సూపర్-8కి వెళ్లగా.. బెర్ముడాతో కలిసి భారత్ ఇంటిముఖం పట్టింది. అప్పుడు కెప్టెన్ రాహుల్ ద్రవిడ్. ఆ దారుణ పరాభవంతో ఎన్నో విమర్శలు ఎదుర్కొన్న ద్రవిడ్ సారథ్యం కూడా కోల్పోయాడు. సుదీర్ఘ కాలం భారత్‌కు ఆడినా అతడి ఖాతాలో ఒక్క వరల్డ్‌కప్ కూడా లేకుండానే ముగిసిపోయింది. అయితే అప్పుడు కలగానే మిగిలిన కప్‌ను.. తన అపార అనుభవంతో జట్టు కోచ్‌గా ద్రవిడ్ సాధించి చూపాడు. అంతకుముందే అండర్-19 జట్టు సైతం తన ఆధ్వర్యంలోనే వన్డే వరల్డ్‌కప్ అందుకోవడం విశేషం.

దూకుడు నేర్పాడు..

రవిశాస్త్రి కోచ్‌గా ఉన్నప్పుడు 2021 టీ20 వరల్డ్‌కప్‌లో జట్టు గ్రూప్ దశలోనే నిష్క్రమించింది. అనంతరం ద్రవిడ్ కొత్త కోచ్‌గా బాధ్యతలు తీసుకున్నాడు. ఆ పరాభవానికి కారణాలను విశ్లేషించాక ఆటతీరులో మార్పు తెచ్చాడు. సంప్రదాయ ఆటతీరుకు స్వస్తి చెప్పి మూడు ఫార్మాట్లలోనూ దూకుడుగా వెళ్లాలనే నిర్ణయం తీసుకున్నాడు. ఆటగాళ్లను వెన్నంటి ప్రోత్సహిస్తూ వారి నుంచి సరైన ఆటతీరును రాబట్టాడు. వివాదాల జోలికి వెళ్లకుండా ప్రపంచ క్రికెట్‌లో జట్టు ఆధిపత్యానికి తనవంతు ప్రయత్నం చేశాడు. ఫలితంగా.. మూడు ఫార్మాట్లలోనూ జట్టు నెంబర్ వన్ స్థాయికి ఎదిగింది. అలాగే అద్భుత ఆటతీరుతో నాలుగు ఐసీసీ టోర్నీల్లో ఫైనల్స్‌కు చేరగలిగింది. అయితే మూడు సార్లూ తుదిమెట్టుపైనే బోల్తా పడింది. 2022 టీ20 వరల్డ్‌కప్ సెమీస్‌లో భారత జట్టు ఇంగ్లండ్ చేతిలో ఓడింది. 2023 వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో.. అదే ఏడాది వన్డే వరల్డ్‌కప్ ఫైనల్లోనూ ఆసీస్ చేతిలోనే పరాభవం పాలైంది. కానీ నాలుగోసారి ఫైనల్‌కు చేరిన క్రమంలో కోచ్‌గా ద్రవిడ్ అనుకున్నది సాధించాడు. అపజయమన్నది లేకుండా రోహిత్ నేతృత్వంలోని టీమిండియా టీ20 వరల్డ్‌కప్‌ను తమ శిక్షకుడి చేతికి అందించి సగర్వంగా సెండాఫ్ పలికేలా చేసింది. అంతకుముందు రవిశాస్త్రి శిక్షణలో భారత్ భారీ విజయాలు సాధించినా.. ఐసీసీ టైటిల్ మాత్రం అందని ద్రాక్షగానే మిగిలింది. 2019 వన్డే వరల్డ్‌కప్ సెమీస్, 2021 వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్, 2021 టీ20 ప్రపంచకప్ గ్రూప్ దశలో భారత్‌కు పరాజయాలు ఎదురయ్యాయి.

కోచ్‌గా ద్రవిడ్ ప్రస్థానం

- 24 టెస్టుల్లో 14 గెలిచి మూడింట్లో ఓడింది.
- 13 వన్డే ద్వైపాక్షిక సిరీస్‌ల్లో భారత్ పదింటిని గెలుచుకుంది. అలాగే రోహిత్-ద్రవిడ్ కాంబినేషన్‌లో ఆడిన 56 మ్యాచ్‌ల్లో 41 విజయాలున్నాయి.
- 77 టీ20 మ్యాచ్‌ల్లో 56 గెలిచింది.

భారత్ రికార్డు స్కోరు

● 603/6 డిక్లేర్ ● మహిళల టెస్ట్ క్రికెట్‌లోనే అత్యధిక స్కోరు
● సౌతాఫ్రికా 236/4 ● స్నేహ్ రాణాకు 3 వికెట్లు



1 మహిళల టెస్ట్ క్రికెట్‌లో 600 పరుగుల మార్క్ దాటిన తొలి జట్టుగా భారత్. ఈ ఏడాదే పెర్త్‌లో జరిగిన మ్యాచ్‌లో సౌతాఫ్రికాపై ఆస్ట్రేలియా సాధించిన 575/9 (డిక్లేర్) రికార్డును మన మ్మాయిలు బద్దలు కొట్టారు.

చెన్నై: బ్యాటర్ల ఆధిపత్యంతో.. మహిళల టెస్ట్ క్రికెట్ చరిత్రలోనే భారత్ అత్యధిక స్కోరు నమోదు చేసింది. క్రితం రోజు స్కోరు 525/4తో శనివారం తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన భారత్ 603/6 వద్ద డిక్లేర్ చేసింది. మొదటి రోజు స్కోరుకు 78 రన్స్ జోడించింది. ఓవర్‌నైట్ బ్యాటర్లు హర్మన్‌ప్రీత్ (69), రిచా ఘోష్ (86) ఐదో వికెట్‌కు 143 పరుగుల భాగస్వామ్యం నమోదు చేశారు. సుదీర్ఘ ఫార్మాట్‌లో తొలి అర్ధ శతకం సాధించిన హర్మన్‌ను టుమి అవుట్ చేసింది. ధాటిగా ఆడుతూ టీమ్ స్కోరును 600 మార్క్ దాటించిన ఘోష్‌ను మ్లాబా ఎల్బీ చేయడంతో.. భారత్ డిక్లేర్ చేసింది. అనంతరం తొలి ఇన్నింగ్స్ బరిలోకి దిగిన దక్షిణాఫ్రికా రెండోరోజు ఆట ముగిసేసరికి 236/4 స్కోరు చేసింది. స్నేహ్ రాణా (3/61) మూడు వికెట్లు తీసింది. మరిజానె కాప్ (69), నడిన్ డి క్లార్క్ (27) క్రీజులో ఉన్నారు. సునె లుస్ (65) అర్ధ సెంచరీ చేయగా, ఓపెనర్లు వొల్వార్ట్ 20, బాష్ 39 రన్స్ చేశారు. కానీ, భారత తొలి ఇన్నింగ్స్ స్కోరుకు సౌతాఫ్రికా 367 పరుగులు వెనుకంజలో ఉంది.

క్రిస్టీకి మాళవిక షాక్

ఫోర్ట్‌వర్త్ (అమెరికా): యూఎస్ ఓపెన్ సూపర్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో 2014 కామన్వెల్త్ గేమ్స్ రజత పతకధారి క్రిస్టీ గిల్మోర్ (స్కాట్లాండ్)కు భారత షట్లర్ మాళవిక బన్సోడ్ షాకిచ్చింది. శనివారం జరిగిన సింగిల్స్ క్వార్టర్స్‌లో 22 ఏళ్ల మాళవిక 10-21, 21-15, 21-10తో క్రిస్టీని ఓడించింది. సెమీస్‌లో ఆరో సీడ్ నట్సుకి నిదైరా (జపాన్)తో మాళవిక తలపడనుంది. పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో ప్రియాన్షు రజావత్ 21-15, 11-21, 18-21తో లీ లాన్ జి (చైనా) చేతిలో ఓడాడు. డబుల్స్‌లో రెండో సీడ్ గాయత్రి-ట్రీసా జాలీ జోడీ 17-21, 21-17, 19-21తో హిరోకామి-యున కాటో (జపాన్) జంట చేతిలో ఓటమిపాలైంది.

దిక్సూచి DIKSUCHI

అగ్రి డిప్లొమాలు

ఎన్‌జీ రంగా వర్సిటీ

గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ- డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగించింది. అగ్రికల్చర్, సీడ్ టెక్నాలజీ, ఆర్గానిక్ అగ్రికల్చర్ విభాగాల్లో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ వ్యవధి మూడేళ్లు. పదోతరగతి/తత్సమాన పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ప్రభుత్వ పాలిటెక్నిక్‌లతోపాటు అనుబంధ పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్స్ ఇస్తారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

డిప్లొమాలు-సీట్లు

- డిప్లొమా ఇన్ అగ్రికల్చర్-ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో 578 సీట్లు, అనుబంధ కళాశాలల్లో 1900 సీట్లు ఉన్నాయి.
- డిప్లొమా ఇన్ సీడ్ టెక్నాలజీ-ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో 25 సీట్లు, అనుబంధ కళాశాలల్లో 260 సీట్లు ఉన్నాయి.
- డిప్లొమా ఇన్ ఆర్గానిక్ అగ్రికల్చర్-ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో 25 సీట్లు, అనుబంధ కళాశాలల్లో 40 సీట్లు ఉన్నాయి.
- డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్-ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో 60 సీట్లు, అనుబంధ కళాశాలల్లో 330 సీట్లు ఉన్నాయి.
- కనీసం నాలుగేళ్లు గ్రామీణ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు 75 శాతం సీట్లు, పట్టణ ప్రాంతాల్లో చదివినవారి కోసం 25 శాతం సీట్లు ప్రత్యేకించారు. మొత్తం సీట్లలో 85 శాతం సీట్లను స్థానికులకు నిర్దేశించారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.

అర్హత వివరాలు: ఆంధ్రప్రదేశ్/తెలంగాణ స్టేట్ బోర్డు లేదా సీబీఎస్ఈ/ఐసీఎస్ఈ/ఎన్ఐఓఎస్/ఏపీఓఎస్ఎస్/టీఓఎస్ఎస్ నుంచి పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. పదోతరగతి కంపార్ట్‌మెంటల్ అభ్యర్థులు; ఇంటర్ ఫెయిల్/మధ్యలో ఆపేసినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్ ఉత్తీర్ణులు/ఆపై చదివినవారు దరఖాస్తుకు అనర్హులు. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 31 నాటికి 15 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 30
- **వెబ్‌సైట్:** angrau.ac.in



డా.వైఎస్సార్ హెచ్‌యూ

పశ్చిమగోదావరి జిల్లా-వెంకటరామన్నగూడెంలోని డా.వైఎస్సార్ హార్టికల్చరల్ యూనివర్సిటీ(డావైఎస్సార్‌హెచ్‌యూ)- డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగించింది. రాష్ట్రంలోని ప్రభుత్వ, అనుబంధ హార్టికల్చరల్ పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్స్ నిర్వహించనున్నారు. డిప్లొమా ఇన్ హార్టికల్చర్ ప్రోగ్రామ్‌లో 528 సీట్లు, డిప్లొమా ఇన్ హార్టికల్చరల్ ఫుడ్ ప్రాసెసింగ్ ప్రోగ్రామ్‌లో 22 సీట్లు చొప్పున మొత్తం 550 సీట్లు ఉన్నాయి. వీటిలో 75 శాతం సీట్లను గ్రామీణ విద్యార్థులకు, 25 శాతం సీట్లను పట్టణ ప్రాంతాల వారికి కేటాయించారు. మొత్తం సీట్లలో 85 శాతం సీట్లను స్థానికులకు ప్రత్యేకించారు. మిగిలిన 15 శాతం సీట్లకు దేశవ్యాప్తంగా అభ్యర్థులందరూ పోటీపడవచ్చు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్లు వర్తిస్తాయి. పదోతరగతి/తత్సమాన పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది.

డిప్లొమా ఇన్ హార్టికల్చర్ సీట్ల వివరాలు

ప్రభుత్వ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లు: డా.బీ.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా-రామచంద్రాపురంలోని ఎస్‌కేపీపీ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లో 60 సీట్లు, ఏలూరు జిల్లా-నూజివీడులోని హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లో 40 సీట్లు, అన్నమయ్య జిల్లా-కలికిరిలోని హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లో 40 సీట్లు, శ్రీ సత్యసాయి జిల్లా-మడకశిరలోని ఎస్ఎస్‌పీజీ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లో 60 సీట్లు చొప్పున మొత్తం 200 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు అదనంగా పది శాతం సీట్లు కేటాయించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో మొత్తం 220 సీట్లు ఉన్నాయి.

అనుబంధ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లు: శ్రీకాకుళం జిల్లా-ఎన్వీ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, మన్యం జిల్లా-ఎస్ఆర్ఆర్ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, ఏలూరు జిల్లా-నోవా కాలేజ్ ఆఫ్ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, పలనాడు జిల్లా-సాదినేని చౌదరయ్య హార్టికల్చరల్ పాలిటెక్నిక్, ప్రకాశం జిల్లా-శ్రీ బెల్లంకొండ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, వైఎస్సార్ కడప జిల్లా-ఎస్‌బీవీఆర్ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, నంద్యాల జిల్లా-ఎస్ఆర్ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లలో ఒక్కోదానిలో 40 చొప్పున మొత్తం 280 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు అదనంగా 28 సీట్లు కేటాయించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అనుబంధ పాలిటెక్నిక్ కళాశాలల్లో మొత్తం 308 సీట్లు ఉన్నాయి.

డిప్లొమా ఇన్ హార్టికల్చరల్ ఫుడ్ ప్రాసెసింగ్ సీట్ల వివరాలు: నంద్యాల జిల్లాలోని హార్టికల్చరల్ ఫుడ్ ప్రాసెసింగ్ పాలిటెక్నిక్ కళాశాలలో 20 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు అదనంగా 2 సీట్లు కేటాయించారు. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 22 సీట్లు ఉన్నాయి.

అర్హత: బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ నిర్వహించే పదోతరగతి పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. సీబీఎస్ఈ/ఎన్ఐఓఎస్/ఓఎస్ఎస్/ఐసీఎస్ఈ అభ్యర్థులు కూడా అర్హులే. పదోతరగతి కంపార్ట్‌మెంటల్ అభ్యర్థులు, ఇంటర్ మధ్యలో ఆపేసిన/ఫెయిల్ అయిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్ ఉత్తీర్ణులు, ఆపై చదివినవారు దరఖాస్తుకు అనర్హులు. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 31 నాటికి 15 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

- **దరఖాస్తు, కౌన్సెలింగ్ ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.800; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.400
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 6
- **వెబ్‌సైట్:** https://drysrhu.ap.gov.in

ఎఫ్‌సీఆర్ఐలో బీఎస్సీ ఆనర్స్ ఫారెస్ట్రీ

సిద్దిపేట జిల్లా ములుగులోని ఫారెస్ట్ కాలేజ్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌సీఆర్ఐ) హైదరాబాద్- బీఎస్సీ(ఆనర్స్) ఫారెస్ట్రీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగించింది. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. మొత్తం 55 రెగ్యులర్ సీట్లు ఉన్నాయి. టీజీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. మేథమెటిక్స్ స్ట్రీమ్ అభ్యర్థులకు 25 శాతం, బయాలజీ స్ట్రీమ్ అభ్యర్థులకు 75 శాతం సీట్లు ప్రత్యేకించారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ లేదా మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ లేదా మేథమెటిక్స్, బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. జనరల్ అభ్యర్థులకు 45 శాతం; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు ఉండాలి. టీజీ ఈఏపీసెట్ 2024 అర్హత పొంది ఉండాలి. అభ్యర్థుల వయసు డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు మూడేళ్లు; దివ్యాంగులకు అయిదేళ్ల సడలింపు వర్తిస్తుంది.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 1
- **వెబ్‌సైట్:** www.fcrihyd.in/

ఇఫ్లూలో ఇంగ్లీష్ ప్రొఫిషియెన్సీ కోర్సు

హైదరాబాద్‌లోని ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ(ఇఫ్లూ-సెంట్రల్ యూనివర్సిటీ)- ఇంగ్లీష్‌లో 160 గంటల ప్రొఫిషియెన్సీ కోర్సును నిర్వహిస్తోంది. అభ్యర్థులు ఆంగ్ల భాషలో ప్రావీణ్యం సాధించేందుకు ఈ ప్రోగ్రామ్ ఉపకరిస్తుంది. హైదరాబాద్ క్యాంపస్‌లో మొత్తం 200 సీట్లు ఉన్నాయి. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్‌డ్ పద్ధతిలో అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్ ఆగస్టులో ప్రారంభమౌతుంది.



కోర్సు వివరాలు

- ఇందులో బేసిక్, ఇంటర్మీడియట్, అడ్వాన్స్‌డ్ లెవెల్స్ ఉంటాయి. ప్లేస్‌మెంట్ టెస్ట్ ద్వారా లెవెల్ అడ్మిషన్ ఉంటుంది. కోర్సు వ్యవధి నాలుగు నెలలు. రోజుకు రెండు గంటలు చొప్పున వారానికి అయిదు రోజులు తరగతులు నిర్వహిస్తారు. తరగతికి 30 నుంచి 35 మంది అభ్యర్థులు ఉంటారు. ఉదయం, సాయంత్రం బ్యాచ్‌లు నిర్వహిస్తారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉం టుంది. కనీసం 80 శాతం అటెండెన్స్ తప్పనిసరి.
- కోర్సులో భాగంగా ఇంగ్లీష్ లాంగ్వేజ్‌కు సంబంధించి లిజెనింగ్, స్పీకింగ్, రీడింగ్, రైటింగ్, కమ్యూనికేషన్, గ్రామర్, ఒకాబులరీ అంశాల్లో శిక్షణ ఇస్తారు. వారానికి ఒకసారి ప్రొనౌన్సియేషన్ ప్రాక్టీస్ ఉంటుంది. రీసెర్చ్ స్కాలర్స్, టీచింగ్ అసిస్టెంట్లు క్లాస్‌రూం తరగతులు నిర్వహిస్తారు. వీటికి సంబంధించిన మెటీరియల్ ఫొటోకాపీ ఇస్తారు. డిజిటల్ ల్యాబ్స్ ఉంటాయి. అభ్యర్థుల నెలవారీ ప్రోగ్రెస్‌ను పరీక్షిస్తారు. కోర్సు చివరలో ఫైనల్ టెస్ట్ ఉంటుంది. ఇందులో ఉత్తీర్ణులైనవారికి మాత్రమే సర్టిఫికెట్‌లు ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైనవారు; సంస్థ నిర్వహించే 40 గంటల ఇంగ్లీష్ ప్రొఫిషియెన్సీ కోర్సు పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. విదేశీ విద్యార్థులు వీసా, రెసిడెన్స్ పర్మిట్ కాపీలు సబ్మిట్ చేయాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభం:** జూలై 1
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 28
- **వెబ్‌సైట్:** www.efluniversity.ac.in

ఉస్మానియ యూనివర్సిటీలో వర్క్‌షాప్

హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్(డీఈఈ)- వారం రోజుల వర్క్‌షాప్‌ను నిర్వహిస్తోంది. దీని ప్రధానాంశం 'అప్లికేషన్స్ ఆఫ్ డిజిటల్ కంట్రోల్ ఇన్ పవర్ ఎలక్ట్రానిక్ కన్వర్టర్స్'. ఈ వర్క్‌షాప్‌ను ఆర్‌యూఎస్ఏ-2.0, వీఐ మైక్రో సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు స్పాన్సర్ చేస్తున్నాయి. ఇందులో ఫండమెంటల్ అండ్ అడ్వాన్స్‌డ్ థియరిటికల్ కాన్సెప్ట్‌లు; మైక్రోకంట్రోలర్స్, డిజిటల్ సిగ్నల్ ప్రాసెసర్స్, ఫీల్డ్ ప్రోగ్రామబుల్ గేట్ యారేస్‌ల వినియోగం; ల్యాబొరేటరీ సెషన్స్ ఉంటాయి. సంబంధిత విభాగాలకు చెందిన రీసెర్చ్ స్కాలర్స్, ఇండస్ట్రీ పార్టిసిపెంట్స్, ఫ్యాకల్టీ మెంబర్లు, విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్‌డ్ పద్ధతిలో అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఎంపికైనవారికి ఈ-మెయిల్ ద్వారా సమాచారమిస్తారు.

రిజిస్ట్రేషన్ ఫీజు: రీసెర్చ్ స్కాలర్స్‌కు రూ.2,500; ఫ్యాకల్టీ మెంబర్లు, విద్యార్థులకు రూ.3,500; ఇండస్ట్రీ పార్టిసిపెంట్స్‌కు రూ.4,500

రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: జూన్ 30

వర్క్‌షాప్ వ్యవధి: జూలై 8 నుంచి 13

వెబ్‌సైట్: www.uceou.edu

హెచ్‌ఎల్‌ఎల్ లైఫ్‌కేర్‌లో ఖాళీలు

జాబ్ కార్నర్

సికింద్రాబాద్‌లోని హెచ్‌ఎల్‌ఎల్ లైఫ్‌కేర్ లిమిటెడ్...కాంట్రాక్ట్ ప్రాతిపదికన బీబీనగర్ ఎయిమ్స్(అమృత్ ఫార్మసీ ఔట్‌లెట్‌లు), తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ ఆస్పత్రుల్లో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తుంది.

ఫార్మసిస్ట్: బి.ఫార్మసీ/డి.ఫార్మసీ ఉత్తీర్ణతతో పాటు రెండేళ్ల పని అనుభవం ఉండాలి

అసిస్టెంట్ ఫార్మసిస్ట్: బి.ఫార్మసీ/డి.ఫార్మసీ ఉత్తీర్ణులై ఉండాలి.

ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా

ఇంటర్వ్యూ తేదీలు: జూలై 4

వెబ్‌సైట్: www.lifecarehll.com/

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/Tw94JRdలో చదవండి.

నవ్య చిత్రజ్యోతి

ఫహాద్‌పై సుమోటో కేసు


మలయాళ నటుడు, నిర్మాత ఫహాద్ ఫాజిల్‌పై కేరళ మానవ హక్కుల సంఘం సుమోటో కేసు నమోదు చేసింది. దీనిక్కారణం ఆయన నిర్మిస్తున్న 'పింకేలీ' సినిమా షూటింగ్. అంగమలైలోని ఎర్నాకులం ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం రాత్రంతా ఈ సినిమా కోసం షూటింగు చేయడంతో



అక్కడున్న రోగులంతా ఇబ్బంది పడ్డారు. ఆస్పత్రి లోపలికి ఎవరినీ అనుమతించకుండా అత్యవసర విభాగం అనుమతి తీసుకోకుండా షూటింగ్ చేశారనేది ఆరోపణ. దీనిపై ఎర్నాకులం జిల్లా వైద్యాధికారి బీనా కుమారి సీరియస్ అయ్యారు. ఏడు రోజుల్లో ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలని ఆదేశించారు. ఈ వ్యవహారాన్ని సుమోటోగా తీసుకున్న కేరళ మానవ హక్కుల సంఘం నిర్మాత ఫహాద్‌పై కేసు నమోదు చేసింది.


'హరిహర వీరమల్లు' వచ్చేది ఎప్పుడంటే

పవన్‌కల్యాణ్ నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'హరిహరవీరమల్లు' మీదే ఇప్పుడందరి దృష్టీ ఉంది. అగ్ర నిర్మాత ఏ.ఎం.రత్నం నిర్మిస్తున్న ఈ భారీ చిత్రం చాలా కాలంగా నిర్మాణంలో ఉంది. ఈ సినిమా విడుదల ఎప్పుడా అని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. హీరో పవన్‌కల్యాణ్ రాజకీయాలతో బిజీ కావడం వల్ల నిర్మాణంలో జాప్యం జరుగుతోంది. ఇటీవల ఆంధ్రప్రదేశ్ శాసన సభకు జరిగిన ఎన్నికల్లో పవన్‌కల్యాణ్ గెలిచి, ఉప ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించి, బిజీగా ఉండడంతో ఆయన అర్జెంటుగా తిరిగి సెట్‌లోకి అడుగు పెట్టడానికి మరింత ఆలస్యం అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఇటువంటి నేపథ్యంలో 'హరిహర వీరమల్లు' చిత్రం గురించి అప్‌డేట్ ఇచ్చారు నిర్మాత ఎ.ఎం.రత్నం. 'సినిమాలో పవన్‌కల్యాణ్ వర్క్ దాదాపు పూర్తయింది. మరో 20-25 రోజులు ఆయన కేటాయిస్తే షూటింగ్ మొత్తం పూర్తవుతుంది. ప్రస్తుతం పవన్‌కు ఉన్న బిజీ షెడ్యూల్ ను దృష్టిలో పెట్టుకుని షూటింగ్ ప్లాన్ చేస్తాం. మా సినిమా స్ట్రీమింగ్ రైట్స్ అమెజాన్‌కు ఇచ్చాం. వారితో చేసుకున్న ఒప్పందం ప్రకారం అక్టోబరులో సినిమాను విడుదల చేయాలి. అయితే ఇంకాస్త సమయం



కావాలని వాళ్లను అడుగుతాం. డిసెంబర్ నాటికి విడుదల చేయడానికి ప్రయత్నిస్తాం. ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని కలిగిస్తుంది' అని చెప్పారు. సినిమా ఆలస్యం అవుతున్న కారణంగా 'హరిహర వీరమల్లు' చిత్రానికి దర్శకత్వం వహిస్తున్న క్రిష్ తప్పుకోవడంతో జ్యోతికృష్ణ దర్శకత్వ బాధ్యతలు చేపట్టారు.

గతంతో ముడిపడిన కథ



విజయ్‌ఆంటోని నటిస్తున్న చిత్రం 'తుఫాన్'. విజయ్ మిల్టన్ దర్శకత్వంలో కమల్‌బోరా, డి.లలితా, బి.ప్రదీప్, పంకజ్ బోరా నిర్మిస్తున్నారు. శనివారం సినిమా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ఇందులో పోలీసుల నుంచి తప్పించుకు తిరుగుతున్న హీరో గతమేంటి అనే ఆలోచనను ప్రేక్షకుల్లో రేకెత్తించారు. ఇది హీరో గతంతో ముడిపడిన కథ అని ట్రైలర్ ద్వారా అర్థమవుతోంది. ఈ చిత్రానికి ఎడిటర్: ప్రవీణ్ కేఎల్, సంగీతం: అచ్చు రాజమణి, విజయ్ ఆంటోని.



ప్రముఖ నటి వరలక్ష్మీ శరత్‌కుమార్ త్వరలోనే ప్రియుడు నికోలయ్ సచ్‌దేవ్‌తో ఏడడుగులు వేయనున్నారు. ప్రస్తుతం ఆమె పెళ్లి పనుల్లో బిజీగా ఉన్నారు. సినీ, రాజకీయ ప్రముఖులను కలసి ఆహ్వాన పత్రికలు పంచుతున్నారు. శనివారం వరలక్ష్మి కుటుంబ సమేతంగా ప్రధాని మోదీని కలిశారు. తమ వివాహ కార్యక్రమానికి హాజరయ్యి ఆశీస్సులు అందించాలని కోరారు. ఈ సందర్భంగా దిగిన ఫొటోలను ఆమె సోషల్ మీడియాలో షేర్ చేసి, ప్రధానికి ధన్యవాదాలు తెలిపారు.

స్టార్‌డమ్ పేరుతో బందీ కాలేను


దక్షిణాదిన అగ్ర హీరోలందరి సరసన కథానాయికగా అలరించిన తమన్నా ఇప్పుడు ప్రత్యేక గీతాల్లోనూ ఆడి పాడుతున్నారు. అలాగే ఓటీటీలో వెబ్ సిరీస్‌లు చేస్తున్నారు. నెగెటివ్ పాత్రలకు సైతం సై అంటున్నారు. దీంతో హీరోయిన్‌గా స్టార్‌డమ్ తగ్గడంతోనే తమన్నా ఐటమ్ సాంగ్స్ చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే తమన్నా మాత్రం వాటిని కొట్టిపారేస్తున్నారు. ఎప్పుడూ ఒకే తరహా పాత్రలు చేయడం తన వల్ల కాదన్నారు. అందుకే కొత్త తరహా పాత్రలు ప్రయత్నిస్తున్నానని చెప్పారు. కరోనా తర్వాత ప్రేక్షకుల అభిరుచిలో వచ్చిన మార్పుకు అనుగుణంగా కథలు, పాత్రలు ఎంచుకుంటున్నానని తెలిపారు. "మేస్ట్రో' చిత్రంలో నెగెటివ్ రోల్ చేశాను. ఆ పాత్ర బాగా పండింది. ఆ తర్వాత అలాంటి అవకాశాలు మరిన్ని నన్ను వెతుక్కుంటూ వచ్చాయి. కానీ వాటికి నో చెప్పాను. ఇప్పుడు నటిగా నాలోనూ పరిణతి వచ్చింది. స్టార్‌డమ్ పేరుతో బందీగా ఉండలేను. హీరోకు జోడీగా నటించడం అనేది నాకున్న ఎంపికల్లో ఒకటి మాత్రమే అని గుర్తుంచుకోవాలి. వెబ్ సిరీస్‌లు చేసినా, ప్రత్యేక గీతాల్లో నర్తించినా ప్రేక్షకులకు ఇంకా ఏదో కొత్తదనం అందించాలనేదే నా ప్రయత్నం' అని తమన్నా అన్నారు.



తమన్నా



'కూర్మావతారం' ఆధారంగా...



వరలక్ష్మీ శరత్‌కుమార్, సాయికుమార్, శివాజీ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'కూర్మనాయకి'. హర్షవర్ధన్ కడియాల దర్శకత్వంలో కె.విజితా రావు నిర్మిస్తున్నారు. శనివారం శివాజీ పుట్టినరోజు సందర్భంగా చిత్ర బృందం ఓ స్పెషల్ వీడియోను రిలీజ్ చేసింది. మహావిష్ణు అవతారాల్లోని 'కూర్మావతారం' ఆధారంగా తెరకెక్కుతున్న ఈ చిత్రం త్వరలోనే విడుదలవుతుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి ఎడిటర్: చోటా.కె.ప్రసాద్, సినిమాటోగ్రఫీ: రామ్, సంగీతం: శేఖర్‌చంద్ర.



'జై బోలో తెలంగాణా, హితుడు' లాంటి పలు తెలుగు చిత్రాల్లో కథానాయికగా నటించిన మీరానందన్ మూడు ముళ్ల బంధంలోకి అడుగుపెట్టారు. యూకేకు చెందిన చార్టెడ్ అకౌంటెంట్ శ్రీజును ఆమె పెళ్లాడారు. శనివారం గురువాయుర్‌లో వీరి వివాహం ఘనంగా జరిగింది. ఆ ఫొటోలను మీరానందన్ సోషల్ మీడియాలో షేర్ చేశారు.

ఆశా పాదాలు కడిగిన సోనూ నిగమ్



బాలీవుడ్ చిత్రసీమలో దశాబ్దాలుగా ప్రేక్షకులను అలరిస్తున్న మధుర గాయని ఆశా భోంస్లే. ఆ గానమాధుర్యానికి ఎన్నో పురస్కారాలు వశమయ్యాయి. ఆమె సంగీత ప్రయాణం 'స్వరస్వామిని ఆశ' పేరుతో పుస్తకరూపంలోకి వచ్చింది. ఇటీవలే ముంబైలో జరిగిన ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆసక్తికర సంఘటన జరిగింది. ప్రముఖ గాయకుడు సోనూ నిగమ్ ఆశా పాదాలను కడిగారు. ఆమె పట్ల తనకున్న ప్రేమ, గౌరవాలను అలా చాటుకున్నారు. 'ఆశాజీ నుంచి చాలా నేర్చుకున్నాను. అందుకే ఆమెకు ఈ విధంగా కృతజ్ఞతలు తెలుపుతున్నాను' అని సోనూ నిగమ్ చెప్పారు.

నవ్య 'దృశ్యం' పేజీలో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/rRRLwqX లో చదవండి.

పిండానికి గండం

(మొదటిపేజీ తరువాయి)

కోల్పోయినట్టు వైద్యశాఖ తన నివేదికలో పేర్కొంది. మూడు మాసాల్లోపు గర్భ స్రావం 13,786 మందిలో (4 శాతం) జరిగినట్లు పేర్కొంది. అత్యధికంగా జయశంకర్ భూపాలపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 18 శాతం మంది గర్భిణులకు అబార్షన్ అయింది. జయశంకర్ జిల్లాలో గత ఐదు నెలల్లో 2,741 మంది గర్భిణులు రిజిస్ట్రేషన్ చేసుకోగా 505 మందికి, సిరిసిల్ల జిల్లాలో 3,983 మందిలో 708 మందికి గర్భస్రావమైంది. ఆ తర్వాత మంచిర్యాల, కరీంనగర్ జిల్లాల్లో 17 శాతం, వరంగల్, జగిత్యాల, మహబూబాబాద్, మెదక్, హన్మకొండ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో 16 శాతం మంది గర్భిణులకు అబార్షన్ అయినట్లు వైద్య శాఖ లెక్కలు చెబుతున్నాయి. అతి తక్కువగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో కేవలం రెండు శాతమే గర్భస్రావాలు అయ్యాయి. ఆ జిల్లాలో గడిచిన ఐదు నెలల్లో 29,022 మంది గర్భిణులు రిజిస్ట్రేషన్ చేసుకోగా 719 మందికి అబార్షన్ అయినట్లు వైద్య శాఖ నివేదిక పేర్కొంది. తర్వాత వికారాబాద్, హైదరాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో మొత్తం గర్భిణుల్లో ఏడు శాతం మందికే అటువంటి పరిస్థితి ఎదురైనట్లు ఆ నివేదిక వివరించింది. జోగులాంబ గద్వాల, నారాయణ్‌పేట జిల్లాల్లో 8 శాతం, రంగారెడ్డి, ఆదిలాబాద్, కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 9 శాతం, సిద్దిపేట, ఖమ్మం జిల్లాల్లో పది శాతం అబార్షన్లు నమోదయ్యాయి. మిగిలిన జిల్లాల్లో కూడా పది శాతానికి మించి గర్భస్రావాలు అయ్యాయి. వివిధ కారణాల వల్ల గర్భస్రావం జరగవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. క్రోమోజోమ్ అసాధారణతల వల్ల పిండం జన్యుపరమైన లోపాలు తలెత్తి అది మనగడ సాగించకపోవచ్చు. పిండం నిర్మాణం, ఎదుగుదలలో అసాధారణతలు మరో కారణం. బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్లు, గర్భాశయ సమస్యలు కూడా అబార్షన్‌కు దారితీస్తాయి. తల్లి రోగ నిరోధక వ్యవస్థ కూడా పిండాన్ని తిరస్కరించవచ్చని, హార్మోన్ల అసమతుల్యత పిండం అభివృద్ధికి ఆటంకం కల్గిస్తుందని గైనకాలజిస్టులు చెబుతున్నారు. వయసు 35 పైబడినా కూడా ఇటువంటి సమస్యలు తలెత్తుతాయంటున్నారు. థైరాయిడ్, రక్తపోటు, మధుమేహం, పీసీవోడీ, అధిక బరువు లాంటి సమస్యలు కూడా అబార్షన్లకు కారణమవుతాయని పేర్కొంటున్నారు.

పూటుగా తాగొచ్చిన ప్రధానోపాధ్యాయుడు

- కొత్తపల్లి పాఠశాల హెచ్‌ఎం నిర్వాకం
- వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన స్థానికులు

కొత్తగూడ (మహబూబాబాద్ జిల్లా), జూన్ 29: విద్యార్థులకు విద్యాబుద్ధులు చెబుతూ వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేయవల్సిన ఉపాధ్యాయులే గాడి తప్పుతున్నారు. పీకాల దాక తాగి స్కూళ్లకు వస్తున్నారు. తాజాగా మద్యం మత్తులో పాఠశాలకు వచ్చిన ప్రధానోపాధ్యాయుడిని స్థానికులు నిలదీసిన ఘటన మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలోని కొత్తపల్లిలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపల్లి గ్రామంలో గిరిజన ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంగా ఈక నారాయణ విధులు నిర్వర్తిస్తున్నారు. శనివారం ఆయన మద్యం తాగి పాఠశాలకు వచ్చారు. ఈ విషయాన్ని గుర్తించిన స్థానికులు నారాయణను నిలదీశారు. తాగి స్కూల్‌కు వచ్చి, విద్యార్థులకు పాఠాలు ఎలా చెబుతారని ప్రశ్నించారు. ఈ ఘటనను స్థానికులు.. వీడియో తీసి, సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో వైరల్ అయింది.

రూ.130 కోట్ల చేనేత వస్త్రం.. చీలికలు పీలికలై!

(మొదటిపేజీ తరువాయి)

హాస్పిటళ్లలో బెడ్‌షీట్లు, పిల్లో కవర్లు.. ప్రభుత్వ కార్యాలయాల్లో పరదాలు ఇతరత్రా అవసరాలకు ఉపయోగించేందుకు గత సర్కారు నేయించిన టన్నుల కొద్దీ ఉత్పత్తి చేయించిన వస్త్రం కొన్ని నెలలుగా గోదాముల్లోనే మూలుగుతోంది. నేసిన వస్త్రాన్ని నేసినట్లుగా టెస్కో, చేనేత ప్రాథమిక సహకార సంఘాల గోదాముల్లో ఎక్కడ పడితే అక్కడ పడేయడం.. అక్కడ సంరక్షణ చర్యలు సరిగా లేకపోవడంతో అత్యంత విలువైన వస్త్రం ఎలుకలు పందికొక్కులపాలవుతోంది. కొంత నిల్వనేమో ఎండకు ఎండి వానకు తడుస్తుండటంతో చిరిగిపోతోంది. ఈ వస్త్రానికి సంబంధించి సహకార సంఘాలకు గత సర్కారు గానీ, ప్రస్తుత సర్కారు గానీ పైసా చెల్లించలేదు. పైగా 360 సొసైటీలకు చెల్లించాల్సిన పాత బకాయిలు రూ. 220 కోట్ల మేర పేరుకుపోయాయి. ఫలితంగా మొత్తంగా రూ. 350 కోట్ల విలువైన బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. ఇవికాకుండా పవర్ లూమ్ ఉత్పత్తులకు సంబంధించిన బకాయిలు కూడా రూ. 112 కోట్లు ఇవ్వాల్సి ఉంది. కాగా వస్త్రం ఉత్పత్తి చేయటానికి పెట్టుబడి ఖర్చులకోసం చేనేత సహకార సంఘాలు గతంలోనే బ్యాంకుల్లో అప్పులు చేశాయి. ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవటంతో.. బ్యాంకుల్లో తీసుకున్న అప్పులకు వడ్డీలు పెరిగిపోయాయి. అప్పులు, వడ్డీలు చెల్లించాలని బ్యాంకర్లు చేనేత సహకార సంఘాలపై ఒత్తిడి చేస్తున్నారు.

జీతాలు చెల్లించడమూ భారమై..

టెస్కో ఆధ్వర్యంలో దశాబ్దాలుగా పాడుబడ్డ భవనాల్లో చేనేత వస్త్రాలయాలను నిర్వహిస్తున్నారు. హైదరాబాద్‌లోని నారాయణగూడ, అబిడ్స్‌తో పాటు నల్లగొండ, వరంగల్ ఒక్కోచోట మొత్తంగా ఉన్న నాలుగు వస్త్రాలయాలను ఆధునికీకరించలేదు. వినియోగదారులను ఆకర్షించేలా ఈ వస్త్రాలయాలను తీర్చిదిద్దాలనే డిమాండ్లు ఉన్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవటంలేదు. చేనత షోరూముల్లో పనిచేసే సిబ్బందికి వాస్తవానికి ప్రభుత్వమే వేతనాలు చెల్లించాలి. ఇందుకు బడ్జెట్‌లో రూ.40 కోట్లు కేటాయించారు. అయితే ప్రభుత్వం మంజూరు చేయడం లేదు. షోరూముల్లోని వస్త్రాల ధరలను 10-20 శాతం దాకా పెంచి.. వచ్చే ఆ అదనపు ఆదాయంతోనే సిబ్బందికి వేతనాలు చెల్లిస్తున్నారు. కార్యాలయాల ఖర్చులు, వాహనాలు, ఇతరత్రా ఖర్చులను కూడా 'ధరలు పెంచగా వచ్చిన మొత్తాన్నే' వాడుతున్నారు. ఈ ధరల పెంపు విక్రయాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. బయట మార్కెట్లోకన్నా చేనేత వస్త్రాలయాల్లో ఎక్కువ ధరలు ఉండటంతో వినియోగదారులు కొనేందుకు అంతగా ఇష్టపడటం లేదు. ఫలితంగా అమ్మకాలు తగ్గిపోయి.. నిల్వలు పేరుకపోతున్నాయి. ఈ ప్రభావం కార్మికులపైనా పడుతోంది. రాష్ట్రవ్యాప్తంగా 360 సొసైటీల్లో ఉన్న 17వేల మంది కార్మికులు ఉపాధిలేక, ఆర్థిక సమస్య లతో ఇబ్బందులు పడుతున్నారు. సాధారణంగా మాతృ సంస్థ అయిన టెస్కోకు, సహకార సంఘాలకు కలిపి ఐదేళ్లకోసారి ఎన్నికలు నిర్వహించాలనే నిబంధన ఉంది. కానీ.. 11 ఏళ్ల నుంచి ప్రాథమిక సహకార సంఘాలకు గానీ, టెస్కోకు గానీ ఎన్నికలు నిర్వహించలేదు. పాలకవర్గాలను ఏర్పాటుచేయలేదు. దీంతో సహకార సంఘాల వ్యవస్థ కుంటుపడింది.

కాళేశ్వరం కమిషన్ విచారణ గడువు పెంపు



హైదరాబాద్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై జరుగుతున్న విచారణ గడువును రాష్ట్ర ప్రభుత్వం మరో రెండు నెలలు పొడిగించింది. ఈ నెల 30వ తేదీతో గడువు ముగియనుండగా విచారణ ప్రక్రియలో పలు దశలు మిగిలి ఉండడాన్ని గుర్తించిన ప్రభుత్వం.. ఆగస్టు 31వ తేదీ దాకా పొడిగించాలని నిర్ణయించింది. ఈ మేరకు నీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా శనివారం జీవో నెం.14 జారీ చేశారు. మరోవైపు జూలై మొదటి వారంలో తదుపరి విచారణ ప్రక్రియను చేపట్టడానికి జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ హైదరాబాద్ రానున్నారు. ఈ దఫా అఫిడవిట్లన్నీ పరిశీలించి, వాటిలోని అంశాల ఆధారంగా నోటీసులు జారీచేసి, వారిని విచారణకు పిలవనున్నారు. మరోవైపు ప్రభుత్వం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పూర్తిస్థాయి నివేదికను కూడా తెప్పించుకోనుంది. జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ) పూర్తి నివేదిక కూడా జూలై 7వ తేదీకల్లా ప్రభుత్వానికి చేరే అవకాశాలు ఉన్నాయని సంకేతాలు వచ్చాయి. దాంతో ఈ దఫా విచారణ ప్రక్రియ అత్యంత కీలకం కానుంది.

వెలువడని 'విద్యుత్ విచారణ' పొడిగింపు జీవో

గత ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్‌తో విద్యుత్ ఒప్పందం, యాదాద్రి, భద్రాద్రి థర్మల్ ప్లాంట్ల నిర్మాణాలను నామినేషన్ పద్ధతిపై అప్పగించడంపై రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి కమిషన్‌తో విచారణ జరిపిస్తున్న విషయం విదితమే. ఈ కమిషన్ గడువు కూడా ఈ నెల 30వ తేదీతో ముగియనుంది. గడువును నెల రోజులు పొడిగించాలనే ప్రతిపాదన ప్రభుత్వానికి చేరినప్పటికీ జీవో మాత్రం వెలువడలేదు. మరోవైపు కమిషన్ విచారణను సవాల్ చేస్తూ మాజీ సీఎం కేసీఆర్ కోర్టులో కేసు వేసిన విషయం తెలిసిందే.

మీ విచారణలో నిష్పాక్షికత లేదు

- కేసీఆర్‌పై వ్యతిరేకతతో ఉన్నారు
- జస్టిస్ నర్సింహారెడ్డికి జగదీశ్‌రెడ్డి లేఖ

హైదరాబాద్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): "గత ప్రభుత్వంలో చేసుకున్న విద్యుత్తు ఒప్పందాలపై మీరు జరుపుతున్న విచారణలో నిష్పాక్షికత లేదు. అప్పటి సర్కారు, దాని అధినేత కేసీఆర్‌పై మీరు వ్యతిరేక భావనతో ఉన్నట్లుగా స్పష్టమవుతోంది" అని జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డికి మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి లేఖ రాశారు. విచారణలో భాగంగా ఆయనకు కమిషన్ నోటీసులు జారీ చేయగా, ఈ-మెయిల్ ద్వారా బదులిచ్చారు. బొగ్గు లభ్యత ఉన్నచోటే విద్యుత్తు ప్లాంట్ నిర్మించాలనేది అర్థం లేని వాదన అని, విదేశీ బొగ్గును విధిగా వాడాలనే నిబంధనను కేంద్రం అమలు చేస్తే.. నౌకాశ్రయాలకు నల్లగొండలోని దామరచర్లనే సమీపంగా ఉంటుందని పేర్కొన్నారు. ఏపీలోని పలు ప్రాజెక్టులను బీహెచ్‌ఈఎల్‌కు నామినేషన్ పద్ధతిలో ఇచ్చారని.. దాంతో పోల్చితే తెలంగాణ జెన్‌కో అతి తక్కువ ధరకే పని అప్పగించిందని జగదీశ్‌రెడ్డి తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌తో విద్యుత్ ఒప్పందం ఆ రాష్ట్ర సీఎం సమక్షంలో జరిగిందని, రెండు ప్రభుత్వాలు, రెండు ప్రభుత్వ రంగ సంస్థల మధ్య జరిగే ఒప్పందాల్లో ప్రజాధనం దుర్వినియోగానికి అవకాశాల్లేవని స్పష్టంచేశారు. ఛత్తీస్‌గఢ్‌తో యూనిట్ రూ.3.90కే ఒప్పందం చేసుకున్నామని, ఆ సమయంలో ఎన్‌టీపీసీ, ఇతర సంస్థల నుంచి యూనిట్‌కు రూ.5-17 దాకా తెలంగాణ చెల్లిస్తోందని పేర్కొన్నారు. పోటీ బిడ్డింగ్‌తో తమిళనాడు, కర్ణాటక యూనిట్‌కు రూ.4.94కు కొనేందుకు ఒప్పందాలు చేసుకున్నాయని గుర్తు చేశారు. "అతి తక్కువ సమయంలో ప్లాంట్ నిర్మాణానికి బీహెచ్‌ఈఎల్ ముందుకొచ్చింది. అందుకే 1,080మెగావాట్ల భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను అప్పగించాం. అప్పటికి ఎన్‌టీపీసీతో పాటు పలు ప్రభుత్వ రంగ సంస్థలు సబ్ క్రిటికల్ టెక్నాలజీతో తయారయ్యే విద్యుత్తును 90శాతం దాకా ఉత్పత్తి చేస్తున్నాయి. ఉత్తరాదిలో విద్యుత్ లభ్యత ఉండడంతో దాన్ని తరలించడానికే పవర్‌గ్రిడ్‌తో ఒప్పందం చేసుకున్నాం. కానీ, లైన్లు లేక ఇబ్బందులు వచ్చాయి. తెలంగాణ ఏర్పడే నాటికి 2,700మెగావాట్ల విద్యుత్తు లోటు ఉంది. 400మెగావాట్ల సీలేరు కేంద్రాన్ని ఏపీ లాక్కుంది. పవర్‌గ్రిడ్, ఛత్తీస్‌గఢ్‌తో విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలతో తెలంగాణకు మేలు చేకూరింది. ఛత్తీస్‌గఢ్‌తో ఒప్పందంలో ఆ రాష్ట్ర సీఎం, అధికారులు భాగస్వాములు. కేంద్రం కూడా భద్రాద్రి ప్లాంట్‌కు అనుమతులు ఇచ్చినందున ఈ వ్యవహారంలో కేంద్రమంత్రులు, అధికారులూ ఉన్నారు. అందరినీ విచారిస్తేనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి. కొద్దిమంది సమాచారం తీసుకుని పత్రికా సమావేశం నిర్వహిస్తే.. ఒక పక్షం వాదనతో మీరు ఏకీభవించినట్లుగా భావించాల్సి ఉంటుంది" అని జగదీశ్‌రెడ్డి తన లేఖలో ప్రస్తావించారు.

ఆదిలాబాద్ మాజీ ఎంపీ..
రమేశ్ రాథోడ్ హఠాన్మరణం

- గుండెపోటుతో తీవ్ర అస్వస్థత
- హైదరాబాద్ తీసుకెళుతుండగా మృతి
- సాధారణ కుటుంబం నుంచి ఎదిగిన నేత
- ఎంపీ, ఎమ్మెల్యే, జడ్పీ చైర్మన్‌గా సేవలు


రమేశ్ రాథోడ్(ఫైల్)

ఆదిలాబాద్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ మాజీ ఎంపీ, బీజేపీ నేత రమేశ్ రాథోడ్(59) శనివారం మధ్యాహ్నం కన్నుమూశారు. శుక్రవారం అర్ధరాత్రి తీవ్ర అస్వస్థతకు గురైన ఆయనను కుటుంబ సభ్యులు ఆదిలాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలోనే తుదిశ్వాస విడిచినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో రమేశ్ భౌతిక కాయాన్ని ఉట్నూర్‌లోని ఆయన నివాసానికి తరలించారు. ఆదివారం 10.30 గంటలకు అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రమేశ్ రాథోడ్ సాధారణ కుటుంబం నుంచి అంచలంచెలుగా రాజకీయాల్లో ఎదిగారు. 1999లో తొలిసారి టీడీపీ తరఫున ఖానాపూర్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2006 నుంచి 2009 మధ్య కాలంలో ఆదిలాబాద్ జిల్లా పరిషత్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. 2009లో టీడీపీ నుంచి ఆదిలాబాద్ ఎంపీగా విజయం సాధించారు. ఆ సమయంలోనే ఆయన భార్య సుమన్ రాథోడ్ ఖానాపూర్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. తెలంగాణ ఉద్యమం తర్వాత టీడీపీని విడిచి టీఆర్ఎస్‌లో చేరిపోయారు. ఆ తర్వాత 2019 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌లో చేరి ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. 2021లో బీజేపీ అగ్రనేత ఈటల రాజేందర్‌తో కలిసి కమలం గూటికి చేరి 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఖానాపూర్ నియోజక వర్గంలో బీజేపీ తరఫున పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ వెంటనే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు తీవ్ర ప్రయత్నాలు చేసినా.. బీజేపీ నుంచి టికెట్ దక్కలేదు. రమేశ్ రాథోడ్ మృతిపట్ల సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీ లక్ష్మణ్, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రులు జోగురామన్న, ఇంద్రకరణ్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాజకీయ నేతలు, ప్రముఖులు సంతాపం తెలిపారు.

స్విమ్మింగ్‌పూల్‌లో మునిగి...
అమెరికాలో ఖమ్మం జిల్లా విద్యార్థి మృతి


కిరణ్ (ఫైల్)

కల్లూరు, జూన్ 29: ఉన్నత విద్యనభ్యసించేందుకు తన వారందరినీ వదిలి అమెరికా వెళ్లిన ఖమ్మం జిల్లా యువకుడు ప్రమాదవశాత్తు స్విమ్మింగ్‌పూల్‌లో మునిగి మృతి చెందాడు. ఖమ్మం జిల్లా కల్లూరు మండలం చిన్నకోరుకొండి గ్రామానికి చెందిన శ్రీనాధరాజు కిరణ్ (20) హైదరాబాద్‌లో గత ఏడాది ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. ఎంఎస్ చదివేందుకు తన తాత ప్రోత్సాహంతో అమెరికా వెళ్లాడు. అక్కడ మిస్సోరి రాష్ట్రంలోని శ్యాంటలిస్ నగరంలో ఉంటున్న కిరణ్ శుక్రవారం రాత్రి తన స్నేహితులతో కలిసి స్విమ్మింగ్‌పూల్‌లో ఈతకొట్టేందుకు వెళ్లాడు. ఈత రాని కిరణ్ ప్రమాదవశాత్తు స్విమ్మింగ్‌పూల్‌లో 8 అడుగుల లోతులోకి జారిపడ్డాడు. తోటి స్నేహితులకు కూడా పెద్దగా ఈత రాకపోవటంతో కిరణ్‌ను రక్షించలేకపోయారు. నీట మునిగిన కిరణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయాన్ని కిరణ్ స్నేహితులు అతడి బంధువులకు సమాచారం అందించారు. కిరణ్ తండ్రి చిన్నతనంలోనే మృతి చెందగా అతడి తాత మనవడి కోరికను కాదనలేక ఒక ఎకరం పొలం అమ్మిమరీ ఎంఎస్ చదివేందుకు అమెరికా పంపాడు. ఎంఎస్ చదివి వస్తాడని ఆశించిన ఆ కుటుంబంలో కిరణ్ మరణ వార్త తీవ్ర విషాదాన్ని నింపింది. కిరణ్ మృతదేహాన్ని స్వదేశానికి తీసుకొచ్చేందుకు అతడి స్నేహితులు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది.





డీఎస్ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల తదితరులు

డీఎస్ కన్నుమూత



(మొదటిపేజీ తరువాయి)

గతంలో నిజామాబాద్ మేయర్‌గా పనిచేశారు. చిన్న కుమారుడు అర్వింద్, బీజేపీ పార్టీ తరఫున రాజకీయాల్లో ఉన్నారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో నిజామాబాద్ నుంచి మరోసారి ఎంపీగా గెలుపొందారు. డీఎస్ తన 45 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎక్కువ కాలం కాంగ్రెస్‌లో క్రియాశీలకంగా వ్యవహరించారు. ప్రత్యేకించి మలి విడత తెలంగాణ ఉద్యమం రోజుల్లో ప్రజల్లో ఉన్న ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను పార్టీ అధిష్ఠానం వద్ద గట్టిగా వినిపించారు. 'ట్రబుల్ షూటర్'గా పేరున్న డీఎస్, ఉమ్మడి రాష్ట్రంలో 2004, 2009లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డితో కలిసి విశేషంగా కృషిచేశారు. సోనియా గాంధీకి విధేయుడిగా కొనసాగిన ఆయన 2004లో టీఆర్ఎస్‌తో కాంగ్రెస్ పొత్తు కుదుర్చుకోవడంలో కీలకపాత్ర పోషించారు. నిజామాబాద్ జిల్లాలోని వేల్పూర్‌లో 1948 సెప్టెంబరు 27న డీఎస్ జన్మించారు. హైదరాబాద్ నిజాం కాలేజీలో డిగ్రీ పూర్తిచేశారు. కొంత కాలం రిజర్వ్ బ్యాంకులో పనిచేశారు. అప్పట్లో నిజామాబాద్ జిల్లాలోని కాంగ్రెస్ సీనియర్ నేత మాజీ మంత్రి అర్గుల్ రాజారాం శిష్యుడిగా 1981లో డీఎస్ రాజకీయాల్లోకి ప్రవేశించారు. నిజామాబాద్ అర్బన్ స్థానం నుంచి 1989, 1999, 2004లో ఎమ్మెల్యేగా గెలిచారు. మర్రి చెన్నారెడ్డి, నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి, వైఎస్ క్యాబినెట్‌లో మంత్రిగా పనిచేశారు. 2011లో ఎమ్మెల్సీగా ఎంపికయ్యారు. 2013-15 మధ్య మండలిలో విపక్ష నేతగా కొనసాగారు. 2015 జూలై 2న ఆయన టీఆర్ఎస్‌లో చేరారు. అప్పటి సీఎం కేసీఆర్ ఆయన్ను ప్రభుత్వ సలహాదారుగా నియమించారు. టీఆర్ఎస్ తరఫున 2016 నుంచి 2022 వరకు రాజ్యసభ సభ్యుడిగా పనిచేశారు. నిరుడు ఆయన బీఆర్ఎస్‌ను వీడి మళ్లీ కాంగ్రెస్‌లో చేరారు. తీవ్ర అనారోగ్య కారణాలతో పూర్తిగా ఇంటికే పరిమితమయ్యారు.

నిజామాబాద్ అభివృద్ధిలో కీలకపాత్ర

నిజామాబాద్ అభివృద్ధికి డీఎస్ కృషిచేశారు. నిజామాబాద్ ఎమ్మెల్యేగా పనిచేసిన కాలంలోనే కార్పొరేషన్ల ఏర్పాటుకు, నిజామాబాద్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తిచేయించారు. ఉద్యమ రోజుల్లో జిల్లాలో తెలంగాణ విశ్వవిద్యాలయం ఏర్పాటులో కీలకపాత్ర వహించారు. నిజామాబాద్‌లో రాజారాం స్టేడియం ఏర్పాటు చేయించడంతోపాటు వేలాది మందికి ఇళ్ల పట్టాలిచ్చారు. నగరం పరిధిలో ఆయన పేరు మీద ధర్మపురి హిల్స్‌కాలనీ ఏర్పాటైంది.

పార్టీకి విశేష సేవలందించారు: రేవంత్

డీఎస్ మృతిపట్ల గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ దిగ్భ్రాంతిని, సంతాపాన్ని వ్యక్తం చేశారు. తెలంగాణ ఏర్పాటు కోసం డీఎస్ అవిశ్రాంతంగా పోరాడారని, ఆయన మరణం రాష్ట్రానికి తీరని లోటు అని పేర్కొన్నారు. డీఎస్ మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రగాఢ సంతాపం ప్రకటించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఉమ్మడి రాష్ట్రంలో పీసీసీ చీఫ్‌గా పనిచేసిన ఆయన, కాంగ్రెస్ పార్టీకి విశేష సేవలు అందించారని, తెలంగాణ ఉద్యమ సమయంలో పార్టీలో తన ప్రత్యేక ముద్రను చాటుకున్నారని కొనియాడారు. డీఎస్ అంత్యక్రియలు ఆదివారం నిజామాబాద్‌లోని బైపాస్‌రోడ్డు పక్కన వ్యవసాయ క్షేత్రంలో జరగనున్నాయి. డీఎస్ పార్థివ దేహాన్ని శనివారం హైదరాబాద్ నుంచి నిజామాబాద్ ప్రగతినగర్‌లోని ఆయన ఇంటికి తరలించారు. అంత్యక్రియలను అధికార లాంఛనాలతో నిర్వహించాలని అధికారులను సీఎం రేవంత్ ఆదేశించారు. ఆ మేరకు తగిన ఏర్పాట్లు చేయాలని సీఎస్ శాంతికుమారికి సూచించారు. డీఎస్ అంత్యక్రియలకు రేవంత్ హాజరుకానున్నారు. డీఎస్ మృతిపట్ల ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన హుందాతనంతో కూడిన రాజకీయాలు చేశారని.. మంత్రి, ఎంపీగా తనదైన ముద్ర వేశారని పేర్కొన్నారు. బంజారాహిల్స్‌లోని డీఎస్ ఇంట్లో ఆయన పార్థివదేహం వద్ద కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొన్నం, కోమటిరెడ్డి, జూపల్లి, ఎంపీలు బలరాం నాయక్, ఈటల, విశ్వేశ్వర్ రెడ్డి, డీకే అరుణ, రఘునందన్ రావు, మాజీ ఎంపీలు వీహెచ్, కేకే, మాజీ స్పీకర్ పోచారం, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, తలసాని, జగదీశ్ రెడ్డి, షబ్బీర్ అలీ, ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, ప్రొఫెసర్ కోదండరాం నివాళులర్పించారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మధుయాష్కీ, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, నిజామాబాద్ మాజీ ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా నివాళులర్పించారు. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, నేతలు మల్లు రవి, రేణుకాచౌదరీ, మధుయాష్కీ, జితేందర్‌రెడ్డి సంతాపం ప్రకటించారు. తెలంగాణ ఓ మంచి నాయకుడిని కోల్పోయిందని వెంకయ్యనాయుడు అన్నారు. పార్టీలు వేరైనా అసెంబ్లీలో ఎలా వ్యవహరించాలో డీఎస్ చెప్పేవారని కిషన్‌రెడ్డి గుర్తుచేసుకున్నారు. రాజకీయాల్లో డీఎస్ అజాతశత్రువులా మెలిగారని కేటీఆర్ అన్నారు. తమ కుటుంబానికి డీఎస్ సన్నిహితులని వైఎస్ షర్మిల పేర్కొన్నారు.


డీఎస్ భౌతికకాయంపై కాంగ్రెస్ జెండాను కప్పుతున్న భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు

శీనన్న ఇక లేడు: అర్వింద్

తన తండ్రి మృతిపై ఎంపీ ధర్మపురి అర్వింద్ తీవ్ర ఆవేదనతో సోషల్ మీడియాలో భావోద్వేగంతో కూడిన పోస్టు పెట్టారు. తండ్రితో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. 'అన్న అంటే నేనున్నానని ఏ ఆపదలోనైనా ఆదుకునే శీనన్న ఇకలేడు. ఐ విల్ మిస్‌యూ డాడ్' అని పోస్టులో పేర్కొన్నారు. ఆయన తనకు తండ్రి, గురువుతోపాటు రాజకీయాల్లో అన్ని నేర్పారని చెప్పారు. ప్రజల కోసం ఎలా పనిచేయాలో ఆయనను చూసి నేర్చుకున్నానని, ఆయన ఎప్పుడు తనవెంటే ఉంటాడని ఆ పోస్టులో పేర్కొన్నారు. ఢిల్లీలో ఉన్న ఆయన తండ్రి మృతివార్త తెలియగానే హుటాహుటిన బయలుదేరి హైదరాబాద్‌కు చేరుకున్నారు.

డీఎస్ కోరికను తీర్చిన కాంగ్రెస్

డీఎస్ చివరి కోరికను తెలంగాణ కాంగ్రెస్ పార్టీ తీర్చింది. తనకు రాజకీయ జీవితాన్ని, అత్యున్నత పదవులను ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని, భూమి మీద నుంచి తాను వెళ్లేటప్పుడు కాంగ్రెస్ పార్టీకి చెందిన వాడిగానే వెళ్లాలన్నది తన కోరికని సన్నిహితుల వద్ద డీఎస్ చెప్పేవారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్లిన ఆయన.. తిరిగి సొంత గూటికి చేరాలని 2018 ఎన్నికల సమయం నుంచీ ప్రయత్నించారు. టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి నియామకం తర్వాత.. ఆయనను కాంగ్రెస్‌లోకి తీసుకువచ్చే ప్రయత్నాలూ జరిగాయి. ఈ క్రమంలోనే ఆయన మళ్లీ కాంగ్రెస్‌కు దగ్గరయ్యారు. శనివారం డీఎస్ ఇంటికి వెళ్లి ఆయన పార్థివదేహంపై మంత్రులు భట్టి, శ్రీధర్‌బాబు, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ కాంగ్రెస్ జెండాను కప్పారు. ఆయన మరణానికి సంతాప సూచకంగా గాంధీభవన్‌లో పార్టీ పతాకాన్ని అవనతం చేశారు. ఫలితంగా డీఎస్ చివరి కోరికను కాంగ్రెస్ తీర్చినట్లయింది.

బిజినెస్

ఫ్రెంచ్ కంపెనీతో
ధ్రువ స్పేస్ జట్టు

- వచ్చే ఏడాది నుంచి ఐఓటీ సేవలు

హైదరాబాద్: ఫ్రాన్స్‌కు చెందిన శాటిలైట్ ఆపరేటర్, గ్లోబల్ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) కనెక్టివిటీ ప్రొవైడర్ కినీస్‌తో హైదరాబాద్ స్టార్టప్ ధ్రువ స్పేస్ జట్టు కట్టింది. ఈ భాగస్వామ్యంలో వచ్చే ఏడాది నుంచి భారత్‌లో కినీస్ ఐఓటీ కనెక్టివిటీ సేవలందించడంతోపాటు ధ్రువ స్పేస్ పీ-30 శాటిలైట్‌పై కినీస్ ఐఓటీ పేలోడ్‌ను లాంచ్ చేయనున్నారు. అలాగే రెండు కంపెనీలు సంయుక్తంగా భారత అంతరిక్ష సామర్థ్యాన్ని పెంచేందుకు శాటిలైట్ మిషన్‌ను చేపట్టనున్నాయి. అంతేకాదు, భారత వినియోగదారులకు అందుబాటు ధరలో ఆధునిక, నమ్మకమైన ఐఓటీ సేవలందించడంతోపాటు కస్టమర్ల అవసరానికి అనుగుణంగా కొత్త అప్లికేషన్లు, సేవల అభివృద్ధికి ఈ భాగస్వామ్యం కృషి చేయనుంది.

దేశంలో అత్యంత విలువైన బ్రాండ్లలో ఎల్ఐసీకి 4వ స్థానం

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ జీవిత బీమా దిగ్గజం ఎల్ఐసీ దేశంలోని అత్యంత విలువైన బ్రాండ్లలో నాలుగో స్థానంలో నిలిచింది. ఈ ఏడాదికి గాను బ్రాండ్‌ఫైనాన్స్ విడుదల చేసిన రిపోర్టు ప్రకారం.. ఎల్ఐసీ బ్రాండ్ విలువ 980 కోట్ల డాలర్లుగా, బ్రాండ్ శక్తి సూచీలో సంస్థ స్కోర్ 88గా నమోదైంది. అంతేకాదు, ఎల్ఐసీకి బ్రాండ్ ఫైనాన్స్ ట్రిపుల్ ఏ బ్రాండ్ రేటింగ్‌ను కేటాయించింది. కాగా, అత్యంత శక్తిమంతమైన దేశీ బ్రాండ్లలో ఎల్ఐసీ మూడో స్థానంలో నిలిచింది.

ఎస్‌బీఐ కొత్త చైర్మన్‌గా
తెలుగు తేజం

- చల్లా శ్రీనివాసులు శెట్టి ఎంపిక
- సిఫారసు చేసిన ఎఫ్ఎస్ఐబీ
- ప్రభుత్వ ఆమోదమే తరువాయి



మహబూబ్‌నగర్(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ కొత్త చైర్మన్‌గా తెలుగు తేజం చల్లా శ్రీనివాసులు శెట్టి పేరు దాదాపుగా ఖరారైంది. ప్రస్తుతం ఎస్‌బీఐ ఎండీగా బాధ్యతలు నిర్వహిస్తున్న శెట్టి బ్యాంకు తదుపరి చైర్మన్ కానున్నారు. కేంద్ర కేబినెట్ ఆమోదిస్తే ఎస్‌బీఐ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తొలి తెలుగు వ్యక్తి అవుతారు. ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఆర్థిక సంస్థల సారథులను, డైరెక్టర్లను ఎంపిక చేసే ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇన్‌స్టిట్యూషన్స్ బ్యూరో (ఎఫ్ఎస్ఐబీ) శనివారం ఇంటర్వ్యూ చేసిన అనంతరం శ్రీనివాసులు శెట్టి పేరును సిఫారసు చేసింది. శెట్టి సహా మరో ఇద్దరు ఎస్‌బీఐ ఎండీలు అశ్విని కుమార్ తివారీ, వినయ్ ఎం టాన్సేలను కూడా ఎఫ్ఎస్ఐబీ ఇందుకోసం ఇంటర్వ్యూ చేసింది. అయితే ఎస్‌బీఐలో 36 సంవత్సరాల సుదీర్ఘ అనుభవం ఉన్న శెట్టి పేరును సిఫారసు చేసింది. ఎఫ్ఎస్ఐబీ ఎంపిక చేసిన పేరును ప్రధాని అధ్యక్షతన జరిగే నియామకాల కేంద్ర కేబినెట్ కమిటీ భేటీలో ఆమోదించాల్సి ఉంటుంది. ప్రభుత్వం ఆమోదిస్తే ప్రస్తుత చైర్మన్ దినేష్ ఖారా స్థానంలో శెట్టి ఆగస్టు 28న ఎస్‌బీఐ కొత్త చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తారు.

తెలంగాణ వాడే..

తెలంగాణలోని జోగులాంబ గద్వాల జిల్లా, మానవపాడు మండలంలోని పెద్ద పోతులపాడు శ్రీనివాసులు శెట్టి స్వగ్రామం. ఏడో తరగతి వరకు స్వగ్రామంలోనే ఆయన విద్యాభ్యాసం జరిగింది. ఎనిమిది నుంచి పదో తరగతి, ఇంటర్ గద్వాలలో పూర్తి చేశారు. రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి బీఎస్సీ, ఎమ్మెస్సీ పూర్తి చేశారు. చిన్న వయసులోనే తండ్రి కిరాణా షాపులో గ్రామస్థులు తీసుకున్న అప్పులు వసూలు చేసేవారు. ఈ అప్పుల వసూళ్ల అనుభవం ఎస్‌బీఐలో మొండి బకాయిల వసూళ్లలోనూ ఉపయోగపడిందని ఆయన చెబుతారు. 1988లో ఎస్‌బీఐలో ప్రొబేషనరీ ఆఫీసర్‌గా చేరిన శెట్టి.. గత మూడున్నర దశాబ్దాల్లో వివిధ హోదాల్లో పని చేశారు. కార్పొరేట్ క్రెడిట్, రిటైల్, డిజిటల్ బ్యాంకింగ్, రుణాల వసూళ్లు, ఇంటర్నేషనల్ బ్యాంకింగ్ రంగాల్లో ఆయనకు అపార అనుభవం ఉంది. శెట్టి ప్రస్తుతం ఎస్‌బీఐ ఎండీగా ఇంటర్నేషనల్ బ్యాంకింగ్, గ్లోబల్ మార్కెట్స్, టెక్నాలజీ విభాగాలను పర్యవేక్షిస్తున్నారు. ఎస్‌బీఐ ఎండీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఎస్‌బీఐ ఫౌండేషన్ ద్వారా స్వగ్రామం పెద్ద పోతులపాడు, దాని చుట్టుపక్కల గ్రామాల్లో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు. గ్రామంలోని పాఠశాల, అంగన్‌వాడీకి రూ.40 లక్షల విలువ చేసే సామాగ్రిని అందజేయగా.. అంతక్రితం ఊరూరా తిరిగి రోగులకు ఔషధాలు అందించే ఎస్‌బీఐ సంజీవని వాహనాన్ని డొనేట్ చేశారు. శ్రీనివాసులు శెట్టికి ఇద్దరు కుమారులు. ఒక కుమారుడు కెనడాలో, మరొకరు ముంబైలో స్థిరపడ్డారు.

హెచ్‌సీజీ గూటికి వైజాగ్‌లోని క్యాన్సర్ ఆసుపత్రి

- డీల్ విలువ రూ.414 కోట్లు

విశాఖపట్నం: దేశంలో అతిపెద్ద క్యాన్సర్ కేర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ నెట్‌వర్క్ హెల్త్‌కేర్ గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్(హెచ్‌సీజీ).. వైజాగ్‌కు చెందిన మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఎంజీసీహెచ్‌ఆర్‌ఐ)ను రూ.414 కోట్ల ఎంటర్‌ప్రైస్ విలువకు కొనుగోలు చేసింది. ఎంజీసీహెచ్‌ఆర్‌ఐలో హెచ్‌సీజీ తొలుత 51 శాతం వాటాను దక్కించుకోనుంది. ఆ తర్వాత 18 నెలల్లో మరో 34 శాతం వాటాను చేజిక్కించుకోనుంది. గత ఆర్థిక సంవత్సరంలో ఎంజీసీహెచ్‌ఆర్ రూ.120.2 కోట్ల ఆదాయంపై రూ.42.2 కోట్ల స్థూల లాభాన్ని గడించింది. ప్రముఖ అంకాలజీ సర్జన్ డాక్టర్ మురళీ కృష్ణ వూన్న 1986లో ఎంజీసీహెచ్‌ఆర్‌ఐని ప్రారంభించారు. 196 పడకల సామర్థ్యంతో కూడిన ఈ ఆసుపత్రి.. 2 లినాక్ మెషీన్స్, ఒక పెట్ సిటీ స్కానర్, ఒక రోబోటిక్ సర్జరీ సిస్టమ్, డెడికేటెడ్ బోన్ మారోవ్ ట్రాన్స్‌ప్లాంట్ యూనిట్ వంటి అత్యాధునిక మౌలిక వసతులను కలిగి ఉంది. కాగా, హెచ్‌సీజీ భారత్, ఆఫ్రికాలో కలిపి 21 ఆసుపత్రులను నిర్వహిస్తోంది.

సీబీడీటీ కొత్త చైర్మన్‌గా రవి అగర్వాల్

న్యూఢిల్లీ: ప్రత్యక్ష పన్నుల కేంద్ర బోర్డు (సీబీడీటీ) కొత్త చైర్మన్‌గా రవి అగర్వాల్ నియమితులయ్యారు. 1988వ సంవత్సరం బ్యాచ్‌కు చెందిన ఐఆర్ఎస్ అధికారి అయిన రవి అగర్వాల్ వచ్చే ఏడాది జూన్ వరకు ఈ పదవిలో కొనసాగనున్నారు. ఈ జూన్ 30తో సీబీడీటీ చైర్మన్‌గా పదవీ కాలం ముగుస్తున్న నితిన్ గుప్తా స్థానాన్ని అగర్వాల్ భర్తీ చేయనున్నారు. అగర్వాల్ ప్రస్తుతం సీబీడీటీలో అడ్మినిస్ట్రేషన్ విభాగ సభ్యుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

ఎఫ్ఐఐల పెట్టుబడులు రూ.26,565 కోట్లు

న్యూఢిల్లీ : విదేశీ సంస్థాగత మదుపరులు(ఎఫ్‌పీఐ) మళ్లీ మన స్టాక్ మార్కెట్‌పై ఆసక్తి చూపిస్తున్నారు. ఈ జూన్‌లో ఎఫ్ఐఐలు మన స్టాక్ మార్కెట్‌లో రూ.26,565 కోట్ల విలువైన నికర పెట్టుబడులు పెట్టారు. ఎన్నికల తర్వాత ఎలాంటి ప్రభుత్వం వస్తుందోననే భయంతో ఇదే ఎఫ్ఐఐలు ఏప్రిల్-మే నెలల్లో పెద్ద పెద్ద మొత్తంలో అమ్మకాలు జరిపాయి. ఎన్నికల తర్వాత సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడినప్పటికీ సంస్కరణలు కొనసాగుతాయనే నమ్మకం, జీడీపీ వృద్ధి జోరు, కంపెనీల ఆర్థిక ఫలితాలు బాగుండటంతో మళ్లీ మన మార్కెట్‌పై దృష్టి పెట్టాయి.

ఎన్‌టీపీసీ రూ.12,000 కోట్ల సమీకరణ

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగంలోని ఎన్‌టీపీసీ రూ.12,000 కోట్ల నిధుల సమీకరణకు సిద్ధమైంది. రుణ పత్రాలు(బాండ్స్), నాన్ కన్వర్టబుల్ డిబెంచర్ల(ఎన్‌సీడీ) ద్వారా ఎన్‌టీపీసీ ఈ నిధులు సమీకరించనుంది. శనివారం సమావేశమైన కంపెనీ డైరెక్టర్ల బోర్డు ఇందుకు ఆమోదం తెలిపింది. ఒకటి లేదా అంతకంటే ఎక్కువ వాయిదాల్లో ఈ నిధులు సమీకరించే అవకాశం ఉందని కంపెనీ తెలిపింది. వ్యాపార విస్తరణ కోసం కంపెనీ ఈ నిధులను వినియోగించనుంది.

పోస్ట్ సేల్ డిస్కౌంట్‌పై జీఎస్‌టీ సర్దుబాటు ఎలా..?

డీలర్స్, స్టాకిస్టులకు ప్రోత్సాహకాలు అందించడం ద్వారా అమ్మకాలు పెంచుకునేందుకు చాలా కంపెనీలు పోస్ట్ సేల్ డిస్కౌంట్‌ను ప్రకటిస్తుంటాయి. మరి ఈ డిస్కౌంట్‌ను జీఎస్‌టీలో ఎలా చూపించాలో తెలుసుకుందాం..

లక్ష్మీ సిమెంట్స్ అనేక ప్రాంతాల్లో డీలర్స్‌ను కలిగి ఉంది. వ్యాపార విస్తరణలో భాగంగా దేశంలోని పలు ప్రాంతాల్లో ప్లాంట్లను ఏర్పాటు చేయడంతోపాటు డీలర్స్ నెట్‌వర్క్‌ను కూడా గణనీయంగా పెంచుకుంది. అమ్మకాలు పెంచుకునేందుకు కంపెనీ తన డీలర్స్‌కు పలు ప్రోత్సాహక పథకాలను ప్రవేశపెట్టింది. ఒకటి కంపెనీ నుంచి కొనుగోళ్లపై డీలర్‌కు డిస్కౌంట్ ఇచ్చే స్కీమ్. రెండో పథకంలో నెల, త్రైమాసిక, వార్షిక కొనుగోళ్ల టార్గెట్‌ను చేరుకున్న ఆధారంగా వారికి డిస్కౌంట్ అమలయ్యేలా చూడటం. అంటే, అమ్మకం జరిగిన తర్వాత డీలర్స్‌కు డిస్కౌంట్ ఇవ్వడం. ఇది కంపెనీకి, డీలర్‌కు మధ్య ఉన్న ఒప్పందం ప్రకారం ఉంటుంది. ఉదాహరణకు, లక్ష్మీ సిమెంట్స్ తన డీలర్స్‌కు ఒక త్రైమాసికంలో 50 లక్షల మేర కొనుగోలు చేస్తే అదనంగా 3 శాతం డిస్కౌంట్, కోటి పైన కొనుగోళ్లపై 5 శాతం డిస్కౌంట్ కల్పిస్తోంది అనుకుందాం.

జీఎస్‌టీ నిబంధనల ప్రకారం, ఇన్వాయిస్‌లో చూపే మొత్తంపై పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అలాగే అమ్మకం జరిగే నాటికే ఇన్వాయిస్ జారీ చేసి ఉండాలి. కాబట్టి, పోస్ట్ సేల్ డిస్కౌంట్‌ను ఇన్వాయిస్‌లో చూపించడం జరగదు. ఎందుకంటే, ఒప్పందం ప్రకారం నిర్ణీత మొత్తం కొనుగోలు చేసిన వారికి మాత్రమే ఈ పోస్ట్ సేల్ డిస్కౌంట్ వర్తిస్తుంది. లక్ష్మీ సిమెంట్స్ విషయానికొస్తే, త్రైమాసిక కొనుగోళ్ల ఆధారంగా డీలర్స్‌కు ఇవ్వాల్సిన పోస్ట్ సేల్ డిస్కౌంట్‌ను లెక్కించేందుకు చాలా సమయం పడుతుంది. ఆ తరువాత డిస్కౌంట్‌కు సరిపోను క్రెడిట్ నోట్‌ను జీఎస్‌టీ కలిపి జారీ చేయడం జరుగుతుంది. అప్పటికే జరిపిన కొనుగోళ్లకు సంబంధించి ఆ డీలర్, కంపెనీకి ఇన్వాయిస్ మొత్తం జీఎస్‌టీతో సహా చెల్లించడం.. కంపెనీ ఆ మొత్తంపై జీఎస్‌టీ చెల్లించడంతోపాటు సదరు డీలర్ చెల్లించిన జీఎస్‌టీని ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) రూపంలో పొందడం జరుగుతుంది. అంటే, అదనపు డిస్కౌంట్‌తో పాటుగా సంబంధిత జీఎస్‌టీని కూడా కంపెనీ సదరు డీలర్‌కు వెనక్కి ఇచ్చేస్తుంది. ఆ సందర్భంలో కంపెనీ తాను చెల్లించిన జీఎస్‌టీని ఎలా వెనక్కి పొందాలి..? దీనికి జీఎస్‌టీ చట్టంలో కొన్ని నియమాలున్నాయి. దీని ప్రకారం, పోస్ట్ సేల్ డిస్కౌంట్‌పై జీఎస్‌టీలో మినహాయింపు పొందాలంటే, ముందుగానే ఆ మేర ఒప్పందం జరిగి ఉండాలి. అన్నిటి కంటే ముఖ్యంగా, సదరు డీలర్ తీసుకున్న ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను పోస్ట్ సేల్ డిస్కౌంట్‌కు వర్తించే మేర రివర్స్ చేయాల్సి ఉంటుంది. అప్పుడే కంపెనీ తను డీలర్‌కు ఇచ్చిన డిస్కౌంట్‌కు సరిపడా జీఎస్‌టీని తగ్గించుకోగలదు. అయితే, డీలర్ జీఎస్‌టీని రివర్స్ చేశాడా..? లేదా..? అని తెలుసుకోవడానికి కంపెనీ దగ్గర ఎలాంటి సదుపాయం లేదు. దాంతో జీఎస్‌టీ ఆడిట్ లేదా ఎంక్వయిరీలు జరిగినప్పుడు చాలా కంపెనీలు ఈ విషయంలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఈ ఇబ్బందులను పరిష్కరించేందుకు ప్రభుత్వం ఈమధ్యనే కొన్ని మార్గదర్శకాలను జారీ చేసింది. కొత్త మార్గదర్శకాల ప్రకారం.. సంబంధిత డీలర్ తన చార్టర్డ్ అకౌంటెంట్ లేదా కాస్ట్ అకౌంటెంట్ ద్వారా డిస్కౌంట్ తీసుకున్న మేర ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను రివర్స్ చేసినట్లు కంపెనీకి సర్టిఫికేట్ ఇవ్వాలి. అందులో క్రెడిట్ నోట్, ఇన్వాయిస్ వివరాలు, రివర్స్ చేసిన ఐటీసీ మొత్తం, ఏ విధంగా రివర్స్ చేయడం జరిగిందన్న వివరాలను పొందుపర్చాలి. ఆడిట్ లేదా ఎంక్వయిరీ సమయాల్లో ఆయా కంపెనీలు ఈ సర్టిఫికేట్‌ను ఆధారంగా చూపవచ్చు. ఏదైనా ఆర్థిక సంవత్సరంలో సరఫరాదారుడు తన డీలర్‌కు ఇచ్చిన పోస్ట్ సేల్ డిస్కౌంట్‌కు సంబంధించిన జీఎస్‌టీ మొత్తం రూ.5 లక్షల లోపే ఉంటే గనుక, ఆ డీలర్ సీఏ లేదా కాస్ట్ అకౌంటెంట్‌ల ద్వారా కాకుండా తనే స్వయంగా పైన తెలిపిన వివరాలతో కూడిన సర్టిఫికేట్‌ను జారీ చేయవచ్చు. కాబట్టి, పోస్ట్ సేల్ డిస్కౌంట్ కల్పించే కంపెనీలు తమ డీలర్ల నుంచి ఈ విధంగా సర్టిఫికేట్‌లను పొందాలి. అలాగే, గడిచిన సంవత్సరాలకూ ఈ సర్టిఫికేట్‌లను తీసుకోవాలి.

ఇదీ GST


రాంబాబు గొండాల

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,280 ▲	66,250 ▲	94,500 ▲
ముంబై	71,840 ▲	65,800 ▲	88,000 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

30వ తేదీ			
హైదరాబాద్	520	విజయవాడ	535
వరంగల్	522	గోదావరి	525
చిత్తూరు	573	విశాఖపట్నం	540
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	112	విజయవాడ	123
వరంగల్	112	గుంటూరు	123
కరీంనగర్	112	ఒంగోలు	123
మహబూబ్‌నగర్	112	చిత్తూరు	130
కర్నూలు	112	నెల్లూరు	130
విశాఖపట్నం	129	అనంతపురం	123
గోదావరి	123		

ఆ ఐదు పంచాయతీలు
ఇవ్వాలని ఏపీని అడుగుతాం

» విభజన చట్టంపై ఉమ్మడి చర్చల్లో ప్రస్తావిస్తాం : తుమ్మల



ఖమ్మం, జూన్ 29(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): భద్రాచలం మండలం నుంచి ఏపీలో కలిసిన ఐదు పంచాయతీలను తెలంగాణలో కలపాలని ఆంధ్రప్రదేశ్‌ను కోరతామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన విభజన చట్టం హామీల అమలు, రెండు రాష్ట్రాల మధ్య ఉన్న సమస్యలపై జరిగే ఉమ్మడి చర్చల్లో ఈ అంశాన్ని ప్రస్తావిస్తామని చెప్పారు. ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో మంత్రి తుమ్మల శనివారం విలేకరులతో మాట్లాడారు. భద్రాచలం మండలానికి చెందిన ఐదు పంచాయతీలు ఏపీలో కలవడం వల్ల.. భద్రాచలం పట్టణంలో చెత్త వేయడానికి కూడా స్థలం లేకుండా పోయిందన్నారు. ఆ ఐదు పంచాయతీలు పోలవరం ముంపు పరిధిలో లేవని, భద్రాచలం మండలంలో ఉండడంతో నాడు వాటిని ఏపీలో కలిపారని గుర్తు చేశారు. భద్రాచలం పుణ్యక్షేత్రం అభివృద్ధి చెందాలంటే ఆ ఐదు పంచాయతీల అవసరం ఉందని స్పష్టం చేశారు. కాగా, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గతంలో తాను ప్రతిపాదించిన జాతీయ రహదారులకు కేంద్ర ప్రభుత్వం రూ.655కోట్లు మంజూరు చేసిందని మంత్రి తుమ్మల వెల్లడించారు. తద్వారా ఖమ్మం జిల్లాలో అన్ని రహదారులు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. నిధుల మంజూరుకు కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రహదారుల కోసం మంజూరైన నిధులకు సంబంధించి డీపీఆర్ సిద్ధం చేసిన తర్వాత టెండర్లు పిలుస్తామని ప్రకటించారు. కొత్తగూడెం పట్టణానికి మూడువైపులా 25కి.మీ. పొడవున రింగ్‌రోడ్డు రాబోతుందని చెప్పారు. భద్రాచలం పట్టణంలో ఆరు లేన్ల రహదారి, కిన్నెరసాని బ్రిడ్జికి అనుసంధానంగా మరో వంతెన, ఖమ్మం రింగ్‌రోడ్డు పనులు, జిల్లాలో మరిన్ని రహదారుల అభివృద్ధి పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని తుమ్మల వివరించారు.

కృష్ణా బోర్డు చైర్మన్‌గా అతుల్ జైన్

హైదరాబాద్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా నది యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) ఛైర్మన్‌గా అతుల్ జైన్‌ను నియమిస్తూ కేంద్ర జలశక్తి శాఖ నిర్ణయం తీసుకుంది. కేంద్ర జల ఇంజనీర్ల సర్వీస్(సీడబ్ల్యూఈఎస్)కు చెందిన గ్రూప్-ఏ అధికారి అయిన ఆయనకు ఇటీవలే పదోన్నతి దక్కింది. దాంతో ఆయన్ను ఛైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ నియామకం జూలై 1వ తేదీ నుంచి అమల్లోకి రానుంది.

మరో 2000 కోట్ల రుణం తీసుకోనున్న రాష్ట్రం

రాష్ట్ర ప్రభుత్వం మరో రెండు వేల కోట్ల రుణాన్ని తీసుకోనుంది. ఈ మేరకు భారత రిజర్వ్ బ్యాంక్‌కు శనివారం ఇండెంటు పెట్టింది. 13 ఏళ్ల కాల పరిమితితో వెయ్యి కోట్లు, 18 ఏళ్ల కాల పరిమితితో వెయ్యి కోట్ల చొప్పున అప్పును సేకరించనుంది. జులై 2న ఆర్‌బీఐ నిర్వహించే ఈ-వేలం ద్వారా దీనిని తీసుకుంటుంది. రాష్ట్రంతో సహా ఎనిమిది రాష్ట్రాలు మొత్తం రూ.14,140 కోట్ల అప్పుల కోసం ఇండెంట్లు పెట్టాయి.

జూలై 31 వరకు ఇంటర్ అడ్మిషన్ల గడువు పెంపు

రాష్ట్రంలో ఇంటర్మీడియట్ అడ్మిషన్ల గడువును పొడిగిస్తూ శనివారం ఇంటర్ బోర్డు కార్యదర్శి ఆదేశాలు జారీ చేశారు. క్రితం గడువు ప్రకారం ఈ నెలాఖరుతో ఇంటర్ అడ్మిషన్ల ప్రక్రియ ముగియాల్సి ఉంది. అయితే తాజాగా పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు ప్రకటించడం, ఇప్పటికీ కొన్ని ప్రైవేట్ జూనియర్ కాలేజీల గుర్తింపు ప్రక్రియ ముగియకపోవడంతో ఇంటర్ ఫస్ట్ ఇయర్ అడ్మిషన్ల గడువును జూలై 31 వరకు పొడిగించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్, ఇతర అన్ని రకాల కాలేజీలకు ఇది వర్తిస్తుంది. గుర్తింపు పొందిన కాలేజీల్లోనే విద్యార్థులను చేర్పించాలని తల్లిదండ్రులకు బోర్డు అధికారులు సూచించారు.

వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టులకు
4 నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్

వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల భర్తీలో భాగంగా జూలై 4వ తేదీ నుంచి అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలంగాణ పబ్లిక్ సర్వీసు కమిషన్ (టీజీపీఎస్సీ) అధికారులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ జూలై 8వ తేదీ వరకు కొనసాగనుంది. ఉదయం 10.30 గంటల నుంచి కమిషన్ కార్యాలయంలో వెరిఫికేషన్ ఉంటుంది.

గిరిజన సంక్షేమంపై జాతీయ ఎస్టీ కమిషన్ సమీక్ష

రాష్ట్రంలో గిరిజన సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై జాతీయ ఎస్టీ కమిషన్ ఆరా తీసింది. ఈమేరకు శనివారం జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో అమలుచేస్తున్న పలు పథకాల పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా గిరిజనులకు విద్య, మౌలిక వసతుల కల్పన కోసం చేపడుతున్న చర్యలపై చర్చించారు. సమీక్షలో శాఖ అడిషనల్ డైరెక్టర్ సర్వేశ్వర్‌రెడ్డి, గిరిజన గురుకుల సెక్రటరీ సీతాలక్ష్మి, చీఫ్ ఇంజనీర్ శంకర్, గిరిజన పరిశోధన సంస్థ జాయింట్ డైరక్టర్ వి.సముజ్వల, డాక్టర్ డి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ గురుకుల పాఠశాలల్లో మరోసారి ప్రవేశాలు

రాష్ట్రంలోని ఎస్సీ గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పించింది. ఈమేరకు 5 నుంచి 9వ తరగతి వరకు మిగిలిన సీట్లలో అడ్మిషన్లు పొందేందుకు జూలై 12 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సీతక్క ఒక ప్రకటనలో తెలిపారు. కాగా ఇప్పటికే 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు గురుకుల అధికారులు ప్రవేశ పరీక్ష నిర్వహించి మెరిట్ ప్రకారం ప్రవేశాలు కల్పించిన విషయం తెలిసిందే.

నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలి

» విద్యార్థి, యువజన సంఘాల నేతలు

రాంనగర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): నీట్ యూజీ ఫలితాలను తక్షణమే రద్దు చేసి పరీక్షను తిరిగి నిర్వహించాలని వివిధ విద్యార్థి, యువజన సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ నేతలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జూలై 1వ తేదీన చలో రాజ్‌భవన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. శనివారం సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో వక్తలు మాట్లాడారు. నీట్ పేపర్ లీకేజీ వల్ల దేశంలో సుమారు 24 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకరంగా మారిందన్నారు. పేపర్ లీకేజీల వల్ల విద్యార్థులకు పోటీ, ప్రవేశ పరీక్షలపై ఉన్న విశ్వసనీయత దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు విన్నవించేందుకు గవర్నర్ అపాయింట్‌మెంట్ కోరినా స్పందించలేదని, అందుకనే చలో రాజ్‌భవన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

'మీ సేవ'లు లేని గ్రామాల్లోనే 'స్త్రీ శక్తి మీసేవ'లు

» 'మీ సేవ' సమాఖ్య ప్రతినిధులతో ఈఎస్‌డీ కమిషనర్

హైదరాబాద్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం మీ సేవ కేంద్రాలు లేని గ్రామాల్లోనే స్త్రీ శక్తి మీ సేవ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని ఈఎస్‌డీ కమిషనర్ రవికిరణ్ స్పష్టం చేశారు. కొత్త కేంద్రాలతో ప్రస్తుతం మీ సేవ కేంద్రాలు నిర్వహిస్తున్న వారికి ఎలాంటి ఇబ్బందీ లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా గ్రామీణ ప్రాంతాల్లో 936, జీహెచ్ఎంసీ పరిధిలో 150 స్త్రీ శక్తి మీసేవ కేంద్రాలు ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై ఇప్పటికే సేవలు అందిస్తున్న మీసేవ కేంద్రాల ఆపరేటర్ల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చెందిన ఆపరేటర్లు శనివారం ఈఎస్‌డీ కమిషనర్ రవికిరణ్‌ను కలిసి నిరసన వ్యక్తం చేశారు. దీనిపై కమిషనర్ రవి కిరణ్ స్పందిస్తూ మీసేవ కేంద్రాలు లేని గ్రామాల్లోనే స్త్రీ శక్తి మీసేవ కేంద్రాలకు అవకాశం ఇస్తామన్నారు. ప్రస్తుతం మీసేవ ఆపరేటర్లు అందుకుంటున్న కమీషన్‌ను సైతం పెంచుతామని వెల్లడించారు. అంతకుముందు తెలంగాణ మీసేవ ఫెడరేషన్ అధ్యక్ష కార్యదర్శులు భైర శంకర్, మొహ్మద్ మొహీద్, తదితరులు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబును కలిసి తమ సమస్యలను వివరించారు. కొత్త కేంద్రాలతో ఇప్పుడున్న ఆపరేటర్లకు ఇబ్బంది లేకుండా చూస్తామని మంత్రి హామీ ఇచ్చినట్టు ఫెడరేషన్ ప్రతినిధులు తెలిపారు.

తెలంగాణ ఇక మెడికల్ హబ్

(మొదటిపేజీ తరువాయి)

ప్రారంభించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. 1965లో ఇందిరాగాంధీ దూరదృష్టితో హైదరాబాద్‌లో ఐడీపీఎల్ సంస్థను ఏర్పాటు చేశారని, ఈ సంస్థలో పరిశోధనలు చేసిన ఉద్యోగులు, చూసి నేర్చుకున్నవారే పలు కంపెనీలు నెలకొల్పారని పేర్కొన్నారు. ఆ తరువాత రాజీవ్‌గాంధీ దేశంలో కంప్యూటరీకరణకు శ్రీకారం చుట్టారని, ఫలితంగానే తెలంగాణలో ఐటీ రంగం రాణించిందని, హైదరాబాద్‌కు ఆదాయం పెరిగిందని అన్నారు. ఫార్మాసిటీలే కాకుండా తెలంగాణలో 10 నుంచి 12 వరకు ఫార్మా విలేజ్‌లను ఏర్పాటు చేయాలని తమ ప్రభుత్వం భావిస్తోందని తెలిపారు. మిడిల్ ఈస్ట్ దేశాలు మనపై ఆధారపడుతున్నాయని, అక్కడివారు వైద్యం కోసం హైదరాబాద్, చెన్నై నగరాలకు వస్తున్నారని చెప్పారు.

శంషాబాద్‌లో మెడికల్ టూరిజం..

శంషాబాద్ ఎయిర్‌పోర్టు సమీపంలో వెయ్యి ఎకరాల్లో మెడికల్ టూరిజం ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. పేద ప్రజలకు వైద్య సేవలందించే సంస్థలకు ఉచితంగా స్థలాలు కేటాయించటంతోపాటు మౌలిక సదుపాయాలు కూడా ప్రభుత్వమే కల్పిస్తుందన్నారు. ఎయిర్‌పోర్టులో గ్రీన్ చానల్ ఏర్పాటు చేసి, వైద్యం కోసం వచ్చేవారికి ప్రత్యేక సౌకర్యాలు కల్పించేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఉండే ప్రతి పౌరుడికి ఉచిత వైద్యం అందేలా ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు. వైద్యం అందక ఏ ఒక్కరు కూడా మృతి చెందారనే వార్త వినబడవద్దన్నారు. ప్రతి ఒక్కరికీ హెల్త్ ప్రొఫైల్ తయారు చేసి, యునిక్ నంబరుతో డిజిటల్ కార్డులు ఇస్తామని, ఈ కార్డు ద్వారా ఏ ఆస్పత్రిలోనైనా ఉచితంగా చికిత్స పొందేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని వివరించారు. ఇక వరంగల్ నగరాన్ని జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేలా అభివృద్ధి చేస్తామన్నారు. త్వరలోనే వరంగల్‌కు ఎయిర్‌పోర్టు, మాస్టర్ ప్లాన్ వస్తున్నాయని తెలిపారు. టెక్స్‌టైల్ పార్కును అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. హెల్త్, ఎడ్యుకేషన్, ఎకో, టెంపుల్ టూరిజం అన్నీ వరంగల్‌లోనే అభివృద్ధి చేసుకునే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు దీటుగా వరంగల్‌ను అభివృద్ధి చేసేందుకు తమ ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసిందని తెలిపారు. వైద్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఉండే అతి పెద్ద మెడికవర్ ఆస్పత్రిని వరంగల్‌లో ఏర్పాటు చేయడంపై ప్రభుత్వం తరఫున అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీ కడియం కావ్య, నగర మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.



మెగా టెక్స్‌టైల్ పార్కులో వనమహోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

ప్రపంచస్థాయి వైద్య సదుపాయాలు

» నలుగురితో ప్రారంభించి లక్షల మందికి సేవలందిస్తున్నాం

» మెడికవర్ ఆలిండియా సీఎండీ డాక్టర్ అనిల్‌కృష్ణ వెల్లడి

బాలసముద్రం, జూన్ 29: వరంగల్‌లో 300 పడకలతో ఏర్పాటు చేసిన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ప్రపంచ స్థాయి వైద్య సదుపాయాలు కల్పిస్తున్నట్లు మెడికవర్ ఆలిండియా ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అనిల్ కృష్ణ తెలిపారు. ఈ ఆస్పత్రిలో ఆపరేషన్ థియేటర్లతోపాటు ఎక్కువ సంఖ్యలో ఐసీయూ బెడ్స్ ఉన్నాయని చెప్పారు. భారత దేశంలో అగ్రగామి మల్టీ నేషనల్ ఆస్పత్రి చైన్‌గా 24 ఆస్పత్రులను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 12 దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తూ హెల్త్ కేర్ బ్రాండ్‌గా గుర్తింపుపొందిన మెడికవర్.. 24వ ఆస్పత్రిని వరంగల్‌లో శనివారం ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డిని, మంత్రులను మెడికవర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు శరత్‌రెడ్డి, హరికృష్ణతో కలిసి డాక్టర్ అనిల్ కృష్ణ శాలువాలతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2015లో నలుగురితో ప్రారంభించిన మెడికవర్ ఆస్పత్రి.. లక్షల మందికి వైద్య సేవలందించి కరోనా సమయంలో లక్షలాది మందికి ఉచితంగా వ్యాక్సినేషన్ అందించినట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం మెడికవర్ సేవలను వినియోగించుకోవాలని, రాష్ట్రాన్ని హెల్త్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు మెడికవర్ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తుందని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి తాను అభిమానినని, రేవంత్ సీఎం కాకముందు అనేక కష్టాలను ఎదుర్కొని లక్ష్యాన్ని సాధించారని ప్రశంసించారు. ఆయన చేతులమీదుగా మెడికవర్ ఆస్పత్రిని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు



సీఎం రేవంత్‌కు జ్ఞాపికను అందజేస్తున్న డాక్టర్ అనిల్‌కృష్ణ

వస్త్రనగరిగా వరంగల్

నగర అభివృద్ధి సమీక్షలో సీఎం రేవంత్

వరంగల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వస్త్ర నగరిగా వరంగల్ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. శనివారం వరంగల్ జిల్లా శాయంపేటలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును సీఎం పరిశీలించి.. అధికారులతో సమీక్షించారు. 22 కంపెనీలు గత ప్రభుత్వంతో ఎంవోయూ కుదుర్చుకున్నా కేవలం మూడు సంస్థలే పరిశ్రమలు ఏర్పాటు చేశాయని అధికారులు చెప్పడంతో.. కొత్తగా వచ్చే కంపెనీలకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. టెక్స్‌టైల్ పార్కు కోసం భూములిచ్చిన నిర్వాసితులకు ఎకరానికి వెయ్యి గజాల ప్లాట్‌తోపాటు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. పార్కులో వరద ముంపును నివారించేందుకు 10 ఎకరాల్లో పాండ్‌ను నిర్మించి.. అందులోని నీటిని పరిశ్రమలకు ఉపయోగించుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. మెగా టెక్స్‌టైల్ పార్కు నుంచి జైలు స్థలంలో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ముఖ్యమంత్రి పరిశీలించారు. ఆస్పత్రిని 24 అంతస్తుల్లో నిర్మించటంపై సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇది ఆస్పత్రా? లేక అపార్ట్‌మెంటా? అని మండిపడ్డారు. ఆస్పత్రి నిర్మాణానికి రూ.1,100 కోట్లున్న అంచనా వ్యయాన్ని ఎలాంటి అనుమతులు లేకుండా రూ.1726 కోట్లకు ఎలా పెంచారని అధికారులను ప్రశ్నించారు. గత ప్రభుత్వ పెద్దలు చెబితే పెంచామని అధికారులు చెప్పగా మౌఖిక ఆదేశాలతో రూ.626 కోట్ల వ్యయం ఎలా పెంచుతారని నిలదీశారు.

మాస్టర్ ప్లాన్ త్వరగా పూర్తికావాలి..

వరంగల్ నగరానికి 2050 వరకు ఉపయోగపడేలా మాస్టర్‌ప్లాన్ రూపొందించాలని అధికారులను సీఎం రేవంత్ ఆదేశించారు. హనుమకొండ కలెక్టరేట్‌లో వరంగల్ నగర అభివృద్ధిపై మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులతో కలిసి సీఎం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం రూపొందించిన మాస్టర్ ప్లాన్ పేదలకు నష్టం చేకూర్చేలా ఉందని, త్వరగా మాస్టర్ ప్లాన్ పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అలాగే వరంగల్ నగరానికి అండర్ డ్రైనేజీకి సంబంధించిన ప్రణాళికను త్వరగా రూపొందించాలన్నారు. రింగు రోడ్డు, ఇన్నర్ రోడ్ల నిర్మాణానికి కావాల్సిన నిధుల కోసం ప్రతిపాదనలు చేయాలన్నారు. వరంగల్ నగరానికి ఎయిర్‌పోర్టు రానుందని, ఇందుకు కావాల్సిన భూసేకరణపై అధికారులు దృష్టి పెట్టాలని ఆదేశించారు. మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య సయోధ్య ఉండాలని, 20 రోజులకోసారి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి వరంగల్‌లో సమీక్ష నిర్వహిస్తారని తెలిపారు. తాను మళ్లీ 45రోజులకు వరంగల్‌కు వచ్చి సమీక్ష నిర్వహిస్తానని, ఈ లోపు పనులన్నీ పూర్తి కావాలని ఆదేశించారు. మెగా టెక్స్‌టైల్ పార్కులో మొక్కలు నాటి వనమహోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. అనంతరం హనుమకొండ కలెక్టరేట్‌లో ఇందిరా మహిళ శక్తి క్యాంటీన్‌లను ప్రారంభించారు. మహిళలతో కొద్ది సేపు ముచ్చటించి.. వారు తయారు చేసిన స్వీట్లను కొనుగోలు చేశారు.

కవిత అప్రూవర్‌గా మారతారు..?

» కేటీఆర్, హరీశ్ నచ్చజెబుతున్నారు: యెన్నం

» త్వరలోనే ఆదిలాబాద్‌లో ఎయిర్ ఫోర్స్ స్టేషన్

» ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్

హైదరాబాద్/న్యూఢిల్లీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): లిక్కర్ కేసుకు సంబంధించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అప్రూవర్‌గా మారబోతున్నట్లు తెలుస్తోందని కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. అందుకే కేటీఆర్, హరీశ్‌రావులు తిహాడ్ జైలుకు వెళ్లి ఆమెకు నచ్చచెప్పే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. సీఎల్పీ మీడియా హాల్‌లో శనివారం యెన్నం మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలంతా ఫామ్‌హౌస్‌కు రావాలని కేసీఆర్ పిలుస్తుంటే.. వారంతా ఢిల్లీకి వెళుతున్నారని అన్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ తరపున కేటీఆర్, హరీశ్‌రావు తప్ప ఎవరూ మిగలరని అన్నారు. కాగా, ఆదిలాబాద్ ప్రజల చిరకాల కోరిక అయిన ఎయిర్ ఫోర్స్ స్టేషన్ నిర్మాణం త్వరలోనే సాకారం కాబోతోందని ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శనివారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో వారు మీడియాతో మాట్లాడారు. ఎయిర్ ఫోర్స్ స్టేషన్ విషయంలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసి వినతిపత్రం అందజేశామని, ఆయన సానుకూలంగా ఉన్నారని వెల్లడించారు. ఆదిలాబాద్‌లో ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ నిర్మిస్తామని 2014లోనే ప్రధాని మోదీ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కేసీఆర్ ప్రభుత్వం భూమి, ఎన్‌వోసీ ఇవ్వకుండా పదేళ్లు కాలయాపన చేసిందని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం భూమి కేటాయించడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. ఎయిర్ ఫోర్స్ స్టేషన్ నిర్మించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృతనిశ్చయంతో ఉన్నాయని పేర్కొన్నారు. కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రతిపాదనలు పంపాలని కోరారు.

అరచేతిలో మీ ఆరోగ్య సమాచారం

» ఆహారం, నిద్ర, వ్యాయామం, గుండె పనితీరు.. సమస్త వివరాలు

» యాప్‌ను విడుదల చేసిన ఎన్ఐఎన్

హైదరాబాద్, జూన్ 29: మీరు ఎత్తుకు తగ్గ బరువు ఉన్నారా? సమతుల ఆహారం తీసుకుంటున్నారా? ఆహారంలో ఎలాంటి మార్పులు చేయాలి? తగినంత శారీరక శ్రమ చేస్తున్నారా? నిద్ర సరిగా పోతున్నారా? వంటి వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవటానికి వీలుగా హైదరాబాద్‌లోని జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్) ఓ యాప్‌ను తీసుకొచ్చింది. 'న్యూట్రిఫై ఇండియా నౌ 2.0' పేరుతో ఈ యాప్‌ను శనివారం విడుదల చేసింది. గతంలో ఉన్న యాప్‌ను ఆధునీకరించామని.. పోషకాహారం, ఆరోగ్య సూత్రాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని పొందుపరిచామని ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ హేమలత తెలిపారు. బాడీ మాస్ ఇండెక్స్‌తో పాటు నిద్ర, గుండె పనితీరు, జీవనశైలికి అనుగుణంగా ఆహారంలో చేసుకోవాల్సిన మార్పుల గురించి ఈ యాప్ విలువైన సమాచారాన్ని అందిస్తుందన్నారు. ఎంత మోతాదులో ఆహారం తీసుకోవాలనే వివరాలను కూడా ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చని యాప్ రూపకర్త డాక్టర్ అనంతన్ తెలిపారు. గూగుల్ ప్లే స్టోర్ నుంచి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు.

కాంగ్రెస్‌లోకి ఎమ్మెల్సీ సారయ్య..?

హనుమకొండలో రేవంత్ సమీక్షకు హాజరు.. సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డితో భేటీ

కలెక్టరేట్‌లోని గదిలో ఏకాంతంగా చర్చలు

వరంగల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య తిరిగి సొంత గూటికి చేరతారనే చర్చ జోరుగా నడుస్తోంది. శనివారం హనుమకొండ కలెక్టరేట్‌లో జరిగిన అనూహ్య పరిణామమే ఈ చర్చకు ఊతమిచ్చింది. హనుమకొండ కలెక్టరేట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన సమీక్షకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు బస్వరాజు సారయ్య, బండా ప్రకాశ్ హాజరయ్యారు. అయితే సమీక్ష మధ్యలోనే ఎమ్మెల్సీలు ఇద్దరూ బయటకు రాగా.. సీఎం సలహాదారు, మాజీ ఎమ్మెల్యే వేం నరేందర్‌రెడ్డితో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య రహస్యంగా మాట్లాడటం చర్చనీయాంశమైంది. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ పక్కనే ఉన్న గదిలో వారిద్దరూ ఏకాంతంగా చర్చలు జరిపారు. ఇప్పటికే బస్వరాజు సారయ్య, బండా ప్రకాశ్‌ను కాంగ్రెస్‌లోకి తీసుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో సీఎం పర్యటనకు ఇద్దరు ఎమ్మెల్సీలు హాజరవడం, సారయ్య వేం నరేందర్‌రెడ్డితో రహస్యంగా చర్చలు జరపడం ఆసక్తిని రేపింది. సారయ్య త్వరలోనే పాత గూటికి చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారనే ప్రచారం జరుగుతోంది.

సీఎం టూర్‌కు నర్సంపేట ఎమ్మెల్యే డుమ్మా...

సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ జిల్లా పర్యటనకు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి దూరంగా ఉండటం చర్చనీయాంశమైంది. మాధవరెడ్డి మొదటి నుంచీ రేవంత్‌తో అంటీ ముట్టనట్టుగా ఉంటున్నారు. గతంలో రేవంత్‌రెడ్డి హాథ్ సే హాథ్ జోడో యాత్ర చేపట్టి ఉమ్మడి వరంగల్ జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో పర్యటించినా.. నర్సంపేటలో అడుగు పెట్టలేదు. శనివారం హనుమకొండ కలెక్టరేట్‌లో ఒక పక్క సీఎం సమీక్షలో ఉంటే.. హనుమకొండలోని తన స్వగృహంలో ఎమ్మెల్యే ఉండటం హాట్‌టాపిక్‌గా మారింది.

రేవంత్ బస్సుపైకి వినతి పత్రాలు..

సీఎం రేవంత్‌రెడ్డికి తమ బాధలు చెప్పుకొనేందుకు హనుమకొండ కలెక్టరేట్‌కు వివిధ వర్గాల నేతలు, ఉద్యోగులు, కార్మికులు భారీగా తరలివచ్చారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6.20 గంటల వరకు రేవంత్ సమీక్షలో బిజీగా ఉండటంతో వారంతా సీఎం రాక కోసం నిరీక్షించారు. అయితే సమీక్ష అనంతరం కలెక్టరేట్ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం ఉన్నా.. వర్షం పడుతుండటంతో రేవంత్ దాన్ని రద్దు చేసుకుని వెంటనే బస్సు ఎక్కారు. అప్పటికే అక్కడ వినతి పత్రాలతో ఉన్న ప్రజలు బస్సు వద్దకు పరుగు తీశారు. అయితే వినతి పత్రాలు స్వీకరించకుండా రేవంత్ బస్సు ఎక్కడంతో.. తమ చేతుల్లో ఉన్న వినతి పత్రాలను పలువురు బస్సు పైకి విసిరేశారు.



సీఎం పర్యటనతో ముందస్తు అరెస్టులు..

వరంగల్‌లో సీఎం రేవంత్ పర్యటన నేపథ్యంలో పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. ఇటీవల వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన రాకేశ్ రెడ్డిని హౌస్ అరెస్టు చేశారు. గ్రూప్-2, 3 పోస్టులను పెంచి డిసెంబరులో పరీక్షలు నిర్వహించాలని, డీఎస్సీని మూడు నెలలు వాయిదా వేయాలని, 25వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ హనుమకొండలోని గ్రంథాలయం వద్ద ఆందోళనకు దిగిన నిరుద్యోగులను పోలీసులు నిర్బంధించారు.

15 రోజుల్లో పరిష్కరించండి

» ధరణి పెండింగ్ దరఖాస్తులపై రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్

» జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్

» నిర్లక్ష్యం వహించిన వారిపై ప్రభుత్వపరంగా చర్యలుంటాయని హెచ్చరిక

హైదరాబాద్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ధరణి పెండింగ్ దరఖాస్తులను 15 రోజుల్లోగా పరిష్కరించాలని రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్ జిల్లా కలెక్టర్లకు స్పష్టం చేశారు. ధరణిపై ఆయన శనివారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాల వారీగా పెండింగులో ఉన్న దరఖాస్తులను సమీక్షించారు. ఈనెల 14న కలెక్టర్లతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌ను ప్రస్తావిస్తూ.. అప్పటి నుంచి శుక్రవారం వరకు పరిష్కరించిన దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గత 14 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా 24,778 దరఖాస్తులను పరిష్కరించగా, 2,34,626 దరఖాస్తులు పెండింగులో ఉన్నట్లు తేలింది. 36,463 పెండింగు దరఖాస్తులతో రంగారెడ్డి మొదటిస్థానంలో ఉండగా.. నల్లగొండ 21,693, సంగారెడ్డి 16,824, వికారాబాద్ 14,556, భువనగిరి 10,132, సిద్దిపేట 10,077, మల్కాజిగిరి 10 వేల దరఖాస్తులతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. పెండింగు దరఖాస్తులు అత్యధికంగా తహసీల్దార్లు, ఆర్డీవోల వద్ద ఉన్నాయి. దీనిపై నవీన్ మిత్తల్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. పెండింగు దరఖాస్తులను తహసీల్దార్లు వెంటనే పరిష్కరించాలని, అదనపు కలెక్టర్లు, కలెక్టర్లు సైతం తమవద్ద పెండింగు లేకుండా చూడాలని కోరారు. నిర్లక్ష్యం వహించేవారిపై ప్రభుత్వపరంగా చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా నవీన్ మిత్తల్ హెచ్చరించినట్లు తెలిసింది. నిర్లక్ష్యం వహించిన తహసీల్దార్లు, ఆర్డీవోలపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు ఆయన సూచించారు. 15 రోజుల్లో పెండింగు దరఖాస్తులన్నింటినీ పరిష్కరించాలని, మ్యుటేషన్, సక్సేషన్ దరఖాస్తులకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అలాగే ప్రజావాణి దరఖాస్తులపైనా నవీన్ మిత్తల్ సమీక్ష జరిపారు. వీటిని పరిష్కరించేందుకు కలెక్టర్లు ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు.

కౌంటర్ దాఖలుకు 4 వారాల గడువు ఇవ్వండి

» జస్టిస్ బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్‌ను కోరిన ఏపీ

హైదరాబాద్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా జలాలను ఏ విధంగా పంచాలనే దానిపై తెలంగాణ దాఖలు చేసిన స్టేట్‌మెంట్ ఆఫ్ కేసు(ఎస్‌వోసీ)పై కౌంటర్ వేయడానికి నాలుగు వారాల గడువు ఇవ్వాలని జస్టిస్ బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్‌ను ఆంధ్రప్రదేశ్ కోరింది. ఈమేరకు ట్రైబ్యునల్ రిజిస్ట్రార్‌కు ఏపీ జలవనరుల శాఖ చీఫ్ ఇంజనీర్ లేఖ రాశారు. కౌంటర్ దాఖలు చేయడానికి ఈ నెల 11వ తేదీ దాకా ట్రైబ్యునల్ గడువు ఇచ్చిన విషయం విదితమే. జూలై 15వ తేదీ నుంచి ట్రైబ్యునల్ విచారణ ప్రారంభం కానుంది. అయితే ఏపీలో శాసనసభ ఎన్నికలు జరగడం, ఫలితాల అనంతరం లీగల్ టీమ్ అంతా రాజీనామా చేయడంతో కొత్త టీమ్ వచ్చేదాకా తమకు అవకాశం ఇవ్వాలని ఏపీ కోరింది. అంతేకాకుండా ట్రైబ్యునల్ విచారణను కూడా వాయిదా వేయాలని ఏపీ నివేదించింది.

ఆ నామినేటెడ్ పదవులకు
గ్రీన్‌సిగ్నల్!

» 37 మంది నియామకాలకు అధిష్ఠానం ఓకే

» లోక్‌సభ ఎన్నికల కారణంగా ఇన్నాళ్లు పెండింగ్

హైదరాబాద్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 37 నామినేటెడ్ పదవులకు నియామకాలు చేపడుతూ రేవంత్‌రెడ్డి సర్కారు గతంలో తీసుకున్న నిర్ణయానికి కాంగ్రెస్ అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో ఈ నియామకాలపై ప్రభుత్వం జూలై మొదటి వారంలోనే ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు సమాచారం. వాస్తవానికి లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే 37 కార్పొరేషన్లకు ఛైర్మన్లను ఎంపిక చేసిన సీఎం రేవంత్‌రెడ్డి.. అధిష్ఠానం అనుమతితో వారి నియామకాలకు అంతా సిద్ధం చేశారు. అయితే లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ రావడంతో కోడ్ అమల్లోకి వచ్చి.. ఆ నియామకాలకు సంబంధించి ఉత్తర్వుల జారీ ఆగిపోయింది. మరోవైపు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఇద్దరు నేతల నియామకాల విషయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. దాంతోపాటు ఒకరిద్దరు నేతలు తమకు కేటాయించిన పదవుల పట్ల అసంతృప్తితో ఉన్నారు. ఈ నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికలు ముగిసినా.. ఉత్తర్వుల జారీ పెండింగ్‌లో ఉండిపోయింది. కాగా, శుక్రవారం అధిష్ఠానం పెద్దలతో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీల భేటీ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న నామినేటెడ్ పదవుల నియామకంపైనా చర్చ జరిగినట్లు తెలిసింది. జాబితాలో మార్పులు, చేర్పులు చేస్తే.. అది మరింత వివాదాస్పదమయ్యే అవకాశం ఉంటుందని, ఎన్నికల ముందు నిర్ణయించిన మేరకే నియామక ఉత్తర్వులు జారీ చేయాలని సమావేశంలో పాల్గొన్న నేతలు అభిప్రాయపడినట్లు సమాచారం. దీంతో ఈ అంశాన్ని త్వరితగతిన తేల్చేసి వెనువెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని అధిష్ఠానం పెద్దలు సూచించినట్లు తెలిసింది. ఈ మేరకు దీపాదాస్ మున్షీ ఆయా నేతలతో మాట్లాడి అభిప్రాయాలు తీసుకోనున్నారు. దాదాపుగా గతంలో నిర్ణయించిన మేరకే నియామక ఉత్తర్వులు జారీ అయ్యే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయని, కుదరని పక్షంలో స్వల్ప మార్పులు చేపట్టి.. నియామక ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేయనుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

కాలం చెల్లిన మైదా.. కుళ్లిన కూరగాయలు!

సుల్తాన్‌పూర్ జేఎన్టీయూలో బయటపడ్డ నిర్లక్ష్యం

పనిచేయని ఆర్వో ప్లాంట్.. కరువైన మంచినీరు

ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీ.. నోటీసులు జారీ


కుళ్లిన, బూజుపట్టిన కూరగాయలు

హైదరాబాద్ సిటీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల విషయంలో జేఎన్‌టీయూ అధికారుల నిర్లక్ష్యం రోజుకో రకంగా వెలుగులోకి వస్తోంది. మొన్నటికి మొన్న హైదరాబాద్ జేఎన్‌టీయూ క్యాంటీన్‌లో కాలం చెల్లిన బియ్యం పిండితో ఆహార పదార్థాలు తయారుచేసినట్లు వెల్లడి కాగా, తాజాగా సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ కాలేజీ లోనూ కాలం చెల్లిన మైదాపిండిని వినియోగిస్తున్న వైనం బయటపడింది. గత వారం రోజుల్లో రెండుసార్లు జేఎన్‌టీయూ క్యాంటీన్/కాలేజీల్లో ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు తనిఖీ చేయగా విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. పాడైన సుమారు 25 కిలోల కూరగాయలు, కాలం చెల్లిన 15 కిలోల మైదాపిండిని గుర్తించిన అధికారులు వాటిని ప్రాంగణం వెలుపల పారపోశారు. మరోవైపు ఎలుకలు, వాటి విసర్జితాలతో స్టోర్‌రూమ్ అపరిశుభ్రంగా ఉండడాన్ని గుర్తించారు. వంటగది, భోజనశాల, పాత్రలు కడిగే ప్రదేశం కూడా అపరిశుభ్రంగా ఉండడాన్ని గమనించారు. ఆహార పదార్థాలు అందించే సిబ్బంది సరైన పద్ధతులు పాటించకపోవడం, ఆర్వో ప్లాంట్ పనిచేయకపోవడం కూడా వారి దృష్టికి వచ్చింది. తమ తనిఖీల్లో వెలుగులోకి వచ్చిన అంశాలను పొందుపరుస్తూ బాధ్యులకు నోటీసులు జారీచేశారు. కాలేజీ అధికారుల నుంచి వచ్చే వివరణను పరిశీలించిన అనంతరం తగిన చర్యలు తీసుకుంటామని ఫుడ్ సేఫ్టీ కమిషనర్ పేర్కొన్నారు.

ఇంట్లో ఆస్తి తగాదా.. తండ్రి చేతిలో కొడుకు హతం

ఎల్లారెడ్డి, జూన్ 29: ఆస్తి పంచివ్వాలని గొడవకు దిగిన కొడుకును కన్న తండ్రి హత్య చేశాడు. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డిలోని గండి మాసానిపేట్‌కు చెందిన కొడిపాక వెంకటేశానికి ఇద్దరు కుమారులు. పెద్దకొడుకు సాయిలు మద్యానికి బానిసై ఆస్తి పంచివ్వాలని తండ్రితో తరుచూ గొడవ పడేవాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి సాయిలు తండ్రి వెంకటేశంతో ఆస్తి పంచాలని మరోమారు ఘర్షణ పడ్డాడు. కోపోద్రిక్తుడైన వెంకటేశం కర్రతో దాడి చేయగా సాయిలు అక్కడికక్కడే మృతిచెందాడు. అనంతరం కొడుకు మృతదేహాన్ని తీసుకెళ్లి గ్రామ పరిసరాల్లోని కాలువ పక్కన పడేశాడు. శనివారం గ్రామస్థుల సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని విచారించగా సాయిలును తానే హత్య చేసినట్లు వెంకటేశం అంగీకరించాడు.

నేడు వెంకయ్య నాయుడి జీవిత విశేషాలపై 3 పుస్తకాల ఆవిష్కరణ

వర్చువల్ విధానంలో ప్రధాని చేతుల మీదుగా...

హైదరాబాద్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడి జీవిత విశేషాలతో రూపొందించిన మూడు పుస్తకాలను ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం వర్చువల్ పద్ధతిలో ఆవిష్కరించనున్నారు. 'వెంకయ్యనాయుడు ఎ లైఫ్ ఇన్ సర్వీస్', 'సెలబ్రేటింగ్ భారత్'(13వ ఉప రాష్ట్రపతిగా ఐదేళ్ల ప్రయాణం)తో పాటు 'మహానేత జీవన చిత్రమాలిక'ను ప్రధాని ఆవిష్కరించనున్నారు. ఈ సందర్భంగా వెంకయ్యానాయుడి 75 వసంతాల ఆత్మీయ కలయికకు సంబంధించి పంచ సప్తతి పేరిట గచ్చిబౌలిలోని అన్వయ కన్వెన్షన్‌లో ఉదయం 10 గంటలకు ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు.

మాదకద్రవ్యాలు వాడితే ఇక తప్పించుకోలేరు

టీఎస్ న్యాబ్ డీసీపీ సాయి చైతన్య

హైదరాబాద్ సిటీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలు తీసుకునేవారు ఇకపై తప్పించుకోలేరని, తక్కువ వ్యవధిలోనే శరీరంలోని డ్రగ్స్ స్థాయిని గుర్తించే పరికరాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామని టీఎస్ న్యాబ్ డీసీపీ సాయి చైతన్య తెలిపారు. ఈ పరికరంతో మాదకద్రవ్యాలు తీసుకున్న వారిని.. మూత్ర పరీక్షలు నిర్వహించడం ద్వారా తక్కువ సమయంలోనే కచ్చితత్వంతో గుర్తించవచ్చని ఆయన చెప్పారు. గతంలో ఇలాంటి పరీక్షలు అందుబాటులో లేకపోవడంతో వారి ఆటలు సాగాయని అన్నారు. గంజాయితోపాటు 32 రకాల సింథటిక్ డ్రగ్స్‌లో ఏది తీసుకున్నారో మూడు రోజుల తర్వాత కూడా మూత్ర పరీక్షల్లో గుర్తించే అవకాశముందని తెలిపారు. కళాశాల, యూనివర్సిటీల్లో విద్యార్థులకు మాదకద్రవ్యాలు సరఫరా చేస్తున్న వారిని గుర్తించి కట్టడి చేయడం ప్రారంభించామని చెప్పారు. అందులో భాగంగా ఇద్దరు పెడ్లర్లు, ఇద్దరు వినియోగదారులను అరెస్ట్ చేశామని తెలిపారు.

పెద్దపేగు క్యాన్సర్లు పెరుగుతున్నాయి

నీరసం, విరోచనంలో రక్తం పడడం వంటి లక్షణాలను అశ్రద్ధ చేయొద్దు

గ్యాస్ట్రోఎంటరాలజీ సదస్సులో వైద్యులు

హైదరాబాద్ సిటీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): పెద్దపేగు క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయని వైద్య నిపుణులు పేర్కొన్నారు. నీరసంగా ఉండడం, బలహీనం కావడం, విరోచనంలో రక్తం పడడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించి, చికిత్స పొందాలని సూచించారు. శనివారం గచ్చిబౌలిలోని కాంటినెంటల్ ఆస్పత్రిలో జాతీయ గ్యాస్ట్రోఎంట్రాలజీ సదస్సు నిర్వహించారు. కాంటినెంటల్ ఆస్పత్రి, నేషనల్ జీఐ కాన్ఫరెన్స్ సంయుక్తంగా నిర్వహించిన ఈ సదస్సులో దేశ విదేశాల నుంచి దాదాపు అయిదు వందల మంది డాక్టర్లు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు. అమెరికా మయో క్లినిక్, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్లు కూడా హాజరయ్యారు. జీర్ణకోశ వ్యాధులు, ఆధునిక చికిత్సా పద్ధతులపై చర్చించారు. చుక్క రక్తంతో క్యాన్సర్‌ను నిర్ధారించే పరిశోధనలు జరుగుతున్నాయని, వాటి ఫలితాలు అందుబాటులోకి వస్తే వెంటనే చికిత్స అందించి ప్రాణాపాయం నుంచి రక్షించవచ్చని వైద్య నిపుణులు పేర్కొన్నారు. క్యాన్సర్‌ను నయం చేయడానికి అధునాతన చికిత్సలు అందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు. 45 ఏళ్లు దాటిన వారు కొలనోస్కోపీ పరీక్ష చేయించుకోవాలని సూచించారు. జీవన శైలి, అలవాట్లలో మార్పులు చేసుకోవాలని, పీచు పదార్థాలు తినాలన్నారు. జన్యుశాస్త్రంలో ఆవిష్కరణలు, వాటి ద్వారా మారుతున్న వైద్య విధానాలు వైద్య రంగాన్ని మరో మెట్టుపైకి తీసుకెళ్లనున్నాయని కాంటినెంటల్ ఆస్పత్రి సీఎండి డాక్టర్ గురు ఎన్ రెడ్డి పేర్కొన్నారు.

నెరవేరిన కంటోన్మెంట్ కల..!

జీహెచ్ఎంసీలో విలీనానికి కేంద్రం ఓకే

దేశవ్యాప్తంగా.. కంటోన్మెంట్ పౌర ప్రాంతాలు రాష్ట్రాలకే

లీజులు/గ్రాంట్లు కూడా అందజేత

సికింద్రాబాద్/హైదరాబాద్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాలుగా లక్షల మంది కంటోన్మెంట్ వాసుల ఎదురుచూపులు ఫలించాయి.! సికింద్రాబాద్ కంటోన్మెంట్‌తోపాటు.. దేశంలోని అన్ని కంటోన్మెంట్‌లలో ఉన్న పౌర ప్రాంతాలను సమీప మునిసిపాలిటీలు/కార్పొరేషన్లలో విలీనం చేసేందుకు రక్షణ శాఖ శనివారం ఆమోదం తెలిపింది. ఈ మేరకు డిఫెన్స్ ఏరియా డైరెక్టర్ జనరల్ ప్రతిపాదనలు, మంగళ, గురువారాల్లో రక్షణ శాఖ కార్యదర్శి నేతృత్వంలో జరిగిన కీలక సమావేశ తీర్మానాలను.. శుక్రవారం ఆమోదిస్తూ.. అన్ని కంటోన్మెంట్ల సీఈవోలకు శనివారం సర్క్యులర్(నంబర్ 8078) జారీ చేశారు. దీంతో.. జీహెచ్ఎంసీలో కంటోన్మెంట్ విలీనానికి కీలక ముందడుగు పడినట్లయింది. మంగళ, గురువారాల్లో వర్చువల్‌గా జరిగిన కీలక సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ముఖ్య కార్యదర్శి దానకిశోర్ హాజరయ్యారు. కేంద్రం తాజా నిర్ణయంతో కంటోన్మెంట్‌లో ఉన్న పౌర ప్రాంతాలను జీహెచ్ఎంసీకి ఉచితంగా బదిలీ చేస్తారు. అంటే.. కంటోన్మెంట్ బోర్డు ఆస్తులు, అప్పులు కూడా జీహెచ్ఎంసీకి బదిలీ అవుతాయి. కంటోన్మెంట్‌లో ఇప్పటికే లీజు/గ్రాంట్‌గా ఇచ్చిన ఆస్తులు కూడా జీహెచ్ఎంసీకి వస్తాయి. ఒప్పందాల ప్రకారం.. ఆ లీజులు కొనసాగుతాయని తెలుస్తోంది. అయితే.. ఆస్తులను అప్పగించేప్పుడు రక్షణశాఖ కార్యాలయాలు, సాయుధ బలగాల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనివ్వాలని కేంద్రం స్పష్టం చేసింది. కేంద్రం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, కంటోన్మెంట్ బోర్డు బాధ్యులకు ఉండే సందేహాలను నివృత్తిచేసి.. తదుపరి కార్యాచరణ చేపట్టాలని కేంద్రం తన సర్క్యులర్‌లో సూచించింది.

విలీనం.. రెండోసారి

నిజాం హయాంలో ఈస్టిండియా కంపెనీ సైన్య సహకారంలో భాగంగా ట్యాంక్‌బండ్‌కు అవతలి వైపు సికింద్రాబాద్‌లో సైనిక స్థావరాలను ఏర్పాటు చేసుకుంది. భారత్‌లో హైదరాబాద్ రాష్ట్రం విలీనం తర్వాత.. కేంద్ర రక్షణ శాఖ ఈ ప్రాంతాన్ని తన అధీనంలోకి తీసుకుంది. 1950లలో జిర్రా, మారేడ్‌పల్లి, కలాసిగూడ వంటి ప్రాంతాలను కంటోన్మెంట్ నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించింది. మిగతా పౌర ప్రాంతాలు మాత్రం అప్పటి నుంచి కంటోన్మెంట్‌లో కొనసాగుతూ వస్తున్నాయి. 40 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో 350 వరకు బస్తీలు, కాలనీలుండగా.. ప్రస్తుతం 4 లక్షలకు పైగా జనాభా నివసిస్తోంది. అయితే.. రక్షణ శాఖ అధీనంలో ఉండడంతో.. ఈ ప్రాంతాల వాసులు నిత్యం ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. భద్రత పేరుతో గాఫ్‌రోడ్ల మూసివేత.. ఆక్ట్రాయ్ ట్యాక్స్‌తో పాటు.. పలు అంశాలను నిరసిస్తూ పౌరులు, స్వచ్ఛంద సేవాసంస్థలు జీహెచ్ఎంసీలో పౌర ప్రాంతాల విలీనానికి రెండు దశాబ్దాలుగా డిమాండ్ చేస్తూ వస్తున్నాయి. రక్షణ శాఖ స్థావరాలున్నందున విలీనం సాధ్యం కాదంటూ కేంద్రం చెబుతూ వస్తోంది. అయితే.. గత ఏడాది కేంద్ర ప్రభుత్వం పౌరుల కోణంలో చర్యలకు ఉపక్రమిస్తూ.. ఓ కమిటీని నియమించింది. కానీ, విలీనం విషయంలో అడుగు కూడా ముందుకు పడలేదు.



సీఎం రేవంత్ చొరవతో..

నగరం నలుమూలల అభివృద్ధి విషయంలో కంటోన్మెంట్‌లోని రక్షణ శాఖ భూములు అడ్డంకిగా ఉంటున్నాయి. దీంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఢిల్లీ వెళ్లినప్పుడల్లా రక్షణ శాఖ మంత్రి దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లారు. మార్చి 5న రాష్ట్ర పర్యటనకు వచ్చిన ప్రధాని మోదీని స్వయంగా కలిసి.. కంటోన్మెంట్ అంశాన్ని తేల్చాలంటూ విజ్ఞప్తి చేశారు. ఈ నెల 25న రక్షణ శాఖ కార్యదర్శి వర్చువల్‌గా నిర్వహించిన కీలక సమావేశంలోనూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి "విలీన ప్రక్రియను వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది" అని వివరించారు. ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి రక్షణ శాఖ భూములను సేకరించడంలోనూ రేవంత్ ప్రత్యేక చొరవ చూపించారు. మల్కాజిగిరి ఎంపీగా ఉన్నప్పుడే రేవంత్‌కు కంటోన్మెంట్ సమస్యలపై పూర్తిస్థాయిలో అవగాహన ఉంది. దాంతో.. అప్పట్లోనే కంటోన్మెంట్ విలీనానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. సీఎం అయ్యాక. కేంద్రంతో సంప్రదింపుల్లో వేగం పెంచారు. కేంద్రం కంటోన్మెంట్ల విలీనానికి ఆమోదం తెలపడం వెనక రేవంత్ క్రెడిట్ ఉంటుందని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

బోడుప్పల్ కార్పొరేషన్ కాంగ్రెస్ హస్తగతం

మేయర్, డిప్యూటీ మేయర్‌పై నెగ్గిన అవిశ్వాసం

ఉప్పల్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి):మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని బోడుప్పల్ కార్పొరేషన్ కాంగ్రెస్ హస్తగతమైంది. బీఆర్ఎస్‌కు చెందిన మేయర్ సాముల బుచ్చిరెడ్డి, డిప్యూటీ మేయర్ లక్ష్మీరవిగౌడ్‌పై కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లు పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. కీసర ఆర్డీవో వెంకట ఉపేందర్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో మేయర్, డిప్యూటీ మేయర్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానాలపై వేర్వేరుగా ఓటింగ్ నిర్వహించారు. మొత్తం 28 మంది కార్పొరేటర్లలో సమావేశానికి హాజరైన 22 మంది కాంగ్రెస్ కార్పొరేటర్లు అవిశ్వాసానికి మద్దతు పలికారు. దీంతో కార్పొరేషన్ కాంగ్రెస్ సొంతమైంది. అవిశ్వాస తీర్మానం నేపథ్యంలో 42 రోజులుగా క్యాంపులో ఉన్న కాంగ్రెస్ కార్పొరేటర్లు ఎట్టకేలకు శనివారం తిరిగొచ్చి ఓటింగ్‌లో పాల్గొన్నారు. కాగా, కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ సొంతమవడంతో ఆ పార్టీ శ్రేణులు సంబురాలు చేసుకున్నాయి. కాంగ్రెస్ నేత, మేడ్చల్ ఎమ్మెల్యే తోటకూర వజ్రేష్‌యాదవ్ కుమారుడు, బోడుప్పల్ 6వ డివిజన్ కార్పొరేటర్ తోటకూర అజయ్‌యాదవ్ మేయర్ పీఠం ఎక్కడం దాదాపు ఖాయమైంది.

'ఇల్లెందు' కౌన్సిల్ భేటీలో డిష్యుం.. డిష్యుం!

ఎమ్మెల్యే కోరం సమక్షంలోనే కొట్టుకున్న చైర్మన్, వైస్ చైర్మన్

'తూంకుంట' భేటీలో చైర్మన్, వైస్ చైర్‌పర్సన్‌పై కౌన్సిలర్ల దాడి


ఇల్లెందు మునిసిపల్ సమావేశంలో ఘర్షణ దృశ్యం

ఇల్లెందు/శామీర్‌పేట, జూన్ 29: ఇల్లెందు మునిసిపాలిటీ కౌన్సిల్ సమావేశం రసాభాసగా మారింది. శనివారం నిర్వహించిన కౌన్సిల్ భేటీలోనే చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరావు వైస్ చైర్మన్ ఎస్‌డీ జానీపాషాల మధ్య ఘర్షణ జరిగి పరస్పర దాడులు చేసుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య సమక్షంలోనే అధికార కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు ప్రజా ప్రతినిధులు తీవ్రంగా దుర్భాషలాడుతూ కొట్టుకోవడం గమనార్హం. కౌన్సిల్ సమావేశంలో అజెండా అంశాలపై జరుగుతున్న చర్చల్లో ప్రతి అంశంపై వైస్ చైర్మన్ జానీ జోక్యం చేసుకోవడంతో విసిగిపోయిన చైర్మన్ డీవీ ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో జానీ.. చైర్మన్ డీవీపై వ్యక్తిగత దూషణలు చేయడంతో ఆగ్రహించిన ఆయన జానీపై మొదట దాడి చేసినట్లు సమాచారం. చివరకు తోటి కౌన్సిలర్లతోపాటు ఎమ్మెల్యే కోరం వారిద్దరినీ సముదాయించి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

తూంకుంటలో చైర్మన్, వైస్‌చైర్‌పర్సన్‌పై దాడి

ఇటు తూంకుంట మునిసిపల్ సర్వసభ్య సమావేశంలోనూ సేమ్ సీన్ రిపీట్ అయ్యింది. అయితే ఇక్కడ మునిసిపల్ చైర్మన్, వైస్ చైర్‌పర్సన్‌పై నిధుల సాకుతో పలువురు కౌన్సిలర్లు దాడికి పాల్పడ్డారు. తూంకుంట మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ రాజేశ్వర్‌రావు అధ్యక్షతన ఉదయం భేటీ మొదలు కాగానే.. కౌన్సిలర్ సింగిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, సింగిరెడ్డి రజిని భర్త సింగిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, వారి మద్దతు కౌన్సిలర్లు, అనుచరులతో సమావేశం హాల్‌లోకి ప్రవేశించి వీరంగం సృష్టించారు. అభివృద్ధి నిధుల కేటాయింపులపై చైర్మన్ రాజేశ్వర్‌రావు, వైస్ చైర్‌పర్సన్ వాణీవీరారెడ్డిలను నిలదీశారు. వారిని దుర్భాషలాడుతూ వారిపైకి కుర్చీలు విసరగా వైస్‌చైర్‌పర్సన్ వాణి తలకు గాయమైంది. దీంతో ఆమెను ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, గతంలో అవిశ్వాస తీర్మానం విషయమై కౌన్సిలర్లు మనసులో పెట్టుకుని ఈ దాడులకు పాల్పడినట్లు సమాచారం.

జేఎన్‌టీయూ అఫిలియేషన్ కోసం ఎవరికీ డబ్బులివ్వొద్దు.!

ఎవరైనా అడిగితే నాకు ఫోన్ చేయండి: బుర్రా వెంకటేశం

హైదరాబాద్ సిటీ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ నుంచి అఫిలియేషన్ కోసం ఎవరికీ డబ్బులు ఇవ్వొద్దని ప్రైవేటు ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల యాజమాన్యాలకు ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్ బుర్రా వెంకటేశం సూచించారు. తాము అఫిలియేషన్ ఇప్పించామంటూ ఎవరైనా డబ్బు అడిగితే నేరుగా తనకే ఫోన్ చేయాలన్నారు. శనివారం ఆయా కళాశాలల యాజమాన్యాల ప్రతినిధులతో జేఎన్‌టీయూలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ విద్యా సంవత్సరం అఫిలియేషన్‌కు దరఖాస్తు చేసుకున్న కాలేజీల్లో ప్రిన్సిపాల్స్, ఫ్యాకల్టీ కొరత ఉన్నట్లుగా తమ దృష్టికి వచ్చిందని, అయినప్పటికీ షరతులతో కూడిన అనుమతి మంజూరు చేస్తామన్నారు. వచ్చే ఏడాది నుంచి అఫిలియేషన్ల విషయంలో నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, లేనిపక్షంలో కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లోని ఇంజనీరింగ్ కాలేజీల్లో సీఎస్ఈ కోర్సు సీట్లను పెంచుకుంటూ పోతే గ్రామీణ ప్రాంతాల్లో ఫ్యాకల్టీ దొరకని పరిస్థితి ఏర్పడుతున్నట్లుగా తమ దృష్టికి వచ్చిందని ఇన్‌చార్జ్ వీసీ పేర్కొన్నారు. సమావేశంలో రెక్టార్ విజయకుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, డైరెక్టర్లు రవీంద్రారెడ్డి, తారాకళ్యాణి, ప్రైవేటు ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలకు అఫిలియేషన్లు ఇవ్వడం, ఆయా కళాశాలల్లో బోధనా సిబ్బందిని ర్యాటిఫై చేయడం.. తదితర అంశాల్లో గత ఐదేళ్లుగా జరిగిన అవతవకలపై విచారణ చేపట్టాలని జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వీసీ బుర్రా వెంకటేశం శనివారం రిజిస్ట్రార్‌ను ఆదేశించారు. ఈ మేరకు ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేస్తూ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు వెంటనే ఉత్తర్వులు జారీ చేశారు.

భద్రాద్రి విద్యుత్ కేంద్రంపై పిడుగు

పవర్ జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధం

ఎగసిపడిన మంటలు.. రూ.10 కోట్ల నష్టం..?

మణుగూరు, జూన్ 29: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులోని భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో పిడుగు పడి పవర్ జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. రాత్రి 8 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా గాలి దుమారంతో కూడిన వర్షం వచ్చింది. ఈ క్రమంలో పిడుగు పడటంతో ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధమై భారీగా మంటలు ఎగసిపడ్డాయి. ఈ ట్రాన్స్‌ఫార్మర్ మొదటి యూనిట్ నుంచి ఉత్పత్తి అయిన విద్యుత్‌ను స్టెప్ అప్ చేసుకొని పవర్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేసే ప్రక్రియలో కీలకంగా ఉంటుంది. దీని ఖరీదు సుమారు రూ.10 కోట్లు ఉంటుందని తెలుస్తోంది. ట్రాన్స్‌ఫార్మర్ పూర్తిగా దెబ్బతిన్నదా..? లేక లేదా పాక్షికంగా పాడైపోయిందా..? అన్నది అధికారుల పరిశీలనలో తేలనుంది. బీటీపీఎస్‌లో నాలుగు యూనిట్లు ఉండగా ఒక్కో యూనిట్ నుంచి 270మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. పిడుగుపాటుతో 1, 2 యూనిట్లను షట్‌డౌన్ చేయడంతో 540 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. పవర్ ప్లాంట్లు, సబ్ స్టేషన్లకు పిడుగు పాట్ల నుంచి రక్షణ కల్పించేందుకు లైట్నింగ్ అరెస్టర్లను ఏర్పాటు చేస్తారు. అయితే బీటీపీఎస్‌లో ఈ వ్యవస్థ లేదా..? ఉంటే సరిగా పనిచేస్తుందా..? అనేది తేలాల్సి ఉంది. ఇప్పటి వరకు ఎక్కడా లేని విధంగా పవర్ స్టేషన్‌లో పిడుగుపడటం చర్చనీయాంశమైంది. సమాచారం అందుకున్న వెంటనే జెన్‌కో సీఎండీ రొనాల్డ్ రాస్ మణుగూరుకు పయనమైనట్లు తెలిసింది.

*Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: **K. Srinivas**. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. **Managing Director: Vemuri Radha Krishna,** Founder: K.L.N.Prasad.*

ఆంధ్రజ్యోతి
నవ్య | దృశ్యం
ఆదివారం • 30 జూన్ 2024

మరోసారి హిట్ కాంబో?




మరోసారి వెబ్‌సిరీస్‌లో మెరిసేందుకు సిద్ధమవుతున్నారట సమంత. ఆమెతో 'ది ఫ్యామిలీ మ్యాన్ 2', 'సిటాడెల్: హనీ బన్నీ' సిరీస్‌ను తెరకెక్కించిన రాజ్ అండ్ డీకే కాంబినేషన్‌లో ముచ్చటగా మూడో సిరీస్ తెరకెక్కుతోందని బాలీవుడ్ టాక్. ఆగస్టులో ఈ సిరీస్ చిత్రీకరణ ప్రారంభంకానుందనిచెబుతున్నారు. యాక్షన్ ఓరియంటెడ్ సిరీస్ కావడంతో సమంత ఇప్పటికే మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ మొదలుపెట్టారట. ఇందులో సమంత లీడ్‌రోల్‌లో నటించనున్నారు. బాలీవుడ్ నటుడు ఆదిత్యారాయ్ కపూర్ కీలకపాత్రపోషించనున్నారు. ఈ వెబ్ సిరీస్‌కు 'రక్త్‌బీజ్' అనే టైటిల్‌ను ఖరారుచేసినట్లు బాలీవుడ్ మీడియా చెబుతోంది. మయోసైటిస్ బారిన పడిన సమంత ప్రస్తుతం చికిత్స తీసుకుంటున్నారు. ఆమె నటించిన 'సిటాడెల్:హనీ బన్నీ' సిరీస్ త్వరలోనే ప్రముఖ ఓటీటీలో స్ట్రీమింగ్ అవనుంది. సమంత తన సొంత బేనర్ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ పై 'మా ఇంటి బంగారం' చిత్రాన్ని ప్రకటించారు.

పొరపాటే... దిద్దుకున్నాను

ప్రస్తుతం ఆరోగ్యంపై అవగాహన పెంచేందుకు కొన్ని పాడ్‌కాస్ట్ వీడియోలు చేస్తున్నారు సమంత. అయితే గతంలో కొన్ని అనారోగ్యకరమైన ఉత్పత్తులకు ప్రచారకర్తగా పని చేసిన మీరు ఇప్పుడు ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కలిగించే నైతిక హక్కు ఉందా అని సమంతను ఓ నెటిజన్ ప్రశ్నించారు. దాంతో ఆరోగ్యానికి హానికరమైన ఉత్పత్తులకు ప్రచారకర్తగా పనిచేయడం పట్ల సమంత పశ్చాత్తాపం వ్యక్తం చేశారు. గతంలో కొన్ని బ్రాండ్లకు ప్రచారం చేసి నేను పొరపాటు చేశాను. ఇప్పుడు ఆ తప్పును సరిదిద్దుకున్నాను. అలాంటి ఉత్పత్తులకు ప్రచారం చేయడం మానుకున్నాను అని తెలిపారు. ముందుగా నేను పాటించి, ఆ తర్వాతే ప్రజలకు చెబుతున్నాను అని చెప్పారు.

ఇండియన్ 2 మేకర్స్‌పై కాపీరైట్ కేసు



శంకర్ దర్శకత్వంలో కమల్‌హాసన్ కథానాయకుడిగా నటించిన 'ఇండియన్ 2' (తెలుగులో 'భారతీయుడు 2') చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. వీరి కాంబినేషన్‌లో గతంలో వచ్చిన 'ఇండియన్' చిత్రానికి ఇది సీక్వెల్. సుభాస్కరన్ నిర్మాత. జూలై 12న 'భారతీయుడు 2' విడుదలవనుంది. అయితే ఇంకొన్ని రోజుల్లో సినిమా విడుదలనుండగా రాజేంద్రన్ అనే మర్మకళ నిపుణుడు 'ఇండియన్ 2' చిత్రం విడుదల కాకుండా ఆపేందుకు న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. '1996లో 'ఇండియన్' చిత్రాన్ని తెరకెక్కించే సమయంలో మర్మకళకు సంబంధించిన కొన్ని ప్రయోగాలను కమల్‌హాసన్, శంకర్‌కు వివరంగా చెప్పాను. వాటి ఆధారంగా కొన్ని ఫైట్స్‌ను తెరకెక్కించారు. ఇప్పుడు ఆ చిత్రానికి వస్తున్న సీక్వెల్‌లోనూ నేను నేర్పించిన విద్యనే చూపించబోతున్నారని 'ఇండియన్ 2' ప్రోమో చూస్తే తెలిసింది. అయితే తొలి భాగం విడుదలైన సమయంలో టైటిల్ కార్డ్‌లో నా పేరు వేశారు, కానీ ఇప్పుడు 'ఇండియన్ 2'కు మాత్రం నాకు క్రెడిట్ ఇవ్వలేదు కాబట్టి 'ఇండియన్ 2' చిత్రం విడుదలపై స్టే ఇవ్వాలని మధురై న్యాయస్థానాన్ని అభ్యర్థించాడు. దీంతో న్యాయస్థానం శంకర్, కమల్‌హాసన్, సుభాస్కరన్‌కు కాపీరైట్ నోటీసులు పంపింది. తదుపరి విచారణను జూలై 9కి వాయిదా వేసింది.

మూడు హిట్లు ఆరు ఫ్లాపులు...

తెలుగు సినిమా ఆరు నెలల ప్రోగ్రెస్ రిపోర్ట్





ఏ సినిమా విజయానికి అయినా ఫస్ట్ హాఫ్ అనేది చాలా కీలకం. ఈ ఫస్ట్ హాఫ్ సెంటిమెంట్ ఇండస్ట్రీకి కూడా వర్తిస్తుంది. ఒక ఏడాదిలో ఎన్ని సినిమాలు విడుదలయ్యాయి.. అందులో ఎన్ని విజయం సాధించాయి అన్న దాన్ని బట్టి ఆ ఇండస్ట్రీ సక్సెస్ రేంజ్ ఆధారపడి ఉంటుంది. ఈ ప్రథమార్థంలో సంక్రాంతి సీజన్, సమ్మర్ సీజన్‌లో రిలీజైన సినిమాలు ఎన్నోసార్లు ఇండస్ట్రీ హిట్స్‌గా నిలిచి.. సినీ రంగానికి జోష్‌నిచ్చిన సందర్భాలు చాలానే ఉన్నాయి. అలా ఏడాది మొత్తం ఇండస్ట్రీ విజయపథంలో ప్రయాణించాలంటే ఫస్ట్ హాఫ్‌లో వచ్చిన సినిమాలు.. వాటి ఫలితాలు చాలా కీలకం. అలా ఈ ఏడాది రిలీజైన సినిమాలు.. అవి బాక్సాఫీస్ దగ్గర ఏ మేర రాణించాయో తెలుసుకుందాం.

జనవరితో జోష్

జనవరి నెలలో సంక్రాంతి సీజన్‌తో సినిమాల హడావుడి మొదలవుతుంది. అగ్ర హీరోల చిత్రాలు ఒకదానితో ఒకటి సై అంటూ బాక్సాఫీస్ దగ్గర పోటీపడడంతో మొదలవుతుంది. అప్పుడప్పుడూ చిన్న హీరోల చిత్రాలు.. ప్రయోగాత్మక చిత్రాలు కూడా బాక్సాఫీస్ వద్ద తమ అదృష్టం పరీక్షించుకుంటుంటాయి. అలా ఈ ఏడాది సంక్రాంతి బరిలో పలు అగ్ర హీరోల చిత్రాలు.. కుర్ర హీరోల చిత్రాలూ విడుదలయ్యాయి.

మహేశ్‌బాబు 'గుంటూరు కారం', నాగార్జున 'నా సామి రంగా', వెంకటేశ్ 'సైంధవ్', తేజ సజ్జా 'హనుమాన్' రిలీజ్ అయ్యాయి. వీటిలో 'హను-మాన్' బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఎటువంటి స్టార్ కాస్టింగ్ లేకుండా కేవలం రూ. 40 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ. 330 కోట్లు కలెక్ట్ చేసి పాన్ ఇండియా స్థాయిలో సత్తా



చాటి.. టాలీవుడ్ రికార్డ్స్‌ను కూడా బ్రేక్ చేసింది. దర్శకుడు ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో మొదటి చిత్రంగా తెరకెక్కిన 'హను-మాన్'కు కొనసాగింపుగా 'జై హనుమాన్' చిత్రం వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదలవుతున్నట్లు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు.

'అతడు', 'ఖలేజా' సినిమాల తర్వాత మళ్లీ 15 ఏళ్లకు మహేశ్‌బాబు, త్రివిక్రమ్ కలయికలో వచ్చిన 'గుంటూరు కారం' బాక్సాఫీస్ దగ్గర రూ. 171 కోట్లు కలెక్ట్ చేసి హిట్ సాధించింది. సంక్రాంతి పండుగ నేపథ్యంలో మలయాళం సినిమా 'పొరింజు మరియమ్ జోస్'కు రీమేక్‌గా తెరకెక్కిన 'నా సామి రంగా' బాక్సాఫీస్ వద్ద డీసెంట్ హిట్‌గా నిలవగా, 'సైంధవ్' అంచనాలను అందుకోలేకపోయింది. ఇక రిపబ్లిక్ డేకి విడుదలైన 'ర్యాపిడ్ యాక్షన్ మిషన్', 'బిఫోర్ మ్యారేజ్' చిత్రాలు ఎప్పుడు థియేటర్లలోకి వచ్చాయో వెళ్లాయో కూడా ప్రేక్షకులకు తెలియలేదు.

ప్రేమికుల నెలలో...

ఫిబ్రవరిలో కూడా బాక్సాఫీస్ దగ్గర పెద్ద చిత్రాలు, చిన్న చిత్రాలు సందడి చేశాయి. మొదటివారంలో రిలీజైన చిత్రాల్లో 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు', ప్రేక్షకులని మెప్పించగా.. 'బూట్‌కట్ బాలరాజు', 'గేమ్ ఆన్', 'కిస్మత్' చిత్రాలు నిరాశపరిచాయి. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో రవితేజ నటించిన 'ఈగల్' 9న విడుదలైంది. స్టైలిష్ యాక్షన్ ఎంటర్టైనర్‌గా ఎన్నో అంచనాలతో విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయింది. రిలీజ్‌కు ముందే 'నిజమే నే చెబుతున్నా' అనే పాటతో ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించిన 'ఊరి పేరు భైరవకోన' 16న విడుదలై మంచి టాక్ తెచ్చుకుంది. సందీప్ కిషన్, వర్ష బొల్లమ్మతో వి.ఐ ఆనంద్ తెరకెక్కించిన ఈ ఫ్యాంటసీ డ్రామా అంచనాలను నిలబెట్టుకుని ఫిబ్రవరిలో రిలీజైన చిత్రాల్లో టాప్ హిట్‌గా నిలిచింది. ఈ నెల చివరలో విడుదలైన వాటిలో వైవా హర్ష టైటిల్ పాత్రలో నటించిన 'సుందరం మాస్టర్' క్లాస్ హిట్‌గా నిలిచింది.

పరీక్షల మాసం 'మార్చి'లో...

మార్చి మొదటి వారంలో వరుణ్‌తేజ్ 'ఆపరేషన్ వాలంటైన్', 'భూతద్దం భాస్కర్ నారాయణ', వెన్నెల కిశోర్ 'చారి 111' వంటి చిత్రాలు రిలీజైనా ఒక్కటీ ప్రేక్షకుల్ని ఆకట్టుకోలేకపోయాయి. శివరాత్రి సందర్భంగా రెండో వారంలో గోపీచంద్ 'భీమా', విష్వక్ సేన్ 'గామి' చిత్రాలు ప్రేక్షకులను పలకరించాయి. 'గామి' విమర్శకుల ప్రశంసలందుకొని ప్రయోగాత్మక చిత్రంగా నిలిచింది. పుష్కలమైన మాస్ అంశాలతో తెరకెక్కిన సెమీ ఫ్యాంటసీ యాక్షన్ డ్రామా 'భీమా'ను ప్రేక్షకులు తిరస్కరించారు. మూడోవారంలో 'షరతులు వర్తిస్తాయి', 'వెయ్ దరువెయ్' 'రజాకార్', 'లంబసింగి' వంటి చిన్న చిత్రాలు రిలీజై పరాజయం బాట పట్టాయి.



నాలుగోవారంలో రిలీజైన 'ఓం భీమ్ బుష్' హిట్‌గా నిలిచింది. శ్రీ హర్ష కొనుగంటి దర్శకత్వంలో శ్రీవిష్ణు, ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ నటించిన ఈ చిత్రం థియేటర్లలో ప్రేక్షకులని నవ్వించింది. ఆఖరి వారంలో రిలీజైన 'టిల్లు స్క్వేర్' మార్చిలోనే అతి పెద్ద విజయాన్ని నమోదు చేసుకోవడమే కాక.. వంద కోట్లకు పైగా కలెక్షన్లను రాబట్టింది. టిల్లుగా సిద్ధు జొన్నలగడ్డ, లిల్లీగా అనుపమా తెరపై సందడి చేయగా.. మొదటి భాగం 'డీజే టిల్లు'లో రాధిక పాత్ర పోషించి సూపర్ ఫాలోయింగ్ సంపాదించుకున్న నేహా శెట్టి.. ఇందులోనూ అతిథి పాత్రలో తళుక్కుమని థియేటర్లలో విజిల్స్ వేయించుకున్నారు.

సెలవుల మాసం 'ఏప్రిల్'లో


ఏప్రిల్ మొదటి వారంలో విజయ్ దేవరకొండ, మృణాల్ ఠాకూర్ జంటగా నటించిన 'ఫ్యామిలీ స్టార్'



విడుదలైంది. ఎన్నో అంచనాలతో, సూపర్ సక్సెస్ గ్యారంటీ అనుకున్న ఈ చిత్రం ఊహించని స్థాయిలో బాక్సాఫీస్ వద్ద పరాజయాన్ని చవిచూసింది. రెండో వారంలో 'గీతాంజలి'కి కొనసాగింపుగా అంజలి నటించిన హారర్ కామెడీ 'గీతాంజలి మళ్లీ వచ్చింది' మొదటి భాగంలా విజయాన్ని నమోదు చేయలేకపోయింది. 'ఫ్యామిలీ స్టార్' సినిమా మినహా ఏ పెద్ద చిత్రం లేకపోవడంతో చిన్న సినిమాలు విడుదలకు క్యూ కట్టాయి. 'మార్కెట్ మహాలక్ష్మీ', 'పారిజాత పర్వం', 'శ్రీరంగనీతులు' వంటి చిన్న సినిమాలు విడుదలైనా.. ప్రేక్షకులను థియేటర్లకు రప్పించలేకపోయాయి.

ముండుటెండల 'మే'లో...

మే నెల సినిమాలకు చాలా కీలకం. సాధారణంగా పెద్ద హీరోల చిత్రాలు రిలీజ్ అయ్యే ఈ సీజన్‌లో ఈ సారి అందుకు పూర్తి భిన్నమైన పరిస్థితి కనిపించింది.



మండుటెండలు, ఐపీఎల్ హవా, ఎలక్షన్ల హడావుడి, చిత్రీకరణల్లో జాప్యం ఇందుక్కారణం.

చిన్న చిత్రాలు క్యూ కట్టినా ఏ ఒక్కటీ విజయతీరాలకు చేరలేదు. మొదటి రెండు వారాల్లో విడుదలైన 'ప్రసన్నవదనం', 'ఆ ఒక్కటీ అడక్కు', 'కృష్ణమ్మ', 'ఆరంభం', 'ప్రతినిధి 2' చిత్రాల్లో కొన్ని అంతో ఇంతో ఆకట్టుకున్నా.. ఐపీఎల్ హంగామా, ఎలక్షన్ల హడావుడి వల్ల కలెక్షన్లు రాబట్టలేకపోయాయి. మే మూడో వారంలో విడుదలైన 'రాజు యాదవ్', 'లవ్ మీ' చిత్రాలు అంచనాలను అందుకోలేక బోల్తాపడ్డాయి. ఆఖరి వారంలో రిలీజైన 'భజేవాయువేగం', 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి', 'గం గం గణేశా' చిత్రాల్లో ఒక్కటీ కూడా కమర్షియల్ హిట్ కాలేదు. అలా మే నెల అంతా హిట్ లేక ఇండస్ట్రీ వెలవెలబోయింది.

చిరుజల్లుల 'జూన్'లో


'మనమే' చిత్రంతో ఓ డీసెంట్ హిట్ కొట్టారు శర్వానంద్. ఫ్యామిలీ ఆడియెన్స్‌ను మెప్పించిన ఈ చిత్రం థియేటర్లకు ప్రేక్షకులని రప్పించగలిగింది. నవదీప్ హీరోగా యూత్‌ని టార్గెట్ చేసి తీసిన బోల్డ్ మూవీ 'లవ్ మౌళి' బాక్సాఫీస్ దగ్గర విఫలమైంది. టీజర్, ట్రైలర్‌తో విపరీతమైన బజ్ క్రియేట్ చేసిన 'హరోం హర' రిలీజ్ అయ్యాక ఆ క్రేజ్‌ను క్యాష్ చేసుకోలేకపోయింది. చాందిని చౌదరి నటించిన 'యేవమ్', 'మ్యూజిక్ షాప్ మూర్తి'కి కూడా నిరాశ తప్పలేదు. మూడో వారంలో వరుణ్ సందేశ్ నటించిన 'నింద' డీసెంట్ టాక్ తెచ్చుకోగా.. అదే రోజు విడుదలైన 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్', 'ఓ మంచి ఘోస్ట్', 'అంతిమ తీర్పు' చిత్రాలు ఎలాంటిబాక్సాఫీస్ దగ్గర ఎలాంటి ప్రభావం చూపించలేకపోయాయి. ఇక అందరినీ ఎంతో కాలంగా ఊరించిన 'కల్కి 2898 ఏ.డీ' చిత్రం నాలుగో వారంలో విడుదలై బాక్సాఫీస్ వద్ద



కలెక్షన్ల సునామీని సృష్టిస్తోంది. కొన్నాళ్లుగా ఖాళీగా దర్శనమిచ్చిన థియేటర్లను హౌస్‌ఫుల్ బోర్డ్‌లతో కిటకిటలాడించింది. మొదటిరోజే ఈ సినిమా ఏకంగా 191 కోట్లు సాధించడమే కాకుండా ప్రీ బుకింగ్స్‌లోనూ సరికొత్త రికార్డులను నెలకొల్పింది. ప్రభాస్‌కు 'బాహుబలి' తర్వాత ఇన్నేళ్లకు ఈ రేంజ్ హిట్ దక్కగా.. కెరీర్ తొలినాళ్లలో యాంగ్రీ యంగ్ మ్యాన్‌గా ఆకట్టుకున్న అమితాబ్‌బచ్చన్‌ను ఇన్నేళ్ల తర్వాత మరోసారి ప్రేక్షకులకు పరిచయం చేశారని దర్శకుడు నాగ్ అశ్విన్ కితాబులందుకున్నారు.

డబ్బింగ్ చిత్రాల హవా

తెలుగు ప్రేక్షకులు భాషతో సంబంధం లేకుండా సినిమాని చక్కగా ఆదరిస్తారని మరోసారి నిరూపించుకున్నారు. మలయాళం సినిమాలు 'ప్రేమలు', 'ద గోట్ లైఫ్' 'ఆడుజీవితం', 'మంజుమ్మెల్ బాయ్స్', విజయ్ సేతుపతి నటించిన 50వ చిత్రం 'మహారాజ' సినిమాలు ఇందుకు ఉదాహరణ. ఇవి థియేటర్లలో చక్కటి కలెక్షన్లు సొంతం చేసుకున్నాయి.







ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
స్ప్రింట్	వెబ్‌సిరీస్	జూలై 02
బెవర్లీహిల్స్ కాప్	హాలీవుడ్ మూవీ	జూలై 03
ద మ్యాన్ విత్ థౌజండ్ కిడ్స్	వెబ్‌సిరీస్	జూలై 03
బార్బెక్యూ షో డౌన్	రియాలిటీ షో	జూలై 04
అమెజాన్ ప్రైమ్		
గరుడన్	తమిళ చిత్రం	జూలై 03
బాబ్ మార్లే	హాలీవుడ్ మూవీ	జూలై 03
స్పేస్ క్యాడెట్	హాలీవుడ్ మూవీ	జూలై 04
మీర్జాపూర్ 3	హిందీ సిరీస్	జూలై 05
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
రెడ్ స్వాన్	కొరియన్ సిరీస్	జూలై 03
సోనీ లివ్		
మలయాళీ ఫ్రమ్ ఇండియా	మాలయాళ చిత్రం	జూలై 05
బుక్ మై షో		
ఇఫ్	హిందీ డబ్బింగ్	జూలై 03
ఫ్యూరియోసా	తెలుగు డబ్బింగ్	జూలై 04
ది సీడింగ్	తెలుగు డబ్బింగ్	జూలై 05
జియో సినిమా		
ప్రైమ్ టైమ్ విత్ మూర్తీస్	కామెడీ షో	జూలై 03
హీ వాంట్ దట్ వే	హాలీవుడ్ మూవీ	జూలై05
మనోరమా మ్యాక్స్		
మందాకిని	మలయాళ చిత్రం	జూలై 05

జాతకం చూసే అవకాశం ఇచ్చారా?

ఫ్లాష్‌బ్యాక్



ఎన్టీఆర్ తర్వాత జానపద చిత్రాల కథానాయకుడిగా మంచి పేరు తెచ్చుకున్నారు కాంతారావు. ఆయన నటించిన జానపద చిత్రాలు తమిళంలోనూ మంచి విజయం సాధించాయి. 'జూనియర్ ఎన్టీఆర్' కాంతారావుని అక్కడ పిలిచేవారు. కాంతారావు, జానపద బ్రహ్మ విఠలాచార్యది సక్సెస్‌ఫుల్ కాంబినేషన్. ఒకరకంగా చెప్పాలంటే జానపద హీరోగా కాంతారావు పేరు తెచ్చుకోవడానికి ప్రధాన కారకులు విఠలాచార్యే. వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన తొలి జానపద చిత్రం 'జయవిజయ'. కాంతారావు 'సతీ సుకన్య' చిత్రంలో ఉండగా ఒకరోజు విఠలాచార్య సెట్‌కు వచ్చి 'మనం చేసిన సోషల్ పిక్చర్ 'కన్యాదానం' ఆడలేదు. ఇప్పుడు ఓ జానపద చిత్రం తీయాలనుకుంటున్నాను. ప్రస్తుతం 'సిపాయి కూతురు' చిత్రంలో హీరోగా నటిస్తున్న సత్యనారాయణ నా దృష్టిలో ఉన్నాడు. ఎన్టీఆర్‌లా పొడుగ్గా ఉన్నాడు. బాగున్నాడు. నీ గురించి కూడా ఆలోచిస్తున్నాను. నీ జాతకం, సత్యనారాయణ జాతకం పరిశీలించి, మీ ఇద్దరిలో ఒకరిని హీరోగా తీసుకుంటాను' అన్నారు విఠలాచార్య. ఇది జరిగిన కొన్ని రోజులకు సత్యనారాయణ నటించిన 'సిపాయి కూతురు' విడుదలై ఫ్లాప్ అయింది. దీంతో జాతకం చూడకుండానే కాంతారావుని హీరోగా ఎంపిక చేసి 'జయవిజయ' చిత్రాన్ని నిర్మించారు విఠలాచార్య. 1959 లో విడుదలైన ఆ చిత్రంతో జానపద హీరోగా కాంతారావు కెరీర్‌లో సరికొత్త అధ్యాయం మొదలైంది. కృష్ణకుమారి ఈ సినిమాలో హీరోయిన్‌గా నటించారు. అలాగే జానపదబ్రహ్మగా విఠలాచార్య విజృంభణ 'జయవిజయ'తో మొదలైంది.

జూహీ చావ్లా తొలి తెలుగు చిత్రం



హీరో కృష్ణ దర్శకత్వం వహించిన మూడో చిత్రం 'కలియుగ కర్ణుడు'. తన సొంత సంస్థకు కాకుండా ఒక బయటి నిర్మాత తీసే చిత్రానికి దర్శకత్వం వహించడం ఆయనకు అదే ప్రథమం. విజయవాడలో అప్సర థియేటర్ యజయాని డి.కాశీవిశ్వనాథరావుతో తనకున్న అనుబంధం కారణంగానే కృష్ణ ఈ సినిమా అంగీకరించారు. అంతకుముందు తనతో 'వజ్రాయుధం' సినిమా తీయాలనుకున్న కాశీవిశ్వనాథరావు తప్పనిసరి పరిస్థితుల్లో చివరి క్షణంలో పక్కకు తప్పుకోవడంతో ఆయనకు మరో సినిమా చేయడం తన నైతిక బాధ్యతగా భావించి 'కలియుగ కర్ణుడు' సినిమాలో నటించారు కృష్ణ. అలాగే రమేశ్‌బాబు హీరో అయ్యాక తండ్రితో కలసి నటించిన తొలి సినిమా ఇదే. ఇందులో వీరిద్దరూ అన్నదమ్ములుగా నటించారు.

రమేశ్ సరసన జూహీ చావ్లా

ఈ సినిమాలో రమేశ్‌బాబు సరసన బాలీవుడ్ నటి జూహీ చావ్లా నటించింది. కాకపోతే పేరుతో తెలుగుదనం ఉండాలని ఇందులో ఆమె పేరుని 'మీనా'గా మార్చారు. (బాలనటి మీనా అప్పటికి హీరోయిన్ కాలేదు). 'సుల్తానత్' (1986) చిత్రంతో హీరోయిన్‌గా పరిచయమైన జూహీ చావ్లా ఆ తర్వాత 'ప్రేమలోక' (1987) కన్నడ సినిమాలో నటించింది. ఆ సినిమా చూసి 'కలియుగ కర్ణుడు' లో హీరోయిన్‌గా ఎంపిక చేశారు కృష్ణ. ఈ సినిమా తర్వాత జూహీ చావ్లా పేరుతోనే 'విక్కీదాదా'(1989), శాంతి-క్రాంతి'(1991) సినిమాల్లో నాగార్జున సరసన ఆమె నటించింది. 'కలియుగ కర్ణుడు' చిత్రనిర్మాణ సమయంలోనే అమీర్‌ఖాన్, జూహీ చావ్లా జంటగా నటించిన 'ఖయామత్ సే ఖయామత్ తక్' హిందీ చిత్రం విడుదలై ఘనవిజయం సాధించడంతో తెలుగు ప్రేక్షకుల్లోనూ ఆమె అంటే క్రేజ్ ఏర్పడింది. అది 'కలియుగ కర్ణుడు' చిత్రానికి ప్లస్ అయింది.

ఆంధ్రజ్యోతి దిక్సూచి

అగ్రి డిప్లొమాలు



ఎన్‌జీ రంగా వర్సిటీ

గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ- డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగించింది. అగ్రికల్చర్, సీడ్ టెక్నాలజీ, ఆర్గానిక్ అగ్రికల్చర్ విభాగాల్లో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ వ్యవధి మూడేళ్లు. పదోతరగతి/తత్సమాన పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ప్రభుత్వ పాలిటెక్నిక్‌లతోపాటు అనుబంధ పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్స్ ఇస్తారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

డిప్లొమాలు-సీట్లు

- డిప్లొమా ఇన్ అగ్రికల్చర్-ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో 578 సీట్లు, అనుబంధ కళాశాలల్లో 1900 సీట్లు ఉన్నాయి.
- డిప్లొమా ఇన్ సీడ్ టెక్నాలజీ-ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో 25 సీట్లు, అనుబంధ కళాశాలల్లో 260 సీట్లు ఉన్నాయి.
- డిప్లొమా ఇన్ ఆర్గానిక్ అగ్రికల్చర్-ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో 25 సీట్లు, అనుబంధ కళాశాలల్లో 40 సీట్లు ఉన్నాయి.
- డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్-ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో 60 సీట్లు, అనుబంధ కళాశాలల్లో 330 సీట్లు ఉన్నాయి.
- కనీసం నాలుగేళ్ల గ్రామీణ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు 75 శాతం సీట్లు, పట్టణ ప్రాంతాల్లో చదివినవారి కోసం 25 శాతం సీట్లు ప్రత్యేకించారు. మొత్తం సీట్లలో 85 శాతం సీట్లను స్థానికులకు నిర్దేశించారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.

అర్హత వివరాలు: ఆంధ్రప్రదేశ్/తెలంగాణ స్టేట్ బోర్డు లేదా సీబీఎస్‌ఈ/ఐసీఎస్‌ఈ/ఎన్‌ఐఓఎస్/ఏపీఓఎస్ఎస్/టీఓఎస్ఎస్ నుంచి పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. పదోతరగతి కంపార్ట్‌మెంటల్ అభ్యర్థులు; ఇంటర్ ఫెయిల్/మధ్యలో ఆపేసినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్ ఉత్తీర్ణులు/ఆపై చదివినవారు దరఖాస్తుకు అనర్హులు. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 31 నాటికి 15 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.800; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.400
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 30
- **వెబ్‌సైట్:** angrau.ac.in

డా.వైఎస్సార్ హెచ్‌యూ

పశ్చిమగోదావరి జిల్లా-వెంకటరామన్నగూడెంలోని డా.వైఎస్సార్ హార్టికల్చరల్ యూనివర్సిటీ(డావైఎస్సార్‌హెచ్‌యూ)- డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగించింది. రాష్ట్రంలోని ప్రభుత్వ, అనుబంధ హార్టికల్చరల్ పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్స్ నిర్వహించనున్నారు. డిప్లొమా ఇన్ హార్టికల్చర్ ప్రోగ్రామ్‌లో 528 సీట్లు, డిప్లొమా ఇన్ హార్టికల్చరల్ ఫుడ్ ప్రాసెసింగ్ ప్రోగ్రామ్‌లో 22 సీట్లు చొప్పున మొత్తం 550 సీట్లు ఉన్నాయి. వీటిలో 75 శాతం సీట్లను గ్రామీణ విద్యార్థులకు, 25 శాతం సీట్లను పట్టణ ప్రాంతాల వారికి కేటాయించారు. మొత్తం సీట్లలో 85 శాతం సీట్లను స్థానికులకు ప్రత్యేకించారు. మిగిలిన 15 శాతం సీట్లకు దేశవ్యాప్తంగా అభ్యర్థులందరూ పోటీపడవచ్చు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్లు వర్తిస్తాయి. పదోతరగతి/తత్సమాన పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది.

డిప్లొమా ఇన్ హార్టికల్చర్ సీట్ల వివరాలు

ప్రభుత్వ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లు: డా.బీ.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా-రామచంద్రాపురంలోని ఎస్‌కేపీపీ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లో 60 సీట్లు, ఏలూరు జిల్లా-నూజివీడులోని హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లో 40 సీట్లు, అన్నమయ్య జిల్లా-కలికిరిలోని హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లో 40 సీట్లు, శ్రీ సత్యసాయి జిల్లా-మడకశిరలోని ఎస్ఎస్‌పీజీ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లో 60 సీట్లు చొప్పున మొత్తం 200 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు అదనంగా పది శాతం సీట్లు కేటాయించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో మొత్తం 220 సీట్లు ఉన్నాయి.

అనుబంధ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లు: శ్రీకాకుళం జిల్లా-ఎస్వీ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, మన్యం జిల్లా-ఎన్ఆర్ఆర్ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, ఏలూరు జిల్లా-నోవా కాలేజ్ ఆఫ్ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, పలనాడు జిల్లా-సాదినేని చౌదరయ్య హార్టికల్చరల్ పాలిటెక్నిక్, ప్రకాశం జిల్లా-శ్రీ బెల్లంకొండ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, వైఎస్సార్ కడప జిల్లా-ఎస్‌బీవీఆర్ హార్టికల్చరల్ పాలిటెక్నిక్, నంద్యాల జిల్లా-ఎస్ఆర్ హార్టికల్చరల్ పాలిటెక్నిక్‌లలో ఒక్కోదానిలో 40 చొప్పున మొత్తం 280 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు అదనంగా 28 సీట్లు కేటాయించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అనుబంధ పాలిటెక్నిక్ కళాశాలల్లో మొత్తం 308 సీట్లు ఉన్నాయి.

డిప్లొమా ఇన్ హార్టికల్చరల్ ఫుడ్ ప్రాసెసింగ్ సీట్ల వివరాలు: నంద్యాల జిల్లాలోని హార్టికల్చరల్ ఫుడ్ ప్రాసెసింగ్ పాలిటెక్నిక్ కళాశాలలో 20 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు అదనంగా 2 సీట్లు కేటాయించారు. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 22 సీట్లు ఉన్నాయి.

అర్హత: బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ నిర్వహించే పదోతరగతి పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. సీబీఎస్‌ఈ/ఎన్ఐఓఎస్/ఓఎస్ఎస్/ఐసీఎస్‌ఈ అభ్యర్థులు కూడా అర్హులే. పదోతరగతి కంపార్ట్‌మెంటల్ అభ్యర్థులు, ఇంటర్ మధ్యలో ఆపేసిన/ఫెయిల్ అయిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్ ఉత్తీర్ణులు, ఆపై చదివినవారు దరఖాస్తుకు అనర్హులు. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 31 నాటికి 15 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

- **దరఖాస్తు, కౌన్సెలింగ్ ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.800; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.400
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 6
- ఆన్‌లైన్ కౌన్సెలింగ్ తేదీలను త్వరలో ప్రకటిస్తారు.
- **వెబ్‌సైట్:** https://drysrhu.ap.gov.in

ఎఫ్‌సీఆర్ఐలో బీఎస్సీ ఆనర్స్ ఫారెస్ట్రీ

సిద్దిపేట జిల్లా ములుగులోని ఫారెస్ట్ కాలేజ్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌సీఆర్ఐ) హైదరాబాద్- బీఎస్సీ(ఆనర్స్) ఫారెస్ట్రీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగించింది. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. మొత్తం 55 రెగ్యులర్ సీట్లు ఉన్నాయి. టీజీ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. మేథమెటిక్స్ స్ట్రీమ్ అభ్యర్థులకు 25 శాతం, బయాలజీ స్ట్రీమ్ అభ్యర్థులకు 75 శాతం సీట్లు ప్రత్యేకించారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.



అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ లేదా మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ లేదా మేథమెటిక్స్, బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. జనరల్ అభ్యర్థులకు 45 శాతం; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు ఉండాలి. టీజీ ఈఏపీసెట్ 2024 అర్హత పొంది ఉండాలి. అభ్యర్థుల వయసు డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు మూడేళ్లు; దివ్యాంగులకు అయిదేళ్ల సడలింపు వర్తిస్తుంది.

ముఖ్య సమాచారం

- **ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.600; దివ్యాంగులు, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.400
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 1
- **వెబ్‌సైట్:** www.fcrihyd.in/

ఇఫ్లూలో ఇంగ్లీష్ ప్రొఫిషియెన్సీ కోర్సు

హైదరాబాద్‌లోని ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ(ఇఫ్లూ-సెంట్రల్ యూనివర్సిటీ)- ఇంగ్లీష్‌లో 160 గంటల ప్రొఫిషియెన్సీ కోర్సును నిర్వహిస్తోంది. అభ్యర్థులు ఆంగ్ల భాషలో ప్రావీణ్యం సాధించేందుకు ఈ ప్రోగ్రామ్ ఉపకరిస్తుంది. హైదరాబాద్ క్యాంపస్‌లో మొత్తం 200 సీట్లు ఉన్నాయి. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్‌డ్ పద్ధతిలో అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్ ఆగస్టులో ప్రారంభమౌతుంది.

కోర్సు వివరాలు

- ఇందులో బేసిక్, ఇంటర్మీడియట్, అడ్వాన్స్‌డ్ లెవెల్స్ ఉంటాయి. ప్లేస్‌మెంట్ టెస్ట్ ద్వారా లెవెల్ అడ్మిషన్ ఉంటుంది. కోర్సు వ్యవధి నాలుగు నెలలు. రోజుకు రెండు గంటలు చొప్పున వారానికి అయిదు రోజులు తరగతులు నిర్వహిస్తారు. తరగతికి 30 నుంచి 35 మంది అభ్యర్థులు ఉంటారు. ఉదయం, సాయంత్రం బ్యాచ్‌లు నిర్వహిస్తారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. కనీసం 80 శాతం అటెండెన్స్ తప్పనిసరి.
- కోర్సులో భాగంగా ఇంగ్లీష్ లాంగ్వేజ్‌కు సంబంధించి లిజనింగ్, స్పీకింగ్, రీడింగ్, రైటింగ్, కమ్యూనికేషన్, గ్రామర్, ఒకాబులరీ అంశాల్లో శిక్షణ ఇస్తారు. వారానికి ఒకసారి ప్రొనౌన్సియేషన్ ప్రాక్టీస్ ఉంటుంది. రీసెర్చ్ స్కాలర్స్, టీచింగ్ అసిస్టెంట్లు క్లాస్‌రూం తరగతులు నిర్వహిస్తారు. వీటికి సంబంధించిన మెటీరియల్ ఫొటోకాపీ ఇస్తారు. డిజిటల్ ల్యాబ్స్ ఉంటాయి. అభ్యర్థుల నెలవారీ ప్రోగ్రెస్‌ను పరీక్షిస్తారు. కోర్సు చివరలో ఫైనల్ టెస్ట్ ఉంటుంది. ఇందులో ఉత్తీర్ణులైనవారికి మాత్రమే సర్టిఫికెట్‌లు ఇస్తారు.



అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైనవారు; సంస్థ నిర్వహించే 40 గంటల ఇంగ్లీష్ ప్రొఫిషియెన్సీ కోర్సు పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. విదేశీ విద్యార్థులు వీసా, రెసిడెన్స్ పర్మిట్ కాపీలు సబ్మిట్ చేయాలి.

ముఖ్య సమాచారం

- **కోర్సు ఫీజు:** భారతీయ విద్యార్థులకు రూ.10,000; విదేశీ విద్యార్థులకు రూ.20,000; ఇఫ్లూలో చదివిన/చదువుతున్న విదేశీ విద్యార్థులకు రూ.15,000
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** జూలై 1 నుంచి
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 28
- **ప్లేస్‌మెంట్ టెస్ట్ తేదీ:** ఆగస్టు 1
- **వెబ్‌సైట్:** www.efluniversity.ac.in

ఉస్మానియ యూనివర్సిటీలో వర్క్‌షాప్



హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్(డీఈఈ)- వారం రోజుల వర్క్‌షాప్‌ను నిర్వహిస్తోంది. దీని ప్రధానాంశం 'అప్లికేషన్స్ ఆఫ్ డిజిటల్ కంట్రోల్ ఇన్ పవర్ ఎలక్ట్రానిక్ కన్వర్టర్స్'. ఈ వర్క్‌షాప్‌ను ఆర్‌యూఎస్ఏ-2.0, వీఐ మైక్రో సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు స్పాన్సర్ చేస్తున్నాయి. ఇందులో ఫండమెంటల్ అండ్ అడ్వాన్స్‌డ్ థియరిటికల్ కాన్సెప్ట్‌లు; మైక్రో కంట్రోలర్స్, డిజిటల్ సిగ్నల్ ప్రాసెసర్స్, ఫీల్డ్ ప్రోగ్రామబుల్ గేట్ యారేస్‌ల వినియోగం; ల్యాబొరేటరీ సెషన్స్ ఉంటాయి. సంబంధిత విభాగాలకు చెందిన రీసెర్చ్ స్కాలర్స్, ఇండస్ట్రీ పార్టిసిపెంట్స్, ఫ్యాకల్టీ మెంబర్లు, విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్‌డ్ పద్ధతిలో అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఎంపికైనవారికి ఈ-మెయిల్ ద్వారా సమాచారమిస్తారు.

ముఖ్య సమాచారం

- **రిజిస్ట్రేషన్ ఫీజు:** రీసెర్చ్ స్కాలర్స్‌కు రూ.2,500; ఫ్యాకల్టీ మెంబర్లు, విద్యార్థులకు రూ.3,500; ఇండస్ట్రీ పార్టిసిపెంట్స్‌కు రూ.4,500
- **రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** జూన్ 30
- **వర్క్‌షాప్ వ్యవధి:** జూలై 8 నుంచి 13 వరకు
- **వెబ్‌సైట్:** www.uceou.edu

కేంద్ర విభాగాల్లో ఎంటీఎస్, హవల్దార్ ఉద్యోగాలు

మొత్తం ఖాళీలు: 8,326

స్టాఫ్ సెలెక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ).... కేంద్ర మంత్రిత్వ శాఖలు/విభాగాలు/కార్యాలయాల్లో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

కేంద్ర మంత్రిత్వ శాఖలు/విభాగాలు: జనరల్ సెంట్రల్ సర్వీస్, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్, సెంట్రల్ బ్యూరో ఆఫ్ నార్కోటిక్స్

1. మల్టీ టాస్కింగ్(నాన్-టెక్నికల్) స్టాఫ్ (గ్రూప్-సీ నాన్ గెజిటెడ్, నాన్ మినిస్టీరియల్): **4,887 పోస్టులు**
2. హవల్దార్(గ్రూప్-సి నాన్ గెజిటెడ్, నాన్ మినిస్టీరియల్): **3,449 పోస్టులు**

అర్హతలు: గుర్తింపు పొందిన బోర్డు నుంచి పదోతరగతి లేదా తత్సమానం ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 2024 ఆగస్టు 1 నాటికి పోస్టులను అనుసరించి 18-25, 18-27 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

ఎంపిక: ఎంటీఎస్ ఖాళీలకు సెషన్-1, 2 కంప్యూటర్ ఆధారిత పరీక్షలు, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా; హవల్దార్ ఖాళీలకు కంప్యూటర్ బేస్డ్ ఎగ్జామినేషన్, ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.

కంప్యూటర్ ఆధారిత పరీక్ష విధానం:

సెషన్-1: న్యూమరికల్ అండ్ మేథమెటికల్ ఎబిలిటీ(20 ప్రశ్నలు/60 మార్కులు), రీజనింగ్ ఎబిలిటీ అండ్ ప్రాబ్లమ్ సాల్వింగ్(20 ప్రశ్నలు/60 మార్కులు).

సెషన్-2: జనరల్ అవేర్‌నెస్(25 ప్రశ్నలు/75 మార్కులు), ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రహెన్షన్(25 ప్రశ్నలు/75 మార్కులు)

సీబీటీ వ్యవధి: ప్రతి సెషన్ 45 నిమిషాలు

దరఖాస్తు రుసుము: రూ.100. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మాజీ సైనికులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: చీరాల, గుంటూరు, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, రాజమహేంద్రవరం, తిరుపతి, విజయనగరం, విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్, కరీంనగర్, వరంగల్.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 31

కంప్యూటర్ ఆధారిత పరీక్షలు: అక్టోబరు/నవంబరు

వెబ్‌సైట్: https://ssc.gov.in/

జాబ్ కార్నర్

హెచ్‌ఎల్‌ఎల్ లైఫ్‌కేర్‌లో ఖాళీలు

సికింద్రాబాద్‌లోని హెచ్‌ఎల్‌ఎల్ లైఫ్‌కేర్ లిమిటెడ్...కాంట్రాక్ట్ ప్రాతిపదికన బీబీనగర్ ఎయిమ్స్(అమృత్ ఫార్మసీ ఔట్‌లెట్‌లు), తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ ఆస్పత్రుల్లో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తుంది.

1. ఫార్మసిస్ట్

అర్హత: బి.ఫార్మసీ/డి.ఫార్మసీ ఉత్తీర్ణతతో పాటు రెండేళ్ల పని అనుభవం ఉండాలి

2. అసిస్టెంట్ ఫార్మసిస్ట్

అర్హత: బి.ఫార్మసీ/డి.ఫార్మసీ ఉత్తీర్ణులై ఉండాలి.

వయసు: జూలై 1 నాటికి 37 సంవత్సరాలు మించకూడదు

ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా

ఇంటర్వ్యూ తేదీలు: జూలై 4

స్థలం: హెచ్‌ఎల్‌ఎల్ లైఫ్‌కేర్ లిమిటెడ్, ఈస్ట్ మారేడ్‌పల్లి, సికింద్రాబాద్.

వెబ్‌సైట్: www.lifecarehll.com/

HLL Lifecare Limited
(A Government of India Enterprise)

తెలంగాణలో సివిల్ అసిస్టెంట్ సర్జన్స్

మొత్తం ఖాళీలు: 435

తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్... రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో జనరల్ రిక్రూట్‌మెంట్ విధానంలో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.



అర్హత: అభ్యర్థులు ఎంబీబీఎస్ లేదా దానికి సమానమైన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్టర్ అయి ఉండాలి.

గరిష్ఠ వయోపరిమితి: 2025 జూలై 1 నాటికి 46 ఏళ్లు మించకూడదు

ఎంపిక: ఎంబీబీఎస్ మార్కులు, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభం: జూలై 2

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 11

వెబ్‌సైట్: https://mhsrb.telangana.gov.in/

లిటిల్స్


ప్రతిఫలాపేక్ష

ఒక రాజ్యంలో వేదమిత్రుడనే కవి ఉండేవాడు. అతను గొప్ప కవిత్వం రాసేవాడు, మంచి పండితుడు కూడా. కానీ అతను చాలా పేదవాడు. ఒకరోజు భట్టు అనే అతని స్నేహితుడు 'వేద మిత్రా.. నీ కవిత్వం అద్భుతంగా ఉంది. నువ్వు దీన్ని ఈ దేశపు రాజుగారికి వినిపిస్తే, నీకు పేదరికం అన్న మాటే తెలియదు' అన్నాడు. ఆ మాటలు విన్న వేద




మిత్రుడు రాజుగారిని దర్శనం చేసుకుని, తన కవిత్వం వినిపించాడు. దానికి రాజుగారు మెచ్చి ఎన్నో బహుమానాలు ఇవ్వడమే కాకుండా, తన ఆస్థానంలో ఉద్యోగం కూడా ఇచ్చారు. అలా కొన్నాళ్లు గడిచిన తర్వాత తనకు రాజాశ్రయం కోరమని సలహా ఇచ్చిన భట్టును కలిసి వేద మిత్రుడు ఇలా అన్నాడు 'మిత్రమా.. నేను రాజుగారి కొలువులో చేరిన తర్వాత ఇంతకు ముందులాగా కవిత్వం రాయలేక పోతున్నాను అంటున్నారు. నాకు కూడా అలాగే అనిపిస్తోంది. ఎందుకంటావు? అని అడిగాడు. దానికి భట్టు 'వేద మిత్రా.. రాజు గారి వద్ద ఉద్యోగం రాక ముందు నువ్వు విలువైన బహుమానాలు కోసం లేదా ఒకరి మెప్పు కోసం కవిత్వం రాయలేదు. నీ కవిత్వాన్ని సరస్వతీ దేవిని ధ్యానించి దేవికి పూజలాగా భావించి రాశావు. కానీ ఇపుడు నీ దృష్టి అంతా ఎలాంటి కవిత్వం రాస్తే రాజుగారు ఎంత గొప్ప బహుమానాలు ఇస్తారా అనే దాని మీదే ఉంది. చేసే పని నిరంతరం ప్రతిఫలం ఆశించి చేస్తూ ఉంటే దాని నాణ్యత తగ్గిపోతుంది'అని చెప్పాడు. ఆ తర్వాత కొద్ది రోజులకే వేద మిత్రుడు మరలా మునుపటిలాగా సరస్వతీ దేవిని ధ్యానిస్తూ మంచి కవిత్వం రాశాడు.

దారి కనుక్కోండి



7 తేడాలు గుర్తించండి!



ఏవి ఎన్ని



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 346

3					4	7		5
	6				1	4		8
			8				6	
2	7						5	
1		5	2		6	8		4
	8						2	9
	3				2			
6		7	3				4	
8		2	1					7

సుడోకు - 345 సమాధానం

3	8	5	4	2	1	6	9	7
9	4	7	8	6	3	5	1	2
6	1	2	7	5	9	8	3	4
2	9	1	3	7	5	4	8	6
4	3	8	6	1	2	7	5	9
7	5	6	9	4	8	1	2	3
5	2	4	1	9	6	3	7	8
1	6	3	2	8	7	9	4	5
8	7	9	5	3	4	2	6	1

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.